ఆంధ్రజ్యోతి
ప్రచురణ
www.navyaweekly.com

నవ్య
వీక్లి

15-6-2016
₹:20

mohan
PUBLICATIONS
Mohanpublication.com

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద,
మంత్రశాస్త్ర, స్మార్త గ్రంథములకు
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదురుగా,
రాజమహేంద్రవరం – 533101.

grantha nidhi
THE TREASURE OF PAGES
FIRSTEVER TELUGU FREE E-BOOKS
DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com
Granthanidhi.blogspot.in

సెల్ఫీలతో టైం పాస్ చేస్తా

-కీర్తి సురేష్

హీరోయిన్లలో కొందరు గ్లామర్, ఎక్స్‌పోజింగులకు సై అంటూ అవకాశాలు చేజిక్కించుకుంటే మరికొందరు వీటికి దూరంగా మడికట్టుకుని (కొందరు వీరిని ఇలాగే పిలుస్తుంటారు) నచ్చిన అవకాశాల కోసం ఎదురు చూస్తుంటారు. రెండవ కోవకి చెందిన హీరోయిన్ కీర్తిసురేష్. తన అందం అభినయంతో హీరో రామ్‌కి బ్లాక్ బస్టర్ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ ఇంత వరకూ తెలుగులో మరో సినిమా ఒప్పుకోలేదు. కోలీవుడ్‌లో మాత్రం స్టార్ హీరోయిన్లను సైతం పక్కకు నెట్టేసి దూసుకు పోతోంది. తెలుగులో ఆ దూకుడును ఎందుకు ప్రదర్శించడం లేదో ఆమె మాటల్లోనే....

తెలుగులో 'నేనూ శైలజ' తరువాత ఇంతవరకూ సినిమా అంగీకరించకపోవడానికి కారణం?

కారణం అంటే ఒక్కటే ఎక్స్‌పోజింగ్. ఆ సినిమా తరువాత చాలా అవకాశాలు వచ్చాయి. సినిమాలో గ్లామర్‌గా కనిపిస్తూ ఎక్స్‌పోజింగ్ చేయాలన్న షరతుపెట్టారు. గ్లామర్‌కు ఓకే కానీ ఎక్స్‌పోజింగ్‌కు నో అనడంతో వచ్చిన వాళ్ళు వచ్చినట్టే తిరిగి వెళ్ళిపోయారు.

రాంచరణ్, మహేష్ పక్కన అవకాశాలు కోల్పోవడానికి ఇదే కారణం అంటారా?

తెలియదు. వారిద్దరి పక్కన నటించమని నన్నెవరూ అడగలేదు. అవన్నీ ఊహాగానాలే! ఇవి నాదాకా వచ్చాయి. నాకు తెలియని వాటి గురించి నేను మాట్లాడలేను కదా? అందుకే మౌనంగా ఉండి పోయాను.

మీ తోటివారు ఎక్స్‌పోజింగ్ చేస్తున్నారు కదా?

చేయవచ్చు, అది వారిష్టం. నిత్యామీనన్ ఈ విషయంలో నాకు ఆదర్శం. తను ఎక్స్‌పోజింగ్‌కి దూరంగా ఉంటుంది. అయినా మంచి మంచి సినిమాలు, పాత్రలు తనకు దక్కుతున్నాయి. తమిళం, మలయాళంతో పాటు తెలుగులోనూ తను సినిమాలు చేస్తోంది కదా! చేతిలో సినిమాలు లేకపోతే సెల్ఫీలతో కాలం గడుపుతాను తప్ప... అవకాశాల కోసం ఎక్స్‌పోజింగ్‌కి అంగీకరించను.

ఎక్స్‌పోజింగ్‌కి నో అన్నారు మరి గ్లామర్ రోల్స్ చేస్తారా?

ఏ రోల్ చేసినా భవిష్యత్తులో నా భర్తతోనూ, నా పిల్లలతోనూ కలిసి కూర్చుని చూసే సినిమాలే చేస్తాను తప్ప, వారి ముందు తల దించుకుని కూర్చునే సినిమాలు చేయను. ఈ విషయంలో మా మదరే నాకు ఆదర్శం. తన కెరీర్‌లో ఎప్పుడూ ఎక్స్‌పోజింగ్ కానీ, మితిమీరిన గ్లామర్ రోల్స్ కానీ చేయలేదు. తన పాత సినిమాలను ఫాదర్‌తో కలిసి కూర్చుని చూస్తాను. మోడ్రన్ డ్రస్‌ల వరకూ ఓకే! అవీ నా శరీరాకృతికి సరిపోయేలా ఉండాలి.

కోలీవుడ్‌లో ఈ ఇబ్బంది ఎదురు కానట్టుంది?

కోలీవుడ్ అనే కాదు మాలీవుడ్‌లో కూడా నన్ను ఎక్స్‌పోజింగ్ చేయమని ఎవరూ అడగలేదు. మాలీవుడ్‌లో కన్నా కోలీవుడ్‌లో మంచి మంచి అవకాశాలు వస్తున్నాయి. దాదాపు అయిదు సినిమాలు చేస్తున్నాను.

తొలిసారిగా విజయ్‌తో చేస్తున్నట్టున్నారు?

అంత పెద్ద హీరోతో చేసే అవకాశం నాకు త్వరగానే లభించింది. చాలా మంచి వ్యక్తి. విజయ్ సార్ గురించి అందరికీ తెలిసిందే! నేను ప్రత్యేకించి చెప్పేదేముంది? ఆయన 60వ సినిమాలో నాకు అవకాశం రావడం నా అదృష్టం.

కథల ఎంపికలో మీ మదర్ సహాయం తీసుకుంటారా?

మొదట్లో నాతో పాటు తనూ కూర్చుని కథలు వినేది. నాకు కొద్దిగా అనుభవం వచ్చిన తరువాత కూర్చోవడం మానేసింది. ఎప్పుడైనా కథ చెప్పబోతే...నీకు నచ్చితే చేసేయ్. మరో ఆలోచన చేయకు అంటుంది. ప్రస్తుతం నాదే ఫైనల్ డెసిషన్.

సినిమాల్లో పాడబోతున్నారట కదా?

ఓసారి ట్రై చేద్దామనిపించింది. ఓ సంగీత దర్శకుడిని అడిగితే చూద్దాం అన్నారు. ఇంకా అది ఫైనల్ కాలేదు.

మాలీవుడ్‌లో సినిమాలు చేస్తున్నట్టు లేదు?

ఎందుకు చేయను. మంచి కథ దొరికితే అక్కడ తప్పకుండా చేస్తాను. నన్ను ఈ రంగానికి పరిచయం చేసిందే మాలీవుడ్.

-కె.రామకృష్ణ

సరదాగా

ఏం మిషన్?

వరుణ్ అందగాడే కానీ కొంచెం లావుగా ఉంటాడు. ఈమధ్య ఓ అమ్మాయికి బీట్ యడం మొదలెట్టాడేమో, కొంచెం సన్నబడాలని నిర్ణయించుకొని జిమ్‌కెళ్ళాడు. ట్రైనర్‌తో “నేను ఒకమ్మాయిని లవ్ చేస్తున్నాను. ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమించాలంటే ఏ మిషన్ ఉపయోగించాలో చెబుతారా?” అడిగాడు వరుణ్.

“అలాంటి మిషన్ ఇక్కడ లేదు. మీరు బయటకెళ్ళి ఏటీఎం మిషన్ ఉపయోగించండి” అని కూల్‌గా సమాధానమిచ్చాడు జిమ్ ట్రైనర్.

ఒక ప్రశ్న?

లావణ్య, రమ్య, ప్రియ ముగ్గురూ కాలేజీ మేట్స్, హాస్టల్‌మేట్స్, రూమ్మేట్స్! ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నారు. ప్రాజెక్ట్ రిపోర్టు ఇవ్వాల్సిన టైం దగ్గరపడింది. వారితో పాటు మరో ముగ్గురు..శేఖర్, రంజిత్, వరుణ్ కూడా ఆ ప్రాజెక్టులో ఉన్నారు. కానీ ఇంకా ప్రాజెక్టు పూర్తికాలేదు. ప్రాజెక్టు పూర్తిచేయటానికి కొన్ని వస్తువులు అవసరమయ్యాయి వారికి. ఆరుగురూ కలిసి ఆ వస్తువులు దొరికే కాంప్లెక్సుకు వెళ్ళారు. ఆ కాంప్లెక్సులో మొత్తం ఆరు ఫ్లోర్లు ఉన్నాయి. తమకు కావలసిన వస్తువులు ఏ ఫ్లోర్‌లో దొరుకుతాయో అడిగి తెలుసుకున్నారు. వారికి కావలసిన వస్తువులు ఒక్కోటి ఒక్కో ఫ్లోర్లో ఉన్నాయి. పని తొందరగా అవటానికి ఒక్కొక్కరు ఒక్కో ఫ్లోర్‌కి వెళ్దామని డిసైడ్ అయ్యారు. లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ ఒక్కో ఫ్లోర్లో ఆగుతూ వెళుతోంది. ఒక్కొక్కరు దిగుతున్నారు. అందరికంటే ఆఖరున రంజిత్ దిగాడు. లిఫ్ట్‌లోంచి వరుణ్ కంటే ముందు, ప్రియ దిగిన తరువాత లావణ్య బయటికొచ్చింది. అందరికంటే ముందు రమ్య లిఫ్ట్‌లోంచి బయటపడింది. మూడో ఫ్లోర్లో దిగిన ప్రియ కంటే ముందుగా శేఖర్ దిగాడు. ఎంచక్కా ఎవరికి వారు కావలసిన వస్తువులు తీసుకుని పార్కింగ్‌లోకొచ్చి కారుతీసుకుని వెళ్ళిపోయారు. ఇంతకీ ప్రశ్న ఏంటంటే, ఎవరు ఏ ఫ్లోర్లో దిగారు? కరెక్ట్‌గా చెప్పండి.

సమాధానం

అందరికంటే ముందు రమ్య మొదటి అంతస్తులో దిగింది. రెండో అంతస్తులో శేఖర్ దిగాడు. ఎలాగూ ప్రియ మూడో అంతస్తులో దిగినట్లుగా క్లూ ఉంది. నాలుగో ఫ్లోర్లో లావణ్య, ఐదో ఫ్లోర్లో వరుణ్, ఆఖరున ఆరో అంతస్తులో రంజిత్ దిగారు. వరుస సరిచూసుకోండి.

Jayadev

అడపా దడపా నవ్వబ్బా



8

అంతుచిక్కని రహస్యాలు

శతవిధాల ప్రయత్నిస్తున్నా మానవమేధకు అంతుచిక్కని రహస్యాలెన్నో ఇంకా అలాగే మిగిలి పోయాయి. ఏడువేల అడుగుల లోతైన గుహ, ఇసుక ఆలయాలున్న ఎడారి, వేల సంవత్సరాల నాటి రాతి బంతులు, డెత్‌వ్యాలీలో కదిలే బండరాళ్ళు....అబ్బో! ప్రపంచమంతా ఎన్ని మిస్టరీలో!

44

ఆరోగ్య సిరి - నల్ల వరి

బ్లాక్ రైస్ గురించి మీరెప్పుడైనా విన్నారా? మనతో సహా ఆసియాదేశాల్లో ప్రాచీనకాలం నుండీ ఉందీ రైస్. అసలీ రైస్ తింటే అంతా ఆరోగ్యమే ఆరోగ్యం!

72

ఇంటర్వ్యూ

చిత్రపరిశ్రమలో మానవతా విలువలు ఇంకా బతికే ఉన్నాయంటున్న నంది అవార్డుల నటి శంకరాభరణం తులసి ఇంటర్వ్యూ....

సీరియల్స్

మృత్యుంజయుడు 18
సమంత@లవ్ 32
నిండు నూరేళ్లు 52

కథలు

నాతిచరామి 10
నోబెల్ కథలు 26
జీవన శృతి 38
మనిషికి రెండు కళ్ళు 46
బానిస 58
ఇండియాస్ వైఫ్ 62

ఫీచర్స్

సురభి-15, కంరుగాడి కాశీయాత్ర-16, సినీ నారాయణీయం-24
తొక్కే కదా అని తీసిపారేయకండి!-29
విజయ విలాసం-30, ఆరోగ్యమే మహాభాగ్యం-37
వంటలు-43, క్రైమ్-50, పుస్తక సమీక్ష-57
నిత్య సంతోషానికి నిఖార్సయిన మార్గం-60
మనమీదేనక్రోయ్-63, రామాయణం-66
సౌభాగ్యచక్రం-68, నవ్యసినిమా-69
ఆ రెండూ నాకు సరిపడవు-70
ఇవన్నీ నిజాలే!, పదగారడి-74

ముఖచిత్రం: సమంత
ఫొటో: గోపీకృష్ణ

రచనలు, కథలు పంపవలసిన చిరునామా
నవ్య వీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్, హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33. **email: navyaweekly@andhrajyothy.com**

మొబైల్

ప్రియురాలు: చెప్పాలి! నువ్వు నన్నెంతగా ప్రేమిస్తున్నదీ ఇవాళ చెప్పాల్సిందే! చెబితేనేగాని నేను ఒప్పుకోను.

ప్రేమికుడు: నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానంటే...ఇది నా మొబైల్ కదా! నేను ఈ మొబైల్ అయితే నువ్వు ఇందులో సిమ్‌వి. చాలా?

ప్రియురాలు: థేంక్యూ! నువ్వు నన్నింతగా ప్రేమిస్తున్నావని నాకు తెలియదు. నేను చాలా అదృష్టవంతురాలిని. ఐ యాం సో హ్యాపీ!

వారి మాటలు కాస్తంత దూరంలో ఉండి వింటున్న ప్రేమికుడి ఫ్రెండ్ ఇలా అనుకున్నాడు.

పిచ్చిపిల్లకు తెలీదు! వాడిది డ్యుయెల్ సిమ్ మొబైల్!

ఆపరేషన్

ఆపరేషన్ టేబుల్ మీద ఉన్నప్పుడు ఇచ్చిన మత్తుమందు పని చేయలేదనుకోండి. మత్తు ఎక్కలేదని గొప్పగా కళ్ళూ, చెవులూ తెరిచి పడుకోకండి. వినకూడని మాటలు వినాల్సి వస్తుంది. చూడకూడనివి చూడాల్సి వస్తుంది.

ఉదాహరణకి ఓ వ్యక్తికి మత్తుమందు పని చేయలేదు. అతను కళ్ళూ చెవులూ తెరిచి పడుకున్నాడు. అప్పుడు డాక్టర్ నోటి నుంచి విన వచ్చిన మాటలు ఏమిటంటే...

"ఇప్పుడిది కిడ్నీ అయితే ఇది లివర్. ఓకే! మరి ఇదేంటిది ఈ మధ్యలో?"

"ఇదిగో సిస్టర్, నిన్నే అడుగుతోంది? మొన్న డాక్టర్‌గారు ఇదే ఆపరేషన్ చేశారు కదా, హార్ట్ ఆగిపోతుంటే ఏం చేశారు?"

"పోపో! బయటికిపో! ఆపరేషన్ థియేటర్లోకి ఈ కుక్కని ఎవరు తీసుకొచ్చారయ్యా? చూడండది ఏదో పట్టుకుపోతోంది. తినేస్తుందేమో! పట్టుకుని లాక్కోండి దాన్ని."

ఆనందం

ఓ ఎనభై ఏళ్ళ వృద్ధుడు బార్బర్‌షాపుకి వెళ్ళాడు. కుర్చీలో కూర్చున్నాడు. అతని తల మీద ఎనిమిది అంటే ఎనిమిదే వెంట్రుకలు ఉన్నాయి. వాటిని చూసి చిరాకు పడ్డాడు బార్బర్. అన్నాడిలా.

"ఏంటి, ఇప్పుడు ఈ ఎనిమిదింటినీ నేను కట్ చెయ్యాలా?"

"వద్దు" అన్నాడు వృద్ధుడు.

"మరేం చెయ్యమంటావు?"

"వాటికి కలర్ వెయ్యి."

(జీవితం అంటే ఉన్నదానితో ఆనందించడం)

-వైనతేయ

నవ్య
సంపుటి: 13 సంచిక: 15
15-6-2016
మేనేజింగ్ డైరెక్టర్
వేమూరి రాధాకృష్ణ
ఎడిటర్
ఎ.ఎస్.జగన్నాథశర్మ

మొదటి పేజీ

ప్రిస్క్రిప్షన్

రాజబాబుకి అన్నీ సమస్యలే! అతనికి ఎందుకో బాధగా ఉంది. భయంగా ఉంది. అన్నిటా అసౌకర్యంగా ఉంది. రాత్రిపూట నిద్రపట్టడం లేదు. కాళ్ళూ చేతులూ చెమటలు పడుతున్నాయి. గట్టిగా ఊపిరి పీల్చుకోలేకపోతున్నాడు. గుండెదడగా ఉంటోంది. ఎక్కడా కుదురుగా కూర్చోలేకపోతున్నాడు. మౌనంగా ఉండలేకపోతున్నాడు. తనలో తానే మాట్లాడుకుంటున్నాడు. గొంతు ఎండిపోతోంది. కాళ్ళూ చేతులూ తిమ్మిర్లు ఎక్కుతున్నాయి...ఎందుకిలా? ఏమిటి ఇదంతా అంటే... అంతుచిక్కడం లేదు. ఆందోళనగా ఉందతనికి. దానిని తగ్గించుకునేందుకు కలవని డాక్టర్ లేడు. వాడని మందు లేదు. అయినా మార్పు లేదు. అప్పుడు గుర్తు చేశాడు ఓ మిత్రుడు.

మీ తాతగారెవరో పల్లెటూర్లో ఒంటరిగా ఉన్నారన్నావు! బాగా వంట చేస్తారన్నావు. ఏ జబ్బునైనా ఆహారంతో నయం చేస్తారని చెప్పావు. అక్కడికి ఓసారి వెళ్ళి రారాదూ? వారం రోజులు సెలవు పెట్టి వెళ్ళు.

ఆందోళన తగ్గి, ఆరోగ్యం కుదుటపడిందీ ఆనందమే! లేదంటే...ఎవరూ పట్టించుకోక పల్లెటూర్లో ఒంటరిగా ఉన్న తాతయ్యను పలకరించిన సంతోషం అయినా మిగులుతుంది.

నిజమే! ఎలాంటి జబ్బునైనా తాతయ్య ఆహారంతో నయం చేస్తాడని అమ్మ చెప్పేది. అమ్మ మాటలు అప్పుడెప్పుడో అందరికీ సరదాగా చెప్పాడు తను. వాటిని గుర్తుంచుకుని సమయానికి గుర్తు చేశాడు మిత్రుడు. అందుకు అతన్ని అభినందించి, తాతయ్య దగ్గరకు, పల్లెటూరుకు ప్రయాణం కట్టాడు రాజబాబు. అనారోగ్యం సంగతి తర్వాత, ముందు చాలా రోజులకి తాతయ్యను చూడబోతున్నానన్న ఆనందంతో రెండు రైళ్ళు మారి, ఓ బస్సెక్కి మరీ పల్లెటూరికి చేరుకున్నాడతను.

బస్సు దిగాడో లేదో తాతయ్య కనిపించేసరికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది రాజబాబుకి. తాతయ్యసహా ఏడుకిలోమీటర్లు మిట్టలూ, పల్లాలూ నడచి ఇంటికి చేరుకున్నాడు. ముందుగా మూడుగ్లాసుల మంచినీళ్ళిచ్చాడు తాతయ్య. తాగు అన్నాడు. రోజంతా కలిపి అంత నీరు ఏనాడూ తాగిన పాపాన పోలేదు రాజబాబు. తాగడం ఇబ్బంది అనిపించింది. అయినా తప్పదన్నాడు తాతయ్య. తాగాడు రాజబాబు. తర్వాత కాఫీ కోసం చూశాడు. ఇవ్వలేదు తాతయ్య. పైగా ఈ ఇంట్లో మందూ, కాఫీలు బంద్ అని నవ్వాడు. వారం రోజుల పాటు వేడిగా కాఫీ తాగడం, చల్లగా బీరు తాగడం కుదరదిక అనుకున్నాడు రాజబాబు.

నూతినీళ్ళతో స్నానం చేసి వచ్చాడు. తాతయ్య ఉప్మా పెసరట్టులాంటి టిఫిన్ పెడతాడనుకుంటే రెండు గుప్పెళ్ళు మొలకెత్తిన సెనగలు ప్లేట్లో పెట్టాడు. తినమన్నాడు. అవి కానిస్తే మరి రెండు గుప్పెళ్ళు మొలకెత్తిన పెసలు పెడతానన్నాడు. అన్నట్టుగానే

పెట్టాడు. తినమన్నాడు. తిన్నాడు రాజబాబు. తర్వాత లెక్కపెట్టినట్టుగా ఏడంటే ఏడు జీడిపప్పులు పెట్టాడు. ఆ తర్వాత గుడ్డులోని పచ్చసొనని పెట్టి, తిను, పర్వాలేదన్నాడు తాతయ్య. తిన్నాడు రాజబాబు. తిన్న తర్వాత అక్కడ రామాయణ మహాభారతాలు ఉన్నాయి. నచ్చిన పర్వమో, కాండో చదువుకో! పదకొండింటికి భోం చేద్దువుగాని అన్నాడు తాతయ్య. మహాభారతంలోని శాంతిపర్వం చదువుకుంటూ కూర్చున్నాడు రాజబాబు. సరళవచనం. హాయిగా సాగింది. చెప్పినట్టుగానే పదకొండింటికి దంపుడుబియ్యం అన్నం, పాలకూరపప్పూ, పెరుగూ వడ్డించాడు. తినలేక తినలేక తిన్నాడు రాజబాబు. పోయి పడుకో! చిన్న కునుకు తియ్యి అంటే...రాజబాబు అలాగే చేశాడు. చిన్న కునుకేం? పెద్ద కునుకే తీశాడు. మధ్యాహ్నం నాలుగు గంటలకు లేచాడు. చిరుతిండిగా తాతయ్య పచ్చిబఠానీలూ, వేరుసెనగలూ, బాదంపప్పూ పెట్టాడు. తినమన్నాడు. తిన్నాడు రాజబాబు. తిన్నవి అరగాలి కదా! అలా తిరిగిరా అన్నాడు తాతయ్య. తిరిగొచ్చాడు రాజబాబు. రాత్రి ఓ గ్లాసుడు రాగిజావ ఇచ్చి, తాగి పడుకోమన్నాడు. పడుకున్నాడు రాజబాబు. కలలు కూడా రాలేదతనికి. అంత కమ్మగా నిద్రపట్టింది.

ఉన్న వారం రోజులూ అంతే! తాతయ్య మెనూ మార్చలేదు. పెట్టిందే పెట్టాడు. ఆందోళన తగ్గించాడు. అనారోగ్యం లేదన్నాడు. ఒకవేళ ఉంటే గింటే నీ రోగానికి ఇదే సరైన ప్రిస్క్రిప్షన్! తరుచూ ఇదే ఆహారం తీసుకుంటూ ఈ ఊరునీ, నన్నూ గుర్తు పెట్టుకో అన్నాడు తాతయ్య. రాజబాబుకి వీడ్కోలు పలికాడు.

తినడానికి సరైన తిండీ, చదువుకునేందుకు సరైన పుస్తకమూ లేకే ఈ ఆందోళనలు. రెండూ ఉంటే...దాని సిగదరగ, ఆందోళన ఎక్కడ ఉంటుందండీ? తోక ముడిచి పారిపోదూ?

WOW

స్లీప్ బస్

ప్రపంచం ముందుకు పోతోంది. దేశాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. ఏ వార్తా పత్రిక చూసినా, ఏ టీవీ చానెల్ చూసినా ఇవే ముచ్చట్లు! కానీ నేటికీ కూడు, నీడ లేక ఎందరో అభాగ్యులు ఫుట్‌పాత్‌లపై, రైల్వే, బస్ స్టేషన్లలో బతుకులీడుస్తున్నారు. ముఖ్యంగా నీడలేక ఎండకి, వానకి, చలికి ప్రాణాలు కోల్పోతున్నవారు ఎందరో! అలాంటి నిరాశ్రయులను చేరదీసి, వారికి ఆవాసం కల్పించేందుకు ఓ వ్యక్తి చేస్తున్న ప్రయత్నం అభినందనీయం.

ఆస్ట్రేలియాకు చెందిన సిమన్ రోవే ఒకప్పుడు ఇంటి అద్దె కట్టలేక, తన కారులోనే కాలం గడిపాడట! ఉండటానికింత చోటు లేనివారి పరిస్థితి

ఎలా ఉంటుందో స్వయంగా అనుభవించాడు. కష్టపడ్డాడు. ఇప్పుడు ఉద్యోగం చేస్తూ మంచి హోదాలో ఉన్నాడు. నిజానికి అతని కష్టమే ఇప్పుడు అతన్ని మంచి హోదాలో నిలబెట్టింది. అయితే తాను ఎక్కడి నుంచి వచ్చాడో ఆ పరిస్థితులను మాత్రం మర్చిపోలేదు. ఫుట్‌పాత్‌లపై, పార్కుల్లో బతుకీడుస్తున్న వారి కోసం ఏదోఒకటి చేయాలనుకున్నాడు. వారికి ఆవాసం కల్పించాలంటే తనవల్ల అయ్యేపని కాదు. మరి ఏం చేయాలా అని ఆలోచించి, కనీసం వారికి రాత్రిపూటయినా వసతి కల్పించాలని నిర్ణయించుకున్నాడు. ఆలోచన చేశాడు. చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేశాడు.

తనకొచ్చిన ఆలోచనను అమలుచేయడానికి బస్సులు కొనుగోలు చేసి, వాటికి 'స్లీప్‌బస్' అని పేరు పెట్టాడు. ఒక్కో బస్సులో 22 మంది సౌకర్యవంతంగా పడుకునేందుకు ఏర్పాట్లు చేశాడు.

అందులో పరుపులు, మెత్తలు, దుప్పట్లు అన్నీ ఉంటాయి. ఫోన్ చార్జింగ్ పెట్టేందుకు యూఎస్‌బీ పోర్టులు ఉంటాయి. ఒక్కొక్కరికి ఒక్కో టీవీ, ఏసీ ఇలా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాడు. ఇదంతా పూర్తిగా ఉచితం. ఈ బస్సులను నిరాశ్రయులు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు తీసుకెళ్తారు.

ఈ బస్సుల కొనుగోలుకు, సౌకర్యాల కల్పనకు 'గోఫండ్‌మీ. కామ్' క్రౌడ్‌ఫండింగ్ వెబ్‌సైట్ ద్వారా దాదాపు 67 లక్షలు (లక్ష డాలర్లు) విరాళాలు సేకరించాడు సిమన్. వచ్చే ఆరేళ్లలో ఆస్ట్రేలియాలో మొత్తం 300 బస్సులు అందుబాటులోకి తెస్తామని సిమన్ చెబుతున్నాడు. గూడు లేనివారికి నీడ కల్పిస్తున్న సిమన్‌కి నిజంగా హ్యాట్సాఫ్!

నవ్య

మెయిల్ బాక్స్

యాత్రికుల అగచాట్లకు దర్పణం కాశీయాత్ర

కంఠగాడి కాశీయాత్రలో యాత్రికుల అగచాట్లు కళ్లకు కడుతున్నారు. శర్మగారికి అభినందనలు. గయ పుణ్యక్షేత్రంలో పండిట్ల దాష్టీకాన్ని ఉన్నదున్నట్టు తెలియజేశారు. అది చదువుతుంటే కొంత కాలం క్రితం గయలో మాకు ఎదురైన చేదు అనుభవం గుర్తుకొచ్చింది. ఎందుకీ యాత్ర చేశామా? అని బాధ కలిగింది. అటువంటి వాతావరణంలో ఎటువంటి కార్యక్రమాలు చేయబుద్ధి కాదు. ప్రాణభయంతో తిరుగు ప్రయాణమయ్యాం. ఆంధ్ర నుంచి వచ్చిన యాత్రికులను పీడించి పండిట్లు డబ్బు వసూలు చేయడం నిత్యకృత్యం.

-సూరి నాగరాజు, బెంగళూరు-48

స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విలువ మారలేదు

నోబెల్ కథ అద్భుతంగా ఉంది. అయిదేళ్ళ గడువు సమయాన్ని తన వేళ్లపై లెక్కించుకుంటూ స్వేచ్ఛకు దగ్గరవుతున్నానని బానిస పొందే ఆనందం అనిర్వచనీయం. అప్పుడైనా ఇప్పుడైనా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకున్న విలువ మారలేదు. దేవుణ్ణి ఎంతగా నమ్మినా కష్టపడి పనిచేయడాన్ని ఇంకా ఎక్కువ నమ్మాలని రచయిత చెప్పడం అన్ని కాలాలకూ వర్తిస్తుంది.

-ప్రతికంఠం మహేందర్‌రాజు,
బాలసముద్రం, వరంగల్

రంజింపజేస్తున్న రామాయణం

'అరణి రామాయణం ఆధ్యాత్మికంగా రంజింపజేస్తున్నది. సముద్రుడి సహకారం, నల వానరుల వంతెన నిర్మాణం, లంకా తీరానికి చేరిన రాముడి గరుడ యుద్ధ వ్యూహ రచన, రాముడి భయం, సంభాషణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుస్తకాల పిచ్చి బాబూరావు కథనం అసాధారణ రీతిలో సాగింది.

కప్పుకాఫీతో జాతకం ఆర్టికల్ నూతన విషయాలతో ఆకట్టుకుంది. భయంకర ప్రదేశాలు, వృద్ధాప్యంలో వచ్చే ప్రధాన రుగ్మతలు, చికిత్సల వివరాలు, ఆలోచింపజేశాయి. రాగిపాత్రలో నీటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు గుర్తుచేశారు. తండ్రి మరణాన్ని గుండెల్లో దాచుకున్న ఎమ్మెస్ స్థిత ప్రజ్ఞుడు. విజయవిలాసం ఉత్తేజాన్నిస్తోంది. సినిమా విశేషాలు తాజాగా ఉన్నాయి. శారద ఇంటర్వ్యూ బాగుంది.

అడపాదడపా, సరదాగా నవ్వించాయి. మార్నింగ్ కాఫీ స్కిట్లు నవ్వించాయి. సురభి వింతలు ఎన్నదగినవి. బహుమతి కవిత నల్లేరుపై బండిలా చదివించింది.

-మాధవరపు కృష్ణ, కాకినాడ

మృత్యుంజయుడు బాగుంది

వక్కంతం సూర్యనారాయణరావ్‌గారి సీరియల్ అత్యద్భుతం. ప్రతివారం దీనికోసం ఎదురు చూస్తుంటాం. 'మంచుతల్పం' బాగుంది. జవాన్లు ప్రాణాలొడ్డి సరిహద్దులు కాపాడుతూంటే మనం ఇక్కడ హాయిగా ప్రశాంతంగా ఉంటున్నాం. అలాగే వాత్సల్యపు ఒడి కథ కంటతడి పెట్టించింది.

-మజుందార్ వెంకట రమణారావు,
అనూరాధ, ఈ-మెయిల్

శ్రమవల్లే విజయం

కృషివల్లే మహోన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని, శ్రమవల్లే విజయం లభిస్తుందనీ విజయ విలాసంలో తెలుసుకున్నాం. పని వాయిదా, అలసత్వం పెంచుతుందని హెచ్చరించారు. రాగి పాత్రలో నీరు ఎంత ఆరోగ్యకరమో తెలిసింది.

-సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

ఎమ్మెస్ ఆదర్శం

ఎమ్మెస్ జీవితం, వ్యక్తిత్వం తెలుసుకుంటున్నాం. ఆయన ఉపాధ్యాయులకు ఆదర్శం. రాగిపాత్రలో నీటి సేవనం, కప్పుకాఫీతో జాతకం వంటి విషయాలు తెలుసుకున్నాం. నోబెల్ బహుమతి కథలు గత రోజుల్ని గుర్తుకు తెచ్చాయి. ఇవన్నీ నిజాలే మంచి శీర్షిక.

-వి.ఎల్.జయంతి, రామవరప్పాడు, విజయవాడ

ఆకట్టుకున్న కాఫీ

మార్నింగ్ కాఫీ ఝలక్ ఆకట్టుకుంది. మంచో చెడో ఎవరిపిచ్చి వారికి ఆనందం అని మొదటి పేజీ ద్వారా తెలిసింది. సురభి శీర్షిక విభిన్నాంశాలతో అలరిస్తోంది. ఆవాల శారద కవిత చైతన్య స్ఫూర్తినిచ్చింది. ఓ నేస్తమా కథా రచయిత ఎమ్. కృష్ణగారికి అభినందనలు. మలివయసులో మహారాజ వైభోగం రచన వృద్ధులకు ప్రయోజనకరం. కార్టూన్లు పోటాపోటీగా నవ్విస్తున్నాయి. నోబెల్ కథలు చదివే మహదవకాశం కలిగించినందుకు కృతజ్ఞతలు.

-నేమాన సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం

కాఫీని ఆస్వాదించాం

మార్నింగ్ కాఫీని తాగుతూ ఆనందించాం. పుస్తక ప్రేమని పిచ్చి స్థాయికి చేర్చడం బాబూరావు చేసిన తప్పు. తాగే కాఫీకీ, జాతకానికీ ముడిపెట్టిన మనవాళ్ళ బుర్రే బుర్ర. సురభిలో అంశాలు ఆకట్టుకున్నాయి. బహుమతి కవిత అలరించింది.

-హెచ్.పవనపుత్ర, రామారావుపేట.తూ.గో.జిల్లా

అదుర్స్

విజయ విలాసం అద్భుతంగా ఉంటోంది. ఎన్నో తెలియని అంశాల్ని సున్నితంగా హృదయాల్లోకి చొచ్చుకుపోయేట్టు రాస్తున్నారు. చక్కని విశ్లేషణతో సక్సెస్ గురించి తెలియజేస్తున్నారు. రచయిత వెంకటేశ్వరరావుగారికి హేట్సాఫ్. సీరియల్స్ అద్భుతం, రామాయణం, కాశీయాత్ర బాగున్నాయి.

-వెంకట సత్యనారాయణమూర్తి,
చిక్కడపల్లి, హైదరాబాద్

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో PCOD సమస్యకు సరైన పరిష్కారం

డా. శ్రీకాంత్ మోర్లావర్
CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్

PCOD అనేది నేటికాలం స్త్రీలలో నానాటికీ పెరుగుతున్న ఆరోగ్య సమస్య. దాదాపు 25 శాతం నుండి 30 శాతం వరకు స్త్రీలు ఈ PCOD సమస్యతో బాధ పడుతున్నారు. యుక్త వయస్సు వారిలో ఇది తొలుత మొటిమలు, బరువు పెరగడం మరియు అవాంఛిత రోమాలను కలుగజేసే ఒక సౌందర్య సమస్యగా పరిణమిస్తుంది. ఇదే PCOD సమస్య వివాహిత స్త్రీలలో తలెత్తినపుడు పై సమస్యలతో పాటు సంతానలేమి సమస్యను కూడా ఎదుర్కోవడం జరుగుతుంది. నేటికాలపు ఆధునికతతో పాటు మారిన జీవన శైలి, అధిక మానసిక ఒత్తిడి మరియు సరైన వ్యాయామం లోపించడం వంటి అంశాల ప్రభావం హార్మోన్లపై ఎక్కువగా ఉండటం వలన అవి అసమతుల్యతకు గురి కావటమే PCOD సమస్య ఉత్పన్నమవడానికి ప్రధాన కారణం.

పీ.సీ.ఓ.డి. అనగా: అపరిపక్వమైన అండం (ఇమ్మెచ్యూర్ ఫాలికల్) నీటి బుడగల మాదిరిగా రూపాంతరం చెంది, అండాశయపు గోడలపైన ఉండిపోవటాన్ని పీ.సీ.ఓ.డి. అంటారు. ఇలా రెండు అండాశయాల పై ఏర్పడటాన్ని బైలేటరల్ పీ.సీ.ఓ.డి. అంటారు. సాధారణ రీతిలో నెలసరి ఉన్న మహిళలలో నెలసరి అయిన 11-14 రోజుల మధ్యలో, ఇరు అండాశయాలలో ఏదో ఒక అండాశయం నుండి అండం విడుదల అవుతుంది మరియు అది ఫలదీకరణకు సిద్ధంగా ఉంటుంది. కానీ పీ.సీ.ఓ.డి. సమస్య ఉన్న మహిళలలో అండం విడుదల కాకుండా, అపరిపక్వత చెంది, అండాశయపు గోడలపై నీటి బుడగల వలె ఉండిపోతుంది.

కారణాలు: పీ.సీ.ఓ.డి. తలెత్తటానికి ఖచ్చితమైన కారణాలు తెలియరాలేదు, కానీ ఇది చాలా వరకు హార్మోన్ల అసమతుల్యత వలన ఉత్పన్నమవుతుందని డాక్టర్లు నిర్ధారించటం జరుగుతుంటుంది. • F.S.H., L.H., టెస్టోస్టిరాన్ మరియు ప్రొలాక్టిన్ హార్మోన్ల స్థాయి పెరగడం. • **ఇన్సులిన్ రెసిస్టెన్స్:** దీని వలన రక్తంలో ఇన్సులిన్ శాతం పెరిగి టెస్టోస్టిరాన్ హార్మోన్ల స్థాయి పెరిగిపోవటంతో- ఇది స్థూలకాయానికి దారితీసి, పీ.సీ.ఓ.డి. సమస్యను ప్రేరేపించటం జరుగుతుంది. • వంశపారంపర్యత, అధిక మానసిక ఒత్తిడి, వ్యాయామం లోపించడం వంటి అంశాలన్నీ ఈ సమస్యకు కారణాలు కావచ్చు.

లక్షణాలు: నెలసరి సరిగా రాకపోవడం, నెలసరి సందర్భంలో ఎక్కువ లేదా తక్కువ రక్తస్రావం కావటం, నెలసరిలో రక్తస్రావం 4-5 రోజులకు మించి కొనసాగటం, రెండు ఋతుచక్రముల మధ్యలో రక్తస్రావం అవటం. • నెలసరి సరిగా వచ్చినా కూడా, అండాశయం నుండి అండం విడుదల కాకపోవడం. • ముఖం మరియు వీపు భాగంలో మొటిమలు రావడం. • చర్మపు మడతలతో పాటు మెడ భాగంలో చర్మం మందంగా మరియు నల్లగా మారటం • సంతానలేమి • తలనొప్పి • బరువు పెరగటం • తల వెంట్రుకలు ఎక్కువగా రాలి పోవటం • కొందరిలో బరువు సాధారణంగా ఉండటం మరియు కొందరిలో బరువు తగ్గటం కూడా గమనించవచ్చు. • ముఖం మరియు ఛాతీ పైన మగవారికి మాదిరిగా వెంట్రుకలు రావడం. • మానసిక అశాంతి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

దుష్ప్రభావాలు: టైప్-2 డయాబెటిస్, గుండె జబ్బులు, కొలెస్ట్రాల్ సమస్యలు, అధిక రక్తపోటు, ఎండోమెట్రియం క్యాన్సర్ వంటి తీవ్ర సమస్యలకు పీ.సీ.ఓ.డి. దారి తీస్తుంది.

తీసుకోవలసిన జాగ్రత్తలు: జీవన విధానంలో మార్పులు చేసుకుని- ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. • బరువును అదుపులో ఉంచుకోవడం ద్వారా డయాబెటిస్, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి సమస్యలకు దూరంగా ఉండవచ్చు. • అధిక క్రొవ్వు మరియు జంక్ ఫుడ్స్ తీసుకోకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పీ.సీ.ఓ.డి. సమస్యను కొంతవరకు నియంత్రణలో ఉంచవచ్చు.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్ చికిత్స: హార్మోన్ల అసమతుల్యత వలన వచ్చే ఇలాంటి జబ్బులను హోమియోపతి మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో మాత్రమే అందించబడే జెనెటిక్ కాన్‌స్టిట్యూషనల్ చికిత్సతో, ఎటువంటి దుష్ప్రభావాలు చూపని రీతిలో PCOD సమస్య నివారణతో పాటు, అంతవరకూ ఎదుర్కొన్న దుష్ప్రభావాలను కూడా పూర్తిగా తగ్గించవచ్చు. యుక్తవయస్సులోనే ఈ సమస్యను గుర్తించి, సరైన చికిత్సను తీసుకోవటం వలన ఇన్‌ఫెర్టిలిటీ, ఒబేసిటీ వంటి కాంప్లికేషన్ల బారిన పడకుండా కాపాడవచ్చు.

ఉచిత కన్సల్టేషన్ 955 000 1188 / 99

www.homeocare.in



అంతు చిక్కని రహస్యాలు

అందమైన ప్రకృతిలో అద్భుతాలెన్నెన్నో! గమనించాలే కానీ ప్రతీదీ ఒక రహస్యమే!

ఆ రహస్యాలను ఛేదించేందుకే మనిషి తన మేధస్సును పదునెక్కించాడు.

ఆ పొరలన్నీ ఒక్కొక్కటిగా తెరుచుకుంటున్నాయి.

కానీ శతవిధాల యత్నిస్తున్నా మానవ మేధకు అందని అపూర్వమైన మిస్టరీలు కొన్ని అలాగే మిగిలిపోయాయి. వాటిని బైటపెట్టాలనే తపన పెరిగిపోయింది. అదో తపస్సుగా మారింది.

ఆ నిరంతర తపోశోధన అజరామరంగా కొనసాగుతూనే ఉంది.

కాలచక్రంలో తెలియకుండా మిగిలిపోయిన మిస్టరీలు కొన్నింటిని కనుక్కోవడానికి ఎన్నో యత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. మనదేశంలోనే కాదు ప్రపంచమంతటా ఉన్న ఇలాంటి మిస్టీరియస్ మిస్టరీలు మానవ మేధస్సును సవాల్ చేస్తూ మనముందు నిలిచున్నాయి. అలాంటి అద్భుత మిస్టరీల గురించి తెలుసుకుందాం రండి!

డెత్‌వ్యాలీ

డెత్‌వ్యాలీగా పిలిచే ఈ ప్రాంతం అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంది. సముద్ర మట్టానికి 1130 మీటర్ల ఎత్తులో ఉన్న ఎండిపోయిన విశాలమైన సరస్సు ఉంటుంది. దీన్నే డెత్ వ్యాలీ అని పిలుస్తారు. ఇక్కడ మనుషులు కానీ జంతువులు కానీ ఉండవు. విచిత్రం ఏంటంటే ఈ ప్రాంతంలో బండ రాళ్లు వాటంతట అవే కదులుతూ ఉంటాయి. భూమిలోని ఒత్తిళ్ళ కారణంగానే ఇక్కడ బండ రాళ్ళు ఇలా కదులుతాయని ఇటీవల శాస్త్రవేత్తలు నిర్ణయించారు. అయినా దీనిపై మరిన్ని పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇదే కాలిఫోర్నియాలోని మరో డెత్‌వ్యాలీలో అయిదు వేల ఏళ్లనాటి ఒక అండర్‌గ్రౌండ్ పట్టణం ఉంది. ఈ భూగర్భ పట్టణంలో పురాతన కాలానికి చెందిన అనేక రకాల మమ్మీలు, ప్రాచీన కళాఖండాలు ఉన్నాయి. వాటన్నింటినీ భూగర్భ పరిశోధకులు పరిశీలించారు. వీటన్నింటినీ ఈ విధంగా ఎవరు భద్రపరిచారు? ఎందుకు భద్రపరిచారు? ఇదంతా ఎలా చేయగలిగారు? అనే విషయాల్ని మాత్రం కనిపెట్టలేకపోతున్నారు.

బెర్ముడా ట్రయాంగిల్

గగనతలంలో ఎగురుతూ వెళ్ళే విమానాలు ఆ ప్రాంతానికి చేరుకోగానే అకస్మాత్తుగా అదృశ్యమైపోతాయి. ఎవరో లాగినట్టుగా బిలంలో పడిపోతాయి. అప్పటివరకు హాయిగా ప్రయాణించే నౌకలు అకస్మాత్తుగా అడ్రస్ లేకుండా పోతాయి. అమెరికన్ నౌకాదళానికి చుక్కలు చూపించిన ఆ ప్రాంతం పేరే బెర్ముడా ట్రయాంగిల్. దీనిమీద ఇప్పటికే ఎన్నో కథనాలు వెలువడ్డాయి. కొందరు ఇది నిజం అని నమ్మితే మరికొందరు ఊహాజనితం అంటారు. కానీ ట్రయాంగిల్‌లోకి వచ్చిన నౌకలు, విమానాలు అదృశ్యమైపోయాయి. ఒక పక్క మియామి, రెండవ పక్క బర్ముడా, మూడో పక్క సాన్‌జువాన్ ప్యూర్టోరికోలకి మధ్య త్రికోణాకారంలో ఉన్న ప్రాంతాన్నే బెర్ముడా ట్రయాంగిల్ అంటారు. దీని విస్తీర్ణం అయిదు లక్షల చదరపు మైళ్లు. ఈ ప్రాంతం దగ్గరకు వచ్చేసరికి విమానాలన్నీ కుప్పకూలిపోతున్నాయట. ఎందుకు ఇలా జరుగుతున్నదన్న విషయం ఇప్పటికీ మిస్టీరియస్‌గానే మిగిలిపోయింది.

ఈజిప్ట్ మమ్మీలు

ప్రపంచ ఏడు వింతల్లో ఒకటిగా ఆశ్చర్యచకితుల్ని చేస్తున్న మహాద్భుత నిర్మాణం ఈజిప్ట్ పిరమిడ్లు. అవే అద్భుతమంటే అందులో భద్రపరిచిన మమ్మీలు మహా అద్భుతాలు. ఇందులో ఇప్పటివరకు చనిపోయిన వారి భౌతిక కాయాల్ని రసాయనపదార్థాల లేపనం ద్వారా చెక్కుచెదరకుండా కాపాడుతూ వచ్చారు. ఇలా ఈజిప్ట్‌లో క్రీస్తు పూర్వానికి సంబంధించిన అనేక కట్టడాలు, వాటి వెనక రహస్యాలు అనేకం దాగున్నాయి. ఈజిప్ట్‌లో నిర్మించిన పిరమిడ్లు ఒక అద్భుతమైతే, ఈజిప్ట్ కోటల మీద చెక్కిన ఈజిప్ట్ పురాతన లిపి మరో మహాద్భుతం! ఆ లిపి ఏమిటో మాత్రం శాస్త్రవేత్తలకు ఇప్పటివరకు అంతు చిక్కని ప్రశ్న. ఇప్పటివరకు ఆ లిపిని అర్థం చేసుకోవడానికి అనేక ప్రయోగాలు చేశారు.

భూగర్భంలో లాబ్రినాథ్

అదేవిధంగా మరో మిస్టీరియస్ మిస్టరీ ప్రాంతం లాబ్రినాథ్. ఈ ప్రాంతాన్ని భూగర్భంలో ఎవరు నిర్మించారో తెలియజేసే సరైన ఆధారాలు ఇప్పటివరకు దొరకలేదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారమైతే, మొసళ్ళు నివసించేందుకు నిర్మించిన పవిత్ర ప్రదేశం. మొత్తం 12 మంది రాజులు వీటిని నిర్మించారని చెబుతారు. ఈ లాబ్రినాథ్‌పై పరిశోధనలు చేసేందుకు మాత్రం ఈజిప్ట్ ప్రభుత్వం అనుమతించడం లేదట.

ది ఓరా లిండా బుక్

చిన్న పిల్లలు, రాయడం తెలియని వారు పుస్తకాలపై రాస్తే ఎలా ఉంటుంది? ఏం రాశారో వారికే తెలియక అర్థం కాకుండా గజిబిజిగా ఉంటుంది కదా! సరిగ్గా ది ఓరా లిండా బుక్ కూడా అలాగే ఉంటుంది. అసలు ఆ బుక్ ఏంటి అన్న విషయం ఇప్పటికీ అంతుచిక్కలేదు. కానీ అదేమీ చిన్న పిల్లలు రాసిన బుక్ కాదండోయ్! ఎంతో విలువైన సమాచారం అందులో ఉంది. ఈ పురాతన పుస్తకంలో ఫ్రిజియన్ భాషలో చేతిరాతతో రాసిన చారిత్రక, పౌరాణిక, మతపరమైన అంశాలెన్నో ఉన్నాయి. అంతేకాక కెటాస్ట్రోఫిజమ్, నేషనలిజమ్, మాత్రి యార్కి, మైథాలజీలకు సంబంధించిన వివరాలు కూడా ఇందులో రాసి పెట్టారు. ఈ పుస్తకంలోని అక్షరాలన్నీ క్రీ.పూ. 2194 నుంచి క్రీ.శ. 803 మధ్యకాలంలో పొందుపర్చినట్టు పరిశోధకులు తేల్చారు. భూదేవిని పూజించే వాళ్ల ఈ పుస్తకం రాశారని అంటుంటారు. కానీ ఈ లిఖిత పుస్తకంలోని లిపిని ఇంతవరకు ఎవరూ డీకోడ్ చేయలేకపోయారు. అందుకే ఆ బుక్‌లోని కాగితాల వెనుక ఉన్న అక్షర సర్వస్వం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయింది.



రబ్బరు బంతులు కాదు రాయి బంతులు

బంతి అనగానే రోజూ క్రికెట్, ఫుట్‌బాల్ ఆడే బంతులే గుర్తొస్తున్నాయా? కానీ అక్కడ ఉన్నవన్నీ రాతి బంతులే. ఒకసారి అరటి తోటలు పెంచే ఉద్దేశంతో కోస్టారికాలో దట్టమైన అడవుల్ని తగుల బెట్టి, నేలను చదునుచేస్తున్న సమయంలో అక్కడ వింత ఆకారంలో ఉన్న రాతిబంతులు అనేకం బయటపడ్డాయట. అవన్నీ టెన్నిస్ బంతి సైజులో మొదలుపెట్టి 16 టన్నుల బరువున్న బంతుల దాకా అనేక రకాల పరిమాణాల్లో బయటపడ్డాయట. వేల సంవత్సరాల నాటివే ఇవన్నీ. ఎవరు ఎందుకు వీటిని తయారు చేశారో అంతుచిక్కడం లేదు.

ది వేలీ ఆఫ్ వేపర్స్

వేడినీటి చెలమలు, చల్లని నీటి చెలమల గురించి మనందరికీ తెలిసిందే. కొన్ని కారణాల వల్ల భూమిలోంచి వేడినీరు ఉబికి వస్తూ ఉంటుంది. అయితే ఆగ్నేయ అమెరికాలోని ఆర్కాన్‌సాస్ ఉవాచిత పర్వతశ్రేణిలో ది వేలీ ఆఫ్ వేపర్స్ అనే ప్రాంతం ఉంది. ఈ నీటిలో స్నానం చేస్తే రోగాలు నయమవుతాయట. ఇప్పటికీ చాలామంది స్నానాలు చేస్తూ తమ వ్యాధులు నయం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం హాట్ స్ప్రింగ్ నేషనల్ పార్క్ అనే పేరుతో రూపుమారింది. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని అనేక తెగల ప్రజలు పరమపవిత్రంగా భావించేవారు. ఈ ప్రాంతంలో స్నానం చేసేవారు. ఇందులో నిత్యం 143 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఎనిమిది లక్షల గాలన్ల నీరు బైటకు ప్రవహిస్తూనే ఉంటుంది. అది ఎందుకు అలా వెలువడుతుందన్న విషయం ఇప్పటివరకు అంతుచిక్కలేదు. ఎటువంటి జియో థర్మల్ యాక్టివిటీ లేకుండా నాలుగు వేల సంవత్సరాలుగా భూగర్భ పొరల్లోంచి నిరంతరాయంగా ఆ నీరు వెలువడుతోంది. అది కూడా వడబోసిన నీరంత స్వచ్ఛంగా ఉంటుంది. ఇక్కడికి దగ్గరలోనే, చల్లని నీటి గుండం కూడా ఉంది. దీన్ని ముద్దుగా స్లీపింగ్ వాటర్స్ అని పిలుచుకుంటారు. ఆనాటి కాలం నుంచి నేటి వరకు ఈ ప్రాంతం అదే పేరుతో పిలవబడుతోంది. ఇలా ఒక పక్కన వేడి నీళ్ల ఉబికి రావడం, మరో పక్క చల్లని నీటి సెలయేరు ఉండడం ఈ రెండూ రోగాల్ని నయం చేయడం అంతా ఒక మిస్టరీ...! ఇప్పటి వరకు ఈ మిస్టరీ ఏమిటో ఎవరూ కనిపెట్టలేకపోయారు. మరో విచిత్రమైన విషయం ఏమిటంటే, ప్రపంచంలోనే ఎంతో అరుదైన అరవై రకాల ఖనిజాలు దీనికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఒకేచోట లభిస్తున్నాయి. కిలోమీటర్ వ్యాసార్థంలో ఈ ఖనిజాలు విస్తరించి ఉన్నాయి. ఈ విధంగా ఈ ప్రాంతం మాగ్నెటిక్ కేవ్‌గా మిస్టరీకి ఆలవాలమైపోయింది.

పురాతన శిలాజాలు

కొన్ని వేల సంవత్సరాలకు పూర్వమే శిలాతలం కింద శిలాజాలు రూపు దాల్చాయి. అయితే ఉలాలో 110 మిలియన్ సంవత్సరాల నాటి ఒక మనిషి హస్తముద్ర లభించింది. అలాగే దొరికిన ఒక మనిషి పాదముద్ర 600 మిలియన్ సంవత్సరాల నాటిదని అంచనా వేశారు. అంటే అప్పటికే మనుషులు పాదరక్షలు ధరించేవారా? లేక వాళ్ల ఎవరైఉంటారు. అనేది ఇప్పటికీ మిస్టరీగా మిగిలిపోయింది. అంతేకాదు అక్కడ చేసిన అనేక తవ్వకాల్లో మనిషి గోరు, ఇనుపకుండ లాంటి వస్తువులు బయటపడ్డాయి. ఇవన్నీ ఎప్పటివీ? ఎవరివీ? అనే విషయం ఇప్పటివరకు తేలలేదు.

అమెరికాలోని మిస్సోరి ఒక పురాతన నగరం. ఈ నగరంలో రాక్షసులు నివసించారని చెబుతారు. అక్కడ మహాకాయాలు గల మనుషుల అస్థికలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వారు ఎవరన్నది మాత్రం ఇప్పటికి మిస్టరీయే!

ది వస్ట్ తక్లామకన్ ఎడారి

ఎడారిలో ఎంత సేపు నడిచినా ఇసుక మేడలు తప్ప ఏమీ ఉండవు. చైనాలో ఉన్న ఈ ఎడారిలో ఏదారినైనా వెళ్లారనుకోండి మళ్లీ తిరిగి అదే దారిన రావడానికి దారి తెలియదట. అక్కడ ఇసుకతో నిర్మించిన పురాతన దేవాలయాలు ఉన్నాయట. అదేంటి ఎడారిలో దేవాలయాలేంటని అనుకుంటున్నారా? ఈ ఆలయాలను ఎవరు నిర్మించారు? ఎందుకు నిర్మించారు? అనే విషయం ఇప్పటివరకు తేలలేదు. అంతేకాదు ఆ దేవాలయాలు ఇసుకతో ఎలా నిర్మించారన్నది మాత్రం ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్న.

-విజేత



లోతైన ఓ అద్భుతం క్రుబేరా గుహ!

గుహల సౌందర్యం, వాటి అద్భుతాలు తెలియంది కాదు. బొర్రాగుహలు, ఎలిఫెంటా, అజంతా గుహలు ఎన్నో అద్భుతాల గురించి వివరిస్తాయి. కానీ ప్రపంచంలోనే అతి లోతైనదిగా పేరొందిన గుహ క్రుబేరా గుహ. 2,197 మీటర్లు అంటే సుమారు 7,208 అడుగుల లోతు వరకు ఉంటుందీ గుహ. భూమి మీద అతి లోతైన గుహగా క్రుబేరా పేరొందింది. భూమి పొరల్లో వచ్చిన మార్పుల వల్ల ఈ గుహలు ఏర్పడ్డాయి. జార్జియా దేశంలోని అబ్ఖజియా ప్రదేశంలో ఉన్న ఈ గుహలు 1960లో బైటపడ్డాయి. అబ్ఖజియా ప్రాంతం రష్యా నుంచి వెళితే దగ్గర. మాస్కో నుంచి ఇక్కడికి సులభంగా చేరుకోవచ్చు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఇక్కడ చల్లగానూ, వాతావరణం అనువుగానూ ఉంటుంది.

నాతిచరామి

గొర్తి శ్రీనివాసరావు

ఇరవయ్యేళ్ళ తరువాత జయంతి ఆ ఊరికి వచ్చింది. ఆ ఊరు వదిలి వెళ్ళినప్పుడు ఆమె తన తొలిప్రేమ బంధాన్ని తెంపుకుని వెళ్ళింది. అప్పట్లో ఆమె వయసు ఇరవై ఏళ్ళు. ఉరకలెత్తే యవ్వనం, ఆశయాల ఉన్మాదం. మేధస్సు కంటే హృదయం వేడిగా వాడిగా ఉండే ఆ రోజుల్లో కాలేజీ పరిచయం ప్రేమలోకి దారితీస్తే వచ్చిన వాడి చేయి పట్టుకుని ఆ ఊరికి వచ్చింది. అతనికి అక్కడ ఉద్యోగం దొరకడంతో, తల్లిదండ్రులకు చెప్పకుండా అక్కడకు వచ్చేసింది.

అతను కూడా తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెను పెళ్ళిచేసుకున్నాడు. కానీ వారు తన దగ్గర ఉండాలి అని తాపత్రయ పడేవాడు. ఎక్కడో ఉన్న తల్లిదండ్రులను తెచ్చి తన దగ్గర ఉంచుకుని ఆమెకంటే వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండటంతో ఆమె అభిమానం దెబ్బతింది. అక్కడ ఇమడలేక పోయింది. తరచు వారి మధ్య గొడవలు వస్తుండేవి.

నవ్యవీక్లి- నాటా సంయుక్త నిర్వహణలో బహుమతి పొందిన కథ

చిన్నిచిన్ని గొడవలను భూతద్దంలో చూసింది. అతన్ని విడిచి తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళిపోయింది. అతన్ని మరిచి పోవడానికి కష్టపడి చదివి డైరెక్ట్‌గా ఆఫీసర్ అయింది. తల్లిదండ్రులు ఎంత చెప్పినా మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఎందుకో మరొకరిని భర్తగా అంగీకరించలేకపోయింది.

ఇన్నాళ్ళ తర్వాత ఇప్పుడు అతను గనుక తనను ఈ పొజిషన్‌లో చూస్తే ఏమనుకుంటాడు? ఎలా రియాక్ట్ అవుతాడో చూడాలనే కుతూహలం కలిగింది ఆమెకు. చూద్దాం, ఎప్పుడో ఒకసారి దొరక్కపోడు. అప్పుడు అతన్ని షాక్ చేయాలి అనుకుంది జయంతి. తర్వాత కొత్త చోటికి వెళ్ళినప్పుడు ఎప్పుడూ తను చేసే పనే అప్పుడూ చేసింది. అక్కడ పెండింగ్ పనులపైన దృష్టి పెట్టింది.

యాక్సిడెంట్ కారణంగా చనిపోయిన ఉద్యోగుల కుటుంబానికి ఇవ్వాల్సిన పరిహారం, వారికి అందించాల్సిన పెన్షన్, కారుణ్య నియామకాలు ముందుగా చేయాల్సి ఉంటుంది. అవి పెండింగ్ పెట్టడం వృత్తిపరంగాను, వ్యక్తిగతంగాను ఆమెకు ఇష్టం ఉండదు. అలాంటి పెండింగ్ కేసుల లిస్ట్ తెప్పించింది.



ఆ లిస్ట్ పరిశీలిస్తున్నప్పుడు అందులో వికాస్ పేరు కనబడేసరికి ఒక్కక్షణం గుండె ఆగినట్లు అనిపించింది ఆమెకు. అది అతని పేరే! కాని అతనే అయి ఉంటాడా? దేవుడా? అలా కాకూడదు. అతన్ని చూడాలి. అతను బ్రతికి ఉండేలా చూడు అనుకుంటూ మనసులోనే దేవుడిని ప్రార్థించింది. వెంటనే అతని ఫైల్ తెప్పించింది. అందులోని ఫోటో చూసి గుర్తుపట్టింది. అతనే! ఆమె కళ్ళల్లో నుంచి అసంకల్పితంగా రెండు కన్నీటి బొట్లు రాలాయి.

మనసులో ఏదో మూల గుబులుగా ఉంది. తెలియని బాధ ఆమె మనసుని మెలి తిప్పుతూనే ఉంది. మరో పక్క అతని కుటుంబం గురించి తెలుసుకోవాలని ఒక కుతూహలం. అసలు తను విడిచి పెట్టేశాక అతను ఏమైపోయాడు. ఎలా తను ఇచ్చిన షాక్ తట్టుకున్నాడు. తెలుసుకోవాలని ఆమెలో ఒక చిన్న కుతూహలం. ఆ కేసుకి సంబంధించిన వాళ్ళను పిలిపించమని ఆర్డర్ ఇచ్చింది తన సిబ్బందికి.

ఆ రోజు వాతావరణం చాలా ఉక్కగా ఉంది. గాలి స్థంభించిపోయి ఉంది. ఆకాశంలో మబ్బులు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. మాటువేసి మలుపు దగ్గర వేసేద్దాం అని స్కెచ్ వేసుకుని కనీకనబడకుండా చుట్టుముడుతున్న దుండగుల్లా ఉన్నాయి ఆ మబ్బులు. 'ఇక్కడి వాతావరణాన్ని నమ్మడానికి లేదు, ఇక్కడి మనుషుల్లానే! ఎప్పుడు మన వెన్నుగాస్తారో, మరెప్పుడు పోటు పొడుస్తారో అంతు పట్టదు!!' అనుకుంది నమిత.

ఆఫీసు వరండాలో ఒక పక్కగా వేసి ఉన్న పాతకాలం చెక్క బెంచిపైన ముడుచుకుని కూర్చుని ఉంది నమిత. సమయం పదకొండు కావస్తోంది. ఆ సమయానికి ఆఫీసులో పని చేసుకుంటూ కనబడాల్సిన ఉద్యోగులు తీరుబడిగా వస్తున్నారు. నోటినిండా పాన్ పెట్టుకుని నములుతూ ఆ ప్రదేశానికి తామే ప్రభువులం అన్నట్లు ధీమాగా నడుస్తూ వస్తున్నారు. వారిని చూసి మరింతగా ముడుచుకుపోయింది నమిత. రోజూ చూస్తున్నట్లే ఈసడింపుగా ఆమెను చూసి 'ఈ కాలంలో మొగుడు పోయిన పెళ్ళాలదే అదృష్టమంటే?' అన్నాడు అందరికంటే ముందు నడుస్తున్న దాసు.

కొత్తగా ఆ ఊరుకి బదిలీపై వచ్చిందామె. పెండింగ్ సమస్యలు పరిష్కరించడం ప్రారంభించింది. ఒక ఫైల్‌మీద ఆమె దృష్టి పడింది. ఒణికే చేత్తో తీసి చూసింది. కారుణ్య నియామకం కేసు. భర్త ఉద్యోగం భార్యకివ్వాలి. కానీ అత్తమామలే ఫిర్యాదు చేశారు ఆమె అసలు భార్య కాదని. ఆమె ఈ సమస్యను ఎలా పరిష్కరించింది? అసలు ఆ కేసు విషయంలో ఎందుకు ఆమెకు ఎందుకంత ప్రత్యేక ఆసక్తి?

పక్కనున్న వాళ్ళు పగలబడి నవ్వారు. 'అవునవును. ఉత్తపుణ్యానికి వచ్చిపడే ఉద్యోగం ఒక వైపు, కష్టపడి సంపాదించకుండానే గాలికి రాలినట్లు పడే కాసులు మరోవైపు' అన్నాడు కొంచెం వెనకగా నడుస్తున్న బెనర్జీ, మళ్ళీ నవ్వారు అందరూ.

వాళ్ళు తనను దాటి ముందుకు వెళ్ళేవరకు తలవంచి నేలనే చూస్తూ కూర్చుంది. ఆ భూదేవి తనకు కూడా ఓరిమి ప్రసాదిస్తుందేమో అని! ఎంత కష్టమైనా భరించాల్సిందే! తన కడుపులో ఉన్న బిడ్డకు ఆసరా కల్పించడం కోసమైనా ఈ ఆఫీసు చుట్టూ తిరిగి తనకు హక్కుగా రావాల్సినవి పొందాల్సిందే అనుకుంది నమిత. కాని దానికి భూదేవికి ఉన్న ఓర్పుతో పాటు కొంత సిగ్గులేనితనం, మరికొంత మాటకారితనం కూడా అవసరం అని ఆమెకు ముందు తెలియదు. కాని మెల్లమెల్లగా తెలుసుకుంది.

ఆమె భర్త సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ కార్ఖానాలో జరిగిన ప్రమాదంలో మరణించాడు. హఠాత్తుగా, నడిసముద్రంలో తాను ఒక చిన్న నావ పైన ప్రయాణిస్తున్నానని ఆ నావ మునిగిపోతే తనకు బ్రతకడానికి దారి లేదనే చేదునిజం నమితను వెక్కిరించింది. కొద్దిరోజుల పాటు మొక్కుబడిగా తోడున్న అయినవాళ్ళంతా పెద్దకర్మ తర్వాత నమితను తన ఖర్మానికి వదిలి వెళ్ళిపోయారు. ఆఫీసులో పైరవీలు చేస్తూ తిరిగే మోహన్ ఆమెకు సాయం చేయడానికి ముందుకు వచ్చినప్పుడు ఆమెకు మరో దిక్కులేక అతన్ని ఆశ్రయించింది.

ఏమి చేయాలో పాలుపోక అయోమయంలో ఉన్న నమితను ఆఫీసు చుట్టూ, ఆఫీసర్ చుట్టూ తిప్పించి ఆమెకు రావలసిన పెన్షన్ కోసం, భర్త చనిపోవడం వల్ల ఆమెకు రావలసిన కారుణ్య

నియామకం కోసం అర్జీలు పెట్టించాడు మోహన్. మామూలు కేసుల్లా కాక నమిత కేసు జటిలమయిందని తెలిశాక మోహన్ ఆమెను తప్పించుకుని తిరగడం మొదలుపెట్టాడు. అతనికి డబ్బు ఇవ్వడం కోసం ఆమె తన ఒంటిమీద బంగారం కొంచెం కొంచెంగా అతనికి సమర్పించుకుంది. ఆడది ఇవ్వగల సౌఖ్యానికి అర్రులు చాచే మోహన్ ఆమె జోలికి పోకపోవడానికి కారణం మాత్రం ఆమె ఎత్తయిన పొట్ట!

నమిత భర్తకు అది వరకు పెళ్ళి అయిందని, ఆమెతో గొడవలు వచ్చి దూరంగా ఉంటున్నాడని, ఆమెకు విడాకులు ఇవ్వకుండానే నమితను వివాహం చేసుకున్నాడని ఆఫీసుకు ఫిర్యాదు వచ్చింది. దాని వల్ల ఆమెకు భార్య హోదా లేదని ఆఫీసులోని ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. అందుకే మోహన్ ప్రయత్నాలు వమ్ము అయ్యాయి. ఆఫీసర్ ఆమెకు ఏమీ సాయం చేయలేక పోయాడు. పైగా ఆ ఫిర్యాదుచేసింది స్వయంగా ఆమె అత్తమామలే!

తమకు వికాస్ ఒక్కడే ఆధారమని, అతను చనిపోయాక తమను చూసుకోవడానికి ఎవరూ లేరని, అతని మరణానంతరం రావలసిన సొమ్ముకి తామే హక్కుదారులం అని నమిత అత్తమామలు విజ్ఞప్తి చేశారు. ఈ కొత్తకోణాల వల్ల నమిత సమస్య ఒక కొలిక్కి రాలేదు. ఈలోగా అంత వరకు కొంచెమైనా సానుకూలంగా ఉన్న ఆఫీసరు బదిలీపై వెళ్ళిపోయాడు.

కొద్దిరోజుల కింద కొత్త ఆఫీసర్ పదవీ స్వీకారం చేశారు. ఆఫీసునుంచి కబురు వచ్చింది కొత్త ఆఫీసరుగారు వచ్చి కలవమన్నారు అని. అందుకే ఆ రోజు ఆఫీసుకి వచ్చి ఆఫీసరుని కలవడానికి పడిగాపులు కాస్తోంది నమిత.

ఉక్క భరించలేనంతగా ఉండటంతో నుదుటికి పట్టిన చెమటలు కొంగుతో తుడుచుకుని, తన వెంట తెచ్చుకున్న బాటిల్‌లో నీళ్ళు కొంచెం తాగి గొంతు తడి చేసుకుంది. రెండు రోజుల నుంచి ఉక్క ఎక్కువయింది. వేసవి మొదలు కాకుండానే ఇలా ఉంటే ముందు ముందు ఎండలు మండటం ఖాయం అనుకుంది. తను ప్రస్తుతం ఉంటున్న రేకుల షెడ్ ఇల్లు గుర్తుకు వచ్చింది. తన భర్త చనిపోయిన తర్వాత తనను కార్ఖానా కాలనీలోని ఇంటినుంచి బలవంతంగా పంపించేశారు. తను మోహన్ పిలిచినప్పుడల్లా వెళ్తుంటే అతనితో తనకి అక్రమ సంబంధం ఆపాదించి నిందించారు.

ఆఫీసర్ నుంచి పిలుపు వచ్చింది. 'నిన్ను రమ్మన్నారు' అన్నాడు ప్యూన్. ఉలిక్కిపడి ఆలోచనల నుంచి లేచింది. చేతిలో ఉన్న బ్యాగ్ ఒకసారి తడిమి చూసుకుని, ఏమి మాట్లాడాలో ఆలోచించుకుంటూ, ఆఫీసర్ గదిలోకి మెల్లగా వెళ్ళింది నమిత.

గదిలో చల్లగా ఉంది. ఏసీలు నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోతున్నాయి. బయట తన లాంటి వాళ్ళు పడే కష్టాలు ఇలాంటి గదులలో ఉండి పనిచేసే పెద్ద ఆఫీసరుకు ఏమి తెలుస్తాయిలే, విరక్తిగా అనుకుంది. ఎదురుగా కుర్చీలో కూర్చున్న ఆఫీసర్‌ని చూసి కొంచెం ఆశ్చర్యపోయింది. కొత్త ఆఫీసర్ వస్తున్నారు అని తెలుసు

శాతకర్ణి రాణి శ్రియ?

'శాతకర్ణి'లో బాలకృష్ణకు జోడీగా రాణి పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటి వరకూ చాలా మంది హీరోయిన్ల పేర్లు వినిపించాయి. చివరికి రాణిగా శ్రియ పేరు ఖరారైనట్టు సమాచారం! శ్రియ కూడా ఈ సినిమా చేయడానికి ఆసక్తి చూపడంతో క్రిష్, శ్రియ పేరును ఖరారు చేశాడని అంటున్నారు. అయితే దీని మీద ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదే గనుక నిజమైతే శ్రియ సుడి తిరిగినట్టే అంటున్నారు సినీ జనాలు. కెరీర్ దాదాపు పూర్తిగా అటకెక్కేసిన తరుణంలో ఓ ప్రతిష్ఠాత్మక సినిమాలో మంచి పాత్ర రావడం శ్రియ అదృష్టం అని కూడా చెబుతున్నారు.

గాని ఆ వచ్చిన ఆఫీసర్ ఒక స్త్రీ అని తెలియదు. సీటులో కూర్చుని తనముందు ఉన్న ఫైల్ చదువుతున్న ఆఫీసర్ తలపైకి ఎత్తి చూసింది.

రెండు చేతులు జోడించి నమస్కరించింది నమిత. ఇంతవరకు మగవాళ్ళ చూపులు తన దైన్యాన్ని తమ అవకాశంగా మలచుకోడానికి ప్రయత్నించేవి. వారి ముందు నిస్సహాయంగా నిలుచుండేది తను. కాని మొదటిసారిగా ఒక స్త్రీ తన సమస్య వింటుంది, తనకు న్యాయం చేస్తుంది, అనుకుంది నమిత.

'రా అమ్మా, ఇలా కూర్చో' అంది ఆఫీసర్.

'పరవాలేదండి. నాకు న్యాయం చేస్తే మీకు ఈ జన్మంతా ఋణపడిపోతాను' అంది నమిత.

'నీ ఫైలే చదువుతున్నాను. నీకు, చనిపోయిన ఉద్యోగికి మధ్య భార్యాభర్తల సంబంధం ఉన్నట్లు ఏమైనా ఋజువు ఉందా?' అడిగింది ఆఫీసర్.

ఒకసారి తన ఎత్తయిన పొట్ట వంక చూసుకుంది. 'మా మ్యారేజి ఫోటోలు పెట్టాను. పెళ్ళి కార్డు కూడా నా దరఖాస్తుతో పాటుగా పెట్టాను' అంది నమిత.

'అవి అన్నీ కట్టుకథలు అంటున్నారు. పైగా ఇదివరకే ఆయనకు పెళ్ళి అయిందనటానికి ఆధారాలు ఉన్నాయి. పైగా అతను విడాకులు తీసుకోలేదు' అంది ఆఫీసర్. తన ముందు ఉన్న ఫైల్‌లోకి తల వంచి చూస్తూ.

'ఆ విషయాలు నాకు తెలియదు. నన్ను ఆయన నిజంగానే పెళ్ళి చేసుకున్నారు. ఆయన బిడ్డను నా కడుపులో మోస్తున్నాను. నేనేమీ అబద్ధం చెప్పడం లేదు మేడమ్. మీరైనా నాకు న్యాయం జరిగేలా చూడండి. మీకు పుణ్యముంటుంది' అంది నమిత కళ్ళు తుడుచుకుంటూ.

'నేను చేయగలిగింది ఏమైనా ఉంటే చేస్తాను. కానీ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా మాకు నోటి మాటల కంటే ఈ ఫైల్‌లో ఉండే కాగితాలలోని మాటలు ముఖ్యం' అంది ఆఫీసర్. తన చేతిలోని పెన్ టేబుల్‌పైన పెడ్తూ, తన అశక్తతను అలా వెల్లడి చేసిందని నమితకు అర్థం అయింది. ఒక్కసారిగా ఉప్పెనలా దుఃఖం ముంచుకు వచ్చి, ముఖం చేతుల్లో దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

'కూర్చో' అంది ఆఫీసర్ కొంచెం అనునయంగా.

కుర్చీలో కూర్చొని దుఃఖాన్ని ఆపుకుని మాట్లాడటానికి ప్రయత్నం చేసింది. కాని మాటల మధ్య ఆమె రోదన ధ్వనులే ఎక్కువ ఉండటంతో ఆమె మాట్లాడేది ఏమిటో అర్థం కాలేదు ఆఫీసర్‌కి.

'కొద్దిసేపు మాట్లాడకు' అంది ఆఫీసర్. బెల్ కొట్టి ప్యూన్‌ని పిలిచి మంచినీళ్ళు తెచ్చి ఆమెకు ఇవ్వమంది. మంచినీళ్ళు తాగి కొంచెం తేప్పరిల్లింది నమిత.

'నీ అత్తమామలకు నీపైన ఎందుకు అంత కోపం' అంది ఆఫీసర్.

'ఏమో తెలియదు' అంది నమిత. కాని ఆమె మనసులో ఒక అపరాధభావన లోతుగా మనసుని కలిచివేసింది. మ్లానమైన ఆమె ముఖాన్ని చూడగానే, తన నుంచి ఆమె ఏదో దాస్తున్నదని గ్రహించింది ఆఫీసర్.

'సరే! ఈ ఫైల్ ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. నేను ఏమి చేయడానికి వీలు పడుతుందో చూస్తాను. రూల్ ప్రకారం పని చేయాల్సి ఉంటుంది మేము' అంది ఆఫీసర్.

'మేడమ్ నా ఒక్కదాని జీవితమే కాదు. నా కడుపులో పెరుగుతున్న బిడ్డ భవిష్యత్తు కూడా మీ చేతుల్లోనే ఉంది. దయచేసి మాకు న్యాయం చేయండి మేడమ్' అంది నమిత చేతులు జోడించి.

'చూస్తాను' అంది ఆఫీసర్. నమిత కుర్చీలో నుంచి లేచి వెళ్ళబోయింది.

'పర్సనల్ విషయం అడుగుతున్నాను అనుకోకపోతే, ఒక విషయం అడగవచ్చునా?' అంది ఆఫీసర్.

'అడగండి మేడమ్' అంది నమిత కొంచెం

ఆశ్చర్యంగా!

'మీ ఇద్దరి మధ్య వయసు తేడా పదిహేను ఏళ్ళు ఉంది. అంత పెద్దవాడిని ఎందుకు చేసుకున్నావు?' అంది ఆఫీసర్.

ఏమి చెప్పాలో పాలుపోలేదు నమితకు. 'గతి లేక' అని ఒక్కమాటలో చెప్పాలా, లేక తన కన్న తల్లి ఒంటరిదని, తనను పెంచడానికి చాలా కష్టపడిందని, ఆమె ఆరోగ్యం పాడైపోయి ఆమె మరణించేటప్పటికి తనకు ఎక్కడా ఉద్యోగం దొరకక ఆయనింట్లో పని చేయడానికి సిద్ధపడితే, వారించి పెళ్ళి చేసుకున్నాడని చెప్పాలా? తల వంచుకుని 'ఆయన దేవుడి లాంటి మనిషి, ఈ లోకంలో అలాంటి మంచి మనిషి నాకు భర్తగా రావడం నా అదృష్టం. కాని నా దురదృష్టం వల్ల ఆయనకు యాక్సిడెంట్ అయింది' అంది కళ్ళు తుడుచుకుంటూ.

'ఓకే' అంది ఆఫీసర్, నువ్వు వెళ్ళొచ్చు అన్నట్టు చూస్తూ. ఆమె ముఖం గంభీరంగా ఉంది.

నమిత తల వంచుకుని బయటకు నడిచింది. ఆమె మనసులో ఎన్నో సందేహాలు. ఎందుకు ఆమె తమ మధ్య ఉన్న వయసు భేదం గురించి అంత ఆరా తీసింది. ఆ విషయంలో ఆమెకు ఏమైనా అనుమానాలు ఉన్నాయా? తన అత్తమామలు ఆ విషయం గురించి ఫిర్యాదులో ఏమైనా రాశారా? ముందు కొంచెం సౌమ్యంగానే కనిపించింది. తర్వాత ఎందుకు అంత గంభీరంగా అయిపోయింది. ఆలోచనలలోనే ఆఫీసర్ గదిలోనుంచి బయటకు వచ్చింది. బయట ఆఫీసరు గదికి నేమ్‌బోర్డు మారుస్తుంటే చూసింది. బోర్డుపైన డి.జయంతి అని ఉంది.

అంతలో ఆఫీసరుని కలవడానికి వస్తున్న వృద్ధ దంపతులు కనబడడంతో వాళ్ళను తప్పించుకుని మరో వైపుకి వెళ్ళిపోయింది. అయినా ఆమెని గమనించారు వాళ్ళిద్దరు. ఆమెను గుర్తుపట్టి చిరాకుగా ముఖం పెట్టాడు పెద్దాయన.

'ఇక్కడ కూడా తగలడింది? అయినా వీధిలో బ్రతికే మనిషి, దానికి సిగ్గేమిటి' అంది వృద్ధురాలు జుగుప్సాకరంగా చూస్తూ.

కొంచెం సేపు వేచి ఉన్నాక ఆఫీసర్‌ని కలవడానికి అనుమతి వచ్చింది నమిత అత్తమామలకు.

లోపలికి వెళ్ళారు వాళ్ళిద్దరు. ప్యూన్ వారి కోసం కాఫీలు, బిస్కట్స్ తీసుకొచ్చి సర్వ్‌చేశాడు. కొత్త ఆఫీసర్‌గారు నమిత అత్తమామలకు అంత సమయం ఇవ్వడం, మర్యాదలు చేయడం చూసిన వారికి నమిత కేసు ఎలా ముగియబోతుందో అర్థమయింది. నమిత అత్తమామలు ఎవరో పై అధికారులతో గట్టి రికమెండేషన్ చేయించి ఉంటారు అని ఊహించారు వాళ్ళు.

ఆ రోజు మధ్యాహ్నం నమిత ఫైల్ చూస్తున్న సెక్షన్ నుంచి సూపర్‌వైజర్‌ని పిలిపించింది ఆఫీసర్.

'వికాస్ చనిపోయి ఇన్ని నెలలయినా, అతని సెటిల్‌మెంట్ కేసు ఇంకా ఫైనల్ కాలేదు ఎందుకని' అంది ఆఫీసర్.

'మొదట్లో నమితకు ఇవ్వాలని డిసైడ్ అయిపోయింది మేడమ్. ఎందుకంటే వికాస్ ఆమె పేరుని ఆఫీసు రికార్డులలో చేర్చుకోమని ముందే దరఖాస్తు

చేసుకున్నాడు. అతనికి ఇంతకుముందు వివాహం జరిగిందని, వారిమధ్య ఏవో గొడవలు వచ్చి అతను ఆమెను విడిచి పెట్టాడనే విషయం మాకు తెలియదు. కాని నమిత అత్తమామలకు వికాస్ తమను కాదని పనిమనిషిని పెళ్ళి చేసుకున్నాడని కోపం. అందువలన ఆమెను అతని భార్యగా వాళ్ళు అంగీకరించలేదు. అతనికి ముందే వివాహం జరిగిన విషయాన్ని వాళ్ళే ఫిర్యాదు రూపంలో మన ఆఫీసుకి తెలియజేశారు. రేషన్ కార్డు, మ్యారేజి కార్డు వంటి ఆధారాలు కూడా ఇచ్చారు' అన్నాడు సెక్షన్ సూపర్‌వైజర్ గంగూలీ.

'మొదటి భార్య ఎక్కడ ఉందో తెలుసా?' అడిగింది ఆఫీసర్.

'తెలియదు మేడమ్. ఆమె వికాస్ నుంచి విడిపోయాక ఎక్కడ ఉందో ఎవరూ పట్టించుకోలేదు. ఆమె ఉందో లేదో కూడా తెలియదు' అన్నాడు గంగూలీ.

'ఒకవేళ ఆమెకు వివాహం జరిగి ఉంటే నమితకు భార్య హోదా దొరుకుతుందా?' అడిగింది ఆఫీసర్.

ఒక్క క్షణం ఆలోచించి, 'దొరకదు మేడమ్. ఆమె విడాకులు తీసుకోకుండా చేసుకున్న వివాహం చెల్లదు. అలాగే నమిత వివాహం కూడా చెల్లదు' అన్నాడు గంగూలీ.

'ఆమె వివాహానికి చట్టబద్ధత లేకున్నా ఆమెకు అతని వలన కలిగిన సంతానానికి హక్కు ఉంటుంది. అతనికి చెందాల్సిన వాటిపై' అంది ఆఫీసర్.

'మీరు చెప్పింది నిజమే. కాని ఆమెకు పిల్లలు లేరు కదా మేడమ్.' అన్నాడు గంగూలీ.

'కాని మేడమ్, ఆ ముసలివాళ్ళను ఎవరు చూసుకుంటారు. ఆ నమితకు, వాళ్ళకు అస్సలు పడదు' అన్నాడు గంగూలీ.

జయంతి ఆలోచనలో పడింది. ఇంట్లో పని చేస్తానని చేరి అమాయకుడైన తమ కొడుకుని ఆకట్టుకుని అతన్నే దేవుడిలా నమ్ముకుని సేవలు చేస్తున్నట్లు నటించి అతనితో తాళి కట్టించుకుంది. తన హక్కులన్నీ భద్రంగా ఉండడం కోసమని తన పేరు ఆఫీసు రికార్డులలోకి ఎక్కేటట్లు వికాస్‌పై ఒత్తిడి తెచ్చింది. అతని తర్వాత తన భవిష్యత్తు బాగుండాలని ప్లాన్ చేసుకోకపోతే అలాంటి ఒత్తిడి తేవాల్సిన అవసరం ఏమిటి ఆమెకు. ఇవీ నమిత అత్తమామలు వెలిబుచ్చిన సందేహాలలో కొన్ని. అతని చావుకి ఆమెకి ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాత్ర ఉండి ఉంటుందని వారి నమ్మకం.

నమితను చూస్తే అంతచెడ్డ మనిషిలా కనిపించడం లేదు. అలాగని వికాస్ తల్లిదండ్రులదే తప్పంతా అనుకోవడానికి కూడా జయంతికి మనసు రాలేదు. ఆ వయసులో తమ కొడుకుని కోల్పోవడం చాలా దురదృష్టకరం. తమ చివరి కాలంలో కొడుకుచేతులు మీదుగా తమ జీవితం కడ తేరాలని కోరుకున్న వారికి తమ కళ్ళముందే చెట్టంత కొడుకు మరణించడం మహాదారుణమైన బాధ. పైగా ఆర్థికంగా అతనిపైన ఆధారపడ్డవారికి ఆ బాధ ద్విగుణీకృతం కావడం సహజమే! అందువలన నమితపైన వారికి కోపం రావడాన్ని అర్థం చేసుకోవచ్చు.

రూల్స్ ప్రకారం ఏమీ చేయడానికి లేని పరిస్థితి. ఒకవేళ పెన్షన్ ఇవ్వవలసి వస్తే నమితకు మాత్రమే అవకాశం ఉంటుంది గాని అతని తల్లిదండ్రులకు ఏ మాత్రం వీలుపడదు. పోనీ నమితకు ఇవ్వాలి అంటే ఆమెకు భార్య హోదా లేదని ఫిర్యాదు. ఇంటికి వెళ్ళిన తర్వాత కూడా జయంతిని అవే ఆలోచనలు వెంటాడాయి. ఎంత ఆలోచించినా ఆమెకు ఏమిచేయాలో అంతుపట్టలేదు. రాత్రంతా నిద్ర పట్టలేదు ఆమెకు.

తరచి తరచి అతనిపైన తనకు ఎటువంటి ఫీలింగ్ ఉందో అని మనసంతా వెతికింది. ప్రేమ గాని, కోపం గాని ఏమీ లేవు అతని పైన. ఒక రకమైన బాధతో కలగలిసిన ఉదాసీనత మాత్రం ఆమె మనసుని మబ్బుల్లా కమ్ముకుంది. నమిత పైన జాలి, అతని తల్లిదండ్రులపై కొంచెం సానుభూతి ఉంది. కానీ మనసులో ఏదో గిల్టీ ఫీలింగ్ వెంటాడుతూనే ఉంది.

మరుసటిరోజు ఉదయం నిద్ర లేచేసరికి జయంతి మనసు కొంచెం తేటపడింది. నిద్రలోనే తను తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడానికి సిద్ధపడింది ఆమె.



ఆ రోజు కూడా ఉక్కగానే ఉంది. మబ్బులు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఉన్నట్లుండి చల్లటి గాలి వీచింది. పెద్ద పెద్ద ఉరుములతో ఆకాశం గర్జించింది. విద్యుల్లతలు నల్లటి మబ్బులను వెలుతురుతో నింపేశాయి కొద్ది క్షణాలు.

నమిత, ఆమె అత్తమామలు ఆఫీసర్ గది బయట వేచి ఉన్నారు. ఎందుకు అందరినీ రమ్మని ఆఫీసర్ పిలిపించిందో వారికి అర్థం కాలేదు. ఆఫీసర్‌గా వచ్చినది, తమ మొదటి కోడలని, ఆ ముసలి దంపతులు గుర్తుపట్టలేదు.

గంగూలీని పిలిపించి ఒక డాక్యుమెంట్ ఇచ్చింది జయంతి. అది ఆమె వికాస్ నుంచి వేరుపడిన తర్వాత తన తల్లిదండ్రుల సలహా వల్ల కోర్టు నుంచి సంపాదించింది. ఆమె తండ్రి లాయర్ కావడం వల్ల అది కొంచెం తేలికగానే అందింది.

తన చేతిలో ఉన్న డాక్యుమెంట్ చదివి, 'మేడమ్ ఈ డివోర్స్ పేపర్ మీకు ఎలా వచ్చింది' అడిగాడు కుతూహలంగా.

'ఆ ఫ్యామిలీ నాకు తెలిసిన వాళ్ళది. వారి ద్వారా తెప్పించాను' అంది జయంతి అతని అనుమానాలను తుంచేస్తూ.

'ఈ పేపర్‌తో నమితకు భార్య హోదా లభిస్తుంది మేడమ్. కాని ఆ ముసలి దంపతులను ఆమె చూసుకుంటుంది అనే గ్యారెంటీ ఏమిటి?' అన్నాడు గంగూలీ.

'అందుకే వాళ్ళను పిలిపించమన్నాను' అంది జయంతి.

నమితతో ఆమె అత్తమామలతో మాట్లాడి వాళ్ళ మధ్య ఒప్పందం కుదిర్చింది జయంతి. నమిత తనకు వచ్చిన సెటిల్‌మెంట్ సొమ్ములో నుంచి సగభాగం అత్తమామలకు ఇచ్చేటట్లు, వారిని జీవితాంతం ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకుంటాను అని రాతపూర్వకంగా ఇచ్చే పక్షంలో ఆమెకు కార్ఖానాలో ఉద్యోగం ఇప్పించేటట్లు నిర్ణయించింది జయంతి.

సంతోషంగా ఒప్పుకుంది నమిత. ఆమె అత్తమామలు కొంచెం గొణుక్కుంటూనే ఒప్పుకున్నారు.

వారెవరికి తనే వికాస్ మొదటి భార్య అన్న విషయం జయంతి చెప్పలేదు.

బయట హోరుమంటూ వర్షం ప్రారంభమైంది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కిటికీలో నుంచి బయట కురుస్తున్న వర్షం చూస్తూ జయంతి తన పర్స్‌లో నుంచి ఒక పాత కవర్ బయటకు తీసి మళ్ళీ చదివింది. ఆమె పంపిన డివోర్స్ నోటీసుకి బదులిస్తూ వికాస్ రాసిన ఉత్తరం అది. నిన్ను విడవనని ప్రమాణం చేసి పెళ్ళి చేసుకున్నాను. నువ్వు వదిలి వెళ్తానన్నా నేను నిన్ను విడువలేను. నాతిచరామి. ఎప్పటికీ నీ వికాస్.

ఆ ఉత్తరం చదువుతుంటే జయంతి కళ్ళు మళ్ళీ కన్నీళ్ళతో నిండిపోయాయి!

సెల్: 091633 40600

సురభి

ప్లాస్టిక్ బాటిళ్ళతో ఇళ్ళు

ఇల్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడు అన్నారు పెద్దలు. కానీ ఈరోజుల్లో ఇల్లు కట్టటం కంటే పెళ్ళి చేయడమే ఈజీ. సిమెంటు, ఇనుము, కలప, ఇంటీరియర్ డెకరేషన్‌కి తడిసి మోపెడవుతోంది. కానీ ఓ గ్రామంలో మాత్రం ఇవేమీ అవసరం లేకుండా, ఎక్కువ ఖర్చులేకుండా ఇళ్ళు కట్టేసుకుంటున్నారు. ఆ వింతేంటో తెలుసుకుందామా!

పనామాలోని ఓ గ్రామంవాళ్ళు ప్లాస్టిక్ బాటిళ్ళతో ఇళ్ళు నిర్మించుకుంటున్నారు. రాబర్ట్ బిజావు అనే సృజనశీలి ఈ ప్లాస్టిక్ బాటిళ్ళ ఇళ్ళ నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. దీనివల్ల వాతావరణ కాలుష్యాన్ని, ఇళ్ళ నిర్మాణ ఖర్చులను తగ్గించవచ్చని చెబుతున్నాడు రాబర్ట్. ఇలా ప్లాస్టిక్ బాటిళ్ళతో నిర్మించిన ఇంట్లో ఉష్ణోగ్రత సాధారణ ఉష్ణోగ్రత కంటే 17 డిగ్రీలు తక్కువగా ఉంటుందట. ఒక వ్యక్తి తన జీవితకాలంలో తాగి పడేసే బాటిళ్ళతో సుందరమైన ఇంటిని నిర్మించవచ్చని చెబుతున్నాడు. గతేడాది 10 వేల బాటిళ్ళతో ఓ ఇంటిని నిర్మించారు. ప్రస్తుతం 14 వేల వాటర్ బాటిళ్ళతో మరో ఇంటిని నిర్మిస్తున్నారు. త్వరలోనే 83 ఎకరాల విస్తీర్ణంలో 120 ప్లాస్టిక్ బాటిళ్ళ ఇళ్ళను నిర్మించి పర్యావరణ సహిత ప్లాస్టిక్ బాటిళ్ళ గ్రామంగా తీర్చి దిద్దుతామని చెబుతున్నారు.

చైనాలో చాయ్ ఫెస్ట్

లేవగానే టీ గొంతులో పడకపోతే తెల్లారదు చాలా మందికి. ఇరానీ టీ, అల్లం టీ, మసాలా టీ...ఇలా ఎన్నో రకాలు. ఈ అన్ని రకాల టీలను ఒకేసారి, ఒకే చోట ఆస్వాదించాలంటే చైనా వెళ్ళాల్సిందే! ఎందుకంటే చైనాలో రకరకాల టీలను ఆస్వాదించటానికి ప్రత్యేకంగా ఓ పండుగ చేస్తారు.

చైనీయులు జరుపుకునే పండుగలు, కార్యక్రమాలు విచిత్రంగా ఉంటాయి. వాటి జాబితాలోకే వస్తుంది ఈ పండుగ కూడా. ప్రతి సంవత్సరం మే నెలలో చైనీయులు టీ ఫెస్టివల్ నిర్వహిస్తారు.

'వు-వో టీ సెరిమనీ' అని పిలుస్తారు ఆ పండుగని. ప్రజలంతా ఇంటి దగ్గర నుంచే కావాల్సిన పాలు, టీ పౌడర్, చక్కెర, స్టవ్ వంటి పదార్థాలు వెంట తెచ్చుకుంటారు. మరికొందరు ఇంటి వద్దే టీ కాచి ఫ్లాస్క్‌లో తీసుకొస్తారు. అలా అందరూ కమ్యూనిటీ హాల్స్‌కి చేరుకొని ఒకరి టీ మరొకరికి ఇచ్చిపుచ్చుకుంటారు. తెచ్చిన లేదా చేసిన టీ అయిపోయేవరకు ఎంచక్కా కబుర్లాడుకుంటూ ఎంజాయ్ చేయవచ్చు. ఈ వేడుకలో చిన్నాపెద్ద భేదాలు లేకుండా అందరూ పాల్గొంటారు. మనిషికి మనిషి స్నేహపూర్వకంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఏటా ఈ పండుగ ఘనంగా చేసుకుంటామని చైనీయులు చెబుతున్నారు.

భలే భలే తాతయ్య

రికార్డులు సృష్టించడం అంటే ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు. ఇష్టం ఉంటేనే సరిపోదు, దానికి తగ్గ కృషి, సంకల్పం ఉండాలనేగా మీ ఉద్దేశం. అలాంటి కృషి, సంకల్పంతో రికార్డుల మోత మోగిస్తున్న ఈ తాతగారి గురించి చదివితే మీకూ ఏదోఒకటి ప్రయత్నించాలని అనిపించవచ్చు.

ఢిల్లీకి చెందిన ప్రకాశ్ రిషి(74) ఓ విభిన్నమైన వ్యక్తి. పలు రకాల రికార్డుల కోసం ఆయన ప్రయత్నిస్తుంటాడు. పాశ్చాత్య దేశాల్లో సరదా కోసం, కొత్తగా కనిపించడం కోసం వేయించుకునే టాటూలను ఆయన ప్రపంచ రికార్డు కోసం వేయించుకుంటున్నాడు. ఇంతవరకు సుమారు 500 టాటూలను ఆయన తన శరీరంపై వేయించుకున్నాడు. ఇందులో సుమారు 396 దేశాల జాతీయ జెండాలు ఉండడం విశేషం. ప్రపంచ ప్రముఖులైన మహాత్మాగాంధీ, ప్రధాని మోదీ, క్వీన్ ఎలిజబెత్, యూఎస్ ప్రెసిడెంట్ ఒబామా ఇలా పలువురి ముఖ చిత్రాల్ని కూడా టాటూలుగా వేయించుకున్నారు. ఒక్క టాటూలతోనే సరిపెట్టుకోలేదు. 1990లో 1001 గంటలపాటు స్కూటర్ నడిపిన ప్రపంచ రికార్డు, నాలుగు నిమిషాల్లో టమోటా కెచప్ తాగిన రికార్డు, ఢిల్లీ నుంచి శాన్ ఫ్రాన్సిస్కోకు పిజ్జా డెలివరీ చేసి మరో రికార్డు, నోట్లో దంతాలన్నీ పీకించుకుని 496 స్ట్రాలు నోట్లో పెట్టుకుని సృష్టించిన రికార్డు....ఇలా 20 రికార్డులు ఆయన పేరిట ఉన్నాయి. రికార్డుల తాతగారు భలే భలే కదూ!

కౌగిలింతల రికార్డు

ముద్దు ముచ్చట్లు, కౌగిలింతలు ప్రేమికులకు మాత్రమే సొంతం కాదంటూ కౌగిలింతల్లో రికార్డుల మోత మోగించి చూపించాడు కృష్ణకుమార్. ఒకే ఒక్క నిమిషంలో ఎక్కువ మందిని కౌగలించుకుని ప్రపంచ రికార్డు సృష్టించాడీ హైదరాబాదీ. 60 సెకన్లలో మొత్తం 79 మందిని మనసారా కౌగలించుకొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకెక్కాడు. దీనికి సంబంధించిన వీడియోను గిన్నిస్ బుక్ అధికారికంగా యూట్యూబ్‌లో విడుదల చేసింది.

గతంలో ఈ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన క్యారీ బిక్‌మోర్ పేరిట ఉంది. ఈ రికార్డును కృష్ణ బద్దలు కొట్టాడు. అతను మొత్తం 83 మందిని కౌగలించుకోగా అందులో సరిగ్గా హత్తుకోలేదని నలుగురిని పక్కన బెట్టారు. వారిని తీసేయగా 79 మందిని కౌగిలించుకున్నట్లు గిన్నిస్ బృందం ధ్రువీకరించింది. ఇప్పుడీ కౌగిలింతల వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

-నర్మద వాసిరెడ్డి

కంఠుగాడి కాశీయాత్ర

- శివసతీపురం శర్మ 15

పడవలోనికి చేరుకున్నాడు కంఠు. తల ఒత్తుకుంటున్నాడు. సుబ్బారావు పక్క పడవలో ఉన్న యాత్రికునితో కబుర్లు మొదలెట్టాడు. పక్క పడవలో ఉన్న యాత్రికునికి అరవై, అరవై అయిదేళ్ళు ఉంటాయి. సన్నగా ఉన్నాడు. భార్యా, కొడుకూ, కోడలూ, కూతురూ, అల్లుడుతో వచ్చినట్టున్నాడు. కళకళలాడుతున్నాడు. ఆయన పేరూ, వాళ్ళ ఊరూ అన్నీ అడిగాడు సుబ్బారావు. ఓపిగ్గా చెప్పాడు ఆయన. తర్వాత అసలు విషయానికి వచ్చాడు సుబ్బారావు.

"రానూ పోనూ పడవకి ఎంత మాట్లాడారు?" అడిగాడు.

"ఆరువందలు" చెప్పాడాయన.

"దెబ్బయిపోయాం" గొల్లుమన్నాడు సుబ్బారావు. డాక్టర్‌బాబుతో అన్నాడిలా.

"చూడు! పక్క పడవలో మనిషికి ఆరొందలట! మనమేమో మనిషికి వెయ్యి రూపాయలు చెల్లిస్తున్నాం. సరిగ్గా బేరం ఆడడం రాదు. పేరుకేమో పెద్ద డాక్టర్‌వి."

"అయ్యా మనిషికి ఆరొందలు కాదు, మా ఆరుగురికీ కలిపి రానూపోనూ ఆరొందలు." అరచి చెప్పాడు పక్క పడవలోని ఆయన. అంతే! సుబ్బారావుకి నోట మాట రాలేదు. కొయ్యబారిపోయాడు. పురిసెడు నీళ్ళు తీసి జల్లాడతని మీద కంఠు. తేరుకున్నాడు సుబ్బారావు.

"మోసంరా! ఈ బెల్ట్ బెల్టంతా మోసమే" అన్నాడు సుబ్బారావు.

నవ్వారంతా. పడవలో ఒడ్డుకు చేరుకున్నారు. పడవ వాళ్ళకి ఆరు వేలు చెల్లించాడు బాబు.

"దోపిడీరా! అంతా దోపిడీ" నెత్తికొట్టుకున్నాడు సుబ్బారావు.

"మీరు వెళ్ళి అక్కడ ఆ కోటలో హనుమను దర్శించుకుని బయటికొచ్చే వేళకి ఓ ఫోన్ కొట్టండి! నేను అక్కడ ఉంటాను. అందాకా నేనిక్కడే ఉంటాను, పార్కింగ్ ప్రాబ్లెం." అని నవ్వాడు దీక్షిత్. సరేనన్నారు కంఠు వాళ్ళు. తీరానికి దగ్గరగా ఉన్న కోట వైపు నడవసాగారు. నడుస్తూ నడుస్తూ వెనక్కి తిరిగి చూసి ఆగిపోయాడు సుబ్బారావు. పడవ వాళ్ళతో దీక్షిత్ డబ్బు పంచుకోవడాన్ని చూసి 'దొంగ దొంగ' అంటూ గుండెలు బాదుకుంటూ మిత్ర బృందం దగ్గరకు పరుగున వచ్చాడు.

"వాడు...ఆ దీక్షిత్‌గాడు ఎంత దొంగో తెలుసా?" అని తాను చూసింది చెప్పాడు అందరికీ.

"జరిగిన అన్యాయం గురించి తెలుసుకుంటేనే బాధ. తెలుసుకోలేదనుకో, ఏ గొడవా ఉండదు." అన్నాడు కంఠు.

అంతా కోటలోనికి వెళ్ళి అక్కడ ఉన్న హనుమను దర్శించుకున్నారు. హనుమతోపాటు ఇంకా ఎవరెవరో దేవుళ్ళుంటే వారిని కూడా దర్శించి వెనక్కి తిరిగొచ్చారు. ఆసరికి బాబు ఫోన్ చేశాడేమో! బయట కారుతో సిద్ధంగా ఉన్నాడు దీక్షిత్. కారెక్కారంతా. బయల్దేరారు.

"ఇలా ఇప్పుడెక్కడికి?" అడిగాడు సుబ్బారావు.

"శక్తిపీఠానికి వెళ్తున్నాం. మాధవేశ్వరి ఆలయానికి తీసుకెళ్తున్నాను. ఆ తల్లిని అలోపిమాత అని కూడా అంటారు." అన్నాడు దీక్షిత్.

"సతీదేవి వేలు ఇక్కడ పడిందట కదా! అందుకే ఈ పీఠం చాలా పవర్‌ఫుల్ అంటారు." అన్నాడు సుబ్బారావు. అవునన్నట్టుగా తలూపి కారు డ్రైవ్ చేయసాగాడు దీక్షిత్.

"అన్నట్టు అలోపిమాత ఆలయంలో చూడ్డానికి ఎలాంటి విగ్రహమూ ఉండదు. కర్రతో చేసిన ఓ చిన్న ఊయల ఉంటుందంతే! ఆ ఊయల్ని నొసటికి తాకించుకుని, అమ్మవారిని ఊహించుకోవాలి. ధ్యానించాలి." చెప్పాడు సుబ్బారావు.

"ఇక్కడి ఆలయాల గురించి బాగా స్టడీ చేసి వచ్చినట్టున్నావు?" అంది నిర్మల.

"చెయ్యకపోతే నాకివన్నీ ఎలా తెలుస్తాయి చెప్పు?" అన్నాడు సుబ్బారావు.

"ఫ్యూచర్లో గైడ్‌గా సెటిలవుతాడేమో! బాగా స్టడీ చేస్తున్నాడు." అన్నాడు కంఠు.

"చెబితే ఓ బాధ! చెప్పకపోతే ఓ బాధ" అని తల పట్టుకున్నాడు సుబ్బారావు.

"అలోపిమాత ఏమిట్రా? అదేం పేరు?" అడిగాడు బాబు.

"అలోప్ అంటే ఉర్దూలో అదృశ్యం అని అర్థం. అమ్మవారు ఏ రూపంలోనూ కనిపించదుగా అందుకే ఆ పేరు." అన్నాడు సుబ్బారావు.

"ఓ కథ ప్రకారం అలోపి అన్నది ఓ యువతి పేరు. ఆమెకి పెళ్ళయింది. పల్లకీలో ప్రయాణిస్తోంది. ఇంతలో బందిపోట్లు దాడి చేశారు. పెళ్ళి బృందాన్ని దొరికిన మేరకు దోచుకున్నారు. పెళ్ళికూతుర్ని కూడా దోచుకుందామని పల్లకీ వైపు పరుగుదీశారు. తెరలు తొలగించి చూశారు. అలోపి లేదందులో. తర్వాత కాలంలో ఆమే దేవత అయిందంటారు స్థానికులు." చెప్పాడు సుబ్బారావు.

ఆసరికి ఆలయానికి చేరుకున్నారు. కారాపి, వెళ్ళి రండి అన్నాడు దీక్షిత్. మిత్రబృందం ఆలయ ప్రవేశం చేసింది. సుబ్బారావు చెప్పింది నిజమే! అతను చెప్పినట్టు చూసేందుకు అక్కడ ఎలాంటి విగ్రహమూ లేదు. ఓ చిన్న ఊయల వేలాడుతోందంతే! ఆ ఊయల్ని పట్టుకుని, దానికి తలని తాటించి ప్రార్థిస్తున్నారంతా. పదిమందినీ



అనుసరించడమే ఉత్తమం అనుకున్నారు కంతూ వాళ్ళు. అలాగే తల్లిని ప్రార్థించి తిరిగి వచ్చారు. కారెక్కారు.

"ఇప్పుడు మనం ఆనంద్‌భవన్‌కి వెళ్తున్నాం సార్! మీరిప్పుడు హిస్టారిక్ హౌస్ మ్యూజియం చూడబోతున్నారు." అన్నాడు దీక్షిత్.

ఆనంద్‌భవన్‌ని 1930లో మోతీలాల్ నెహ్రూ నిర్మించారు. తొలిరోజుల్లో ఈ భవన్‌ని 'ఆనంద్ భవన్' అని వ్యవహరించినా తర్వాతి కాలంలో దానిని 'స్వరాజ్‌భవన్'గా పేర్కొన్నారు. ఈ భవనాన్ని 1970లో భారతప్రభుత్వానికి అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ధారాదత్తం చేశారు. ఈ భవన్‌లో జవహర్ ప్లానిటోరియం కూడా ఉంది.

-దీక్షిత్ టూకీగా ఆనంద్‌భవన్ పుట్టుపూర్వోత్తరాలు చెప్పి, సరిగ్గా ఆ భవన్‌కి ఎదురుగా ఉన్న హోటల్ ముందు కారాపాడు.

"లంచ్ చేసి చూస్తారో, లేదంటే చూసొచ్చి లంచ్ చేస్తారో మీ ఇష్టం." అన్నాడు.

"చూసొచ్చే లంచ్ చేద్దాం." అంది వాణి. సరే అన్నారంతా. ఆనంద్‌భవన్‌లోకి ప్రవేశించారు. ఆసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. టికెట్ కౌంటర్ దగ్గరకు వెళ్తే అది మూసి ఉంది. ఒంటిగంట నుంచి ఒంటిగంటన్నర వరకూ లంచ్ సమయమంట! అక్కడి సిబ్బంది చెప్పింది. భారతీయులకైతే సందర్శించేందుకు పదిహేను రూపాయలే! విదేశీయులకైతే డెబ్బయి అయిదు రూపాయలు! వాళ్ళు చేసుకున్న పాపం ఏమిటో అర్థం కాలేదెవరికీ.

"పదండి! లంచ్ చేసొద్దాం, ఓ పనైపోతుంది." అన్నాడు సుబ్బారావు.

వెనక్కి తిరిగొచ్చారు. దీక్షిత్ కారు పార్క్ చేసిన హోటల్లోనే భోం చేశారంతా. ఫుడ్ పరమదరిద్రంగా ఉంది. కంతుకైతే వాంతి వచ్చినంత పనైంది.

వింధ్యాచలవాసిని ఆలయం దారికిరువైపులా దుకాణాలే. సన్నని దారిలో మెట్లెక్కుతోంది మిత్రబృందం. సందులోంచి ఎలాగైతేనేం గర్భగుడిలోకి చేరారు. తొక్కిసలాటగా ఉందక్కడ. ఊపిరి అందడం లేదు. ఒకరిమీదొకరు పడిపోతున్నారు. మమ్మల్ని బైటకు పంపించేయండని పోలీస్‌ను అడిగాడు కంతు. పూజారి చెప్పినా మిత్రబృందం వినలేదు. ఇంతకూ వారు అమ్మవారిని దర్శించారా? లేదా?

పావు తక్కువ రెండైంది.

"పదండి పదండి! టికెట్లిస్తారిక." అన్నాడు సుబ్బారావు. పడుతూ లేస్తూ ఆనంద్‌భవన్‌కి చేరుకున్నారంతా. టికెట్లు తీసుకున్నారు. మోతీలాల్‌నెహ్రూ, నెహ్రూ, ఇందిరాగాంధీల గదులూ, ఆకాలం నాటి వస్తువులూ, పుస్తకాలూ చూశారు. అపురూపమైన ఫోటోలు కూడా చూశారు. మెట్లెక్కీ, దిగి, అటు తిరిగీ, ఇటు తిరిగీ అలసిపోయారు. పోదాం అంటే పోదాం అనుకున్నారు. కారు దగ్గరకు చేరుకున్నారు. కూర్చున్నారందులో.

"పోనీ" అన్నారు. కారు వింధ్యాచలవాసినిని దర్శించేందుకు అటుగా పరుగుదీసింది.

అలసిపోయారేమో! కునుకులో పడ్డారంతా. కాశీ డెబ్బయి కిలోమీటర్ల దూరంలో ఉందనగా మెలకువ వచ్చింది అందరికీ. వేడిగా టీ తాగుదాం అన్నారు. అమ్మవారి ఆలయం దగ్గర తాగుదురు గాని అంటూ కారాపకుండా డ్రైవ్ చేయసాగాడు దీక్షిత్. కాసేపటికి ఓ ఇంటి ముందు కారాపాడు.

నాలుగైదు గిన్నెలూ, ఓ స్టవ్ పెట్టుకుని టీ కాస్తుందో యువతి.

"మంచి టీ కావాలి" అడిగాడామెను దీక్షిత్. సరేనన్నట్టుగా తలూపిందామె. అందర్నీ కారు దిగమన్నాడు దీక్షిత్. దిగారంతా. నీడపట్టున నిల్చున్నారు. ముందుగా తాగడానికి నీళ్ళిచ్చి, తర్వాత అల్లం చాయ్ తయారు చేసిచ్చింది. తాగుతోంటే ప్రాణం లేచొచ్చినట్టనిపించింది. బాగుందని మెచ్చుకున్నాడు డాక్టర్‌బాబు. వంద రూపాయలు ఇచ్చాడామెకు. చిల్లర ఇవ్వబోతుంటే వద్దన్నాడు. కోపం వచ్చింది ఆ యువతికి.

"నేను టీ అమ్ముకునేదాన్నే కాని, బిచ్చగత్తెను కాను." అన్నది హిందీలో. తీసుకోమంటూ చిల్లర విసిరేసింది. ఏరుకోక తప్పింది కాదు. అంత కోపం ఏమిటో అని ఆశ్చర్యపోయారంతా.

కారెక్కి ఆలయానికి చేరుకున్నారు. బాగా ఎత్తు మీద ఉంది ఆలయం. నడవసాగారు. దారికి ఇరుపక్కలా వందల దుకాణాలు. అన్నిటా అమ్మవారి వస్తువులే! కొనమని మీది మీదికి దుకాణదారులు వస్తోంటే... వద్దని ముందుకు నడిచింది మిత్రబృందం. సన్నని దారిలో... మెట్లెక్కుతూ ముందుకు నడుస్తున్నారు. పెద్దపెద్ద పళ్ళాల్లో పూజాద్రవ్యాలు ఉంచుకుని భక్తులు తోసుకు వస్తోంటే... ఇబ్బంది అనిపించింది. సందులోంచి గర్భగుడిలోకి ప్రవేశించాలి. అక్కడ తొక్కిసలాటగా ఉంది. ఊపిరి ఆడడం లేదు కంతుకి. వెనక్కి వెళ్ళిపోదాం అంటే... కిక్కిరిసి ఉన్నారు భక్తులు. ఎలాగైతేనేం ముందుకి, గర్భగుడిలోనికి చొరుకున్నారు. ఒకరి మీద ఒకరు పడిపోతున్నారక్కడ. ఫ్యాన్లు ఉన్నా ఊపిరి అందడం లేదు కంతుకి. గుండెను ఎవరో నొక్కేస్తున్నట్టుగా అనిపించిందతనికి. దాంతో కాపలాగా ఉన్న పోలీసును కేకేశాడు కంతు.

"నేను దర్శనం చేసుకోను. నన్ను బయటికి పంపించేయండి. ఇబ్బందిగా ఉంది." అన్నాడు. ముఖకవళికలు పరిశీలించి కంతు చెప్పింది నిజం అని తెల్సుకున్నాడు పోలీసు. అతన్ని పట్టుకుని భక్తుల మధ్య నుంచి ముందుకు లాగాడు. కంతుని అనుసరించింది మిత్రబృందం. తమకీ తల్లి దర్శనం అక్కరలేదు, బయటపడితే చాలన్నారు. తొలగి, భక్తులు దారి ఇస్తే అంతా అమ్మ దగ్గరగా చేరుకున్నారు.

"దండం పెట్టుకోండి" పూజారి చెబుతున్నా వినిపించుకోలేదు మిత్రబృందం. బయటపడితే చాలన్నట్టుగా ముందుకు దారి తీశారు.

"ఇంత దూరం వచ్చి అమ్మకి నమస్కారం చెయ్యరా?" పోలీసడిగాడు. కంతుసహా అంతా ఒక్క క్షణం ఆగారు. తల్లిని కళ్ళ నిండుగా చూసి, చేతులు జోడించి నమస్కరించారు. బయటపడ్డారు.

ఏమిటో ఈ ఇరుకిరుకు ఆలయాలు? విశాలంగా ఎందుకు నిర్మించుకోరో, ఏమిటో? ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు?

కంతుకి చిరాకేసింది. కోపం కూడా వచ్చింది. కోపాన్నీ, చిరాకునీ పోగొట్టుకునేందుకు గుండె నిండుగా గాలి పీల్చి వదిలాడతను.

"ఇప్పుడు ఓకేనా? ఎలాంటి ఇబ్బందీ లేదు కదా?" అడిగింది వాణి. లేదన్నాడు కంతు.

"తిరిగినవి చాలు, ఇక పదండి కాశీకి." అన్నది నిర్మల. అంతా కిందకి, కారు దగ్గరకు రాసాగారు. అంతలో ఎవరో పిలుస్తున్నట్టనిపించి వెను తిరిగి చూశారు.

బైరాగి!

గబగబా మెట్లు దిగి వస్తున్నాడతను. ఆగి అతని కోసం చూడసాగింది మిత్రబృందం.

"తల్లిని దర్శించుకుని, కుంకుమ తీసుకోకపోతే ఎలా?" అన్నాడు బైరాగి. దగ్గరగా వచ్చాడు. చేతులు చాస్తే, తన చేతిలోని కుంకుమను అందరికీ ప్రసాదంగా పంచిపెట్టాడతను.

"వెళ్ళి రండి" అన్నాడు. దీవించి, పంపాడు.

"ఈ బైరాగేంట్రా ఇందుగలడు అందులేడన్నట్టుగా ఎక్కడపడితే అక్కడ ప్రత్యక్షమవుతున్నాడు?" అన్నాడు బాబు.

"ష్" అంది అతన్ని వారిస్తూ వాణి.

"ప్రత్యక్షమై మంచే చేస్తున్నాడు కాని, చెడు చెయ్యట్లేదుగా, ఊరుకో." అంది.

కిందికి దిగి, కారెక్కారంతా. బయల్దేరారు. మలుపు తిరిగి వెళ్ళిపోతున్న కారుని చల్లగా చూశాడు బైరాగి. ఏ అడ్డంకులూ, అవరోధాలూ లేకుండా చీకటి వేళకు కాశీకి చేరుకుంది కారు.

(ముగింపు వచ్చేవారం)

బుగ్గల ముడుతల మీద జారుతున్న కన్నీటిని తుడుచుకుని కళ్ళు తెరిచి, చూశాడు చతురాననుడు. "నాయనా! మీ వంశానికి దాపురించిన శాపం నేపథ్యం ఇది. భార్యనూ, కవలలైన పుత్రులనూ ఒకే చితి మీద ఉంచి దహనం చేశాను. నా తల్లిదండ్రులకు నేనొక్కడినే. తండ్రి ఆజ్ఞ కాదనలేక, నా అర్థాంగి విశుద్ధను మరిచి పోయి పునర్వివాహం చేసుకున్నాను. సంతానాన్ని కని వంశాభివృద్ధి చేశాను.

మీ వంశీకుడిని శపిస్తూ, నేను మరొక సంకల్పం చేసుకున్నాను. మీ వంశంలో అల్పాయుష్షుతో ఒక్కొక్క పురుషుడూ మరణించే కొద్దీ ఒక దశాబ్దం పాటు నా ఆయుర్దాయం పెరిగేలా సంకల్పించాను. అది మహా సంకల్పం. అందుకే ఇంకా జీవించే ఉన్నాను; ఉంటానేమో కూడా!"

"ఆర్యా, మీ శాపం సమర్థనీయమే. అయితే తరాల కొద్దీ అది కొనసాగడం వాంఛనీయమా అని నాకు అనిపిస్తోంది" వీరధర్మ అన్నాడు. "ప్రస్తుతం నా వయస్సు పాతికేళ్ళు. మరొక పదిహేనేళ్ళకే నా జీవితం..."

"ముగిసిపోదు!" చతురాననుడు అడ్డొస్తూ అన్నాడు. "ఈ చతురాననుడు ముగిసిపోనివ్వడు! శపించే శక్తితో బాటు ఉపసంహరించే శక్తీ ఉంది నాకు..."

"ఆర్యా!" వీరధర్మ ఆశ్చర్యానందాలతో అన్నాడు.

"అవును వీరధర్మా! నేను అర్ధనారీశ్వర ఉపాసకుడిని. ఉపాసనతో, తపస్సుతో ఆర్జించిన శక్తినంతటినీ పణంగా పెట్టి, శాపాన్ని ఇప్పుడే, ఇక్కడే ఉపసంహరిస్తాను. ఉపసంహారాన్ని నువ్వూ, మా మార్తాండుడూ ప్రత్యక్షంగా చూస్తారు. ఉపసంహారం శాపం లిఖించబడిన తాళపత్రాన్నీ, దాని అరనూ దహించివేస్తుంది! తిలకించండి!" అంటూ చతురాననాచార్యుడు ఆసనం మీద నుంచీ దిగి, దాని మీద పరిచి ఉన్న దర్భాసనాన్ని నేల మీద పడవేశాడు. దర్భాసనం మీద పద్మాసనంలో కూర్చున్నాడు. నేల మీద పడి ఉన్న తాళపత్రాన్ని అరలో ఉంచి, తన ముందు పెట్టుకున్నాడు. ధ్యాన ముద్రతో కళ్ళు మూసుకున్నాడు.

"నమశ్శివాయై చ నమశ్శివాయ!" అంటూ తగ్గ స్వరంలో ఉచ్చరించి ధ్యానంలో నిమగ్నమయ్యాడు, చతురాననాచార్యుడు. ఆయన పెదవులు కదలడం లేదు.

మార్తాండుడు, వీరధర్మ రెప్పపాటు మరిచి పోయి ఆయన ముఖంలోకే చూస్తూ ఉండిపోయారు. నిమిషాలు గడుస్తున్నాయి. చతురాననాచార్యుడి నుదురు క్రమంగా ఎర్రబడుతోంది. లోపల జ్వలిస్తున్న ఏదో ఎర్రటి కాంతి ఆయన నుదుటి చర్మం మీదికి చిమ్ముతున్నట్టుంది! కొద్ది సేపట్లో ఆయన ముఖ మండలం పూర్తిగా ఎర్రబడింది. కళ్ళు మెల్లగా విచ్చుకున్నాయి. కళ్ళు రక్తం పులిమినట్టు ఎర్రగా ఉన్నాయి. ఆ ఎర్రటి చూపులు ముందున్న తాళపత్రం మీదకు ప్రసరిస్తున్నాయి. ఏదో అదృశ్య హస్తం వెలిగించినట్టు తాళపత్రం, అది ఉన్న అర ఒకేసారి అంటుకుని, కాలుతున్నాయి! కొన్ని క్షణాల్లో అక్కడ బూడిద ప్రత్యక్షమైంది. ప్రక్కనే ఉన్న రాగి పానపాత్రను అందుకున్నాడు చతురాననాచార్యుడు.

జరిగిన కథ

వైశాలిక రాజ్యయోధుడు వీరధర్మ. సంపూర్ణాయుస్సు లక్ష్యసాధనతో బయలుదేరతాడు. ఎందరినో రక్షిస్తాడు. ఎందరికో సహాయం చేస్తాడు. మదగజనగరంలో జీవంతకుడి దుష్పరిపాలన అంతం చేస్తాడు. ఆ రాజ్య సామంతుల తిరుగుబాటును అనూహ్యమైన ఉపాయంతో తిప్పికొట్టి మహారాజుకు బాసటగా నిలుస్తాడు. తన వంశాన్ని అర్ధాయుస్సుతో బతకమని శపించింది చతురాననాచార్యుడేనని తెలిసిన తర్వాత కూడా అతడి ఏకైక వారసుడు అగ్నిభట్టారకుడి ప్రాణాలు కాపాడేందుకు మంత్రోపాసనతో సింహం పాలు సంపాదించి తన పరోపకార పరాయణత్వాన్ని చాటుకుంటాడు వీరధర్మ. ఆ తర్వాత...

నవ్యవీక్లి-లక్ష్మీనారాయణ జైని మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో

ప్రథమ బహుమతి పొందిన నవల

బూడిదను జాగ్రత్తగా తీసి, పానపాత్రలోని నీటిలో వేశాడు. ఒకసారి బూడిద కలిపిన నీటిని తదేకంగా చూసి, పాత్రను పైకెత్తి నీళ్ళను గడగడా త్రాగేశాడు. ఎర్రగా ఉన్న ఆయన ముఖం కొన్ని క్షణాలలో, సాధారణమైన యధార్థ వర్ణానికి మారిపోయింది. కళ్ళను కమ్మిన రక్త వర్ణం అంతర్థానమైంది. అంతసేపూ ఏదో ఉద్రేకంతో గంభీరంగా ఉన్న ముఖం మీద ప్రశాంతత ప్రత్యక్షమైంది. చిరునవ్వు మొలకెత్తింది. రెప్పల్ని పైకెత్తి వీరధర్మ ముఖంలోకి చూశాడు.

"నా శాపాన్ని ఉపసంహరించుకున్నాను. భస్మం చేసి, నీటిలో కలిపి నేనే త్రాగివేశాను. ఈ క్షణం నుండీ నీ వంశాన్ని నా శాపం అనే గ్రహణం వదిలింది! ఇందుకు నా ఆరాధ్య దైవ స్వరూపమూ, పంచభూతాలూ సాక్షులు!"

"మూడు తరాలుగా నీ వంశంలో నా శాపకారణంగా అకాల మరణం చెందిన వాళ్ళ నుండీ నాకు సంక్రమించిన ఆయుర్దాయ భాగాలను నీకు ధారాదత్తం చేశాను! దీర్ఘాయుష్మంతుడిగా, ఆరోగ్యంతో శతాధిక వత్సరాలు జీవిస్తావు!"

"సింహగాయత్రీ దేవి అమృత వాణి నుండీ వెలువడిన దీర్ఘాయుష్మాన్‌భవ!" అన్న దివ్య దీవెనను మీ వాక్కులు గుర్తుకు తెస్తున్నాయి! 'కలకాలం చల్లగా జీవించు తండ్రీ!' అన్న నా మాతృమూర్తి ఆశీస్సు, ఆశ, ఆశయం నిజమవుతున్నాయి! ధన్యవాదాలు స్వీకరించండి!" అంటూ వీరధర్మ చతురాననాచార్యుడి పాదాలకు నమస్కరించాడు.

"ఒక మహాద్భుతాన్ని కళ్ళారా చూసే భాగ్యం నాకు లభించింది!" మార్తాండుడు అన్నాడు "శపించిన వంశాన్ని శపించబడిన వంశం ఆదుకుంది! శపించిన వాక్కు శాపాన్ని ఉపసంహరించుకుంది!"

"విధి లీలలోని విచిత్రాలు ఇలాగే ఉంటాయి మార్తాండా!" చతురాననాచార్యుడు చిరునవ్వుతో అన్నాడు. "వీరతిలక వంశంలో గతించిన తరానికి చెందిన వ్యక్తి నా కన్నబిడ్డల ప్రాణాలు తీశాడు. ప్రస్తుత తరానికి చెందిన వ్యక్తి నా వంశాంకురానికి ప్రాణం పోశాడు!"

"వీరధర్మ ఒక ఉన్నత లక్ష్య సాధనకు ప్రయత్నిస్తున్నాడు. అది మీకు విన్నవించాలి" మార్తాండుడు అన్నాడు. శాప ప్రభావంతో అకాల మృత్యువు నీడలో ఉన్న తాను మృత్యుంజయుడు కావాలని సంకల్పించాడు. ఆ ప్రయత్నంలోని ప్రస్థానమే అతడిని మన ప్రాంతానికి తీసుకు వచ్చింది!"

"మృత్యుంజయుడా?!" చతురాననుడు నిర్ఘాంతపోతూ అన్నాడు.

"మీ సహకారంతో అకాల మృత్యువును జయించాను. అకాల మరణాన్నీ, దుర్మరణాన్నీ, బలవన్మరణాన్నీ, జయించిన మానవుడు మృత్యుంజయుడే-అంది సింహగాయత్రీదేవి!" వీరధర్మ చిరునవ్వుతో అన్నాడు.

ఇద్దరూ అతడిని ఆశ్చర్యంగా చూశారు.

"ఆ తల్లి వాక్కు నాకు అమృతవాక్కు! నా భావి జీవితానికి సూచన!" వీరధర్మ అన్నాడు.

•••

సువేగాశ్వం లయబద్ధమైన ధాటిలో ఏదో ఉత్సాహం కొత్తగా వ్యక్తమవుతోంది. ప్రశాంత వాతావరణంలో, చల్లటి గాలిలో వీరధర్మ ప్రయాణం ఇప్పుడు తెలిసిన గమ్యం వైపు సాగుతోంది. నిన్న మొన్నటి దాకా సాగిన తన ప్రయాణానికి గమ్యం ఏదో తెలీదు. దారి ఏదైనా దారే! అగమ్యగోచరమైన ప్రయాణానికి నిర్ధారణ లేని, మార్గం! ఇవాళ తనకి ఆ పరిస్థితి లేదు. తనకు గమ్యం ఉంది; ఆ గమ్యాన్ని చేర్చే మార్గమూ ఉంది. తనకు గమ్యం తెలుసు. మార్గమూ తెలుసు. పసికట్టిన తన అశ్వానికీ తెలుసు!

మొన్న తన గమ్యం, మదగజనగరం. దారి తెలుసు. విప్రవిదిశ అగ్రహారం నుండీ మదగజనగరం చేరే మార్గం. విప్రవిదిశ అగ్రహారం తన పాలిట ఒక దివ్య క్షేత్రం. శాపవిముక్తి ధామం; ప్రాణదాన క్షేత్రం. ఆయుర్భవ తీర్థం!



జీవితంలో మొదటిసారిగా అనిర్వచనీయమైన ఆనందాన్ని భాషకు అందని బ్రహ్మానందాన్ని అనుభవించాడక్కడ తను! తనకు ఇంక అకాల మరణం లేదు. తన వంశంలో తన పుత్రులుగా, పౌత్రులుగా, ప్రపౌత్రులుగా జన్మించే వాళ్ళకు అకాల మరణం లేదు!

"నాయనా, భగీరథుడు అకాలంలో మరణించిన తన పూర్వీకులకు ముక్తి లభించడానికి కృషి చేశాడు. నువ్వు నీ వంశంలో భవిష్యత్తులో జన్మించబోయే పురుషులకు అకాల మరణం సంభవించకుండా ఉండడానికి కృషి చేశావు! నిన్ను కన్నవారు ధన్యులు!" అన్నాడు తనను వీడ్కొలిపే సందర్భంలో చతురాననాచార్యుడు. ఆయన ఆధ్వర్యంలో, వీడ్కోలు సమయంలో - విప్రవిదిశ అగ్రహారంలోని వేదవేత్తలు తనకు ముక్త కంఠంతో వేదాశీర్వచనం అందించారు. మార్తాండుడితో కలిసి, భుజంగపుర ఆదిశేషభగవానుడిని దర్శించుకుని, మదగజనగరం చేరుకున్నాడు తను.

తన తిరుగు ప్రయాణ నిర్ణయం రాజమాతనూ, ధీరేంద్రరాజునూ, సోదరీమణులు గిరిజా గిరికలనూ, వాళ్ళ తల్లిదండ్రులనూ, ఆనందంలో ముంచివేసింది. రాజమాత నగలు బహూకరించింది. మహారాణులైన తన సోదరీమణులు యువతులు ధరించే రకరకాల ఆభరణాలు ఒక్కొక్క దినానికి ఒక్కో శ్రేణి ఆభరణాల చొప్పున ఏడువారాల నగలు ఇచ్చారు, ఎంత వారించినా వినకుండా. అవి తనకి కాదట. కాబోయే వదినగారికట!

పూర్ణమ్మ ఆనంద దంపతులూ, గిరిజా గిరికలూ ఒకరి తరువాత ఒకరు తనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. రాజు ధీరేంద్రుడు సపరివారంగా, నగర ముఖద్వారం దాకా వెన్నంటి వచ్చి, వీడ్కోలు పలికాడు. పురజనులు వీధులకు ఇరువైపులా బారులు తీరి చిరునవ్వులతో చేతులు ఊపుతూ తనను ఆదరించారు. కొందరైతే మేడల మీద నుంచీ పువ్వులు జల్లారు.

గుర్రం వేగంగా ముందుకు పరుగు తీస్తోంది. వీరధర్మ ఆలోచనలు మరింత వేగంతో వెనక్కి వెళ్తున్నాయి. సువేగాశ్వం, తన ప్రయత్నం లేకుండానే...లోయవైపు వెళ్ళింది. చిరంతన యోగి తపస్సులో ఉన్న పర్వత శిఖరం సమీపాన ఉన్న లోయ!

చతురాననాచార్యుడు ధ్యానముద్రలో కూర్చున్నాడు. అతడి ముఖమండలం ఎర్రబడింది. కళ్ళు రక్తం పులిమినట్టు ఎర్రగా ఉన్నాయి. ఆ చూపుల తాకిడికి తాళపత్రం దగ్ధమైంది. కొన్ని క్షణాల్లోనే అక్కడ బూడిద ప్రత్యక్షమైంది. ఆ బూడిదను పానపాత్రలో వేసి గడగడా తాగేశాడు ఆచార్యుడు. ఏమిటిదంతా? చతురాననాచార్యుడు ఎందుకిలా చేశాడు? దాని ఆంతర్యమేమిటి?

ఆయనను దర్శించి, ఆశీస్సులు అందుకోవాలన్న ఆశ తనను శిఖరం మీదికి చేర్చింది. ఆశ్చర్యం! ఆయన తపస్సమాధిలో లేరు. నిలుచుని ఉన్నారు, చిరునవ్వుతో, తనకోసమే ఎదురు చూస్తున్నట్టు!

తను సాగిలపడి నమస్కరించాడు. "గురుదేవా...మృత్యుంజయుడు కావాలన్న..."

"ఆశను వదులుకున్నావు. సింహగాయత్రి అనుశాసనం పాటించు! మానవజన్మ దేవతల జన్మ కన్నా గొప్పది. ఆర్జించుకున్న 'గతజన్మ పుణ్యం' వ్యయమైపోయాక ఆ దేవతలు కూడా మన మర్త్యలోకానికి రావాల్సిందే! జనన మరణాలు మార్పులు మాత్రమే! వేషాలు మారుతాయి; విధులు మారుతాయి! అంతే! వెళ్ళు! మానవ ధర్మాన్ని పాటిస్తూ సుఖంగా జీవించు!" అన్నాడు చెయ్యెత్తి దీవిస్తూ చిరంతనయోగి.

స్కందానంద యోగి కూడా అంతే! తన నిర్ణయాన్ని ప్రశంసించి, దీవించి పంపించారు!

సువేగాశ్వం దట్టంగా చెట్లూ, పొదలూ ఉన్న దారిలో ప్రవేశించింది. వీరధర్మ ఆలోచనలకు అంతరాయం కలిగింది. చుట్టూ పరికించి చూశాడు. కుడివైపున ఎత్తుగా ఉన్న ప్రాంతంలో గుండ్రటి రాళ్ళు గుట్టలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. ఆటవికుల ఆవాస స్థానం! వీరధర్మకు ఆనాడు తనను బండదేవరకు బలి అయిపోకుండా కాపాడిన పిల్ల మొగ్గ గుర్తొచ్చింది. అనాగరిక యువతి! ఆటవిక సోదరి! ఈ చేతులు కోసి రక్తం పంచుకున్న సోదరి!

సూర్యాస్తమయం కావస్తోంది. ఆటవిక సామ్రాజ్యం ఎప్పుడో వెనుకపడి, అదృశ్యమైపోయింది. ఉన్నట్టుండి చెట్లలోంచీ కలకలం! ఆటవికులా? తన రాకను గమనించారా? తన హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తూ, సువేగాశ్వం ఆగి, చిన్నగా సకిలించింది. ఆ సకిలింతకు సమాధానంగా శ్రవణానందకరంగా వీరధర్మ చెవులను తాకాయి కోతుల కిచకిచలు! క్షణాల్లో వానర మిత్రులు అతడిని చుట్టేశారు! పిల్ల వానరం అతని పాదం మీదికీ, అక్కణ్ణుంచీ అతని ఒడిలోకీ ఎగిరి, కూర్చుని కిచకిచగా పలకరిస్తోంది.

వానర మిత్రులతో బాటు రాత్రి విడిది చేసిన వీరధర్మ అరుణోదయం కాగానే ప్రయాణం ప్రారంభించాడు. ఇప్పుడు, కొన్ని గంటల ప్రయాణంతో తను చేరబోయే గమ్యం తన జీవితానికి ఒక సరికొత్త అనుభూతినీ, పరిపూర్ణమైన ఆనందాన్నీ అందించే సంతోషసాగరం! ఆనందతీర్థం!

అక్కడ అందరూ తనను చిరునవ్వులు చిందించే ముఖాలతో, సంతోషంతో, సాదర వచనాలతో ఆహ్వానిస్తారు! ఒకరు చిరునవ్వుల సిరి వెన్నెలలు కురిపిస్తారు. వెలిగి పోతున్న కళ్ళతో తనకు దీపారాధన చేసి, హారతి ఇస్తారు! తను గమ్యం చేరుకుంటున్నాడు. తను...'తన' గమ్యం చేరుకుంటున్నాడు. అమ్మ ఆశించిన గమ్యాన్ని చేరుకోబోతున్నాడు...

ఆశ్రమం సజీవంగా అతనికి ఎదురొచ్చింది!

"స్వాగతం, నాయనా!" సనాతన మహర్షి చేతులు జాచి, సాదరంగా ఆహ్వానించాడు.

"పునస్స్వాగతం!" ఆశ్రమంలోని వృద్ధ తాపసులు బృందగానంలా అన్నారు.

బ్రహ్మచారులు నవ్వుతున్నారు. మునికన్యలు కిలకిలల నవ్వులు విరియిస్తున్నారు. వీరధర్మ గుర్రం దిగి, సనాతన మహర్షి దంపతులకు పాదాభివందనం చేశాడు. మునులందరి వైపు చేతులు జోడించాడు.

"కల్యాణమస్తు!" సనాతన మహర్షి అన్నాడు.

"తథాస్తు!" మునులందరూ ఒకేసారి అన్నారు.

"వీరధర్మా, బాగున్నావా నాయనా?" సనాతన మహర్షి పత్ని ప్రేమతో అడిగింది.

"అమ్మా..." వీరధర్మ అన్నాడు.

తల్లి వెనుక నుండీ, వీరధర్మకు కనిపించేలా పక్కకు జరిగింది తరంగ.

"తరంగా..?" వీరధర్మ పెదవులు పలికాయి.

తరంగ ముఖం చిరునవ్వుల సిరివెన్నెలలు

ఐటెంసాంగ్ అంటే అర్థం ఏమిటి?

ఈ మాట సినిమాల్లోకి కొత్తగా వచ్చిన హీరోయిన్ అడిగితే అర్థం చెప్పవచ్చు. కానీ కత్రినా పోలికలతో కత్తిలా ఉంది అనిపించే జరీన్‌ఖాన్ అడిగితే ఏం చెప్పగలం అంటున్నారు బాలీవుడ్ జనాలు. సినిమాలో ప్రత్యేకంగా వచ్చే పాటలని స్పెషల్ సాంగ్స్ అనాలి కానీ ఐటెంసాంగ్స్ అనడం ఏమిటి? ఏదో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడం కోసం ఇలాంటి పాటలు సినిమా మధ్యలో పెడుతుంటారు. అంతే తప్ప వాటికి సినిమా కథతో ఎలాంటి సంబంధం ఉండదు కదా! అలాంటి వాటిని స్పెషల్ సాంగ్స్ అంటేనే వినడానికి బావుంటుంది. అసలు అందరూ ఐటెంసాంగ్ అంటూంటారు కానీ ఇప్పటి వరకూ దాని అర్థమే తనకు తెలియదు అంటూ బోలెడంత అమాయకత్వం ప్రదర్శిస్తోంది జరీన్!

కురిపిస్తోంది. వెలిగిపోతున్న ఆమె విశాల నేత్రాలు వీరధర్మకు దీపారాధన చేస్తున్నాయి; హారతి యిస్తున్నాయి..

●●●

వీరధర్మ తన యాత్ర అనుభవాలనూ, చేసిన సాహసాలనూ వివరించాడు. ఆశ్రమ వాసులు అందరూ ఆసక్తిగా శ్రవణం చేశారు.

"నాయనా, నువ్వు అదృష్టవంతుడివి. ధర్మబద్ధమైన సాహసం నీది. నాకు తెలుసు. నువ్వు క్షేమంగా తిరిగి వస్తావని నాకు తెలుసు. ఒక మహత్తర లక్ష్యం నీ మృత్యుంజయ సంకల్పం. అది ఒక మహా అన్వేషణ! ఆ అన్వేషణ నీ కళ్ళ ముందు మానవ జీవన లక్ష్యాన్నీ, అర్థాన్నీ, పరమార్థాన్నీ ఆవిష్కరిస్తుందని నాకు తెలుసు! సత్యమైన అన్వేషణ ఎప్పుడూ సత్ఫలితాన్నే యిస్తుంది!" సనాతన మహర్షి మెప్పుగా అన్నాడు.

"గురుదేవా, ఘనత అంతా మీదే! మీరు 'దర్శించిన' సింహగాయత్రీ మంత్రం నాకు స్థిరమైన రక్ష అయింది. ఆ తల్లి దయ లేకపోతే నేను లేను! మీ దయ, దార్శనికత లేకపోతే నా పాలిట ఆ దివ్య జనని లేదు!"

"నిన్ను అనుగ్రహించిన ఆ తల్లి, నన్ను అనుగ్రహించినట్టే! నేను రూపొందించిన సింహగాయత్రీ మంత్రానికి అంత శక్తి సమకూరడం నా అదృష్టమే! ఆ దేవి అనుగ్రహమే! ఆ స్వర్ణపాత్ర నీ భావి తరాలకు దైవికమైన వారసత్వ సంపద. పూజా గృహంలో ఉంచి అర్చించు!

●●●

సాయంకాలం కావస్తోంది. ఆశ్రమ ఉద్యాన వనం ప్రశాంతంగా ఉంది. వికసించిన పువ్వుల సుగంధాన్ని మోసుకుంటూ చల్లగా వీస్తోంది గాలి. మధుర సుగంధాన్ని వీరధర్మ ఘ్రాణేంద్రియానికి అందిస్తున్న పిల్లగాలి అతని శ్రవణేంద్రియానికి అందెల సవ్వడిని చేరవేస్తోంది...

వీరధర్మ తిరిగి చూశాడు. నార చీరలో, మూర్తీభవించిన సహజమైన నిసర్గ సౌందర్యంలా ఉన్న తరంగ పెద్ద పెద్ద కాటుక కళ్ళతో తననే చూస్తూ, నెమ్మదిగా వస్తోంది! అది నడక కాదు; పుణికిపుచ్చుకున్న అందాన్ని హెచ్చవేత వేసే నాట్య విన్యాసం!

వీరధర్మ తన ముందు ఆగిన తరంగను తదేకంగా చూశాడు.

"తరంగా.." సృష్టిలోని అనురాగాన్ని ఇముడ్చుకున్న మహనీయ భారంతో తొణికిసలాడుతున్న పిలుపు అది!

తరంగ రెప్పలెత్తి చూసింది.

"తిరిగి వచ్చాను...నీ కోసం..."

తరంగ చిగురాకు పెదవులు కదలి మధురమైన మందహాసాన్ని సృష్టించి, దానికి ప్రాణం పోశాయి. "మీరు తిరిగి రావాలని, క్షేమంగా తిరిగి రావాలని నిత్యం గౌరీమాత వ్రతం చేశాను. మీరు వస్తారని నాకు తెలుసు...నా...హృదయానికి!"

వీరధర్మ మౌనంగా, తీక్షణంగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

తరంగ తటాలున క్రిందికి వంగి, వీరధర్మ పాదాలను స్పృశించింది. వీరధర్మ చేతులు ఆమె భుజాల మీద వాలాయి. ఆమెను లేవదీశాయి. తరంగ కళ్ళెత్తి చూసింది. ఆమె కాటుక కళ్ళు తడిగా

మీ అభిమాన రచయిత
వక్కంతం సూర్యనారాయణరావ్
మరో సంచలనాత్మక సీరియల్
ఆటా నవలల పోటీలో
బహుమతి పొందిన నవల
మదరిండియా
వచ్చేవారమే ప్రారంభం

మెరుస్తున్నాయి. ఆనందబాష్పాలు!

వీరధర్మ చేతులు సున్నితమైన అనురాగ లతల్లా కదిలాయి. తరంగను అతనికి దగ్గరగా లాగాయి. తన కౌగిలిలో వొదిగిపోయిన ఆమె చుట్టూ ప్రేమ పాశాల్లా బిగుసుకున్నాయి.

"తరంగా, నువ్వు నా కోసమే సుకృతినది తరంగాల మీద తేలియాడుతూ వచ్చావు!" వీరధర్మ కంఠంలో పారవశ్యం స్పందించింది.

"అది నా సుకృతం..." తరంగ గుసగుసగా అంది.

"అందులో సగం నాది!"

తరంగ తల ఎత్తి అతని కళ్ళల్లోకి చూసింది. "నాన్నగారు పెళ్ళి ముహూర్తం నిర్ణయించారు."

వీరధర్మ చేతులు స్పందిస్తూ మరికొంచెం బిగుసుకున్నాయి.

•••

తరంగ, వీరధర్మ భార్యాభర్తలయ్యారు. పదహారు దినాల పర్వం శాస్త్రోక్తంగా జరిగింది. సనాతన మహర్షి నూతన వధూవరుల ప్రయాణానికి శుభముహూర్తం నిర్ణయించాడు. తన వీరతిలక వంశం ఆవిర్భవించిన వైశాలిక నగరంలో తను జీవించడం తన తల్లిదండ్రుల ఆత్మలకు శాంతినీ,



ఆనందాన్నీ కలిగిస్తుందన్న వీరధర్మ విశ్వాసాన్ని సనాతన మహర్షి సమర్థించాడు.

"జన్మనిచ్చిన మాత, జన్మభూమి స్వర్గం కన్నా మిన్న అన్నారు ఆర్యులు. నీకు అన్యాయం చేసింది జనులు; జన్మభూమి కాదు!" అన్నాడాయన.

గిరిజా, గిరికా బహూకరించిన నగలతో తరంగ సువర్ణ శిల్పసుందరిలా మెరిసిపోతోంది. ఆశ్రమంలోని దంపతులందరికీ, నూతన దంపతులు నమస్కరించారు. అశ్రునయనాల ఆశీస్సులతో వధూవరులకు వీడ్కోలు పలికారు ఆశ్రమవాసులు. వీరధర్మ సహాయంతో తరంగ సువేగాశ్వాన్ని అధిరోహించింది. 'తరంగా!తరంగా' అంటూ ఎగురుతూ వచ్చి ఆమె భుజం మీద కూర్చుంది చిలుక.

"అది నీ నెచ్చెలి తల్లీ....తీసుకెళ్ళు..." అంది తల్లి సుచేతన.

ఆశ్రమ ద్వారం ముందు గుంపుగా ఉన్న వానరాలు కిచకిచ మంటున్నాయి. ఇన్నాళ్ళు ఆశ్రమ పరిసరాల్లో ఆనందంగా గడిపాయి.

"అల్లుడూ, నీ వానర మిత్రులు ఆశ్రమ ప్రాంతంలో హాయిగా ఉంటారు. వాళ్ళ యోగక్షేమాల బాధ్యత ఆశ్రమానిదే! సంకోచం లేకుండా వెళ్ళిరా!" సనాతన మహర్షి నవ్వుతూ అన్నాడు.

వీరధర్మ వానరాల దగ్గరగా వెళ్ళాడు. అన్నింటినీ కలయ జూస్తూ పిల్ల వానరాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. "ఆశ్రమ పరిసరాల్లో క్షేమంగా ఉండండి!" అన్నాడు చిరునవ్వుతో.

అర్థమైనట్టు వానరాలు కిచకిచ భాషలో సమాధానం చెప్పాయి. పిల్లవానరాన్ని వదిలి, వీరధర్మ గుర్రం దగ్గరగా వెళ్ళాడు. అందర్నీ కలయజూసి, అశ్వాన్ని అధిరోహించాడు.

సువేగుడు నూతనోత్సాహంతో ముందుకు కదిలింది.

•••

దంపతులుగా గుమ్మం ముందు ప్రత్యక్షమైన తరంగనూ, వీరధర్మనూ మిళిందుడూ ప్రచండికా ఆశ్చర్యంగా చూశారు.

రెప్పపాటులో వాళ్ళ ఆశ్చర్యం ఆనందంగా మారిపోయింది. మిళిందుడు వీరధర్మనూ, ప్రచండిక తరంగనూ కౌగిలించుకున్నారు. ఇద్దర్నీ గుమ్మం అవతలే నిలబెట్టి, ప్రచండిక లోపలికి పరిగెత్తింది. వెలుగుతున్న జ్యోతి ఉన్న పళ్ళెంతో వచ్చి, ఇద్దరికీ హారతి ఇచ్చింది. పాత దంపతులు, కొత్త దంపతులను ఇంట్లోకి ఆహ్వానించారు.

"మిళిందా, ఎలా ఉన్నావు? రాజ్యం ఎలా ఉంది?" వీరధర్మ ప్రశ్నించాడు.

"సాగరిక పాలన చక్కగా ఉంది. మనం ఇప్పుడు రాజవైద్యులం తెలుసా?" మిళిందుడు నవ్వుతూ అన్నాడు. "నువ్వు క్షేమంగా తిరిగి వస్తావని నాకెందుకో అనిపిస్తూ ఉండేది. అందుకే మీ గృహాన్ని అద్దంలా ఉంచాను!"

"ఈ అద్దం నీదే! నా చెల్లి ప్రచండికకు పెండ్లి కానుకగా ఆనాడే ఇచ్చి వేశాను. నా గృహం వేరే ఉంది. ఉదయం నీకు చూపిస్తాను. పూజాగృహంలోని మందిరాన్నీ, అఖండజ్యోతినీ మాత్రం తీసుకెళ్తాను..?" వీరధర్మ అన్నాడు. "నీకు చాలా విషయాలు చెప్పాలి. భోజనాలయ్యాక, రాత్రంతా పురాణ పఠనంలా వినిపిస్తాను!"

•••

తన పాదాలంటి ప్రణామాలు చేసిన వీరధర్మనూ, తరంగనూ ఆనందంతో పొంగిపోతూ దీవించాడు యోధాశ్రమ నిర్వాహకుడు కంఠీరవుడు.

"ధర్మా, నీ ధర్మపత్నిలో అద్భుతమైన కళ ఉట్టిపడుతోంది! సౌభాగ్యవతి తరంగ ముఖంలో నీ అదృష్టాన్ని చూడగలుగుతున్నాను!"

"అందుకు కారణం మీ ఆశీస్సులు గురువుగారూ!"

"శిష్యుడిని దీవించడం గురువు ధర్మం, ధర్మా!" కంఠీరవుడు చిరునవ్వు నవ్వాడు...."నీ లక్ష్యం..."

"దానికి సంబంధించిన బృహత్ కథను వివరంగా మీకు విన్నవించాలి. మీరు నేర్పిన యోధ విద్య ఒక సామ్రాజ్యాన్ని కాపాడింది! అది కూడా విన్నవించాలి..."

"అలాగా! లోపలికి రండి; రా తల్లీ!" కంఠీరవుడు ప్రేమగా ఆహ్వానించాడు.

"ఆ బృహత్ కథను రాత్రి నేనూ, నా అర్ధాంగీ ఆలకించాం, గురువుగారూ. అద్భుతాలతో, సాహసాలతో, త్యాగాలతో నిండి, పండిన యదార్థగాథ అది!" వీరధర్మ దగ్గరగా నిలుచున్న మిళిందుడు అన్నాడు.

"ఓ! నవరసభరితం అన్నమాట! అయితే వెంటనే ఆలకించాలి. పులకించాలి. ఆనందించాలి! రా, ధర్మా, రా!" కంఠీరవుడు ఉత్సాహంగా అన్నాడు.

"గురువుగారూ, ముందుగా మీరు నాకో వరం ఇవ్వాలి..." వీరధర్మ వినయంగా అన్నాడు.

"కోరుకో నాయనా! ఉన్నది ఏదైనా సరే, లేదనకుండా ఇస్తాను!"

"యోధాశ్రమంలో ఉద్యోగం!"

కంఠీరవుడు ఆశ్చర్యంగా చూశాడు. "నాకు పరమానందాన్నిచ్చే వరం అడిగావు! నేటి నుండీ నువ్వు ప్రధానాచార్యుడివి, నేను పర్యవేక్షకుడిని!"

"ధన్యుణ్ణి గురువుగారూ!"

"అదిగో...అటు చూడు! నూతన భవనం! నీ ఇల్లాలిని పుత్రికగా భావించి, ఆమెకు కానుకగా ఇస్తున్నాను. నూతన దంపతులకు నూతన నివాసం! ఎప్పుడో ప్రారంభించిన నిర్మాణం ఇటీవలే పూర్తి అయింది. మీ కోసమే అనుకుంటాను!"

వీరధర్మ, తరంగ, వాళ్ళతో బాటు మిళిందుడూ కంఠీరవుడు చూపిస్తున్న వైపు చూశారు. పచ్చటి చెట్ల మధ్య తెల్లటి భవనం, ఎత్తుగా, విశాలంగా కనిపిస్తోంది.

"అభినవ విశ్వకర్మ నిర్మించిన భవనం అది. వాస్తు విశ్వరూపం! ధర్మపత్నితో వెళ్ళి, దర్శించి రా ధర్మా!" కంఠీరవుడు నవ్వుతూ అన్నాడు.

తరంగా, వీరధర్మా, భవనం వైపు జంటగా నడుస్తున్నారు. కంఠీరవుడి కళ్ళలోంచీ వాత్సల్య కిరణాలు వాళ్ళవైపే ప్రసరిస్తున్నాయి.

"మిళిందా, నా శిష్యుడు మృత్యువును జయించాడో లేదో నాకు తెలీదు కానీ, అందచందాల ఆరో ప్రాణాన్ని తెచ్చుకున్నాడు!"

"సారాంశం నేను చెబుతాను. సంగతులు తను చెబుతాడు. మీ ప్రియశిష్యుడు, నా ప్రియ మిత్రుడు అకాల మరణాన్ని జయించాడు. దుర్మరణాన్ని జయించాడు. అపమృత్యువును జయించాడు!"

కంఠీరవుడు ఆశ్చర్యంగా సగర్వంగా చూశాడు. "అలాగా! అయితే మన వీరధర్మ మృత్యుంజయుడే!"

(అయిపోయింది)

కామెర్లు

కామెర్లు కాలేయ సంబంధిత వ్యాధి. ఇటీవల కాలంలో తరుచూ తలెత్తుతున్న ఆరోగ్య సమస్యల్లో ఒకటిగా కామెర్లు అని చెప్పవచ్చు. ఒక వ్యక్తి ఈ సమస్యతోబాధపడుతున్నప్పుడు అతనికన్నా ముందు ఇతరులే దీన్ని గుర్తిస్తారు. ఈ విచిత్ర పరిస్థితి కామెర్ల లోనే కనిపిస్తుంది. రక్తంలో బిలిరుబిన్ యొక్కస్థాయి హెచ్చినప్పుడు (హైపర్ బిలిరుబినిమియా) చర్మము, కనుగుడ్లు మరియు మ్యూకస్ మెంబ్రేన్‌లు పసుపు పచ్చ రంగుతేలడాన్ని పచ్చకామేర్లు అంటారు.

శరీరానికీ ప్రాణవాయువు అనదగ్గ ఆక్సిజన్‌ను రక్తంలోని ఎర్ర రక్తకణాలు సరఫరా చేస్తాయి. ఇందులో హిమోగ్లోబిన్ అనే ప్రొటీన్ పదార్థం కీలక పాత్ర పోషిస్తుంది. దీని జీవితకాలం 120 రోజులు మాత్రమే ఉంటుంది. ఆ తరువాత హిమగ్లోబిన్‌లోని హీమ్ పదార్థం ప్లీహంలో(స్ప్లీన్) శిథిలమైపోయి బైలిరూబిన్, బైలివర్దిన్ అనే పసుపురంగు వ్యర్థపదార్థాలుగా మారిపోతుంది. శరీరంలో ఈ పసుపు రంగు పదార్థాలు పేరుకు పోవడాన్ని కామెర్లుగా అభివర్ణించవచ్చు.

సాధారణంగా కాలేయం ఈ వ్యర్థ పదార్థాలను సేకరించి పైత్యరసంతో పాటు కాలేయ వాహిక (బైల్‌డక్ట్) ద్వారా పేగుల్లోకి పంపుతుంది. అక్కడ నుంచి మలంతో పాటు ఈ పసుపురంగు వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్ళిపోతాయి.

మన శరీరంలో అత్యంత కీలకమైన అవయవం కాలేయానికి ఏదైనా వ్యాధి సోకినప్పుడు అది పైకి కామెర్లు రూపంలో కనబడుతుంది. కామెర్లు అనగా మనలో చాలామంది నోరు కట్టేసుకోని చప్పటి తిండి తినాలని భావిస్తుంటారు. నూనె, కొవ్వులేమి లేకుండా ఉడకేసిన చప్పిడి పదార్థాలే పెట్టటం వల్ల నోటికి రుచించక, మొత్తం తిండే తగ్గిపోతుంది. దీంతో మనిషి బలహీనపడటంతో పాటు జబ్బు నుంచి కోలుకోవటానికి దీర్ఘకాలం పడుతోందని, దీనివల్లే మనదేశంలో కామెర్లు బాధితులు ఎక్కువ కాలం బాధపడాల్సి వస్తోందని స్పష్టంగా గుర్తించారు.



కారణాలు: 1. హెపటైటీస్ ఎ,బి,సి,డి,ఇ అనే వైరస్‌ల కారణంగా కామెర్లు వచ్చే అవకాశం ఉంది. 2. ఆల్కహాల్ ఎక్కువగా తీసుకునే వారిలో వచ్చే అవకాశం ఉంది. 3. పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలు కూడా కామెర్లకు దారితీస్తాయి. 4.కాలేయం పాడైనపుడు వచ్చే అవకాశం వుంది.

5. కాలేయం నుంచి పేగుల్లోకి తీసుకుని వెళ్ళె కాలేయ వాహికలో అంతరాయం ఏర్పడినప్పుడు ఈ సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది.

లక్షణాలు: వికారం మరియు వాంతులు. పొత్తి కడుపులో నొప్పి, జ్వరం, నీరసం, తలనొప్పి, కడుపు ఉబ్బర్‌గా ఉండటం. కామెర్లు సోకిన పుడు ప్రధాన లక్షణంగా కళ్లు పచ్చబడటాన్ని గమనించ వచ్చు.

వ్యాధి నిర్ధారణ: సి.బి.సి, యల్.యఫ్.టి., సిటీస్కాన్, ఎం.ఆర్.ఐ, ఆల్ట్రాసౌండ్ స్కాన్.

హోమియోచికిత్స: కామెర్లను తగ్గించడానికి హోమియోపతిలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. రోగి యొక్క మానసిక, శారీరక స్థితిని పరిగణ లోకి తీసుకుని లక్షణాలను బట్టి మందులను వైద్యులు సూచిస్తారు. కామెర్లకు ప్రారంభ దశలోనే మందులతో చికిత్స చేయడం వల్ల సమూలంగా నయం అవ్వచ్చు. కామెర్లకు హోమియోపతిలో చెలడోనియం, సెలీనియం, లైకోపోడియం, మెర్క్‌సోల్, నాట్‌సర్ఫ్ మొదలగు మందులు డాక్టర్ పర్యవేక్షణలో వాడాలి.

డా. మురళి అంకిరెడ్డి
M. D (Homeo)
స్టార్ హోమియోపతి

www.starhomeo.com

సికింద్రాబాద్ । కొత్తపేట । కూకట్‌పల్లి । వరంగల్ । గచ్చిబౌలి
విజయవాడ । తిరుపతి । వైజాగ్ । రాజమండ్రి । కర్నాటక

✆ 90300 64224

సయాటికా (గృధ్రసీ వాతము)

ప్రస్తుత పరిస్థితిలో మానవుని జీవితం చాల యాంత్రికం గా మారిపోయింది. ముఖ్యంగా ఆహారపుఅలవాట్లు, దిన చర్య స్వప్నవిపర్యయం (పగటినిద్ర, రాత్రి సమయానికి నిద్రపోకపోవటం) లాంటి విషయాలలో అనేక మార్పులు రావటం వలన, ఆందోళన, మానసికఒత్తిడి లాంటి సమస్యల వలన మానవులనేక వ్యాధులబారిన పడుతు న్నారు. అందులో అతి ముఖ్యమైనది (నడుమునొప్పి) కటిశూల. నూటికి 90మంది తమ జీవితకాలంలో ఎప్పుడో ఒకసారి ఈనడుమునొప్పిసమస్యతో బాధ పడుతున్నారు. ఆయుర్వేద శాస్త్రంలో చరక, సుశ్రుత, వాగ్భటులు ఈ సమస్యను గృధ్రసీవాతం(సయాటికా)గా పేర్కొంటూ ఎంతో విపులంగా వివరించారు.

దీనికి సాధారణ కారణాలు పరిశీలించినట్లయితే... ఎక్కువగా ఒకే పొజిషన్‌లో కూర్చోనటం, స్థూల కాయం, అధికశ్రమతో కూడిన పనులు ఎక్కువ సేపు చేయుటం, అధిక బరువులను మోయుటం, ఎక్కువ దూరం ద్విచక్ర వాహనాలు, కార్లలోప్రయాణించటం, కొన్ని దీర్ఘకాలిక వ్యాధులువలన, కొన్ని వంశపారం పర్య వ్యాధులవలన, మరికొన్ని రోడ్డుప్రమాదాల వలన ఈ నడుము నొప్పి సమస్య వస్తుంటుంది. ముఖ్యంగా పైన వివరించిన కారణాలవలన శరీరంలో వాతప్రకోపంజరిగి, ముందుగా పిరుదులకు పైభాగాన స్తబ్ధతను, నొప్పినికలిగించి తరువాత కటి ప్రదేశం (నడుము), తొడలు, మోకాళ్ళు, పిక్కలు, పాదాలలో క్రమంగా నొప్పి కలుగుతుంది. దీనినే గృధ్రసీవాతాము (సయాటికా) అని అంటారు. ఈ సమస్య శీతాకాలంలో ఎక్కువ అవుతుంది. ముఖ్యంగా నడుముకు సంబంధించిన ఎల్4-ఎల్5, ఎస్1-ఎస్2 వెన్నుపూసల మధ్యగల సయాటికా అనే నరంపై ఒత్తిడి పడటం వల్ల ఈ నొప్పి వస్తుంది.

డిస్క్‌లో వచ్చేమార్పులు: ఈ వ్యాధిలో వెన్నుపూసలమధ్య ఉండే డిస్క్‌లో కొన్ని మార్పుల జరుగుతాయి. అవి డిస్క్ మీద ఒత్తిడి పెరగటం, వాపురావటం లేదా డిస్క్‌కి రక్త ప్రసరణ సరిగా లేకపోవటం, అరిగిపోవటం అనే సమస్యల వల్ల ఈ నొప్పి వస్తుంది. డిస్క్‌లో వాపు వస్తే దానిలోఉండే చిక్కనిద్రవం బయటకు వచ్చి మేరుదండం లేదా దాన్నుంచి వచ్చే నరాలపై ఒత్తిడి కలిగించటం వల్ల నొప్పి వస్తుంది.

లక్షణాలు: నడుములో నొప్పి కలగటం, వాపు, కొంచెం శారీరక శ్రమ చేయగానే నొప్పి తీవ్రత పెరగటం, ఈ నొప్పి సూదులతో గుచ్చినట్లుగా, ఒక్కోసారి తిమ్మిర్లు, మంటలతో కూడి ఉంటుంది. సమస్య తీవ్రమైనది అయితే స్పర్శహాని కూడా కలుగవచ్చు. ఒక్కో సారి మల మూత్రాలమీద నియంత్రణకూడా పోయేప్రమాదంఉంది. వెన్ను నొప్పి బాధ అనగానే సాధారణంగా పెయిన్‌కిల్లర్స్ తో కాలయాపన చేస్తుంటారు. దీనివల్ల తాత్కాలిక ఉప శమనం కల్గుతుంది. కాని మలబద్ధకం, జీర్ణా శయ సమస్యలు మొదలవుతాయి. కావున ఇలాంటి సమస్యల ను ప్రారంభదశలోనే గుర్తించి, జాగ్రత్త పడటం వల్ల ఈ వ్యాధి ని సమూలంగా నయం చేయవచ్చు.

ఆయుర్వేదచికిత్స: ఆయుర్వేదంలో ఇలాంటి సమస్యల కు సమగ్రమైన చికిత్సాపద్ధతులుఉన్నాయి. అందులో

శమన చికిత్స: ఇది దోషాలను బట్టి అభ్యంతరంగా వాడే ఔషద చికిత్స ఇందులో వేదన, కాయకంగా ఔషదాలు ఉంటాయి. అలాగే వాతహర చికిత్సా పద్ధతులుంటాయి.

శోధనచికిత్స: శమన చికిత్స వలన ఒక్కోసారి మళ్ళీ వ్యాధి తిరగబెట్టవచ్చు. అందుకే ఆయుర్వేదంలో పంచకర్మ అనే ఒక ప్రత్యేక చికిత్సా పద్ధతి ఉంది. ఈ చికిత్సా పద్ధతీ ద్వారా ప్రకోపించిన వాతాది దోషాలను సమూలంగా తగ్గించవచ్చు.

1.స్నేహకర్మ: ఈ ప్రక్రియ ద్వారా వెన్నెముకలోని వెన్ను పూసల మధ్య స్నిగ్ధత్వాన్ని పెంపొందించి, తద్వారా జాయింట్స్‌లో కదలికలను తేలికగా చేయవచ్చును.

2.స్వేదకర్మ: ఈ పద్ధతిలో గట్టిగా అతుక్కొనిఉండే జాయింట్స్ ను మృదువుగా అయ్యేటట్లు చేయవచ్చును. కటివస్తి, ఈ ప్రక్రియ ద్వారా అరిగిపోయిన మృదులాస్థికి రక్త ప్రసరణను పెంచి తద్వారా నొప్పి తీవ్రతను తగ్గించ వచ్చును. అలాగే సర్వాంగధార, వస్తికర్మ అనే విశిష్ట చికిత్సా పద్ధతుల ద్వారా నాడీ కణాలలో కలిగిన లోపాల ను సరిచేయువచ్చు, అదేవిధంగా ప్రకోపించిన వాతాన్ని సమస్థితికి తీసుకురావచ్చు.

జాగ్రత్తలు:సరిఅయిన పోషకఆహారాలు తీసుకోవడం, నిదాన పరివర్జనం అనగా పైన చెప్పిన ప్రత్యేక వ్యాధి కారణాలను మళ్లీ చేయకుండా జాగ్రత్త పాటించినట్ల యితే ఈ సమస్యనుంచి శాశ్వతవిముక్తి పొందవచ్చును.

డా.మనోహర్. M. D (Ayurveda)
స్టార్ ఆయుర్వేద

ADVT

✆90300 85456

సికింద్రాబాద్ । కొత్తపేట । కూకట్‌పల్లి । వరంగల్ । గచ్చిబౌలి
విజయవాడ । తిరుపతి । వైజాగ్ । రాజమండ్రి । కర్నాటక

www.starayurveda.com

సినీ నారాయణీయం

(ఎమ్మెస్ నారాయణ జీవితచిత్రం) 21

ప్రయత్నిస్తూ మరణిస్తే గెలిచినట్టే

నేను పరుగెత్తుకెళ్ళి స్టేషన్ మాస్టర్‌కి కంప్లయింట్ చేశా. ఎవరో టికెట్లు లేకుండా ఎక్కారు. నా సూట్‌కేసు లాక్కున్నారు మీరు రండి అన్నా. రైల్వే వాళ్ళొచ్చారు. విచారించి వాళ్ళందర్నీ కిందకి దింపేశారు. నీ సూట్‌కేసేదీ? అనడిగారు. ఇదే సార్ అన్నా. తీసుకో అన్నారు. నా సూట్‌కేసు తీసుకుని నేను ఎక్కేశా. ట్రైన్ వెళ్ళిపోయింది. అంతే. ఆ తర్వాత వాళ్ళు ఏమయ్యారో నాకు తెలియదు.

ఒకసారి నేను మద్రాసు నుంచి రైల్లో వచ్చేటప్పుడు మరో అనుభవం ఎదురైంది. ఒక మిలిటరీ మ్యాన్, ఒక అమ్మాయి, నేను కూర్చున్నాం. వాడు అమ్మాయి పక్కన కూర్చున్నాడు. తమ్ముడూ ఆ బ్రదర్ అన్నాడు. ఏమండీ ఆవిడ దిగిపోయిందా అన్నా. ఎవరు మీ అక్కా అన్నాడు. మా అక్క ఏంటీ, ఆవిడ మా అక్క కాదు అన్నా. వీడు కొడతాడని నా అనుమానం. ఎందుకంటే వీడు వీక్లీ ఇలా ఇమ్మన్నాడు. వీక్లీ ఇచ్చా. నేను ఆ అమ్మాయికి తమ్ముడన్నమాట. వీడు ఆ అమ్మాయిని సెక్స్‌పరంగా కలవాలి. అదీ వాడి స్కీము. ఏమండీ కూర్చోండి ఇక్కడ అన్నా. కూర్చున్నాడు. బండి గూడూరు స్టేషన్‌లో ఆగింది. చక్రకేళీ వాడొచ్చాడు. బాబూ నీకు చక్రకేళీ అంటే ఇష్టమా అన్నాడు. నాకు చాలా ఇష్టమండీ అన్నా. చక్రకేళీ రెండు తింటున్నా. మా అక్కకు ఒకటిచ్చాడు. నెల్లూరులో చెక్కలు, పకోడీలు చాలా బాగుంటాయి. ఈ విధంగా తెనాలి వచ్చేలోపు నాకు, నా పక్కన మా అక్కయ్యకు చెరో 20 రూపాయలు ఖర్చు పెట్టాడు. వీడు ఆ అమ్మాయిని ట్రాప్ చెయ్యాలన్నమాట.

అదీ బ్రేక్ మ్యాటరు!

ఆమె అప్పుడప్పుడు బయటికి వెళుతూ తమ్ముడూ ఇదిగో వీక్లీ అనేది. నేను తీసుకునేవాడిని. ఈవిడ టాయ్‌లెట్స్‌కెళ్ళేది. వీడు వెనకాల వెళ్ళేవాడు. మళ్ళీ ఆమె వెనకాలే వీడు వచ్చేవాడు. కట్ చేస్తే తెనాలి స్టేషన్ వచ్చింది. ఆమె ఆ స్టేషన్‌లో దిగిపోయింది. వీడు ఆవిడ వెనకాల వెళ్ళాడు. ఇద్దరూ దిగిపోయారు. లోపల నేనున్నా. మళ్ళీ వచ్చి ఎక్కాడు. బండి కదిలింది. ఆ అమ్మాయి లేదు. వెళ్ళిపోయింది. వీడొక్కడే వచ్చి నా పక్కన కూర్చున్నాడు. నాకు టెన్షన్ స్టార్టయింది. 17 రూపాయల జంతికలు, చక్రకేళీలు తిన్నాం. వీడొచ్చి ఇక్కడ కూర్చున్నాడు. ఆమె వెళ్ళిపోయింది.

చక్రకేళీలు, ఐస్‌క్రీంలు అన్నీ ఇప్పించాడు కదా. ఎందుకు ఇప్పించాడు?

ఆ అమ్మాయికి వీడు బీటేస్తున్నాడు. కానీ ఆ అమ్మాయి చెడ్డదో మంచిదో తెలీదు. నాకో పక్కన సైకాలజీ అర్థమవుతోంది. నన్ను కొట్లేదు. కూర్చున్నాడు. మీ అక్క కాదా అన్నాడు. కాదన్నా. చెప్పలేదే అన్నాడు. మీరు అడగలేదు కదా అన్నా. దిగిపోయింది. వెళ్ళిపోయింది అన్నాడు. 'నువ్వు వెధవ్వి రా' అని నేను తిట్టకూడదు కదా. కామ్‌గా ఉన్నా. ఎక్కడికెళ్ళిందీ అన్నా. ఎక్కడకెళ్ళిందో నాకేం తెలుసు అన్నాడు. వాడు వెధవని ఇంక మనమెందుకు మాట్లాడ్డం వాడే చెప్పినప్పుడు. వాడు వాడి దారిన వెళ్ళిపోయాడు. నేను నా దారిన వచ్చేశా.

ఈ విషయం మీద నాకు మీలాంటి ఒక స్నేహితుడొకడు ఏమన్నాడంటే, వాడు ఇచ్చాడు నువ్వు తిన్నావు. ప్రాబ్లం వాడిది. ప్రాబ్లం ఎవరిదని ఆలోచించేంత గొప్పోడు కాదు వాడు అని. అదీ బ్రేక్ మ్యాటర్.

నన్ను షాపులోపెట్టి తాళం వేసుకెళ్ళాడు

చెన్నై వెళ్ళే రోజుల్లో ఒక రాత్రి ఒక షాప్ దగ్గర కూర్చున్నా. ఎందుకనో ఆ పరిస్థితుల్ని భరించలేక ఏడుపు వచ్చింది. ఏం జరగటంలేదు. ఏంటిదీ అని. ఇంటి దగ్గర మా అమ్మ వాళ్ళు గుర్తొచ్చారు. షాపు వాడు అడిగాడు ఏంటీ అని. ఏం లేదు సినిమా సబ్జెక్టులు చెప్పడానికి వచ్చాను. కనీసం ఈ ఒక్క నైట్ ఎక్కడన్నా ఉందామంటే డబ్బుల్లేవు. షెల్టరు లేదు అన్నా. ఊ... ఒక పన్జెయ్యి నువ్వు. ఈ షాపులో పడుకుంటావా అన్నాడు. పడుకుంటాను అన్నా. మరి నేను తాళం వేసుకుని వెళ్ళిపోతాను. పొద్దున్నే 8 గంటలకి వస్తాను. అలా నీకిష్టం అయితేనే నీకు చోటిస్తాను అన్నాడు. అక్కడే పడుకున్నాను. పొద్దున్నే 8 గంటలకి వచ్చాడు. అప్పటి దాకా మలమూత్రాలకు వెళ్ళడానికి లేదు. తర్వాతంతా అక్కడ రైల్వే లెట్రిన్స్ అవి ఉన్నాయి. రైల్వేస్టేషన్‌లో బయట పడుకోలేం కదా. ఇదంతా కోడంబాకం రైల్వే స్టేషన్ దగ్గర జరిగింది.

హోమో సెక్సువల్ బారినపడ్డా

తర్వాత నేను ఆ రోజంతా వర్కవుట్ చేసి ఒక ఫ్రెండ్‌ని పట్టుకున్నాను. ఆ ఫ్రెండ్ రూంలో పడుకున్నాను. కోడంబాకంలోనే అది కూడా.

నెక్స్ట్ డే నైట్ నాతో పాటు ఇంకా ముగ్గురు పడుకున్నారు. పెద్ద హాలు అది. సరిగ్గా నిద్రపడుతున్న సమయానికి మెల్లిగా ఒకడు వచ్చి చెయ్యి పట్టుకున్నాడు. వాడు హోమో సెక్సువల్. నాకు అర్థమైపోయింది. ఏయ్ లే అని గెంటేశా. వదల

ట్లేదు. చాలా బలంగా ఉన్నాడు. వాడు చెప్పాడు. చెయ్యనిస్తే చెయ్యనియ్యి. లేకపోతే వెళ్ళిపో అన్నాడు. లేచి మళ్ళీ బ్యాగ్ తీసుకుని వెళ్ళి కోడంబాకం రైల్వేస్టేషన్‌లో కూర్చున్నా ఆ రాత్రి. ఇంకో రాత్రి షెల్టర్ ప్రాబ్లం నాకు. ఒకతను ఒక రూంకి తీసుకెళ్ళాడు. పాండీ బజారులో పరిచయమైన సినిమా వాళ్ళు వీళ్ళూ ఉంటారు. రాము అని ఒకతను. అతను ఎడిటర్‌గా ప్రయత్నం చేస్తున్నాడు. నా రూం ఉందిలెండి అని అతను నన్ను తీసుకెళ్ళాడు. ఆ రూంకి రెంట్ కట్టకుండా దొంగచాటుగా ఉంటున్నాడు వీడు. కరెంట్ లేదు, దోమలు. రూం అయితే ఇచ్చాడు గానీ వెలుతురు వచ్చేదాకా మేలుకొని కూర్చున్నాను. చంపేస్తున్నాయ్ దోమలు. దోమ కుడితే నాకు నిద్రపట్టదు. నిడమర్రులో దోమలుండవు. ఇంకొక రాత్రి ఇంకొకడు రూం ఉందిలే అని తీసుకెళ్ళాడు. వెళ్ళాను. పైన రూంలో ఉన్నాం. రాత్రి 11, 12 గంటలు అయ్యేటప్పటికి కింద నుంచి కేకలు అరుపులు వినిపిస్తున్నాయి. ఒక 12 మంది ఎయిడ్స్ పేషంట్స్‌ని అక్కడ పెట్టారంట. అప్పుడు భయమేసింది. ఎయిడ్స్ గురించి అప్పటికి ఇంత అవేర్‌నెస్ లేదు. ఆ రోజంతా అలా మేల్కొని ఉండిపోయాను.

ఎండిపోయిన బ్రెడ్ తిని ఆకలి తీర్చుకున్నా

ఓసారి సినీ రచయిత మహారథిగారి అబ్బాయి, చిట్టి దర్శకత్వంలో ఓ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఆయనకు చెన్నై మహాలింగపురంలో ఓ అపార్ట్‌మెంట్ ఉంది. అక్కడ నాకు రెసిడెన్స్ ఇచ్చి కథలు రాయిస్తున్నారు. సంతానం అనే ఓ కన్నడ సినిమాకు రీమేక్ రాస్తున్నాను. ఓ రోజు ఆయన

> **రచయితగా, నటుడుగా ఎదగడానికి ముందు ఎమ్మెస్ పూట గడవని రోజులు అనుభవించారు. ఎన్నో చిక్కుల నుంచి తన తెలివితేటలతో అవలీలగా బయటపడగలిగారు. అలా ఢక్కామొక్కీలు తిన్న తర్వాతే ఆయన జీవితంలో వెలుగు ప్రసరించింది. మహానుభావులు మాత్రమే గొప్ప కొటేషన్లు చెప్పగలరనుకుంటాం. కానీ సామాన్యులు కూడా తమ జీవితానుభవాల్లోంచి కొటేషన్లు చెప్పగలరని ఎమ్మెస్ నిరూపించారు!**

పొరబాటున బయట తాళం వేసుకొని వెళ్ళిపోయారు. అక్కడ సెల్‌ఫోన్ లేదు, ల్యాండ్‌లైన్ లేదు. ఆఖరుకు తింటానికి ఏమీ లేదు. అది అయిదో అంతస్తులో ఉంది. కిటికీ తీసి పిలుద్దామంటే ఎక్కడో కింద రోడ్డు మీద కనిపిస్తున్నారు జనం. నా మాట వినపడే ప్రసక్తే లేదు. కొంతసేపు అంతా వెదికితే ఓ ఎండిపోయిన బ్రెడ్ దొరికింది. దాన్ని నీటిలో నానబెట్టుకుని తిని కొంతసేపు ఆకలి తీర్చుకున్నాను. ఎట్టకేలకు రాత్రి ఏడు గంటలకు ఆయన వచ్చి తాళం తీశాడు. 'సారీ ఎం.ఎస్ గారు' అన్నాడు. ఆయన దగ్గర పని చేసే వాళ్ళం ఆయనను ఏం అనగలం? అని సరి పెట్టుకున్నాను.

భీమవరం మిత్రుడు పులగం నాగేశ్వరరావు మద్రాసులో ఉండేవాడు. ఓసారి అతని దగ్గరకు వెళ్ళాను. అతను లేడు. మరి ఎక్కడికి వెళ్ళాలి? దగ్గరలోనే కర్ణాటక బలిజ సంఘం గెస్ట్‌హౌస్ ఉంది. అక్కడకు వెళ్ళాను. నువ్వు 'బలిజా!' అని అడిగారు. 'అవును' అన్నాను. కర్ణాటక అని అడగలేదు. పది రూపాయలు ఇమ్మంటే ఇచ్చాను. ఇంకో పది ఇమ్మన్నాడు. 'ఇది ఎందుకు?' అన్నాను. 'ఇది రెంటు, అది మామూలు' అన్నాడు. ఇంకో పది ఇమ్మన్నాడు. అది అడ్వాన్స్ అన్నాడు. నా దగ్గర డబ్బయిపోయింది. పక్క సందులో తనఖీ షాపులు ఉన్నాయి. నా దగ్గర ఉన్న చిన్న ఉంగరం తాకట్టు పెడితే ముప్పై ఇచ్చాడు. అప్పుడు నాగేశ్వరరావు ఆఫీసుకు వెళితే అతను వచ్చాడు. ఇద్దరం కలిసి మ్యాట్నీ 'గాంధీ' సినిమాకు వెళ్ళాం. ఇలా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడేవాడిని.

భార్య సపోర్ట్

పరిస్థితి ఏంటంటే మూడు సంవత్సరాలు కాలేజీకి సెలవు పెట్టాను. సంవత్సరన్నర అయ్యింది. అప్పటికి రవిరాజాగారు ఇంకా టచ్ అవ్వలేదు. ఏంటిరా భగవంతుడా అని ఫ్రస్టేట్ అయిపోయాను. కాలేజీకి వెళ్ళిపోయాను. ఈవెనింగ్ మళ్ళీ వచ్చేశాను. వచ్చేసి బయటికి వెళ్ళకుండా ఇంట్లో కూర్చుని కుంగిపోయాను. నా మిసెస్ వచ్చి అడిగింది. ఇక్కడ కాలేజీలో జాయిన్ అయిపోయారా అంది. ఆ! జాయిన్ అయిపోయాను అన్నాను. ఎందుకు జాయిన య్యారు అంది. ఇంక అక్కడ సక్సెస్ అయ్యే మార్గం కనబడటంలేదు. కష్టపడిపోతున్నాను. భరించలేకపోతున్నాను. అక్కడే కూర్చుంటే ఇక్కడ కాలేజీలో జాబ్ పోతుంది ఇలా అయితేను అన్నా. పిల్లలేమో బోళా అయిపోతారు. ఇదీ పరిస్థితి. అంటే తను అంది కాదండి మీరు డెఫినెట్‌గా రైటర్ అవుతారు. ఏదో ఒకటి అవుతారు. పరిశ్రమలో గొప్పవారవుతారు. నా మాట వినండి. నేను పిల్లల్ని చూసుకుంటాను. మీరు సెలవు కంటిన్యూ చేసెయ్యండి. వెళ్ళిపోండి అంది. ఫస్ట్‌టైమ్ రియలైజ్ అయ్యాను. లైఫ్‌లో ఒక వ్యక్తికి విశ్వాసముందంటే ఆ విశ్వాసాన్ని మనం నమ్మాలి. జనరల్‌గా సినిమా పరిశ్రమ అంటే ఎవరూ అలా సపోర్ట్ చేసి పంపించరు. పైగా జాబ్ మానేసి, జీతం నష్టం మీద. అప్పుడు ఎందుకు మా ఆవిడ ఇలా చెప్పిందంటే... నేను ప్రతీ కథను మా ఆవిడకు చెప్పేవాణ్ణి. ఇంటికెళ్ళడం రాత్రి టైము ఎనిమిది, తొమ్మిదైనా సరే నేను అట్లాగే కథలు చెప్పేవాణ్ణి మిడ్‌నైట్ వరకు. నా దగ్గర ఉన్న అన్ని సబ్జెక్టులూ చెప్పాను. ఆవిడ మంచి లిటరేట్. భాషాప్రవీణ చదువుకుంది నాతోపాటే. లిటరేచర్ పట్ల, సరస్వతి పట్ల విశ్వాసం ఉన్న వ్యక్తి. బోల్డ్‌గా చెప్పాలంటే బ్రాహ్మణ బిడ్డ. ఆమెకి నా మీద చాలా విశ్వాసం వచ్చింది. వచ్చి ప్రోత్సహిస్తే, నెక్ట్స్ డే సెలవు పెట్టేశా. రిక్వెస్ట్ చేశా. మళ్ళీ కొత్తగా పెట్టినట్లు అవుతుందండి కాబట్టి ఈ ఒక్కరోజు పని చేసిన దానిని తీసేసి నా సెలవు ఇలా కంటిన్యూ చేసేద్దాం అన్నా. నీతి కోసం కొన్ని పనులు జరిగాయి అలా. ఒప్పుకుంటే నేను వెళ్ళిపోయాను.

అనుభవంతో రాసిన స్లోగన్

అప్పుడు మళ్ళీ ఫ్రస్టేషన్ వచ్చింది. మద్రాసు నుండి తిరిగి వచ్చేద్దామనుకున్న రోజుల్లో ఒకసారి నా డైరీ తీసుకుని ఒక పదం రాసుకున్నా "ప్రయత్నిస్తూ మరణిస్తే గెలిచినట్లే. ప్రయత్నం విరమిస్తే మరణించినట్లే". ఈ స్లోగన్ నాదే. వివేకానంద, అరిస్టాటిల్, ప్లేటో లాంటి వాళ్ళే కొటేషన్స్ రాస్తారని అనుకోనక్కర్లేదు. నాకు కనిపించిన లైఫ్‌లో నేను రాసినటువంటి సెంటెన్స్ అది. అది డైరీలో రాసుకుని అక్కడ వర్క్ స్టార్ట్ చేశాను.

(ఇంకావుంది)

-కూనపరాజు కుమార్

సెల్: 99899 99599

నరకానికి లిఫ్ట్

3 నోబెల్ కథలు

-పార్‌లాగర్‌క్విస్ట్

పార్ లాగర్‌క్విస్ట్ 23 మే 1891న స్వీడన్‌లో జన్మించారు. సాహిత్యంలో నోబెల్ బహుమతి 1951లో అందుకున్నారు. 83 ఏళ్ళ వయసులో 11 జూలై 1974న మరణించారు.

ధనిక పారిశ్రామికవేత్త అయిన మిస్టర్ స్మిత్ హోటల్ లిఫ్ట్ తలుపు తెరిచి ఆమెకు స్వాగతం చెప్పాడు. ఆమెతో పాటే పౌడరు పరిమళం అక్కడంతా కమ్ముకుంది. లిఫ్టులో ఉన్న మెత్తటి సోఫాలో వాళ్ళు ఒకరినొకరు ఆనుకుని కూర్చోగానే లిఫ్టు కిందకు వెళ్ళడం మొదలుపెట్టింది. వైన్‌తో తడిసిన పెదవులను ఆమె స్మిత్‌కు అందించింది. స్మిత్ ఆమెను ముద్దుపెట్టుకున్నాడు. చుక్కల పందిరి కింద ఇద్దరూ కలిసి భోజనం చేశారు. తర్వాత ఇద్దరూ ముచ్చట్లలో మునిగిపోయారు.

"డార్లింగ్. ఇదంతా స్వర్గంలోలాగా లేదూ' ఆమె గుసగుస లాడింది. 'ఇక్కడ నీతో కలిసి ఈ చుక్కల పందిరి కింద కూర్చోడం ఎంత రసాత్మకంగా అద్భుతంగా ఉందో తెలుసా! ఇలాంటప్పుడే నిజంగా ప్రేమ అంటే ఏంటో మనకు తెలుస్తుంది. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు కదూ. అవునా? కాదా?"

స్మిత్ సమాధానం చెప్పకుండా ఆమెను చాలా సేపు ముద్దాడాడు. లిఫ్ట్ కిందకు దిగుతోంది.

"నువ్వు వచ్చి మంచి పనిచేశావు ప్రియా. నువ్వు రాకపోతే నేను ఏమైపోయే వాడినో నాకే తెలీదు" అతనన్నాడు.

"నిజమే. కానీ అతను నన్ను ఎంత బాధ పెడుతున్నాడో నీకు ఎంత చెప్పినా అర్థం కాదు. నేను బైటకు రావడానికి సిద్ధం అయ్యానో లేదో ఎక్కడికి వెళుతున్నావని అతను అడగడం మొదలుపెట్టాడు. "నా ఇష్టం వచ్చిన చోటుకి" అని సమాధానం చెప్పాను. "నేనేమన్నా ఖైదీని అనుకున్నావా" అంటూ అతను కావాలని నా ఎదురుగా కూర్చుని నా వంకే చూడడం మొదలుపెట్టాడు. నేను బట్టలు మార్చుకుంటున్నా, కొత్త డ్రెస్ వేసుకుంటున్నా నా వంకే దీక్షగా చూస్తూ కూర్చున్నాడు. అన్నట్టు ఈ డ్రెస్ బాగుందా? నాకు ఏ డ్రెస్ ఎక్కువగా బాగుంటుంది? గులాబీరంగుది కదూ?" ఆమె అడిగింది.

"నువ్వు ఏది వేసుకున్నా బాగుంటావు ప్రియా. అయితే ఇవాళ సాయంకాలం ఉన్నంత అందంగా నువ్వు ఎప్పుడూ లేవు" స్మిత్ అన్నాడు.

ఆమె అందంగా నవ్వింది. వాళ్ళిద్దరూ చాలా సేపు ముద్దాడారు. లిఫ్టు కిందకు వెళుతూనే ఉంది.

"నేను బయల్దేరి రాబోతుండగా అతను నా చేయి పట్టుకుని గట్టిగా బలంగా గుంజాడు. ఎంత గట్టిగా అంటే చెయ్యి ఇప్పటికీ నొప్పెడుతూనే ఉంది. మళ్ళీ నోరు తెరిచి ఒక్కమాట అనలేదు. అతను ఎంత మృగం లాంటివాడో నీకు చెప్పినా తెలీదు. "సరే, నేను వెళ్తున్నాను" అన్నాన్నేను. అతడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అతని ప్రవర్తనకు ఒక అర్థం అంటూ కనబడలేదు. ఎంత భయంకరుడో చూడు. నేను అది సహించలేకపోయాను" ఆమె చెప్పింది.

"అయ్యో, అలాగా" స్మిత్ అన్నాడు.

"నేను బైటకు వెళ్ళి సరదాగా గడపకూడదా? అతను ఎంత కోపంగా ఉన్నాడంటే నీకు చెప్పలేను. అతను దేన్నీ తేలికగా, సహజంగా తీసుకోడు. ప్రతీదీ జీవన్మరణ సమస్య అన్నట్టే చూస్తాడు" ఆమె అంది.

"అవునా? మరి ఇన్నాళ్లూ ఎలా భరించావు?"

"అవును. నరకం అనుభవించాను. నానా బాధలు పడ్డాను. నేను పడినంత బాధ ఇంకెవ్వరూ పడి ఉండరు. నిన్ను కలిసేంతవరకూ అసలు ప్రేమ అంటే ఏంటో నాకు తెలీదు".

"అవునా ప్రియా" అంటూ స్మిత్ ఆమెను దగ్గరకి తీసుకున్నాడు. లిఫ్టు కిందకు వెళుతూనే ఉంది.

ఇవాళ ఇక్కడ నీతో కూర్చుని ఈ నక్షత్రాలను చూస్తూ కలలు కంటానని అస్సలు ఊహించలేదు. ఈ క్షణాలను నేను ఎప్పటికీ మరువలేను. నీకు ఒకటి తెలుసా! ఇలా అర్విడ్‌తో అయితే ఉండలేను. అది అసాధ్యం. తను ఎంత గంభీరంగా ఉంటాడంటే.. పైపెచ్చు అతనిలో భావుకత్వం మచ్చుకి కూడా కనపడదు. అతనికి కవిత్వం అంటే ఎలాంటి ఆసక్తి లేదు.

"అవునా? అలా అయితే కష్టమే. అలా ఉంటే భరించలేం".

"అవును భరించడం కష్టమే. సరేకానీ ఇప్పుడు అవన్నీ ఎందుకు? వాటి గురించి ఆలోచించడం అనవసరం. మనం ఇక్కడికి సరదాగా గడపడం కోసం వచ్చాం. నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావు కదూ" ఆమె నవ్వుతూ అతనికి తన చేయి అందిస్తూ అడిగింది.

'ప్రేమించడం లేదంటావా' అంటూ అతను ఆమెను బలంగా హత్తుకున్నాడు. ఆమెకు ఒక్క నిమిషం ఊపిరి పీల్చడం కష్టమనిపించింది. లిఫ్టు ఇంకా కిందకు వెళుతూనే ఉంది. స్మిత్ ఆమెకు దగ్గరగా జరిగి ఆమెను ముద్దు పెట్టుకున్నాడు. ఆమె అందంగా సిగ్గుపడింది.

"అంతకుముందు ఎప్పుడూ లేనట్టుగా ఇవాళ రాత్రి మనం స్వర్గం అంచులవరకూ వెళ్ళి వద్దాం" అతను గుసగుస లాడాడు. ఆమె అతన్ని దగ్గరకు అదుముకుని పరవశంతో కళ్ళు మూసుకుంది. లిఫ్టు ఇంకా కిందకు వెళుతూనే ఉంది. ఇంకా కిందకు ఇంకా కిందకు వెళుతూనే ఉంది. చివరికి స్మిత్ లేచి నుంచున్నాడు. అతని మొహం ఎర్రగా కందిపోయి ఉంది.

లిఫ్ట్ ఎక్కి మెత్తటి సోఫాలో కూర్చుని ముద్దులు పెట్టుకుంటూ రొమాన్స్ ప్రారంభించారు వాళ్ళు. ఇక ఆ లిఫ్ట్ కిందికి ప్రయాణించడం ప్రారంభించింది. ఎంతకీ ఆగడం లేదు. చాలా సేపటికిగానీ వాళ్ళు ఆ విషయం గుర్తించలేదు. బైటకు చూసి భయపడ్డారు. చీకట్లో కూరుకుపోతున్నట్టనిపించింది. ఇంతకూ ఆ లిఫ్ట్ వారిని ఎక్కడకు తీసుకెళ్ళింది? అక్కడ వారికి ఎవరు కనిపించారు? వారికెలాంటి అనుభవాలెదురయ్యాయి?

"ఏంటి ఈ లిఫ్టుకి ఏమయింది? ఎందుకు ఇది ఆగడం లేదు? మనం ఎప్పట్నుంచో ఇందులో కూర్చుని మాట్లాడుకుంటూనే ఉన్నాం కదూ" అతను అడిగాడు.

"అవును. ఎప్పట్నుంచో మాట్లాడుతున్నాం. కాలం త్వరగా గడిచిపోతోంది".

"అదికాదు. మనం ఇక్కడ కూర్చుని కొన్ని యుగాలయినట్టుగా ఉంది. ఏమయింది?"

అతడు ఇనుపగ్రిల్ నుంచీ కిందకూ చుట్టు పక్కలా చూశాడు. భయంకరమైన చీకటి తప్ప

ఎక్కడా ఏమీ కనిపించలేదు. లిఫ్టు ఇంకా కిందకు వెళుతూనే ఉంది.

"ఏమయిందో తెలీడం లేదు. చూస్తే ఇది మనల్ని ఏదో గోతిలో పడేసేలా ఉంది. ఇంకా ఎంతసేపు ఇందులో ఉండాలి?" వాళ్ళు లిఫ్టులోంచి కళ్ళు చించుకుని బైటకు చూశారు. బైట గాఢాంధకారం తప్ప ఏమీ కనిపించలేదు. వాళ్ళకు చీకట్లో మునిగిపోతున్నట్టు అనిపించింది.

"ఏదో నరకంలోకి వెళుతున్నట్లుంది" స్మిత్ అన్నాడు.

"అయ్యో, నాకేదో భయంగా ఉంది. గొలుసు లాగి ఎమర్జెన్సీ బ్రేకు వెయ్యకూడదూ" ఆమె అతని చేయి పట్టుకుంటూ అడిగింది.

స్మిత్ గొలుసు పట్టుకుని లాగడానికి చూశాడు. లాభం లేకపోయింది. లిఫ్టు ఇంకా కిందకు దిగుతూనే ఉంది.

"ఇదంతా భయంకరంగా ఉంది. ఇప్పుడేం చేద్దాం?" ఆమె అడిగింది.

"నిజంగానే ఏదో దయ్యపు పనిలా ఉంది" స్మిత్ అన్నాడు.

ఆమెకు భయంతో కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి.

"లేదు ప్రియా ఏడవకు. ఏం జరగదు. మనం చేయగలిగింది కూడా లేదు. ఇక్కడ కూర్చో. మనం ఇక్కడే నిశ్శబ్దంగా కూర్చుని ఏం జరుగుతుందో చూద్దాం. ఇది ఎప్పుడో ఒకప్పుడు ఆగక తప్పదు" వాళ్ళు అట్లాగే కూర్చుని వేచి చూశారు.

"మనం ఏదో సరదాగా గడుపుదామని వస్తే చూడు ఎలా అయిందో" ఆమె అంది.

"అవును. నిజంగా దరిద్రమే".

"నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావు కదూ?"

"ప్రియా, నీకెలా చెప్పను" స్మిత్ ఆమె భుజాల చుట్టూ చేతులువేసి దగ్గరకు తీసుకున్నాడు. లిఫ్ట్ ఇంకా వెళుతూనే ఉంది.

చివరికి అది ఒక్కసారిగా ఆగిపోయింది. అక్కడంతా వెలుగుతో ప్రకాశవంతంగా ఉంది. కళ్ళు చెదిరేంత వెలుగు. వాళ్ళు నరకంలో అడుగుపెట్టారు. ఒక దయ్యం లిఫ్టు తలుపు తెరిచింది.

"గుడీవినింగ్" అంటూ మర్యాదగా తలవంచి వాళ్ళకు స్వాగతం చెప్పింది. అది చక్కటి దుస్తులు వేసుకుని ఉంది. దానికి వీపు కింద నుంచీ తోక వేలాడుతూ ఉంది.

స్మిత్ అతని ప్రియురాలు ఆశ్చర్యంతో నోరు తెరిచారు. దయ్యాన్ని చూసిన భయంతో "మేం ఇప్పుడు ఎక్కడున్నాం?" అంటూ అరిచారు.

"ఇది పేరుకు తగ్గట్టు అంత భయంకరంగా ఉండదు. మీకు ఇక్కడ మంచిగా కాలం గడుస్తుంది. పైగా ఒక్క రాత్రికి మాత్రమే మీరు ఇక్కడ ఉంటారు" దయ్యం వాళ్ళకు పరిస్థితి వివరించి చెప్పింది.

"సరే.. సరే. ఒక్కరాత్రి వరకేగా. అంతకన్నా ఉండలేం" స్మిత్ అన్నాడు.

ఆమె భయంతో వణుకుతూ అతని చేతిని పట్టుకుంది. ప్రకాశవంతమైన వెలుతురికి వాళ్ళ కళ్ళు అలవాటు పడగానే వాళ్ళకు అక్కడ కొన్ని ఇళ్ళు కనిపించాయి. గుమ్మాలకు తెరలు వేలాడుతున్నాయి. ఆ లోపల ఏదో మండుతున్నట్టు తలుపు సందుల్లోంచి కనిపిస్తోంది.

"ప్రేమించుకుంటున్నది మీ ఇద్దరేనా?" దయ్యం అడిగింది.

"అవును" ఆమె మెరుస్తున్న కళ్ళతో అతని వంక చూస్తూ చెప్పింది.

"అయితే ఇటురండి" అంటూ దయ్యం వాళ్లను ఒక ఇరుకు వీధిగుండా తీసుకువెళ్లి పగిలిపోయిన పాత లాంతరు తగిలించి ఉన్న ఒక గుమ్మం ముందు ఆగింది.

"ఇదే మీరుండాల్సిన చోటు" అంటూ దయ్యం వెళ్లిపోయింది.

వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళారు. అక్కడ ఒక లావుగా ఉన్న దయ్యం విసురుకుంటూ కూర్చుని ఉంది. ఆమెకు మూతి మీద మీసాలు ఉన్నాయి. ఆమె నవ్వుతూ వాళ్ళని ఆహ్వానించింది.

"ఓహో... మిస్టర్ స్మిత్. ఆయన ప్రియురాలునా? అయితే ఎనిమిదో నెంబరు గదిలోకెళ్ళండి" అంటూ పెద్ద తాళపు చెవి ఇచ్చింది. మాసిపోయి జిడ్డోడుతున్న మెట్లమీద నుంచీ వాళ్ళు పైకి వెళ్ళారు. స్మిత్ ఎనిమిదో నెంబరు గది చూసి లోపలికి అడుగుపెట్టాడు. అది చాలా పెద్దగది. గది మధ్యలో టేబుల్, గోడ పక్కగా మంచం, పరిశుభ్రంగా ఉన్న దుప్పట్లు - చూసి అంతా బాగుందని వాళ్ళు అనుకున్నారు. వేసుకున్న కోట్లు తీసి వాళ్ళు చాలాసేపు ముద్దాడుతూ ఉండిపోయారు. పక్కనున్న గుమ్మంలోంచి ఒక వ్యక్తి లోపలకు వచ్చాడు. అతను వెయిటర్ దుస్తుల్లో ఉన్నాడు. అక్కడి కనుచీకటిలో అతని షర్టు దయ్యాల్ని తలపించేంత ప్రకాశవంతంగా ఉంది. అతను నిదానంగా యాంత్రికంగా నడుస్తున్నాడు. అతని మొహం పాలిపోయి ఉంది. అతని కణతమీద బుల్లెట్ గాయం ఉంది. అతను గదిని శుభ్రం చేసి, డ్రెస్సింగ్ టేబుల్‌ని శుభ్రంగా తుడిచాడు. వాళ్ళు అతన్ని అంతగా గమనించలేదు. అతను వెళ్ళబోతుండగా స్మిత్ అతన్ని చూసి "మాకు కొంచెం వైన్ కావాలి. ఒక

ఆ క్రెడిట్ వాళ్ళదేనట!

టాలీవుడ్‌కి వచ్చిన కొత్తల్లో భాష తెలియక చాలా ఇబ్బంది పడేదాన్ని అంటోంది మిల్కీ బ్యూటీ తమన్నా. నా మొదటి సినిమా 'శ్రీ' సమయంలో నాకు అస్సలు ఏమీ తెలియదు. డైలాగ్స్ ఇంగ్లీషులో రాసుకుని వాటిని రికార్డ్ చేసుకుని ఇంటి దగ్గర ఒకటికి పదిసార్లు వినేదట! డైలాగ్స్ విషయంలో హీరో మనోజ్, దర్శకుడు దశరథ్ తనకు చాలా హెల్ప్ చేశారట! ఆ సినిమాతోనే తెలుగు అర్థం చేసుకోవడం వచ్చిందట! మొదటి సినిమాతోనే భాషను అర్థం చేసుకోగలిగానంటే ఆ క్రెడిట్ హీరో, దర్శకులదే అని చెబుతోంది. ఆ తరువాత నేను చేసిన సినిమాల్లో హీరోలు, దర్శకులు అందరూ నన్ను చాలా బాగా ఎంకరేజ్ చేశారు. కానీ నా మొదటి సినిమా విషయంలో వీరిద్దరూ ఇచ్చిన సపోర్ట్ మాత్రం ఎప్పటికీ మరిచిపోలేనిది అంటోంది. ఇప్పుడు ఉన్నట్టుండి ఈ ఇద్దరినీ మిల్కీ ఇంతగా ఎందుకు పొగుడుతోందో అర్థం కావడం లేదు అంటున్నారు టాలీవుడ్ జనాలు.

అరబాటిల్ వైన్ తెచ్చిపెట్టు" అని చెప్పాడు. అతను తలవంచి అదృశ్యం అయిపోయాడు. స్మిత్ దుస్తులు విప్పడం మొదలు పెట్టాడు. ఆమె అతన్ని సందేహిస్తూ చూసింది. "అతను మళ్ళీ వెనక్కివస్తాడు" ఆమె గుర్తు చేసింది. 'ఇలాంటిచోట్ల అవన్నీ పట్టించుకోనక్కర లేదు. నువ్వు కూడా దుస్తులు తీసెయ్యి" స్మిత్ అన్నాడు. ఆమె తన దుస్తులు తీసివేసి అతని ఒడిలో కూర్చుంది.

"మనం ఇద్దరం ఇలా ఒంటరిగా ఈ చిత్రమైన స్థలంలో ఇలా కలిసి ఉండడం ఎంత బాగుందో చూడు. ఎంత కవితాత్మకంగా ఉందంటే నేను ఎప్పటికీ మర్చిపోలేను" ఆమె గుసగుసలాడింది.

"అవును ప్రియా" అంటూ స్మిత్ ఆమెను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

ఆ వ్యక్తి చప్పుడు చేయకుండా మళ్ళీ వచ్చాడు. అతను యాంత్రికంగా, నిదానంగా ఎలాంటి శబ్దం రాకుండా గ్లాసులు అమర్చి గ్లాసు నిండా వైన్ పోశాడు. టేబుల్ ల్యాంపు నుంచీ వస్తున్న కాంతి అతని మొహంపై పడింది. అతని మొహం శవంలా పాలిపోయి కణతపై బుల్లెట్ గాయంతో ఉండడం తప్ప అతని గురించి వేరే చెప్పుకోదగిన విషయం ఏదీ లేదు.

అతన్ని చూసి ఆమె ఒక్కసారిగా గట్టిగా అరిచింది.

"ఓరి దేవుడా. అర్విడ్! నువ్వా? నువ్వేనా? అయ్యో. దేవుడా, అతను చనిపోయాడు. తనని తాను కాల్చుకుని చనిపోయాడు" ఆ వ్యక్తి అలాగే కదలకుండా స్మిత్ ఎదురుగా నుంచుని ఉన్నాడు. అతని మొహంలో ఎలాంటి బాధాచిహ్నాలు లేవు. అతని మొహం కఠినంగా అప్పుడే సమాధి నుంచీ లేచి వచ్చినట్టుగా ఉంది.

"అర్విడ్! ఎంత పనిచేశావు? ఎలా చెయ్యగలిగావు? నువ్విలాంటి పని చేస్తావని ముందే ఊహించి ఉంటే నేను ఇంట్లోనే ఉండిపోయేదాన్ని. నువ్వు నాతో ఏమీ చెప్పలేదు. నువ్వు ఇలా చేస్తావని ఒక్కమాట కూడా నాతో అనలేదు. నువ్వు చెప్పకుండా నాకు ఎలా తెలుస్తుంది. ఓరి దేవుడా.."

ఆమె శరీరం మొత్తం వణికిపోతోంది. ఆ వ్యక్తి ఆమె వంక కొత్త వాళ్ళని చూసినట్టు చూస్తున్నాడు. అతని చూపు మంచులా చల్లగా ఉంది. దేన్నయినా చీల్చుకుని వెళ్ళేలా ఉంది. అతని మొహంలోంచి ఒకలాంటి వెలుగు. గాయం నుంచీ రక్తం రావడం లేదు. కణతమీద రంధ్రం మాత్రం ఉంది.

"ఓహ్! ఇది భయంకరంగా ఉంది. నేను ఇక్కడ ఉండలేను. మనం వెంటనే వెళ్ళిపోదాం. ఇంకొక్క క్షణం ఇక్కడ ఉండలేను" ఆమె అంది.

ఆమె తన దుస్తుల్నీ, టోపీని, ఉన్ని కోటుని లాక్కుని గబగబా బైటకు పరిగెత్తింది. స్మిత్ ఆమెను అనుసరించాడు. మెట్లు దిగుతుండగా వాళ్ళకి కాలు జారింది. ఆమె మెట్లపై కూర్చుండిపోయింది. మెట్లకింద మీసాలతో ఉన్న ఆడ దయ్యం కనిపించి వాళ్ళని చూసి అంతా తెలుసు అన్నట్టు నవ్వింది. వీధిలోకి వచ్చిన తర్వాత వాళ్ళు కొంచెం స్థిమిత పడ్డారు. ఆమె దుస్తులు వేసుకుంది. జుట్టు సరిచేసుకుని పౌడరు అద్దుకుంది. స్మిత్ ఓదారుస్తున్నట్టు ఆమె నడుము చుట్టూరా చెయ్యి వేశాడు. కిందకు జారడానికి సిద్ధంగా ఉన్న కన్నీళ్ళను ముద్దుతో చెరిపేశాడు. అతను నిజంగానే మంచివాడు. వాళ్ళు రోడ్డు కూడలిలోకి వచ్చారు. అక్కడ అటూ ఇటూ నడుస్తున్న పెద్ద దయ్యం వాళ్ళను చూసి పరిగెత్తుకుని వచ్చింది.

"మీరు చాలా త్వరగా వచ్చేశారే. మీకు అంతా సౌకర్యంగా ఉందనే అనుకుంటున్నాను" అంది.

"లేదు. చాలా భయంకరంగా ఉంది" ఆమె అంది.

"లేదు. అలా అనొద్దు. ఇదివరకటి రోజుల్లో వేరేగా ఉండేది. ఇప్పుడు నరకం గురించి ఎలాంటి ఫిర్యాదులు లేవు. మేం అంతా ఇక్కడ పారదర్శకంగా ఉండేలా చూస్తున్నాం. పైగా సరదాగా గడపగలిగేలా చేయడానికి ప్రయత్నిస్తున్నాం" అంది పెద్ద దయ్యం.

"అవును. ఎంతోకొంత మానవీయంగా కరుణాత్మకంగా ఉంది" స్మిత్ ఒప్పుకున్నాడు.

"మేం నరకాన్ని పూర్తిగా ఆధునికీకరించాం. పూర్తిగా పునర్నిర్మించాం."

"అవును. కాలంతో పాటు మనం కూడా మారాలి" స్మిత్ అన్నాడు.

"అవునవును. ఈ రోజుల్లో బాధపడేది ఒక్క ఆత్మ మాత్రమే" దయ్యం చెప్పింది.

"దానికి దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి" ఆమె అంది.

దయ్యం వాళ్ళని మర్యాదగా లిఫ్టువరకు వెంటబెట్టుకెళ్ళింది.

"మీరు మళ్ళీ ఎప్పుడైనా రావచ్చు. మీకు స్వాగతం" అంటూ లిఫ్టు తలుపు మూసింది. లిఫ్టు పైకి వెళ్ళడం మొదలుపెట్టింది.

"అమ్మయ్య. మొత్తానికి అదంతా అయిపోయింది" ఇద్దరూ ఒక్కసారిగా తేలికగా నిట్టూర్చి ఒకళ్ళనొకళ్ళు పట్టుకుని సీటులో కూర్చున్నారు.

"నువ్వు లేకపోతే ఇదంతా నా వల్ల అయ్యేది కాదు" ఆమె గుసగుసలా అంది. అతడు ఆమెను తనవైపు లాక్కున్నాడు. ఇద్దరూ చాలాసేపు ముద్దాడుతూ ఉండిపోయారు.

"ఆశ్చర్యం. చూశావా అతనేం చేశాడో! నేను ఇప్పటికీ నమ్మలేకుండా ఉన్నాను. అతను ఎప్పుడూ మూర్ఖంగా ఇలాంటి పనులే చేస్తుంటాడు. విషయాల్ని తేలికగా సహజంగా తీసుకోవడం అతనికి ఎప్పుడూ తెలీదు. దేన్నీ యథాతథంగా అంగీకరించడు. ప్రతిసారీ అన్నీ ఏదో జీవన్మరణ సమస్య అన్నట్టు చూస్తాడు" అతని కౌగిలినుంచీ బైటపడి ఊపిరి పీలుస్తూ ఆమె అంది.

"అవును. ఇదంతా చాలా అసందర్భంగా ఉంది" స్మిత్ అన్నాడు.

"అతను నాతో స్పష్టంగా చెప్పొచ్చు కదా! అప్పుడు నేను ఇంట్లో ఉండిపోయేదాన్ని. ఆ రోజుకు బదులుగా అప్పుడు మనం ఇంకోరోజు సాయంత్రం బైటకు వెళ్ళి ఉండేవాళ్ళం".

"అవును. అంతేకదా" స్మిత్ అన్నాడు.

"ఇంకచాలు డార్లింగ్. ఇంక దాని గురించి మనం ఆలోచిస్తూ కూర్చోవడం అనవసరం" ఆమె అతని మెడచుట్టూ చేతులు వేస్తూ గుసగుసలాడింది.

"ఇంక అదంతా అయిపోయింది" ఆమె అంది.

"అవును ప్రియా. అదంతా ముగిసిపోయింది" స్మిత్ ఆమెను చేతుల్లోకి తీసుకున్నాడు. లిఫ్టు పైకి వచ్చింది.

అనువాదం: జి.లక్ష్మి, e-mail: guttalakshmi62@gmail.com

తొక్కే కదా అని తీసిపారేయకండి!



సాధారణంగా కొన్నిపండ్లను తొక్కలతోనే తినేస్తుంటాం. మరికొన్నింటిని తొక్కతీసే తింటాం. కొన్నిపండ్ల తొక్కలు టేస్టీగా ఉన్నప్పటికీ వాటిని తినాలంటే ఇష్టం ఉండదు. ఎందుకంటే అవి వగరుగా, రుచి లేకుండా ఉంటాయి. అయితే కొన్ని రకాల పండ్ల తొక్కల్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో పడేయకుండా తినాలని సూచిస్తున్నారు ఆహార నిపుణులు.

పండ్లు పోషకాలయాలు. వాటిలో అనేక రకాల హెల్త్, బ్యూటీ ఉపయోగాలు ఇమిడి ఉంటాయి. అయితే పండ్ల పోషకాల గురించి అందరికీ తెలిసిన విషయమే కానీ పండ్ల తొక్కలలో కూడా ఆరోగ్య ప్రయోజనాలతో పాటు కొన్ని రకాల వ్యాధులను నయం చేసే సత్తా ఉందట. అందుకే ఏ పండు తొక్కలో ఏముందో తెలుసుకుందాం. ఏ పండు తొక్క తినడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు నివారించవచ్చో తెలుసుకుంటే ఇకపై తొక్కను నిర్లక్ష్యం చేయకుండా ఆరగించేస్తారు. మరి ఆ విశేషాలేంటో చూసేద్దామా...

నారింజ

బరువు తగ్గడానికి నారింజతొక్క సరైన పరిష్కారం. అలాగే ఇది న్యాచురల్ స్క్రబ్‌గా, బ్లీచింగ్ చర్మంపై పనిచేస్తుంది. అలాగే ఈ పండు తొక్క ఆరోగ్యానికి, కడుపునొప్పి నివారించడానికి, శ్వాస సంబంధమైన సమస్యలకు, ఎసిడిటీ నుంచి ఉపశమనం కలిగించడానికి కూడా ఉపయోగపడుతుంది. అలాగే ఆరెంజ్ పీల్స్ క్యాన్సర్ రిస్క్ తగ్గించడంతో పాటు గుండె సంబంధింత వ్యాధులనూ నివారిస్తాయి.

దానిమ్మ

చూడగానే తినాలనిపించే దానిమ్మ గింజల్లోనే కాదు తొక్కలో కూడా ఆరోగ్య రహస్యాలు ఉన్నాయి. దానిమ్మ తొక్క మొటిమలు, జుట్టు రాలడం, రాషెస్, చుండ్రు నివారించడంలో ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. అలాగే హార్ట్ డిసీజ్, గొంతు నొప్పి నివారించడంలో దానిమ్మ తొక్క సహాయపడుతుంది. అలాగే ఎముకల ఆరోగ్యానికి, పళ్ల పరిశుభ్రతకి ఉపయోగపడుతుంది.

అరటి

అరటి తొక్క లోపలి భాగంతో పంటిపై రుద్దడం వల్ల పళ్లు న్యాచురల్‌గా తెల్లగా మారుతాయి. అలాగే అరటి తొక్కను కాలిన చర్మంపై పెట్టడం వల్ల ఉపశమనం కలిగిస్తుంది. అలాగే పగిలిన పాదాలపై అరటి తొక్కతో రబ్ చేయడం వల్ల వారం రోజుల్లో అమోఘమైన ఫలితాలు కనిపిస్తాయి.

దోసకాయ

చాలా సందర్భాల్లో దోసకాయ తొక్కలను పడేస్తుంటాం. లోపల ఉండే పదార్థంలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని భావిస్తాం కానీ తొక్కలోనే తక్కువ క్యాలరీలు ఉండడం వల్ల బరువు తగ్గిస్తుంది, అలాగే కడుపునొప్పిని నివారిస్తుంది. దోసకాయ తొక్కలో బీటా కెరోటిన్, విటమిన్ ఏ, విటమిన్ కే ఉండడం వల్ల ఎముకల ఆరోగ్యానికి బ్లడ్ క్లాట్స్ నివారించడానికి, కంటి చూపు మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుంది.

యాపిల్

యాపిల్ తినడం వల్ల ఇన్ఫెక్షన్లు నివారించవచ్చు. అయితే యాపిల్ తొక్క తినడం వల్ల ఫ్లేవనాయిడ్స్, కెమికల్స్ క్యాన్సర్ సెల్స్‌ని నాశనం చేస్తాయి. ఇమ్యునిటీ పెంచుతుంది. యాపిల్ పీల్‌లో ఒబెసిటీ తగ్గించే గుణం ఉంది.

నిమ్మ

నిమ్మ తొక్కలో అనేక బ్యూటీ బెనిఫిట్స్ ఉన్నాయని తెలుసు. అలాగే ఇది చర్మంపై న్యాచురల్ మాయిశ్చరైజర్ క్లెన్సర్‌లా పని చేస్తుంది. అలాగే ఈ తొక్కలు బరువు తగ్గడానికి, పంటి సమస్యలు నివారించడానికి ఉపయోగపడతాయి. ఎముకల ఆరోగ్యానికి మంచిది. క్యాన్సర్‌తో పోరాడే గుణాలు యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. టాక్సిన్స్ బయటకి పంపి ఒత్తిడిని తగ్గిస్తాయి.

పుచ్చకాయ

పుచ్చకాయ తొక్కలో ఉండే తెల్లటి భాగంలో అనేక పోషకాలు ఉంటాయి. అవి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఈ పీల్‌ను చర్మంపై రుద్దడం వల్ల చర్మంపై పేరుకున్న డస్ట్ తొలగిపోతుంది. అలాగే చర్మం డ్యామేజ్‌కి లోనవకుండా అరికడుతుంది.

-సంతోషి

భయాన్ని కన్నెత్తి ప్రశ్నించు

"భయాలన్నిటికీ కారణం అభద్రతా భావమే. దీనిని ఆదిలోనే తుంచెయ్యకపోతే నీ వ్యక్తిగత ప్రపంచమంతా భయంతో నిండి పోతుంది. అది విజయం వైపు నిన్ను కన్నెత్తి చూడకుండా చేస్తుంది".

అనారోగ్యం కన్నా భయమే ఎక్కువ బాధిస్తుంది.

"భయం" ఎప్పుడూ ఒంటరిగా రాదు. మనం ఊహించుకునే దాన్ని బట్టే ఉంటుంది. నిష్కారణ భయమంటూ ఏదీ ఉండదు. తెలిసిన దాని గురించో, తెలియని దాని గురించో, ఎవరో ఒకరు చేసిన దాని గురించో, చెయ్యబోయే దాని గురించో భయం ఆవిర్భవిస్తుంది.

"విజయాన్ని కాంక్షిస్తే... అపజయ భయం, వ్యాపారం మొదలుపెట్టాలంటే లాభనష్టాల భయం.. ఇలా ఉన్న స్థితికి, ఉండాలనుకున్న స్థితికి మధ్య భయం ప్రవేశిస్తుంది.

"గ్రీకు తత్వవేత్త సోక్రటీస్‌పై అనేకానేక అభియోగాలు మోపి, ఐదొందల మంది న్యాయనిర్ణేతల ముందు నిలబెట్టారు. సోక్రటీస్ తన వాదాన్ని విన్పించాడు. అయినా ఆయనకి ఉరిశిక్ష విధించారు. సోక్రటీస్‌కి ఆ శిక్ష నుండి బయట పడటానికి అనేక మార్గాలున్నాయి. కానీ వాటిని సోక్రటీస్ అంగీకరించలేదు. నేను నా జీవితంలో నీతి, నియమాలకు, ఆదర్శాలకు కట్టుబడి ఉన్నాను. శిక్ష నుండి తప్పించుకోవడానికి వాటిని నేను ఉల్లంఘించలేను. వాటిముందు నా ప్రాణం విలువైంది కాదు. ఇప్పుడు నేనీ ఉరిశిక్ష నుండి తప్పించుకున్నా, శాశ్వతంగా మరణం నుండి తప్పించుకోలేను" అని సంతోషంగా నవ్వుతూ విషం తాగి, మృత్యువుపై తన విజయాన్ని చాటాడు.

మరణ భయాన్ని మించింది మరొకటిలేదు. దానిముందు మనిషికి నిత్యం ఎదురయ్యే భయాలే పాటివో ఆలోచించండి.

భయాల్లో రకాలు

భయం రెండు రకాలు

శాశ్వత భయాలు

మనం తప్పించుకోలేని భయాలివి. మన చేతుల్లో, చేతల్లో లేనివి. బాల్యం, యవ్వనం, కౌమార, వార్ధక్యం వంటి శారీరక మార్పుల్ని ఆపటం ఎవరి తరం కాదు. మనకి ఆనందాన్నిచ్చే యవ్వనస్థితిలోనే కడదాకా కొనసాగాలనుకోవటం అసాధ్యం. కురులు తెల్లబడటం ఆపలేని ప్రక్రియ. భయపడి నల్లరంగు వేసినా అది వృథా వెంపర్లాట. శారీరక మార్పులూ పరిష్కారం లేనివి.

వార్ధక్యంలో మరణభయం మొదలవుతుంది. ఏ క్షణాన ఏమైపోతామో అనే భయం వెంటాడుతుంది. దీన్నుంచి బయటపడాలంటే.. మనసుని, హృదయాన్ని నిత్యయవ్వనంగా ఉంచుకోవాలి.

అవరోధాల్ని, కష్టాల్ని యవ్వనంలో ఎంత ధైర్యంగా ఎదుర్కోగలమో అదే ప్రవృత్తిని అలవర్చుకుంటే 'మరణం' ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియనే తెలియదు.

రమణ మహర్షి

బాల్యంలో 16 ఏళ్ళ ప్రాయంలో జీవించి ఉండగానే మరణానుభవం పొంది, ఆ భయం నుండి శాశ్వతంగా బయటపడి, తన మౌనం ద్వారా ప్రపంచాన్నే తనవైపు చూసేలా చేసుకున్న మహోన్నత వ్యక్తి భగవాన్ శ్రీరమణ మహర్షి.

భయాన్ని పుట్టించేది మనసే.
దాన్ని జయించటమే విజయం.

తాత్కాలిక భయాలు

మనిషి పరిష్కరించుకోగలిగిన భయాలివి. అనారోగ్యం, పేదరికం, అపజయం, ఇవన్నీ ధైర్యంతో ఒక్క అడుగు ముందుకు వెయ్యగలిగితే అధిగమించగలుగుతాం.

'భయం' అనేది ఒక్కటే. అది మౌలిక భయం. దీన్లోంచి వచ్చిన చిన్న చిన్న భయాలే తక్కినవన్నీ. మరణంలో ఉన్నా, ప్రేమలో ఉన్నా తనని తాను కోల్పోతానన్న భయం ఒక్కటే. తమని తాము కోల్పోతామని భయపడే వాళ్ళకు సొంత ఆలోచన, సాహసం, ధైర్యం ఉండవు. అవి ఉన్న వాళ్ళకు భయం ఉండదు. ఇలా భయం లేని వారిని ధైర్యం జయించి విజేతల్ని చేస్తుంది.

తాత్కాలిక భయాలెప్పుడూ పడి లేచే కడలి కెరటాల్లాంటివి. భయపడితే వెంటబడతాయి. ఎదురు తిరిగితే పారిపోతాయి.

భయానికి కారణాలు

మనిషి ఎప్పుడూ తనవద్ద లేనిదాన్ని గురించే ఆలోచిస్తాడు. భయపడతాడు. ఉద్యోగం వస్తుందో రాదో, ఇతరులు ఏమనుకుంటున్నారో, ఆధిపత్య భయం, అనారోగ్య భయం, ప్రేమ భయం. దేవుడు, దయ్యం అంటే భయం, ఆఖరుకి తన నీడని చూసినా భయమే. మనిషి ఆలోచనలకు, ఆచరణకు ఇలా రకరకాల భయాలు అవరోధాలుగా మారుతున్నాయి.

విజయ విలాసం

స్టెప్స్ టు సక్సెస్ 24

-ఎం. వెంకటేశ్వరరావు, సెల్: 90307 07037

హేట్సాఫ్

ఏ రంగంలోనైనా ఎదురు దెబ్బలకు సిద్ధపడి తొలి అడుగెయ్యాలి. నిర్ణయించుకున్నాక వెనక్కి తగ్గకండి. సవాళ్లను చూడాలంటే ఆ ప్రయాణాన్ని దగ్గరగా గమనించాలి. యవ్వనంలో అత్యాచారం; కొన్నాళ్ళు జైలుశిక్ష, తదుపరి భౌతిక దాడులు, హత్యాయత్నాలు.. వీటన్నింటిని భరించింది. ధైర్యంగా ఎదిరించింది. జయించింది. అంతర్జాతీయ అవార్డులు అందుకున్నా, తాజాగా పద్మశ్రీ అవార్డు పొందినా.. అవేమీ తాను "రక్షించిన" అమ్మాయిల చిరునవ్వుకు సరితూగవు అంటారామె.

సామాజిక అడ్డుగోడలను బద్దలుగొట్టి 'ప్రజ్వల' పేరుతో వేలమందికి ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తున్నారు. ఆమే పద్మశ్రీ డాక్టర్ సునీతాకృష్ణన్.

బాల్యం నుండే పొరుగువారికోసం పాటుబడాలన్న తపన. 'మదర్ థెరిస్సా'లా అవుతావా! అంటే.." లేదు సునీతాకృష్ణన్నే" అవుతానని చెప్పిన ధైర్యశాలి. పదిహేనేళ్ళ వయసుకే చిన్నపాటి సంఘ సేవకురాలై మురికివాడల్లో పిల్లలకి చదువు చెప్పి మోటివేట్ చేస్తుంటే.. అది నచ్చక ఎనిమిది మంది మగాళ్ళు ఆమెపై దాడి, అత్యాచారం చేశారు.

ఆ సంఘటనతో మానసికంగా దెబ్బతిన్నా, భయాన్ని దరి చేరనీయకుండా స్వయం సంపాదనతో పి.జి. వరకు చదువుకుందామె. బెంగుళూరులో మిస్‌వరల్డ్ పోటీలకు వ్యతిరేకంగా పోరాడినందుకు రెండు నెలల జైలు శిక్ష, తల్లిదండ్రులు-తోబుట్టువుల నిరాదరణ కుంగదీసినా భయపడలేదు. తర్వాత హైదరాబాద్ వచ్చి... ఆకలి కష్టాలనుభవించిందామె. ఆ సమయంలోనే వేశ్యావాటికల మీద పోలీసులు దాడులు చేసి, వారిని నిరాశ్రితులను చేశారు. వారి అభీష్టం మేరకు మరో సామాజికవేత్తతో కలిసి బాధిత మహిళల పిల్లల కోసం ఓ స్కూలు ఆరంభించారు. ఆ సంస్థే 'ప్రజ్వల'. మహిళల అక్రమ రవాణా అరికట్టడం, వేశ్యావృత్తి చెరనుండి స్త్రీ విముక్తి, వారి పిల్లల చదువు... ఈ క్రమంలో 18,600 మంది స్త్రీలను రక్షించిందామె. వెయ్యి మందికి పెళ్ళిళ్ళు చేశారు.

18 స్కూళ్ళు పెట్టి 8000 మందిని చదివిస్తున్నారు. అయినా ఆమెపై అడపాదడపా దాడులే. ఒకసారి యాసిడ్ దాడికి వచ్చిన వ్యక్తి కాలుజారి పడ్డాడు. ఆమెకోసం తెచ్చిన యాసిడ్ అతని మీదే పడి ఒళ్ళు కాలింది. అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించారామె. భయంలేని లక్ష్యం, అలుపెరుగని పయనం. భర్త రాజేష్ టచ్ రివర్... సహకారంతో 'నా బంగారు తల్లి' వంటి సినిమా తీసి మూడు జాతీయ అవార్డులు గెలుచుకున్న మహిళామణి సునీతా కృష్ణన్.

భయస్థులకు రెండ్రోజుల ముందు నుండే ఇంటర్వ్యూ భయం మొదలవుతుంది. ఎన్ని వేల మంది వస్తారో, ఏం ప్రశ్నలడుగుతారో, ఉద్యోగం వస్తుందో రాదో వంటి భయాలు మన ధైర్యాన్ని నిర్వీర్యం చేస్తాయి. ఓ వైపు ప్రిపేరవుతూనే, మరో వైపు మర్చిపోతుంటాం. ఇంటర్వ్యూ హాల్లో అడుగు పెట్టేవరకు భయం, టెన్షన్. ఒక్కసారి అద్దం ముందు నిలబడి మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. మన సంతోష సమయాల్ని, అప్పటి మన మానసిక పరిస్థితినీ, బాడీ లాంగ్వేజీనీ జ్ఞప్తికి తెచ్చుకోవాలి. భయంతో నిండిన ప్రస్తుత మానసిక స్థితికీ, దానికీ మధ్య గల పలుచని తేడా గమనించాలి. దానిని చెరిపేసి అడుగుముందుకు వెయ్యటమే ధైర్యం.. అదే విజయం.

భయాన్ని అర్థం చేసుకో

భయం అంటే ఏమిటో తెలుసా? పసితనంలోనే మొదలై జీవితాంతం కొనసాగుతుంది. శాశ్వత భయాలు, తాత్కాలిక భయాలు అనుక్షణం వెంబడిస్తాయి. భయపడే మనసు విధేయతగా ఉంటుంది. అనగా స్వేచ్ఛని కోల్పోతుంది. క్రమంగా జీవితాన్ని యాంత్రికంగా మార్చేస్తుందీ భయం. దీన్ని అర్థం చేసుకుని స్వతంత్రించి ముందడుగు వెయ్యడమే విజయం.

బైటపడే ప్రయత్నం

ఏయే అంశాలవల్ల మీరు భయపడుతున్నారో గమనించండి. భయం ఏ రూపంలో ఉన్నా చూసి పారిపోకుండా ఆగి, పరిశీలించండి. ప్రశ్నించండి. ఆ భయం ఏమిటో, ఎలాంటిదో, ఎక్కణ్నుంచి వస్తోందో తెల్సుకునే ప్రయత్నం చెయ్యండి. అది నష్టం కల్గిస్తోందా? అపాయం చేస్తోందా? ఆలోచించండి. దాన్నుండి ఎలా బైట పడాలో ఆలోచించండి.

లేనిది ఉన్నట్టు భ్రమ కల్గించే స్థితే "భయం". చీకట్లో తాడుని పాము అని భ్రమపడతాం. ఆ క్షణంలో మనకి అది పాము. కానీ దగ్గరకెళ్ళి చూసిన వారికే అది 'తాడు' అని తెలుస్తుంది. సో... భయాన్నుండి బయటపడ్డ వారిదే విజయం.

ఒకసారి ఓ వ్యక్తిత్వవికాస నిపుణుడు విమానంలో ఢిల్లీ వెళ్తున్నాడు. ఆయన పక్క సీట్లో యాభైపైబడిన స్త్రీ. సీటు హ్యాండిల్స్ గట్టిగా పట్టుకుని, కళ్ళు మూసుకుని వణుకుతోంది. ఆ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆమెకు తనను పరిచయం చేసుకుని,

"మీరు దేన్ని గురించి భయపడుతున్నారు?" అన్నాడు.

"ఈ విమానం కొద్ది సేపట్లో బూడిదైపోబోతోంది" అంది.

"మీరు ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నారు?" అన్నాడు నిపుణుడు కూల్‌గా.

"నా గ్రాండ్ చిల్డ్రన్‌తో జాలీగా గడిపేందుకు వెళ్తున్నాను. వాళ్ళతో కలిసి మరోసారి తాజ్ మహల్ చూడాలనుకుంటున్నాను" అందామె.

"వండర్‌ఫుల్. ఒక్కసారి జ్ఞాపకం చేసుకోండి.

యమునా నది, సూర్యకిరణాలు, పాలరాతి తాజ్ మహల్, అందమైన గార్డెన్స్... వాటి ముందు మీరు మీ గ్రాండ్ చిల్డ్రన్ మధ్య కేరింతలు కొడుతూ... పెళ్ళయిన కొత్తల్లో తాజ్‌మహల్ చూసిన అనుభూతులు నెమరువేసుకుంటూ".....

"ఓ! అద్భుతం. నా కళ్ళకి తాజ్‌మహల్ ఇంకా అందంగా కన్పిస్తోంది. నా భర్త, నేను తాజ్ మహల్ ముందు తీయించుకున్న ఫోటో.. గుర్తొస్తోంది" చెప్పుకుపోతోందామె.

ఇప్పుడామె రిలాక్సయింది. ఆమె సీటు హ్యాండిల్ వదిలేసింది. ఇప్పుడు ఆమె మొహంలో భయం మాయమైంది. అందువల్ల భయం స్థానంలో ఆహ్లాదకర అంశాన్ని మన మెదడులో ప్రవేశపెట్టాలి. అది భయాన్ని బలహీనపరచి విజయాన్నందిస్తుంది.

•••

**"నీ గురించిన నీ చింతే నీలో భయం.
సాహసించి ముందుకు సాగడమే "విజయం".**

-పాలోకోయిలో

(ఇంకావుంది)

ఆ ఒక్కటీ వదిలేస్తే...

- జీవిత సమస్యలలో భయం ఒకటి. అది మన కాలాన్ని హరిస్తుంది.
- భయం ఒక భావన మాత్రమే. ఏ పని చేపట్టినా ఫలితాన్ని పక్కనపెట్టి ఆలోచించండి.
- పిరికివాడి ఆయుధం భయం.
- భయం అజ్ఞానం నుండే పుడుతుంది.
- భయం, న్యూనతా భావన విడనాడితే అంతర్గతశక్తి మనల్ని మహోన్నతులుగా మార్చి విజేతల్ని చేస్తుంది.
- ధైర్యవంతుడు గులాబీపువ్వుని చూస్తే, పిరికివాడు దాని కింద ముల్లు చూస్తాడు.

శ్రీకర్‌కి దగ్గరగా ఉండి...దూరమవుతున్నానా?

ఆమె మెదడు లోపల ఆలోచనల తరంగాలు అటూ ఇటూ పరిగెడుతున్నాయి.

అమ్మ గుర్తొచ్చింది ఆమెకు. సమంత తల్లి సునంద తనని పెంచడానికి పడ్డ కష్టాలు గుర్తొచ్చాయి ఆమెకు. తండ్రి తాగుబోతు, తిరుగుబోతు. ఉన్న ఆస్తి వ్యసనాలకు హారతి కర్పూరమైపోతే తల్లిని తాతయ్యే ఆదుకునేవాడు. నెలవారీ పచారి సామాన్లు, ఇంటి అద్దె ఇచ్చేవాడు.

తల్లి చిన్నపాటి కుట్టు మిషన్ ద్వారా సంపాదించిన డబ్బు తన కోసం దాచేది.

తండ్రి ఏ తెల్లవారుజామునో వచ్చి అమ్మ దాచుకున్న డబ్బులు తీసుకెళ్ళేవాడు.

డబ్బు విలువ చిన్నప్పుడే తెలిసిందామెకు. అందుకే కష్టపడి చదివింది. హైస్కూల్ చదువులో మెరిట్ సాధించడంతో ఒక కార్పొరేట్ కళాశాల ఇంటర్ ఫ్రీ ఎడ్యుకేషన్ ఇచ్చింది.

పెద్దగా కష్టపడకుండానే ఇంజనీరింగ్ సీటు... తర్వాత సత్యం కంప్యూటర్స్‌లో ఉద్యోగం సంపాదించింది. శ్రీకర్ అక్కడే పరిచయం ఆమెకు.

ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా ఉండేవాడు. తన అందం, సిన్సియారిటీ అతన్ని తక్కువ కాలంలో ఆకర్షింపచేసింది. ఆ తర్వాతే ఈమెయిల్ ప్రహసనం నడిచింది.

అప్పటికే సమంత వివాహ వ్యవస్థపై ఒక అభిప్రాయానికి వచ్చేసి ఉంది.

మగాడికి బానిసగా పడి ఉండడానికి కారణమవుతున్న తాళికి మాత్రం దూరంగా ఉండాలన్న కృత నిశ్చయానికి వచ్చేసింది.

అందుకే ఆమె స్వరంలో మగాళ్ళ పట్ల తృణీకార భావం, నిర్లక్ష్యం కన్పిస్తూ ఉంటుంది.

'ఆడపిల్లకు అణకువ ఉండాలమ్మా..' తల్లి మాటలు తరచూ గుర్తొస్తూనే ఉంటాయి.

"అణకువ నీకేం మిగిల్చిందమ్మా..." అడగాలనుకొని ఒకసారి అడిగేసింది.

"అణకువ ఆడపిల్లకు భూషణమే తల్లీ...ఇక నా విషయమంటావా? పుణ్యం కొద్దీ పురుషుడు అంటారు. దానం కొద్దీ బిడ్డలు అంటారు. నేను చేసిన పూజలు దేవుడికి సరిగ్గా చేరాయో లేదో...మీ నాన్న నాకు భర్తయ్యాడు. కానీ భగవంతుడు ఎంతో కొంత దయ ఉంచి ఏ జన్మలోనో నేను చేసిన మంచి వల్ల ఆణి ముత్యంలాంటి నిన్ను బిడ్డగా ఇచ్చాడు" కూతురిని పొదివి పట్టుకొని అనేది.

తల్లి ఒడిలో తల పెట్టుకొని ఏడుస్తూ పడుకున్న రాత్రుల్ని సమంత మర్చిపోలేదు.

•••

శ్రీకర్ ఇన్ఫోసిస్‌లోకి మారిన తర్వాత కంపెనీ కారు, కంపెనీ ఫ్లాట్ లభ్యమైనప్పటికీ, అతడికి మనశ్శాంతి మాత్రం కరువైంది. 'సత్యం'లో సమంత దర్శనంతో అతడి రక్తనాళాల్లో, మెదడు పొరల్లో ఏదో సంచలనం కలిగేది. ఆమెని చూస్తూ ఎంత పనైనా సునాయాసంగా చేసేవాడు. ఇన్ఫోసిస్‌లో యాంత్రికత పెరిగిపోయింది. క్రియేటివిటీ స్థానంలో నిరాసక్తత పెరిగిపోయింది.

వారం పొడుగునా సమంత కోసం ఎదురు చూడడం, వారం తర్వాత ఆమెని కలవడానికి వెళ్ళడం జరుగుతోంది. సమంత సన్నిధిలో స్వేచ్ఛగా వ్యవహరించలేకపోతున్నాడు. తానేమైనా మాట్లాడితే తను హర్టవుతుందేమో... హర్ట్ అయితే దూరమవుతుందేమో అన్న ఆందోళన అతడిలో పెరిగిపోతోంది. సత్యంలో ఉన్నప్పుడు తనతో ఏ రోజూ సమంత బయటకు రాకపోయినా, ఏదో హాయి కన్పిస్తూ ఉండేది. ఎప్పుడు చూడాలనుకుంటే అప్పుడు చూసేవాడు. ఇప్పుడు ఫోన్ చేయాలన్నా ఆఫీసు సమయం మధ్యలో సమంత ఫోన్ తీయదు. ఒకవేళ ల్యాండ్ లైన్‌కి ప్రయత్నిస్తే...

"శ్రీకర్ ఆఫీసు సమయం వృథా చేయకండి. అది మీకూ నాకూ ఇద్దరికీ మంచిదికాదు" అనేది.

తాను జీవితం పంచుకోవాలని తపన పడుతున్న ఆడపిల్ల పులిపిల్లగా కన్పిస్తే ఏం చేయాలో తోచక తల్లడిల్లేవాడు. తాళి ద్వారా స్త్రీపై హక్కు ఇందుకే సాధిస్తారని అర్థమైంది. నిజానికి స్త్రీ పురుషుల సంబంధం పసుపు తాడుతోనో, చట్టాలతోనో ముడిపడింది కాదు.

అది నూరు శాతం మనసుకు సంబంధించింది.

తనకి తెలిసినంత వరకు సమంత ఏ మగాణ్ణీ కూడా తనంత దగ్గరగా రానివ్వలేదు. తన పైన ఎంతో కొంత పాజిటివ్ కార్నర్ ఉండడం వల్లే బహుశా అది సాధ్యమయింది.

మగాణ్ణి హద్దులో పెట్టడం ఆమెకు బాగా తెలుసు. తాను కూడా ప్రేమ పేరుతో వ్యవహారం నడిపి ఉంటే ఎలా స్పందించేదో కానీ నేరుగా ఈ-మెయిల్‌లో మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. అందుకే ఈ మాత్రం స్నేహమైనా మిగిలింది.

శ్రీకర్ ఆలోచనల్లో ఉండగానే అతడి సెల్‌ఫోన్ మోగింది.

అవతలి వైపు సమంత.

"శ్రీకర్, ఒకసారి ఆఫీసుకు రాగలవా?" అడిగింది.

వాస్తవానికి ఆరోజు సాయంత్రం తాను కొత్తగా తయారు చేస్తున్న ప్రాజెక్టు రిపోర్టు ఫైనల్‌గా చెకప్ చేసి యుఎస్‌కి పంపాలి. కానీ అవేవీ అతడు ఆలోచించలేదు. సమంత ఫోన్ అతడి హృదయ సవ్వడిని పెంచింది.

గంట వ్యవధిలో సమంత ఆఫీస్‌కు చేరుకున్నాడు శ్రీకర్.

శ్రీకర్ కోసమే ఎదురు చూస్తున్నట్టు ఉంది సమంత.

"శ్రీకర్, సారీ! మిమ్మల్ని ఇబ్బందిపెట్టానేమో. అమ్మకు ఆరోగ్యం బాగోలేదట. మావయ్య ఫోన్ చేశారు. నన్ను కొంచెం రైల్వే స్టేషన్‌లో డ్రాప్ చేయగలవా.." అడిగింది.

"ఓ...ష్యూర్...డోంట్ వర్రీ..." చెప్పాడు.

సమంత కళ్ళలో సన్నటి నీటి పొర.

కేవలం రైల్వే స్టేషన్‌లో డ్రాప్ కోసం మాత్రమే సమంత పిలవలేదని అర్థమవుతోందతడికి. తన నుండి ధైర్యమో, ఓదార్పో కోరుతోంది.

మరిక ఆలోచించలేదు శ్రీకర్.

చప్పున సమంత చేతులు పట్టుకుని "వర్రీ కాకు. అమ్మకు ఏమీ కాదు" అన్నాడు.

"థాంక్యూ శ్రీకర్" అంది.

సమీర కూడా వస్తానంది.

జరిగిన కథ

సమంత, శ్రీకర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అతడామెకు ప్రపోజ్ చేస్తాడు. మరో కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్ ఆఫర్ వదులుకోకుండా వెళ్ళి జాయిన్ అయితే స్నేహం చేస్తానని సమంత విధించిన షరతును అతడు అంగీకరిస్తాడు. రొమాన్స్ లేని స్నేహం ఎలా సాధ్యమని సమంతను స్నేహితురాలు సమీర నిలదీస్తుంది. ప్రేమ, పెళ్ళి వ్యవస్థ మీద తనకు నమ్మకం లేదనీ, శ్రీకర్‌పై తనకు ఎలాంటి ఫీలింగ్స్ లేవనీ చెబుతుంది సమంత. ఆ తర్వాత......

సమంత "వద్దులేవే. శ్రీకర్ ఉన్నాడు కదా" అంది.

మామూలుగా అయితే ఇద్దరిలో ఎవరు ఊరెళ్ళినా రెండో వ్యక్తి సెండాఫ్ ఇవ్వడం అలవాటు. కానీ ఈ సారి తన ప్లేస్‌లోకి శ్రీకర్ రావడం సమీర గమనించకపోలేదు. జాగ్రత్తగా పరిశీలిస్తే సమంత, శ్రీకర్ సాన్నిహిత్యం కోరుతోంది. కానీ దానికి స్పష్టమైన రూపం రాలేదని అర్థమైంది సమీరకు.

కాచీగూడ రైల్వే స్టేషన్ ఆవరణలో శ్రీకర్ కారు ఆగింది.

కారు పార్కింగ్ చేసి ఇద్దరూ స్టేషన్‌లోకి వెళ్ళారు. సమంత చేతిలో బ్యాగ్ తను తీసుకోవడానికి చేయి ముందుకు చాపితే ఇవ్వడానికి సమంత నిరాకరించింది. "పెద్దగా బరువు లేదులే శ్రీకర్" అంది.

"అమ్మకు నయమయ్యే వరకూ నాలుగు రోజులు ఉండండి. అవసరమైతే మీ ప్రాజెక్టు మేనేజర్ కర్కరేతో నే చెబుతా" చెప్పాడు.

"థాంక్యూ శ్రీకర్. నే వెళ్ళి పరిస్థితిని బట్టి ఆఫీస్‌కి మెసేజ్ చేస్తాను" చెప్పింది.

"మరి డ్రెస్‌లు సరిపోతాయా?" అడిగాడు.

"ఇంటి దగ్గర నా శారీస్ చాలా ఉన్నాయ్" చెప్పింది.

"డిప్రెస్ కాకు సమంతా..." చెప్పాడు.

శ్రీకర్ వైపు ఒక నిమిషం అభిమానంగా చూసింది.

స్టేషన్ అంతా కోలాహలంగా ఉంది.

గుంటూరుకు వెళ్ళే నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ మరో పది నిమిషాల్లో రానుందన్న అనౌన్స్‌మెంట్ వినిపించింది. "వన్ మినిట్" అని వెళ్ళి ఒక వాటర్ బాటిల్, రెండు బిస్కెట్ పాకెట్స్, రెండు మ్యాగజైన్స్ తెచ్చాడు.

"అయ్యో... ఇవన్నీ ఎందుకు శ్రీకర్? నేను ట్రైన్‌లో తీసుకునేదాన్ని కదా?" అంది.

"పర్వాలేదు" అన్నాడు.

సమంత నుదుటిపై స్వేద బిందువులు చేరుకుంటున్నాయి.

సమంత నెర్వస్‌గా ఫీలవుతోందని అర్థమైంది శ్రీకర్‌కి.

"ఈ రోజుల్లో మెడిసిన్ చాలా అడ్వాన్స్ అయింది. ఏ జబ్బు వచ్చినా నయం చేసుకోవచ్చు..." సమంతకి ధైర్యం చెప్పే ప్రయత్నం చేశాడు.

శ్రీకర్ కళ్ళల్లోకి సూటిగా చూసింది..."నిజమే కదా?" అన్నట్టు.

రైలు వచ్చే సమయం దగ్గర పడే కొద్దీ ఆమెలో టెన్షన్ పెరిగి, "అమ్మకి ఏమీ కాదు కదా" అంది. ఆమె స్వరంలో ఆదుర్దా కన్పిస్తోంది.

"డోంట్ వర్రీ సమంతా..ఏం కాదు..." చెప్పాడు.

సమంతలో కదలాడే ఆందోళన చూస్తుంటే అతడికి ప్రాణం పోయినంత పనవుతోంది. రైలు స్టేషన్‌లో వచ్చి ఆగింది.

"నీకు కాస్త ధైర్యంగా ఉంటుందేమో, నేనూ రానా?" అడిగాడు శ్రీకర్.

తల్లికి ఆరోగ్యం బాగోలేదని కబురు రావడంతో ఊరు బయలుదేరింది సమంత. శ్రీకర్‌ని స్టేషన్‌కి రమ్మని అడిగింది. అలా అడిగినందుకే తెగ సంతోషించాడు శ్రీకర్. కానీ సమంత ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి. తల్లి గురించే ఆమె ఆలోచిస్తోంది. బాల్యం నుండి తల్లి పడిన కష్టాలు చూశాక పెళ్ళి, తాళి అంటే వ్యతిరేకత పుట్టింది సమంతకు. అంత విరక్తి కలగడానికి ఏంటి కారణం?

"పర్వాలేదు. అక్కడ మావయ్య ఉన్నాడు. ఆయన సాయం తీసుకుంటాను" చెప్పింది.

రైలు కదిలే వరకూ ఉండి కనిపించినంత సేపు చేతులు ఊపాడు.

ఎందుకో శ్రీకర్‌కి కొంత తృప్తి అన్పించింది. తన నుండి సమంత ఏదో ఆశిస్తోంది. అది 'ఓదార్పా?'

తల విదిల్చాడు.

సమంత కూడా శ్రీకర్ కన్పించినంత మేర చూస్తుండిపోయింది. ట్రైన్ నగర శివార్లు దాటుతుండగా గతం అలలుగా ఆమె కళ్ళ ముందు కదలాడింది.

ఆమె తండ్రి పేరు శంకర్రావ్. అతడి తండ్రి సూర్యారావు.

భార్య చనిపోవడంతో కొడుకు శంకర్రావ్‌ని కావల్సిన దానికన్నా ఎక్కువ గారం చేశాడు. పదెకరాల ఆసామి సూర్యారావు.



సమంత తల్లి సునంద అందగత్తెల జాబితాలోకే వస్తుంది. పదో తరగతితో శంకర్రావ్ చదువు ఆగిపోయినా పదెకరాల ఆసామి అన్న ఉద్దేశంతో సునంద తండ్రి రాఘవ, శంకర్రావుకిచ్చాడు.

సునంద పెద్దగా చదువుకోలేదు. అయినా ఆమె తీరు పొందికైంది. ఇంటిని చక్కగా తీర్చిదిద్దుకునేది. శంకర్రావ్ తన తండ్రి సూర్యారావు చనిపోయిన తర్వాత భూమిని కౌలుకిచ్చి కౌలు ద్వారా వచ్చే డబ్బుతో జల్సా చేసేవాడు. సప్తవ్యసనాలు అతడిని కావలి కాస్తుండేవి.

సునంద హృదయంపై దారుణమైన సమ్మెట దెబ్బలు పడ్డాయి. ఉన్న ఆస్తి హారతికర్పూరం కావడానికి ఎక్కువ కాలం పట్టలేదు. కౌలుదార్లే పొలానికి సొంతదార్లు అయ్యారు. కౌలుదార్ల నుండి తీసుకున్న అప్పులకు శంకర్రావు భూమిని వదులుకోవలసి వచ్చింది. సునంద పడుతున్న కష్టాలు చూసి ఆమె తండ్రి కుమిలిపోయేవాడు. తనే సాయం చేసేవాడు.

సునంద తోబుట్టువులు తండ్రితో పోట్లాడే వాళ్ళు.

"ఉన్నదంతా దానికే పెడుతున్నావ్. మాకేమీ ఇవ్వవా?" అని నిలదీసే వాళ్ళు.

"దాని పరిస్థితి బావోలేదు కదే..." అనేవాడు రాఘవరావు.

"మా పరిస్థితి కూడా బాగోలేదు. మొగుణ్ణి కంట్రోల్‌లో పెట్టుకోవడం దానికి చేతకాదు. దానికి మేము బాధ్యులమా? నెలకు దానికి ఎంతిస్తున్నావో మాకూ అంత ఇవ్వాలి. మా పిల్లల చదువులక్కూడా చాలా అవుతోంది" అని నిలదీసేవాళ్ళు. రాఘవరావు కూతుళ్ళ పోరుతో సతమతమయ్యేవాడు.

సునంద ఆత్మాభిమానం దారుణంగా గాయపడేది. తన అక్కా చెల్లెలితో మాట్లాడడం దరిదాపు మానుకుంది. సునంద తమ్ముడు రాజారావు అడపా దడపా అక్కను ఆర్థికంగా ఆదుకునేవాడు. తన అక్కను పెడుతున్న కష్టాలను చూసి భరించలేక ఒకటి రెండు సార్లు శంకర్రావు మీద చేయి కూడా చేసుకున్నాడు. శంకర్రావులో మార్పు ఉండేది కాదు.

ఒక స్వచ్ఛంద సంస్థ ఆ గ్రామంలో పెట్టిన కుట్టు శిక్షణా కేంద్రంలో చేరి సునంద టైలరింగ్ నేర్చుకుంది. తన అవసరానికి పట్టుదల తోడు కావడంతో త్వరగానే జాకెట్లు, మిడ్డీలు కుట్టడం నేర్చుకుంది. ఆ సంస్థే సునందకి ఉచితంగా కుట్టు మిషన్ ఇచ్చింది.

అదే ఆమెకు జీవనోపాధిగా మారింది. తండ్రి నుండి ఆర్థిక సాయం తీసుకోవడం మానేసింది. రాఘవరావు చాలా మదన పడేవాడు.

సునంద ఒక నిర్ణయం తీసుకుంటే మళ్ళీ తిరిగి చూసేది కాదు. తనని చూడడానికి వచ్చి డబ్బు పెట్టి వెళ్ళినా ఎవరో ఒకరి ద్వారా తండ్రికి తిప్పి పంపేది. కూతురిపై దిగులుతో రాఘవరావు కాలం చేశాడు. రాఘవరావు ఆస్తి, అప్పులకు రాజారావు వారసుడయ్యాడు. సునందకు తన పొలంలో పండిన బియ్యం పంపినా ఆమె తిరస్కరించేది. "వద్దురా తమ్ముడూ.." అనేది.

తల్లి పడే బాధల్ని తరచూ గమనించేది సమంత. రాత్రింబవళ్ళూ కష్టపడినా కాన్వెంట్ ఫీజు కట్టడం సునందకు గగనమయ్యేది. సునంద ఏదైనా చిన్నపాటి సుస్తీకి గురైతే మిషన్ నడిచేది కాదు. సమంతకు అనారోగ్యం వచ్చినా పరిస్థితి అదే విధంగా ఉండేది. సంపాదించే కొద్దిపాటి డబ్బులు మందులక్కూడా సరిపోయేవి కావు.

"కూతురిని కాన్వెంట్‌కి పంపించి అంతంత ఫీజు కట్టి శ్రమపడడం ఎందుకు...గవర్నమెంటు స్కూలు ఉంది కదా" అనేవాళ్ళు సునందకు కాస్త సన్నిహితంగా ఉండే ఆడవాళ్ళు. సునంద నవ్వేసేది. "నా కూతురు పెద్ద ఉద్యోగం చేయాలంటే ఇంగ్లీషు మీడియం చదువులు తప్పవు కదా" అనేది.

"చాయ్..చాయ్" వెండర్ అరుపులతో లోకంలోకి వచ్చింది సమంత.

రైలు ఏదో స్టేషన్‌లో ఆగినట్టుంది.

ఏ ఊరో తెలుసుకుందామని కాస్త విండో పైకి లేపింది. సన్నటి తుంపర్లు ముఖం మీద పడ్డాయి. గాలి చల్లగానూ, మరికాస్త హాయిగానూ ఉంది. మళ్ళీ తల్లి గుర్తుకొచ్చింది సమంతకు.

"మంచులో తిరగకే అసలే నీకు నిమ్ము" అనేది.

నిజానికి సమంతకి చలిగాలి పడదు. కాని చలిని ఆస్వాదించడం తనకెంతో ఇష్టం. అమ్మతో చివాట్లు తింటూనే ఆ క్లైమేట్‌ని ఎంజాయ్ చేసేది. హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత నిమ్ము సమస్య ఎందుకో తగ్గింది. బహుశా వాతావరణం మార్పు కావచ్చు. మనిషి రంగు కూడా బాగా వచ్చింది.

అందరూ సమంతను చూసి ఆశ్చర్యపోతుంటే సునంద వాళ్ళని తిట్టుకుంటూ దిష్టి తీసేది. దిష్టి తీసేప్పుడు ఎండు మిరపకాయలు నిప్పుల్లో వేసేది. దాంతో సమంతకు దగ్గు వచ్చేది. 'దిష్టి సంగతేమో కానీ... దానికి ఊపిరాడదేమోనే అక్కా' అనే వాడు రాజారావు మావయ్య.

"అక్కా, చాయ్ కావాలా?" పన్నెండేళ్ళ కుర్రాడు టీ క్యాన్ పట్టుకుని కంపార్ట్‌మెంట్‌లోకొచ్చి అడుగుతున్నాడు. క్లైమేట్ డిమాండ్‌తో పాటు, వాణ్ణి ఎంకరేజ్ చేసేందుకు, "ఒక టీ ఇవ్వు బాబూ" అని చెప్పి వాడికి వంద రూపాయల కాగితం ఇచ్చింది.

వాడు జేబు తడుముకొని "చిల్లర లేదక్కా.. చిల్లర ఉంటే చూడక్కా" అన్నాడు.

వాడి ఒంటిపై కుట్లు పడ్డ చొక్కా ఉంది.

"పర్వాలేదులేరా ఉంచుకో..." అంది. వాడు సమంతని వెర్రి వెంగళప్పలాగా చూసి, "అక్కా, నువ్విచ్చింది వందరూపాయల నోటక్కా, పది రూపాయలు కాదు" అన్నాడు.

"తెలుసురా.." అంది.

సమంత వైపు తేరిపార చూసి..

"మూడు గంటలు చాయ్ అమ్మితే మా సేట్ వంద రూపాయలు ఇస్తాడు. నువ్వేందక్కా వంద రూపాయలు టిప్ లెక్క ఇస్తున్నావు..." అన్నాడు.

వాడి గొంతులో అయాచితంగా వచ్చేది నాకు వద్దన్న భావం ధ్వనించింది సమంతకు.

చప్పున తల్లి ఆత్మగౌరవం గుర్తుకు వచ్చింది.

"అక్కా నువ్వు గుంటూరికే కదా...నువ్వు గుంటూరులో దిగేలోపు చిల్లర తెచ్చిస్తాలే" అంటూ ముందుకు ఉరికాడు.

వాడు వెళ్ళినంత సేపు వాణ్ణే చూస్తూ మళ్ళీ జ్ఞాపకాల్లోకి జారుకుంది.

నాన్నకు యాక్సిడెంటు అయింది. నాన్న అదనపు భారం కూడా అమ్మ పైనే పడింది. అప్పుడు తను ఇంటర్ చదువుతోంది. స్కూలు ట్యూషన్ ఫీజు ఉచితమే అయినా పుస్తకాలు వగైరాలకు డబ్బు బాగానే ఖర్చయ్యేది. రెండు పైటలు, రెండు పావడాలతో కాలక్షేపం చేసేది. నాన్న ముఖం చూడాలంటే జుగుప్సగా అనిపించేది. తండ్రి ఎప్పుడైనా మురిపెంగా 'సమూ' అని పిలిచినా వినీ విననట్టు ఉండేది.

"మీ నాన్న పిలుస్తుంటే ఏంటే ఆ తల బిరుసు.." అనేది తల్లి.

"నాది తల బిరుసు కాదమ్మా..." అని అరిచి చెప్పాలనిపించేది. కానీ పిచ్చి అమ్మ బాధ పడుతుందని, "నాకు వినపడలేదమ్మా..." అనేది.

కాలు నయమయ్యాక తండ్రి దోరణి మళ్ళీ మొదటికి వచ్చింది. ఒంటి పైన పడే పిడిగుద్దులు తాలూకూ బాధని తల్లి పెదవి కింద అదిమి పెట్టేది. టైలరింగ్ ద్వారా సంపాదించిన డబ్బుల కోసం సతాయించేవాడు. పక్క గదిలో పడుకొని నిద్రపోతున్న తనకి వినపడకూడదని బాధ గొంతులోనే దాచుకునేది తల్లి. కానీ తండ్రి కొట్టే దెబ్బల తాలూకూ శబ్దం వినిపించేది. సమంతలో రక్తం సలసల కాగేది. తనకు తెలిసినట్లు గుర్తిస్తే తల్లి ఇంకా బాధపడుతుందని వినీ విననట్టు ఉండేది. తండ్రిని చంపెయ్యాలన్నంత కోపం వచ్చేది.

ఒళ్ళు పచ్చిపుండులా మారినా తల్లి ఉదయాన్నే లేచి తనకి క్యారేజీ రెడీ చేసి ఇచ్చేది. తాను పెద్దయిన తర్వాత తన తల్లిని పువ్వుల్లో పెట్టి చూసు

ప్రియుడితో ప్రియమణి పెళ్ళి

రీల్ లైఫ్‌లో ఎన్నోసార్లు పెళ్ళిపీటలెక్కిన ప్రియమణి నిజజీవితంలో పెళ్ళి పీటలెక్కబోతోంది. నాలుగు సంవత్సరాలుగా ప్రియుడు ముస్తఫా రాజ్‌తో డేటింగ్ చేస్తున్న ప్రియమణి ఎంగేజ్‌మెంట్ ఇటీవలే జరిగింది. ఓ విధంగా ఈ ప్రేమాయణమే ప్రియమణిని సినిమాలకు దూరం చేసిందని ఆమె సన్నిహితులు సైతం గతంలో ఓ సారి బాధ వ్యక్తం చేశారు. తన మానసచోరుడితో చెట్టాపట్టాలేసుకుని తిరగడం ఆపలేదు. ఆ తిరుగుళ్ళకి ఫుల్‌స్టాప్ పెట్టేసి పెళ్ళిపీటలెక్కడానికి సిద్ధమైపోయింది. పెళ్ళైన తరువాత కూడా సినిమాల్లో నటిస్తానని ప్రియమణి చెప్పడాన్ని కొంత మంది జోక్‌గా తీసుకుంటున్నారు.. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న హీరోయిన్లకే సరైన అవకాశాలు లేక తల్లడిల్లుతుంటే పెళ్ళి చేసుకున్న ఆంటీలకు ఇక అవకాశాలు వస్తాయా? అంటున్నారు సినీ జనాలు.

కోవాలని కసిగా కష్టపడి చదివింది. ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. తల్లిలో ఒకవైపు ఆనందం, మరో వైపు బాధ. గవర్నమెంటు కోటాలో సీటొచ్చినా ఏదో ఒక పేరుతో కాలేజీలో డబ్బులు వసూలు చేసేవాళ్ళు. టైలరింగ్ ద్వారా వచ్చే డబ్బు సరిపోవడం లేదని రెండు మూడు ఇళ్ళలో పనికి కూడా వెళ్ళేది. సాయం చేయకపోగా అమ్మ తోబుట్టువులు...

'దయచేసి నువ్వు మా చెల్లివి అని చెప్పకు. నువ్వు పాచిపని చేస్తుంటే మాకు తలకొట్టేసినట్టు ఉంటుందని" చెప్పి వెళ్ళేవాళ్ళు. సమంతకు కోపం వచ్చేది.

"మీరెందుకిలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. మా అమ్మ నా చదువు కోసమే కదా కష్టపడుతోంది. ఆమెకి మీ అంత అదృష్టం లేదు కదా" అనేది.

వాళ్ళు ఎగాదిగా చూసి, "ఆ... నీ తెలివి తేటలు చదువులో చూపించవమ్మా...మా దగ్గర కాదు" అనేవాళ్ళు.

రైలు మళ్ళీ ఏదో స్టేషన్‌లో ఆగింది.

జ్ఞాపకాలు మళ్ళీ చెదిరాయి. మళ్ళీ కిటికీ తెరిచి చూసింది.

చిమ్మ చీకటి. తన అనుమానాన్ని గుర్తించినట్టు ఎదురుగా కూర్చున్న నడివయసు వ్యక్తి చెబుతున్నాడు. "స్టేషన్ కాదమ్మా. ఏదో గూడ్స్ వస్తున్నట్టుంది. దాని కోసం ఆపారు" చెప్పాడు.

"అవునా" అన్నట్టు చూసింది.

మరో పదినిమిషాల తరువాత టీ అమ్మిన కుర్రాడు సుడిగాలిలా వచ్చాడు. లెక్కపెట్టిన కాగితాలు, చిల్లర ఆమె దోసిళ్ళల్లో పోస్తూ... "అక్కా... లెక్కపెట్టుకో" అన్నాడు.

"ఎందుకురా ఉంచుకోమన్నాను కదా..." అనాలనుకుని ఆగింది.

వాడి సమాధానం తెలుసు.

చిల్లర డబ్బులు, కాగితాలు లెక్క పెట్టుకోకుండా బ్యాగులో వేసుకుంటూ "సరిగ్గానే ఉంటాయిలేరా" అంది.

వాడు వెళుతుంటే "ఒక్క నిమిషం రా" అంది.

"ఏంటక్కా" అన్నట్టు చూశాడు.

"మీ అమ్మా నాన్న ఏం చేస్తున్నార్రా" అడిగింది.

ఓస్...అదా అన్నట్టు చూసి "నాకు నాన్న లేడు కదక్కా. అమ్మని వదిలేసి వెళ్ళాడు" అంటూ వాడు ముందుకు సాగాడు.

చల్లగాలి కిటికీలోంచి వచ్చి చప్పున ముఖానికి తగిలింది. వాడి సమాధానం కూడా ఆమె హృదయాన్ని తాకింది. కిటికీ షట్టరు కిందికి లాగింది. నిద్రకు ఉపక్రమించింది. మాగన్నుగా నిద్ర పట్టింది సమంతకు.

ఎక్కడి నుంచి వచ్చాడో వాడు, గుంటూరు వస్తుండగా..."అక్కా...అక్కా" అని తట్టి లేపాడు. కళ్ళు నులుముకుంటూ చూసింది.

"అక్కా నీది గుంటూరు అని చెప్పావు కదా... గుంటూరు వస్తోంది" చెప్పాడు.

"థాంక్స్ రా" అంది.

వాడు లేపకుంటే తరువాత స్టేషన్‌లో దిగాల్సి వచ్చేది.

"అక్కా నీది హైద్రాబాదా? ఎప్పుడన్నా వస్తాను. నాకు చార్మినార్ చూపిస్తావా? ట్యాంకుబండ్ చూపిస్తావా..." అడిగాడు. వాడు అడగడమే మహా భాగ్యం అన్నట్టు చూసి...

"తప్పకుండా రా...ఇదిగో నా కార్డు. దీంట్లో నా ఫోన్ నెంబరు ఉంది. నువ్వు హైద్రాబాద్ వచ్చి ఫోన్ చెయ్యి. నేను తీసుకెళ్తా.." చెప్పి, కంపెనీ విజిటింగ్ కార్డు ఇచ్చింది.

దాన్ని ప్రసాదంలా స్వీకరిస్తున్నట్టుగా తీసుకుని "థాంక్స్ అక్కా" అన్నాడు. ఆ కార్డును అపురూపంగా చూసుకుంటూ జేబులో వేసుకున్నాడు.

•••

సమంత ఇంటికెళ్ళేసరికి విచిత్రమైన దృశ్యం కన్పించింది.

సమంత పిన్ని సువర్చల, పెద్దమ్మ సులోచన తల్లితో మంతనాలు ఆడుతూ కన్పించారు. ముందు కాస్త ఆనందం అన్పించినా దాని స్థానంలో కాస్త కోపం చోటు చేసుకుంది. తల్లి ముఖంలో సంతోషం చూసి కాస్త నిదానించింది.

"అమ్మా...ఏమైంది" అంది ఆదుర్దాగా...

"ఏ విషయం రా.." అడిగింది.

"నీకు ఆరోగ్యం బావోలేదు. వెంటనే వచ్చి చూసి పొమ్మని మావయ్య ఫోన్ చేశాడే" అంది.

"అదా.." అంటూ నవ్వింది సునంద. ఆమెతో శ్రుతి కలిపారు అక్కా చెల్లెలు.

"మామూలుగా రమ్మంటే నువ్వు రావు కదే..." అంది సులోచన.

"పెద్దమ్మా...పిన్నీ...మీరు ఎప్పుడొచ్చారు?" అడిగింది. గొంతులో ఏహ్యాభావం దాచుకోవడం సాధ్యం కావట్లేదు.

"మేమొచ్చి రెండ్రోజులు అయ్యిందిలేవే.." అంది సువర్చల.

"ఇదేదో స్కీమ్‌లా ఉంది..." అంది గొణుగుతూ సమంత.

"స్కీములూ, ప్రాజెక్టులూ లాంటివేమీ కాదే! నీకు పెళ్ళి చేసెయ్యాలని అక్క డిసైడ్ అయింది..." అన్నాడు రాజారావు అప్పుడే లోనికి వస్తూ. ఒక నిమిషం షాకయినట్టు చూసింది సమంత.

"పెళ్ళా...దానికిప్పుడు తొందరేముంది?" అంది సమంత కాస్త ఇబ్బందిగా.

"తొందరా...ఇప్పుడు నీ వయసెంతనుకుంటున్నావే? నీ వయసుకు నాకు ఐదవ తరగతి చదివే కొడుకు ఉన్నాడు" అంది సులోచన.

"ఇది మీ కాలం కాదు కదా పెద్దమ్మా..." అంది కోపాన్ని అణిచిపెట్టుకుంటూ.

"ఏ కాలమైనా ఎప్పటి ముచ్చట అప్పుడు తీర్చుకోవాలి.." అంది సువర్చల.

"పిన్నీ, పెళ్ళి ద్వారా వచ్చే ముచ్చట ఎలా ఉంటుందో మా అమ్మా నాన్నను చూసింతర్వాత నాకు బాగా తెలిసింది.." అంది తిప్పి కొడుతూ సమంత.

సమంత ట్రాక్ మారుస్తోందని అర్థమైంది రాజారావుకి.

"అక్కా, దాన్ని ఫ్రెషప్ కానివ్వండి..." అన్నాడు రాజారావు.

"సరేరా...సమంత, వేణ్ణీళ్ళు పెడతాను. ముందు స్నానం చేసి భోంచెయ్. మళ్ళీ మాట్లాడుకుందాం." అంది సునంద. సమంతకి ఒక విషయంలో రిలాక్స్‌గా ఉంది.

తాను జర్నీలో భయపడినట్టు తల్లి ఆరోగ్యానికి

నవ్యవీక్లి-నాటా సంయుక్త నిర్వహణలో బహుమతి పొందిన కవిత

కవిత్వమై

నలుగురు కలసినప్పుడల్లా
'ఏం రాస్తున్నావు?' అని పలకరిస్తారు
ప్రశ్న చిన్నదే గానీ జవాబు పెద్దది
చిన్నప్పుడు
చూచివ్రాత పుస్తకంలో చూచి
రోజుకొక పేజీ రాసినట్లు
అనుకున్నప్పుడల్లా అవలీలగా రాయలేను
పాషాణ పదాన్ని రమ్యశిల్పంగా మార్చి
ప్రతి వాక్యాన్ని రసాత్మక కావ్యంగా మలచే
పరుసవేది కొందరికే ఉంటుంది
ఆలోచనల కాసారాన్ని మథించాలి
భావాల మేఘమథనాన్ని కొనసాగించాలి
అప్పుడు గదా ఆప్తమిత్రునిలా ఆత్మీయంగా
పలకరిస్తుంది పద్యం

•••

బంగారు నగలో ముత్యాన్ని పొదిగినట్లు
తగిన పదం కోసం సరియైన మాటకోసం
రోజులు నెలలు తపస్సు చేయాలి
ముందు మనసు కాగితం మీద రాసాకే గదా
కాగితం నీలాకాశం మీద
అక్షర నక్షత్రాలు అలంకరించేది
క్షీరసాగర మథనం అనంతరం
అమృతం ఉద్భవించినట్లు
వంకర టింకర దారుల్లో నెమ్మదిగా నడచిన నది
విశాల మైదానంలో హాయిగా ప్రవహించినట్లు
వర్షిస్తుంది కవిత్వమై

-మందరపు హైమవతి
సెల్: 94410 62732

ఎలాంటి ప్రమాదం లేదని అర్థమై సంతోషపడింది.

పది నిమిషాల వ్యవధిలో స్నానాల గదిలోకి వెళ్ళింది.

సునంద కూతురికి వేణ్ణీళ్ళు కాగపెట్టి బాత్‌రూంలో పెట్టింది.

సమంత బాత్‌రూంలోకి వెళుతుంటే తల్లి, “అమ్మా... తల రుద్దనా...” అని అడిగింది.

అమ్మ వైపు ఎగాదిగా చూసి.

“నేను వాడేది షాంపూనే కదమ్మా...ఫర్వాలేదులే నేను రుద్దుకుంటా” అంది.

నవ్వుకుంది సునంద. తన కళ్ళకి పదో తరగతి చదివే కూతురు సమంతే కన్పిస్తుంది. ఇప్పుడు చాలా పెద్దదైంది కదా అనుకుంది.

వంటగదిలోకి చేరింది. సమంతకి ఇష్టమైన గోంగూర రొయ్యల కూర చేయడానికి సిద్ధపడింది. సమంత చిన్నప్పుడు ఆమె తాత రాఘవరావు ఒక సారి రొయ్యలు తెచ్చాడు. అప్పుడు సమంత ఆరవ తరగతి చదువుతోంది. గోంగూర వేసి చేసింది. వాస్తవానికి తన తండ్రికి ఇష్టమని గోంగూర వేసి చేసింది. తాతలాగే సమంత కూడా ఆ కూరని లొట్టలు వేసుకుంటూ తిన్నది. అప్పట్నించి వీలైనప్పుడల్లా “అమ్మా...రొయ్యల కూర చేయవా?” అని సమంత అడిగేది.



విదేశాలకు రొయ్యల ఎగుమతి పెరిగిన తర్వాత రొయ్యలకి డిమాండ్ పెరిగి, ధర కొండెక్కింది. సమంత వాళ్ళది గుంటూరుకు దగ్గర్లో ఒక లంక గ్రామం. దరిదాపు ప్రతిసారి “రేపు చేస్తాలేరా...” అని వాయిదా వేసేది.

సమంత వస్తోందని తమ్ముడు చెప్పగానే కేజీ రొయ్యలు తెచ్చి ఆవగించి ఫ్రిజ్‌లో పెట్టింది.

సమంత బాత్‌రూంలోకి వెళుతూ “అమ్మా..ఏం కూరే..” అడిగింది.

“నీ కిష్టమని రొయ్యలు తెప్పించాను. త్వరగా స్నానం పూర్తి చేసుకురా వేడి వేడి అన్నంలో రొయ్యల కూర వేసుకుని తిందువు” అంది సునంద.

సమంత నోరు నిజంగానే ఊరింది.

చన్నీళ్ళు...వేన్నీళ్ళు మిక్సయి అవి నులివెచ్చగా మారి సమంత ఒంటి మీద పడుతుంటే ఆమెకి ప్రాణం లేచివచ్చినట్టయింది. డవ్ షాంపూ నుర గలు బాత్‌రూంనాక్రమిస్తుంటే, ఆమె ఆలోచనలన్నీ శ్రీకర్‌తో నిండిపోయాయి.

“శ్రీకర్‌ని నేను డిజప్పాయింట్ చేస్తున్నానా?” ఆలోచించింది క్షణకాలం. “తాను ఓకే చెప్పింది కేవలం స్నేహానికే కదా...అందులో డిజప్పాయింట్ కావల్సింది ఏముంది? అంతకు మించి తన దగ్గర మరేదీ దొరకదని నిష్కర్షగా చెప్పాను కదా” అను కుంది స్వగతంలో.

చప్పున తల్లి డిమాండ్ గుర్తొచ్చింది. తనకి పెళ్ళి చేస్తే తన బాధ్యత తీరిపోతుందని తల్లి భావి స్తోంది. పెళ్ళితో సమస్యలు మొదలవుతాయని తాను భావిస్తోంది. కాలిపోతామని తెలిసి కూడా మిణు గురులు దీపం చుట్టూ తిరుగుతుంటాయి కదా? ఆడవాళ్ళు కూడా అంతేనా? ఒక్క నిమిషం తల విదిల్చింది. అయినా పెద్దమ్మా...పిన్ని వాళ్ళు తల్లి మీద ఎందుకంత ప్రేమ ఒలకపోస్తున్నారు? తల్లికి వత్తాసుగా చేరి తన పెళ్ళి విషయంలో ఎందుకు చొరవ చూపుతున్నట్టు. ఎందుకు వీళ్ళకీ పెద్దరికం?

అసలు వీళ్ళకి ఆ స్థాయి ఉందా? అయినా అమ్మని అనుకోవాలి.

వాళ్ళనెందుకు రానిస్తోంది అమ్మ!? సాయమో పాడో చేసి వదిలించుకోవచ్చు గదా! మూడేళ్ళ క్రితం తాను సత్యం కంప్యూటర్స్‌లో చేరి మొదటగా అందు కున్న జీతం పాతికవేల్లో పదిహేను వేల రూపాయలు తల్లికి పంపినప్పుడు దరిదాపు తల్లికి తల తిరిగినట్టయ్యింది.

అంత డబ్బు ఒక్కసారి చూసేసరికి ఆమెకి కాళ్ళూ చేతులూ ఆడలేదు. పార్శిల్‌లో తల్లికి ఒక సెల్ ఫోను పంపింది.

“ఇంత డబ్బు నేనేం చేసుకుంటానే...నువ్వే అక్కడ బ్యాంకులో దాచుకోవచ్చు కదమ్మా...” అంది.

“అమ్మా...ఇంత కాలం ప్రతి పైసాకి కష్టపడ్డావ్... ఇకనైనా ఆ డబ్బు ద్వారా నీకు సంతోషం కలిగితే నాకు అంతకన్నా ఏం కావాలమ్మా” అంది.

సునందకి వెయ్యి రూపాయలకు మించి ఖర్చు కాదు. మిగతా డబ్బు పోస్టాఫీసులో దాచి పెట్టమని తమ్ముడికిచ్చేది. సమంత హైద్రాబాద్‌లో పాతిక వేల జీతగత్తె అయ్యిందని తెలిసి సునంద అక్కా చెల్లెలు మొదట అసూయపడ్డారు. డిగ్రీ కూడా దాటని తమ పిల్లలని దుమ్మెత్తి పోశారు. మొదట సువర్చల, సునందతో మాటలు కలిపింది.

“అక్కా, నీ శ్రమ వృథా కాలేదక్కా! మన సమంత పాతిక వేల జీతగత్తె అయ్యిందట గదా..” అంది ఫోనులో.

రాజారావు దగ్గర నెంబరు తీసుకొని చేసింది. సునంద ఛాతి పొంగింది. అంతకంటే సంతో షంతో కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి.

అక్క వైపు నుండి మాటలు రాకపోవడంతో...“ అక్కా...నేను చెప్పేది వినబడుతోందా?” అంది.

మళ్ళీ అడగడంతో “వినపడింది...వినపడింది” అంది.

“పర్వాలేదులేక్కా...ఇక నీ కష్టాలు తీరాయి” అంది.

సువర్చల గొంతులో నిజాయితీ ఉన్నా లేకున్నా తనని ఫోన్‌లో పలకరించిన తీరు, చూపిన గౌర వంతో మనసు మయూరమైంది. తర్వాత రోజు సునంద అక్క సులోచన ఫోన్ చేసింది.

“చెల్లీ నీకు ఫోన్ వచ్చిందట కదా...సువర్చల చెప్పింది...” అంది ఉపోద్ఘాతంగా.

“అవునక్కా...తనతో మాట్లాడుతుండమని మన సమంత పంపింది...” చెప్పింది సునంద.

“ఏమైనా నువ్వు అదృష్టవంతురాలివే! నీ బిడ్డ ఇరవై యేళ్ళకే ఉద్యోగస్థురాలై నిన్ను సంతోషపెడు తోంది. మాకూ ఉన్నారు..బడుద్ధాయిలు! పనికిరాని డిగ్రీ చదివి బట్టల కొట్లో గుమాస్తాలుగా చేస్తు న్నారు” అంది.

“వాళ్ళక్కూడా మంచి ఉద్యోగమొస్తుందిలే అక్కా...” అంది ఓదార్పుగా సునంద.

“ఏమొస్తుందో ఏమోనే...చిన్నోడు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేస్తాను. అక్కలాగా నాకూ మంచి ఉద్యోగమొస్తుంది అంటున్నాడు. ఆయనేమో యూనివర్సిటీకి పంపి నిన్ను చదివించే స్థోమత మాకు లేదు. ఏదైనా ఉద్యోగం చేసుకోమంటున్నాడు..” అంది.

సునందకి ప్రాణం ఉస్సూరుమంది.

సులోచన ఫోన్ పెట్టేసిన తర్వాత ఆమె మనసు పరిపరి విధాలుగా పోయింది. మర్నాడు తమ్ముడు రాజారావును పిలిపించి “రాజా పోస్టాఫీసులో పైసలు ఎంతున్నాయో పట్టుకురారా” అంది.

“ఎందుకు అక్కా...” అని అడగబోయి, అక్క సమాధానం చెప్పదని తెలిసి “సరేనక్కా” అని ఓచరు పైన సంతకం పెట్టించుకు వెళ్ళి ఉన్న డబ్బంతా డ్రా చేసి తెచ్చాడు. దరిదాపు యాభైవేల వరకూ ఉంది.

“తమ్ముడూ, ఈ డబ్బు సులోచనక్కకు ఇచ్చి రారా. దాని బిడ్డ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివేందుకు యూనివర్సిటీలో చేరతాడట” అంది.

ఒక్క నిమిషం విస్తుపోయాడు రాజారావు.

“అక్కా...ఈ డబ్బులు సమంత పెళ్ళికి ఉప యోగపడతాయి కదా..” అని నసిగాడు రాజారావు.

“పర్వాలేదులేరా...మళ్ళీ పంపుతుంది కదా...అవి దాచుదాం” అంది.

రాజారావుకి నిజానికి మనసొప్పడం లేదు. తన తోబుట్టువులు సునందక్కను చూసిన చిన్నచూపు అతడి స్మృతి పథంలోంచి తొలిగిపోలేదు. ఏదో కర క్కాయ తిన్నట్టనిపించింది.

కదలకుండా ఆగి ఉన్న తమ్ముడు ఉద్దేశం అర్థ మైంది సునందకు.

“అరేయ్, అక్క చెల్లెళ్ళ మధ్య కక్షలూ, కార్పణ్యాలూ జీవిత కాలం ఉంటాయట్రా. వాడు మాత్రం నా బిడ్డ కాదా?” అంది.

అక్క ఔన్నత్యానికి రాజారావు మనసులోనే చేతులెత్తి మొక్కాడు.

చెల్లాయి డబ్బు పంపిందని తెలిసి సులోచన ముందు షాకయింది.

(ఇంకా వుంది)

కలహాల కాపురంతో డయాబెటిస్?

సంసారంలో కలహాలు సాధారణమే అయినా, అవి పురుషుల ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపుతాయి అంటున్నారు అమెరికాలోని మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు. తరచూ గొడవ పడే భార్యా భర్తలలో భర్తకి డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న విషయం వీరి పరిశోధనలో తేలింది. భార్యలకు ఈ ముప్పు అంతగా ఉండదని వీరు అంటున్నారు. డయాబెటిస్‌కి గురయ్యే భర్తలకు చికిత్స అందించినా పెద్దగా ఫలితం కనిపించకపోవచ్చని వీరు చెబుతున్నారు. తరచూ భార్యతో గొడవ పడే పురుషులలో ఆందోళన, ఒత్తిడి ఎక్కువయి అది వారి గుండె, మెదడు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుందని వీరు స్పష్టం చేస్తున్నారు. 57 సంవత్సరాల నుంచి 85 సంవత్సరాల వయస్సు గల 1300 జంటల మీద సుమారు ఐదు సంవత్సరాల పాటు ఈ పరిశోధన నిర్వహించారు. తరచూ గొడవ పడే ఈ దంపతులలో 389 మంది పురుషులు చక్కెర వ్యాధికి గురయినట్లు వారు గుర్తించారు. మిగతా వారిలో కూడా గుండె సంబంధిత సమస్యలు, అధికరక్తపోటు వంటి సమస్యలను గమనించారు. పురుషులలో అనారోగ్య సమస్యలకు కారణం తరచూ భార్యలతో గొడవకు దిగడమేనని పరిశోధకులు అంటున్నారు. భార్యలలో ఈ లక్షణాలు చాలా తక్కువగా కనిపించాయని వీరు చెబుతున్నారు.

పళ్ళు ఎక్కువ తింటే తెలివైన పిల్లలు పుడతారు!

ఇదేదో స్లోగన్‌లాగా ఉందే అనుకోనక్కర్లేదు. ఇది నిజమని పరిశోధనల్లో వెల్లడైంది. గర్భవతులు సహజంగానే పోషకాహారం తీసుకుంటారు. ఈ ఆహారంతో పాటు పళ్ళు కూడా చేర్చుకుంటారు. అయితే తల్లి కాబోతున్న స్త్రీలు మామూలుగా తీసుకునే పళ్ళ కన్నా ఎక్కువ మొత్తంలో పళ్ళను తింటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగానే కాకుండా ఎక్కువ తెలివితేటలు కలిగి ఉంటారన్న విషయం కెనడాలో నిర్వహించిన ఓ పరిశోధనలో వెల్లడైంది. సుమారు 800 మంది గర్భవతుల మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. వీరిలో కొందరికి గర్భం ధరించిన సమయం నుంచీ ప్రసవం అయ్యేంత వరకూ ఎక్కువ మొత్తంలో అన్ని రకాల పళ్ళను అందించారు. రెండవ గ్రూపు వారికి సాధారణంగా ఇచ్చే పళ్ళనే ఇచ్చారు. ప్రసవం అయిన ఏడాది తరువాత పిల్లల తెలివితేటలను వీరు గమనించారు. ఎక్కువ పళ్ళను తీసుకున్న తల్లులకు పుట్టిన పిల్లల్లో ఎక్కువ ఐక్యూని పరిశోధకులు గుర్తించారు. పళ్ళను మామూలుగా తీసుకున్న తల్లులకు పుట్టిన పిల్లల్లో ఐక్యూ సాధారణ స్థాయిలో ఉండడాన్ని గమనించారు. ఐక్యూ పెరగడం అన్నది కేవలం అధిక మొత్తంలో పళ్ళు తీసుకోవడం వలనే వచ్చిందా? అన్న విషయం మీద వీరు పరిశోధనలు నిర్వహిస్తున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

కట్టెల పొగతో కంటి జబ్బులు

కట్టెల పొయ్యిమీద వంట చేసే మహిళల్లో కంటికి సంబంధించిన జబ్బులు వచ్చే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందంటున్నారు పరిశోధకులు. కట్టెల పొయ్యికి దగ్గరగా పనిచేసే వారిలోనే ఈ సమస్య చాలా ఎక్కువగా ఉంటుందనీ, అదే గ్యాస్, కిరోసిన్ స్టవ్ మీద వంట చేసే వారిలో కంటిజబ్బులు వచ్చే అవకాశాలు తక్కువ అని వీరు చెబుతున్నారు. కంటిలో శుక్లం, పొర ఏర్పడ్డం లాంటివి చిన్న వయస్సులోనే వచ్చే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఎప్పుడో వృద్ధాప్యంలో రావలసిన ఈ సమస్యలు చాలా చిన్న వయస్సులోనే అంటే 30-40 సంవత్సరాల లోపే వస్తాయన్న విషయం వీరి పరిశోధనలో వెల్లడైంది. కట్టెల ద్వారా వెలువడే పొగ కారణంగానే పై సమస్యలు వస్తాయనీ, ఈ పొగకు సాధ్యమైనంత దూరంగా ఉంటే కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు సూచిస్తున్నారు. కంటి జబ్బులు పురుషులలో వచ్చే అవకాశం చాలా తక్కువ అని వారు చెబుతున్నారు. సుమారు వెయ్యి మంది మహిళల మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. కట్టెల పొయ్యి దగ్గరగా పని చేసే మహిళల్లో 90 శాతం మందిలో కంటిజబ్బుల సమస్యను వీరు గుర్తించారు.

కూల్ కిల్లర్స్

చాలామందికి ఆహారపదార్థాలను రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచుకుని తినడం అలవాటు. ఈ అలవాటే క్యాన్సర్ రావడానికి కారణం అంటున్నారు పరిశోధకులు. శరీరంలో క్యాన్సర్ కణాలు వృద్ధి చెందడానికి ఫ్రిజ్‌లో జరిగే శీతల ఉష్ణోగ్రత రసాయనిక చర్య కారణం కావచ్చన్న విషయం వీరి పరిశోధనలో వెల్లడైంది. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు తినే వారిలో క్యాన్సర్ కణాలు వృద్ధి చెందవచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. అలాగే పాలను అన్నింటి కన్నా అడుగు అరలో నిల్వ చేయడమే ఉత్తమమని వీరు సూచిస్తున్నారు. చల్లదనం ఎక్కువయ్యే కొద్దీ పాలల్లో బ్యాక్టీరియా వృద్ధి చెంది పలు అనారోగ్య సమస్యలకు కారణం కావచ్చని వీరు భావిస్తున్నారు. అలాగే ఉల్లిపాయలు, దుంపకూరలు, టమోటాలు వంటివి ఫ్రిజ్‌లో నిల్వ చేయకుండా పొడి ప్రదేశంలో నిల్వచేయడమే ఉత్తమమని వీరు చెబుతున్నారు.

-అవినాష్

శ్రుతికి మెలకువ వచ్చింది. ఉలిక్కిపడి లేచి ఈ లోకంలోకి వచ్చినట్లు అనిపించింది. అదో రకమైన కంగారు. గుబులు.

ఏ.సి. గదిలో నైట్‌బల్బ్ మసక వెలుతురులో ఏదీ స్పష్టంగా కనబడటం లేదు. కాసేపటి వరకు తనెక్కడున్నదీ తెలియలేదు. గుర్తుకొచ్చేసరికి భయం.

ఒక్కరోజు కూడా కాదు. కేవలం ఒక్క రాత్రికోసం అద్దెకు తీసుకున్న హోటల్ గది కావటంతో ఆ వాతావరణం అంతా కొత్తగా, వింతగా అనిపించింది.

డ్రెస్సింగ్ టేబుల్ మీద ఉంచిన రిస్ట్‌వాచీ తీసి చూసుకుంది. అయిదు గంటలవుతోంది. బయటంతా చీకటిగానే ఉంది. మనసులో ఏదో అశాంతి.

డబుల్‌కాట్ మీద ప్రపంచాన్నే మరచి పోయినట్లుగా ఎంతో హాయిగా బోర్లా పడుకుని ఉన్నాడు వంశీ. అస్తవ్యస్తంగా చుట్టుకుని ఉన్న లుంగీ తప్పితే ఒంటిమీద ఏ వస్త్రమూ లేదు. ఆ మాటకొస్తే శ్రుతి మాత్రం...

ఆ చీకటి.. ఆ స్పర్శ... చిలిపిచిలిపి మాటలు.. ఇష్టంతో పెట్టుకున్న ముద్దులు. కసి కౌగిలింతలు. మొత్తంగా కలిపి ఒకరి నుంచి మరొకరు అందుకున్న స్వర్గసుఖాలు.

వంశీని చూడగానే జరిగిపోయినవి ఒకటొకటిగా ఆమె కళ్ళముందు కదలాడాయి.

అతని పెదవులకు చిక్కిన తన పెదాలను అందమైన ఆ పొడుగాటి చేతివేళ్ళతో తడిమి చూసుకుంది. ఎద అందాలు తన సొంతమన్నట్లు ప్రవర్తించిన తీరు, గంటలకొద్దీ శరీరమంతా తడిమితడిమి చూస్తూ తనక్కావలసిన సంపదనంతా దోచుకున్న అతని మగతనం.. ఆ మగతనాన్ని ఊరించి ఊరించి దాసోహమవ్వాలని కోరుకున్న తన ఆడతనం.. తను ఓడుతూ అతన్ని గెలిపించడంలోని సుఖం.. శ్రుతి పక్కమీద నుంచి లేచి పావుగంట దాటినా ఆ మధురస్మృతుల్లోంచి చటుక్కున బయటపడలేక పోయింది.

"వంశీ... వంశీ" తట్టి లేపాల్సి వచ్చింది.

తనలో ఉన్న భయం మెలకువ తెప్పిస్తే, అతనిలోని మొండి ధైర్యం కదలనివ్వని నిద్రకు కారణమైంది.

ఆవులిస్తూ "అబ్బా" టైమెంతయింది.



జీవన శ్రుతి

-మంత్రవాది మహేశ్వర్

"అయిదు దాటిపోయింది మహానుభావా"

"అంతేనా"

"వంశీ ప్లీజ్. ఆలస్యమైపోతోంది" గొంతులో ఆదుర్దా.

"ఆలస్యం ఏం కాదు నా స్వీట్‌హార్ట్" అంటున్నాడే గానీ చల్లారిన కోరిక మళ్ళీ పురివిప్పింది. లేపాలని శరీరాన్ని తాకిన మృదువైన చేయినందుకుని ముద్దాడాడు. మత్తెక్కించే చూపుల వల విసురుతూ తన మీదకు లాక్కున్నాడు దుప్పటిలా.

"చలిగా ఉందా"

"ఊ"

"ఏ.సి. ఆఫ్ చేయనా"

"వద్దు... ఇలాగే బావుంది" గట్టిగా దగ్గరకు తీసుకున్నాడు.

"ప్లీజ్ ... వంశీ".

"ట్రైన్ అయితే నువ్వన్నట్లు ఆలస్యం అవుతుంది. మనం వెడుతున్నది కారు డియర్. రైలు కంటే ముందే చేరుకుంటాం. నా స్పీడు నీకు తెలియదు" చివరి మాటలు కొంటె అర్థాన్ని స్ఫురింపజేశాయి.

"మీ స్పీడు తెలియకే... బాగా తెలుసు. వదిలి పెట్టు వంశీ" అతని కౌగిలి విడిపించుకుంది.

"శ్రుతి... మనం కలిసి గడిపిన క్షణాలు నా జీవితంలో అత్యంత మధురమైనవి. తనివి తీరలేదు. నాకింకా కావాలనిపిస్తోంది".

అతను వదిలిన శ్వాసలోని వెచ్చదనం, ఆ వెచ్చదనంలోని గాఢమైన కోరిక ఆమె గులాబీ బుగ్గలను తడిమాయి. అతని స్పర్శ సర్వం మరచిపోయేలా చేస్తుంది. అదే శ్రుతి భయం కూడా.

"వంశీ... ఇప్పటికే ఒకరోజు ఆలస్యం. ఈవేళ కనుక సమయానికి చేరుకోకపోతే పరిస్థితి చేతులు దాటిపోతుంది'.

"ఎందుకంత కంగారు. ఏం జరగదు డియర్".

పక్కన కూర్చున్న ఆ పాలరాతి శిల్పం లాంటి శ్రుతి అందం అతనిని ఊరికే ఉండనిస్తుందా? చేతులు, చేతివేళ్ళు సుఖాన్వేషణకు మళ్ళీ సిద్ధమయ్యాయి.

"నేను ఆలస్యంగా వెడితే సుధీర్‌కు అనుమానం వస్తుంది. ఆలస్యానికి ఏం సాకు చెప్పగలను" అంది.

"చెప్పనా"

"ఊ"

చెవి దగ్గరగా మూతి నుంచి "నిజం చెప్పేయ్" అంటూ అల్లరిగా కొరికాడు.

చక్కిలిగింతలు ఫీలౌతూ "ఏయ్" అంది.

"అవును. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే లవర్‌తో ఉన్నానని చెప్పు"

ఆమె ఏం ఆలోచన చేస్తోందో గానీ అతని చేతులు మాత్రం ఆమె నడుము చుట్టుకొలతను కొలవడంలోను, పెదాలు దానిపైనున్న మడతను స్పృశించడంలోను నిమగ్న మయ్యాయి.

"సుధీర్ నన్ను ఇంట్లోంచి బయటకు గెంటేస్తారు".

"మరీ మంచిది. అప్పుడు నా శ్రుతి నా దగ్గరే ఉండిపోతుంది. ఎంచక్కా ప్రేమించిన నా కాలేజ్ బ్యూటీని దక్కించుకోలేక పోయానే అనే బాధ ఉండదు. ఈసారి సొంతం చేసుకుంటే క్షణమైనా వదిలిపెట్టను.." చేతివేళ్ళు ఆమె నాభి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి.

"ఇంక చాలు వంశీ... అల్లరి బాగా ఎక్కువవుతోంది. రాత్రంతా నిద్రలేకుండా గడిపినా తనివి తీరలేదా".

లేదన్నట్లుంది అతని ముఖం.

'సరిపోలేదా' రహస్యంగా అంటూ జుట్టులోకి తన చేతి వేళ్ళను పోనిచ్చి కసిగా లాగింది.

తల అడ్డంగా ఊపాడు లేదన్నట్లు.

"ఆలస్యమవట్లేదూ"

ఆమె ఎర్రని పెదాలను చూస్తూ ఊరు కోలేక తన పెదాలను ఉసిగొల్పాడు. కాసేపు నాలుగు పెదాలు రెండయ్యాయి. గరుకైన అతని గడ్డం శరీరమంతా తడిమింది. రెండు శరీరాలు పెరిగిన ఉష్ణోగ్రతలను నమోదు చేస్తూ ఒకటయ్యాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసలతో ఆ ఏసీ గది ప్రతిధ్వనిస్తూ చల్లదనానికే సవాలు విసిరింది.

అతికష్టమ్మీద అతని బాహువుల్లోంచి తప్పించుకుని బయటపడిన శ్రుతి, చిందర వందరైన తన దుస్తులను చేతిలోకే తీసు కుని, నగ్న సౌందర్యాన్ని దాచుకోలేక దాచుకుంటూ, కొంటెగా చూస్తూ టాయ్ లెట్ వైపు నడిచింది.

ఏడు గంటలకు రూమ్ చెకవుట్ అయ్యారు.

హోండా సిటీ కదిలింది.

"ముందు ముఖంలోంచి ఆ 'కంగారు' తరి మేస్తేనే నా శ్రుతి అందంగా ఉంటుంది. అప్పుడే నాలో ఉత్సాహం. నిన్ను విజయవాడ అనుకున్న సమయానికి చేర్చి అక్కడ హైదరాబాద్ ట్రైన్ ఎక్కించే పూచీ నాదీ... సరేనా".

"ఊ"

"అలాకాదు"

"మరి"

"నవ్వుతూ... ఇక్కడ ముద్దివ్వాలి'.

"అబ్బా మీతో కష్టమే..." అంటూ నవ్వుతూ ముద్దిచ్చింది ఉత్సాహం పెంచడానికి. అతని చిలిపి తనాన్ని తట్టుకోలేక తొడ గిల్లింది.

కారు వేగం పెరిగింది.

"మీకు కావల్సింది సాధించారు. సుధీర్ నన్ను రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కు వస్తే నేను ట్రైన్‌లో కనబడకపోతే... ఏమవుతుంది".

"సుధీర్ నీ గురించి అంత జాగ్రత్త తీసు కుంటే మంచిదే. కానీ అతను స్టేషన్‌కు రాడు".

"రవి ఇబ్బంది పెడతాడు వాళ్ళ నాన్నని. వాడి కోసమైనా రావచ్చు".

"రవికి ఆరేళ్ళు. మరీ పసివాడేం కాదు. అమ్మను విడిచి రెండు మూడు రోజులు ఉండ లేని వాడేం కాదు".

వంశీ ముఖంలో కోపాన్ని పసిగట్టింది.

శ్రుతి మూడురోజుల క్రితమే హైదరాబాదు నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరింది, కజిన్ పెళ్ళికోసం. పిల్లాడు రవి తనతోబాటు వచ్చేవాడే కానీ స్కూలు మాన్పించి తీసుకెళ్ళడం సుధీర్‌కు ఇష్టం లేదు. సుధీర్‌కు ప్రయాణాలు పెద్దగా ఇష్టం ఉండదు. పైగా బిజీ. 'నేను మానేజ్ చేస్తాను, నువ్వెళ్ళి రాకూడదు? అవసరమైతే పనమ్మాయి విమల హెల్ప్ తీసుకుంటాను' అన్నాడు.

శ్రుతి విశాఖపట్నం ప్రయాణం విషయం వంశీకి ఫోనులో చెప్పేసింది. ఆఫీసు పని మీద విశాఖలోనే ఉన్న వంశీ, పెళ్ళికి వెళ్ళినప్పటినుంచీ శ్రుతికి ఫోన్లమీద ఫోన్లు... ఎప్పుడెప్పుడు కలవాల న్నట్లు ఆకలితో ఉన్నాడు. పైగా ఏకాంతం.

పెళ్ళి పందిట్లోకి వచ్చేసేవాడే. కానీ వంశీ స్పీడు ముందే గ్రహించిన శ్రుతి హద్దులు గీసింది. బంధువర్గం అంతా అక్కడే ఉంటుందని హెచ్చ రించింది. చాలా నిరాశ చెందాడు. కానీ నిగ్రహించు కోక తప్పలేదు.

శ్రుతి పెళ్ళిలో నలుగురి మధ్య తిరిగినా, మన సంతా వంశీమీదే. పదే పదే మోగే రింగ్ టోన్.... అనుమానం రాకుండా సెల్ లో-వాల్యూమ్‌లో పెట్టాల్సి వచ్చింది. కానీ లోపల 'ఇష్టం' మిస్డ్ కాల్స్‌ను నమోదు చేస్తూనే ఉంది.

పెళ్ళి తరువాత తన కాలేజ్‌మేట్‌ను కలుసుకోవాలని చెప్పి బయటపడింది శ్రుతి.

ఫోనులో వంశీ విసిరే కొంటె కోర్కెలు, కలవడం కోసం పడిన తహతహ చూసి నవ్వుకుంది. నిజం చెప్పొద్దూ - ఆ అను భవం కోసం తను కూడా ఆరాటపడింది.

పెళ్ళయిన మర్నాడు శ్రుతి రిటర్న్ జర్నీ. విషయం తెలిసిన వంశీ మూడ్ పాడైంది. 'ఒక్క రాత్రయినా కలిసి గడప కుండా వెళ్ళిపోవడమా' అన్నాడు. తనేం జవాబివ్వలేదు. కారులో బీచ్‌రోడ్ మీద వెడుతున్న ఇద్దరి మధ్య మౌనం చోటు చేసుకుంది.

శ్రుతి కళ్ళలోకి తదేకంగా చూస్తూ, గడ్డం పట్టుకుని బతిమాలాడు.

"ప్లీజ్ ఒక్కరాత్రి... అంతే".

చూస్తూ 'నో' చెప్పలేక పోయింది. అయితే లోపల 'భయం..' వంశీ పక్కనుంటే అదో మత్తు. గమ్మత్తు... మాయ. అదేం ఆకర్షణో - ఆ మధ్యే ఎవరి ద్వారానో ఆమె సెల్ నెంబరు సంపాదిం చాడు వంశీ. కాలేజీ కబుర్లతో మొదలు.. ఫోన్ సంభాషణలు రహస్యంగా మొదలయ్యాయి. సుధీర్ ఆఫీసుకు వెళ్ళాక... రవిని స్కూల్లో దింపిన తరువాత.. అతని కాల్ కోసం ఆమె... ఆమె కాల్ కోసం అతను. ఫోన్ కబుర్లు కోరికలు పుట్టించేవి. ఒంటరితనంలో ఏవేవో తుంటరి ఆలోచనలు పురుడు పోసుకోవడం ప్రారంభమైంది.

విజయవాడ దగ్గర పడుతున్న కొద్దీ ఒక లాంటి టెన్షన్.

ఎన్ని మధుర క్షణాల్ని పంచుకున్నా ఎదలో ఏదో శూన్యం. ఇదీ అని చెప్పుకోలేని బాధ.

"శ్రుతి.. నువ్వు అలా మౌనంగా కూర్చొని ఉంటే ప్రయాణం కష్టం" అన్నాడు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

"... ... ..."

"సుధీర్ గురించేగా ఆలోచన. అతనికి ఎప్ప టికీ తెలియదు".

"తెలుసుకుంటే"

వెంటనే జవాబులేదు వంశీ నుంచి.

"సుధీర్ నా భర్త. మా ఇద్దరి మధ్య ఎన్ని సమస్యలున్నా ఈ మన వ్యవహారాన్ని ఎలా తట్టు కుంటాడు".

"తట్టుకోక ఏం చేస్తాడు" మాటైతే అనేశాడు గానీ తనలోనూ టెన్షన్ లేకపోలేదు.

"ఏం చేస్తాడు... నాతో తగాదా పడతాడు. నా జీవితం దుర్భరం అవుతుంది. నాకు బతకడమే ఒక సమస్యగా మారుతుంది. డైవోర్స్ ఇస్తాడు తెలుసా".

"అది పెద్ద విషయమా" కోపంగా అన్నాడు.

"అదేమిటి"

"అవును. ఏదో ఒకరోజు మన ప్రేమ వ్యవ హారం తెలుస్తుంది. ప్రేమ గురించి చెప్పే ధైర్యం నాలో ఉంది. నీకుందా?"



ప్రియాంక సంపాదన రోజుకి రెండున్నర కోట్లు

ప్రియాంక హాలీవుడ్‌లో అడుగుపెట్టిన తరువాత ఆమె రాతతో పాటు, సంపాదన కూడా మారింది. బాలీవుడ్‌లో సినిమాకి ఆరేడు కోట్ల కంటే ఎక్కువగా వచ్చేది కాదు. అలాంటిది ఇపుడు ఆమె సంపాదన రోజుకి రెండున్నర కోట్లు. అయితే ఇంత డబ్బు ఆమెకు సినిమాల ద్వారా కాకుండా యాడ్స్ ద్వారా వస్తోంది. సుమారు 25 ఉత్పత్తులకు ప్రియాంక మోడల్‌గా వ్యవహరిస్తోంది. వీటి షూటింగ్ 40 రోజులు ఉంటుందట! ఈ యాడ్స్ ద్వారా ఆమెకు వందకోట్లు వస్తున్నాయట! నలభై రోజులకు వందకోట్లంటే రోజుకి రెండున్నర కోట్లే కదా అంటున్నారు బాలీవుడ్ జనాలు. బాలీవుడ్ నుంచి చాలా మంది హాలీవుడ్‌కి వెళ్ళినా ఈ రేంజ్‌లో సంపాదించిన వారు మాత్రం లేరని వారు స్పష్టం చేస్తున్నారు. ఇప్పట్లో ప్రియాంక రేంజ్‌ను అందుకోవడం బాలీవుడ్ హీరోయిన్లకు సాధ్యం కాకపోవచ్చని కూడా వారు జోస్యం చెబుతున్నారు.

“సమస్య అంత చిన్నది కాదు వంశీ, విడిపోయి స్వేచ్ఛ సంపాదించడంతో పరిష్కారం లభించదు”.

“మరి”

“నాకు ఆరేళ్ళ కొడుకున్నాడు. ఇద్దరికీ వాడంటే ఎంతో ప్రేమ. వాడి భవిష్యత్తు మా ఇద్దరి బాధ్యత...”

“సరే.. అంతేనా. ఇంకేమైనా ఉందా?”

“ఉంది”

“ఏమిటో”

“నీకు భార్య, ఇద్దరు పిల్లలు. నీ ప్రపంచంలో నన్నెక్కడుంచుదామని”

“నువ్వు నా హృదయరాణివి”

“నా ప్రశ్నకు అది కాదు జవాబు.”

“మరి నా నుంచి ఏం ఆశిస్తున్నావు?”

“నీ భార్య పరిమళ తప్పేం లేకపోయినా, నీ స్వార్థంతో ఆమెను శిక్షిస్తావా”.

“తప్పదు. నీ గురించి, నీ ప్రేమ గురించి, నువ్వు అందించే స్వర్గసుఖాల గురించి”

“మీ ఆవిడ అంగీకరిస్తుందా”.

“అంగీకరించాలి”

“ఇద్దరు పిల్లల సంగతో”

“నీ రవికి ఏం జరుగుతుందో.. అదే”.

“రవి నా రక్తం పంచుకుపుట్టిన బిడ్డ. నాతోనే ఉంటాడు. వాడే నా జీవితం”.

“తల్లి మనసు కదా.. పరిమళ కూడా అలాగే ఆలోచిస్తుంది. ఆమె కూడా పిల్లల్ని తన దగ్గర ఉంచుకోవాలనుకుంటుంది. యామై రైట్”.

“చాలా తేలిగ్గా అంటున్నావుగానీ, ఒక పెద్ద తేడా ఉంది. నేను చదువుకుని కొన్నాళ్ళు ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసిన దానిని. కావాలనుకుంటే మళ్ళీ ఓ ఉద్యోగం తేలిగ్గా సంపాదించగలను. నా రవిని బాగా చూసుకో గలను. పరిమళ ఆ పని చేయలేదు..”

“ఆ పరిస్థితే ఎదురైతే పిల్లలకు నేను సహాయం అందిస్తాను”.

‘పరిమళ నీకు డైవోర్స్ ఇవ్వడానికి వ్యతిరేకిస్తే”

“అది జరగదు. అదే జరిగితే మరో మార్గం లేకపోలేదు.”

“ఏమిటది”.

“మనం పెళ్ళిచేసుకోం. కానీ భార్యాభర్తల్లా కలిసి బతుకుతాం. లివ్ ఇన్! ఎవరేమనుకున్నా నాకు లెక్కలేదు”.

శ్రుతి నుంచి ఎటువంటి స్పందనలేదు. కిటికీలోంచి వేగంగా చెదిరి కదిలిపోతున్న దృశ్యాల్ని చూస్తోంది. నిజమే వంశీ దగ్గర కలిసుండడానికి కావల్సిన అన్ని ప్రశ్నలకు సమాధానాలున్నాయి. సుఖాన్వేషణకు తగిన సమీకరణాలున్నాయి. కానీ శ్రుతి మనసు ప్రశాంతంగా లేదు. మనసంతా ఏవో చీకట్లు...

దారి పొడుగునా మౌనం.

హైదరాబాదు చేరుకునే ట్రైను విజయవాడ వచ్చేసింది. శ్రుతిని ఎక్కించాడు. ఎక్కాల్సిన రైలు ఎక్కలేక పోవడం వల్ల ఈ ప్రయాస.

“శ్రుతి... ప్లీజ్ రిలాక్స్. నేను రేపు ఫోన్ చేస్తాను” అంటూ నవ్వాడు. ఆమె నవ్వలేదు. నవ్వు రాలేదు.

రైలు వేగం పుంజుకుంది.

సికింద్రాబాద్ స్టేషన్ వచ్చేసింది. ప్లాట్‌ఫారమంతా హడావిడి. సుధీర్ స్టేషన్‌కు రాలేదు. కాసేపు చూసి ఆటోలో ఇల్లు చేరుకుంది శ్రుతి. కాలింగ్ బెల్ నొక్కగానే పనమ్మాయి తలుపు తీసింది.

“రవి ఎక్కడికెళ్ళాడు” గడియారం కేసి చూస్తూ అడిగింది.

విమల ముఖంలో ఒకలాంటి బాధ.

“అమ్మగారూ, చాలా పెద్ద గొడవ వచ్చి పడింది”.

ఏమిటన్నట్లు చూసింది అసలే అన్యమనస్కంగా ఉన్న శ్రుతి.

“ఏమైందే... రవికి ఏం కాలేదు కదా”.

“అయ్యగారు రవిబాబుని తీసుకుని రాత్రే విశాఖపట్నం వెళ్ళిపోయారు”.

“విశాఖపట్నమా.. దేనికీ” అడుగుతుంటే శ్రుతి గొంతులో ఒకలాంటి వణుకు.

“అయ్యగారు చాలా కోపంతో ఉన్నారు. ఆయనా... మీరు” చెప్పలేక నీళ్ళు నములుతోంది.

“చెప్పవే” అంటూ నీరసంతో సోఫాపైన కూలబడిపోయింది.

“అయ్యగారు మిమ్మల్ని చాలా మాటలన్నారమ్మా. ఎప్పుడూ కోప్పడని రవిని కూడా కొట్టారు. తప్పంతా ఆ ఫోన్ చేసినామెదే”.

“ఫోన్ ఎవరు చేశారు”.

“ఆమె పేరు నాకు తెలవదమ్మా. రాత్రి ఎనిమిది గంటలకు ఒకామె ఫోన్ చేసింది. చాలాసేపు మాట్లాడింది. మీ గురించి ఏవేవో అబద్ధాలు చెప్పినట్లు అనిపించింది. ఎవరో వంశీగారట... ఆయనతో మీరు..” పనమ్మాయి చెప్పుకుపోతోంది. శ్రుతికి ఆమె ముఖం చూసేందుకు ధైర్యం చాల్లేదు.

“ఈ లోకంలో గొడవలు పెట్టేవాళ్ళేనమ్మా అంతా”.

“కొంచెం మంచినీళ్ళు తీసుకొస్తావా” అంటూ శ్రుతి కళ్ళు రెండూ గట్టిగా మూసుకుంది. గుండె పేలుతుందా అనిపించిందా క్షణంలో.

విమల వెళ్ళిపోయింది.

సుధీర్ విశాఖపట్నం వెళ్ళాడంటే విషయాలు తెలుసుకోవడానికే. రాత్రికల్లా ఇల్లు చేరుకుంటాడు. అతన్ని ఎలా ఫేస్ చేయాలి. ఆలోచనలు తేనెటీగల్లా చుట్టుముట్టాయి. నిజం చెప్పేయాలా - ఏడేళ్ళ తమ వైవాహిక జీవితంలో ఎన్నో తేడాలొచ్చి ఉండొచ్చు. గత కొన్నేళ్ళుగా ఒకే ఇంట్లో ఇద్దరి జీవితం అపరిచిత వ్యక్తుల్లా గడుస్తోంది. తనది మధ్య తరగతి కుటుంబం. సుధీర్‌ది బాగా డబ్బున్న ఫ్యామిలీ. ఇన్ఫోసిస్‌లో పని చేస్తున్నాడు. ఓ మీటింగుకు ముంబయి నుంచి వచ్చి చూసి ప్రపోజ్ చేశాడు. తనూ అక్కడే పని చేస్తోంది. అంతా ఓకే అనుకున్నారు. పెళ్ళి జరిగిపోయింది. అతని హోదా బాగా పెరిగింది. తను ఉద్యోగం చేయడం ఇష్టంలేదన్నాడు. బాబు పుట్టాక రిజైన్ చేయాలన్నాడు. ఇల్లు చూసుకుంటే చాలన్నాడు. ‘భార్యాభర్తల్లో ఒకరే కెరీర్‌పై దృష్టి ఉంచాలన్నాడు. డబ్బే కాదు పని ఒత్తిడి కూడా

ఎక్కువే సుధీర్‌కు. ఇద్దరి మధ్య ఆకర్షణ, శృంగారం చాలా త్వరగా తగ్గుతూ వచ్చింది.

ఒంటరితనం ఫీలవడం మొదలైంది శ్రుతికి.

శృంగార భావనలు రేగినప్పుడు అద్దంలో తన అందం చూసుకుంటూ ఉండిపోవడం, యూట్యూబ్‌లో శృంగార చిత్రాలు చూస్తూ కాలక్షేపం చేయడం... ఏదో ఒకలాంటి నిరాశ. అన్నీ ఉన్నా ఏదో లోటు.. అసంతృప్తి... ఆ పరిస్థితుల్లో వంశీ ఫోన్‌కాల్స్ ఆనందపు జల్లులు కురిపించాయి. అతని చిలిపి కబుర్లు జీవితంలో కొత్త కోరికల్ని చిగురింప చేశాయి. ఆలోచనలు అతనిమీదే. ఫోన్‌కాల్ ఆలస్యమైతేనే ఆగలేక పోయినట్లనిపించేది. వయసు, అందం ప్రేమకోసం తపించేలా చేశాయి. వంశీ వలపు పిలుపులు ఆసక్తి రేపాయి. జీవన వీణను శ్రుతి చేసినట్లనిపించింది.

సుధీర్ అమెరికాలో ఉండగా వంశీ బెంగళూరులో పని చేస్తున్నాడు. ఒకసారి వంశీతో కొన్ని గంటల పాటు స్వర్గ సుఖాలు అనుభవించాలనుకుంది. అతగాడి కబుర్లు ఆ మైకం కలిగించాయి.

అయితే అనుకోని అవాంతరాల వల్ల వంశీ వస్తానన్నట్లుగా హైదరాబాదు అప్పుడు రాలేక



పోయాడు. హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నాడు. మార్కెటింగ్ డివిజన్ కావటం చేత టూర్లు ఎక్కువ. అదే ఇబ్బందనిపించింది.

ఆలోచనల్లోంచి బైటపడిన శ్రుతి, వంశీ ఇంటికి ఫోన్‌చేసి మాట్లాడాలనుకుంది. కానీ ఆలోచన మార్చుకుంది. వ్యక్తిగతంగా కలుసుకోవాలని నిర్ణయించుకుంది.

'డ్రీమ్‌హైట్స్' అపార్ట్‌మెంట్స్. వంశీ ఉంటున్న ఫ్లాటు తలుపు కొట్టింది.

ఓ ముప్ఫై ఏళ్ళ యువతి తలుపు తీసింది. కట్టుబొట్టు... ముఖంలో మంచి కళ ఉంది.

"ఏం కావాలి"

"వంశీ ఉన్నారా"

"లేరు... ఏం పని ఆయనతో"

"ఎక్కడికైనా వెళ్ళారా"

"ఊరెళ్ళారు.... వైజాగ్"

ఇంటికి రాలేదన్నమాట.. అనుకుంది.

"పని మీద వచ్చారా"

"లేదు అవును." చిన్న తడబాటు "ఆయన రాగానే ఫోన్ చేయమనండి. నా పేరు శ్రుతి" అంది.

ఆ పేరు వినగానే మతి తప్పింది. ఆమెలో అలజడి ప్రారంభమైంది.

"ఓ మీరా.. శ్రుతి అంటే".

"అవును" శ్రుతి ఆశ్చర్యపోయింది. తను తెలుసునన్నట్టు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చేసరికి"

"పెళ్ళాం దగ్గర తన ప్రస్తావన ఎప్పుడూ తీసుకురాలేదని చెప్పేవాడు వంశీ..." అనుకుంది.

"అలా కూర్చోండి. ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి".

యాంత్రికంగా అడుగులు వేస్తూ వచ్చిన శ్రుతి సోఫాలో కూర్చుంది. పిల్లల బొమ్మలు, బట్టలు, బొమ్మల పుస్తకాలు.. ఎన్నో చిందరవందరగా పడి ఉన్నాయి.

పరిమళ వచ్చి ఎదురుగా కూర్చుంది.

"వంశీ... మీతో తిరిగి రాలేదా"

"నాతోనా.. ఎక్కణ్ణుంచీ"

"మేడమ్, నేను వంశీ భార్య పరిమళను. మీరు అతని ఉంపుడుగత్తె అని తెలుసు. ఆ వ్యవహారాలు నాకు తెలియవనుకోకండి."

శ్రుతి క్షణంపాటు తెల్లబోయినా "సరిగా మాట్లాడండి" అంది.

"ఎందుకు... ఉంపుడుగత్తె అనే మాట మిమ్మల్ని అప్‌సెట్ చేసిందా.. సారీ, పోనీ 'వంశీ ప్రేయసి' అంటే ఇష్టమేనా.. చూడండి శ్రుతిగారూ మాటలు మార్చి అన్నంత మాత్రాన చౌకబారు ప్రవర్తన ఎలా పవిత్రమైపోతుంది".

"షటప్" అంటూ లేచి డోర్ వైపు నడిచింది.

"వంశీకి దూరంగా ఉండండి. మీ వారితోనూ మాట్లాడాను. భార్యను హద్దుల్లో పెట్టుకుని మొగుడిగా సమర్థత నిరూపించుకోమని చెప్పాను.." మీకూ చెబుతున్నా, నా కొంప కూల్చొద్దు".

"నానా రకాలుగా నా భర్తతో మాట్లాడింది మీరేనన్నమాట. సిగ్గులేదు. మా ఇద్దరి మధ్య మీరు ఊహిస్తున్నట్లు ఏం లేదు. ఒకే కాలేజీలో చదువుకున్నాం. అదే పరిచయం".

పరిమళకు నవ్వొచ్చింది. "గత కొంతకాలంగా మా ఆయన.. మీ వంశీ మిమ్మల్ని పొగడ్తలతో ముంచెత్తుతూ నా గుండెకు తూట్లు పొడిచాడు. ప్రతి విషయంలోను ఆఖరికి పడక సుఖం దగ్గర్నుంచీ నీతో నన్ను పోలుస్తూ అవమాన పరుస్తున్నాడు..." ఆవేశంగా చెబుతున్న ఆమె గొంతు జీరబోయింది. కళ్ళనీళ్ళు పైట చెంగుతో తుడుచుకుంది.

"........ ...."

"ఈ ఇంటిని, పిల్లల్ని, వంశీని ప్రేమిస్తున్నాను. వదిలి నా కాళ్ళమీద నేను నిలబడలేను కూడా నీ మాదిరిగా. నా సంసారాన్ని నాశనం చేసి నువ్వు మాత్రం సుఖపడలేవు".

సిగ్గుపడిపోయిన శ్రుతి అక్కడుండలేక పోయింది.

భవిష్యత్తు అంధకారంగా తోచింది. బతుక్కి అర్థం లేదనుకుంది. స్లీపింగ్‌పిల్స్ మింగేసింది. ఆ క్షణంలో అదే పరిష్కారంగా తోచింది.

తెలివి వచ్చేసరికి డాక్టర్లు, నర్సుల మధ్య నర్సింగ్ హోంలో ఉంది.

షాక్‌లో ఉన్న సుధీర్ నెమ్మదిగా వచ్చి శ్రుతి పక్కగా కూర్చున్నాడు.

మౌనం...

రవి అమ్మను ముద్దుపెట్టుకున్నాడు. నీరసంగా దగ్గరికి తీసుకుంది బాబును. సుధీర్‌వైపు చూసింది. చేయి చాచింది. దగ్గరకి రమ్మని సైగ చేసింది. ఆమె కళ్ళనుండి జారుతున్న నీటి బిందువులను తుడిచాడతను.

రోజులు గడిచాయి.

డబ్బు సంపాదనలోనే పడి, ఉద్యోగ బాధ్యతల్లో ఒత్తిళ్ళను ఎదుర్కొంటూ భార్యను అన్నిరకాలుగా నిర్లక్ష్యం చేశాడు తను. సంసారంలో రేగిన తుఫానుకు అసలు కారణం అదే అని గ్రహించాడు సుధీర్. జీవితంలో కెరీర్ ఎంతవరకు? శృంగార జీవితాన్ని నిర్లక్ష్యం చేసే స్థాయిలో ఉండకూడదు అనే ఆలోచన కలిగింది.

సంసారం ఏమైపోతోందన్న ఆలోచన లేకుండా శారీరక సుఖం, మానసిక ఆనందం పరాయి పురుషుడి నుంచి ఆశిస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో శ్రుతికి బాగా తెలిసొచ్చింది. జరిగినదంతా ఒక పీడకలగా భావించింది.

లక్షణమైన భార్య ఉన్నా, పరాయి ఆడదాని పొందు ఇష్టపడే మనస్తత్వం వంశీది. ఏ ఆడదైనా తనకు పడి తీరుతుందన్న కాన్ఫిడెన్స్.

వంశీ మాత్రం ప్రస్తుతం చేసే ఉద్యోగానికి రాజీనామా చేసి ఢిల్లీలో ఒక కొత్త సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాయినయ్యాడు. అయితే భార్యాపిల్లల్ని కూడా తీసికెడితే తన స్వేచ్ఛకు ఆటంకం ఏర్పడుతుందనే ఆలోచన కూడా లేకపోలేదు. ఆర్థిక స్వాతంత్ర్యం లేని అర్ధాంగి ఎక్కడికీ పోదన్న ధీమా ఉంది.

న్యూఢిల్లీ.

వంశీ అందంగా ముస్తాబై ఆఫీసుకు బయలుదేరుతున్నాడు. మరో అందమైన పరిచయం కోసం చేసే అతని అన్వేషణ ఆగినట్లు లేదు. అయినా చేదు అనుభవాలు అందరికీ పాఠాలు నేర్పుతాయని ఎక్కడుంది?

అదిగో 'బ్యూటీఫుల్... యుఆర్ లుకింగ్ గార్జియస్" మాటలు గ్లాస్‌డోర్ వెనక నుంచి.

కోమల్ - ఓ నార్త్ ఇండియన్‌తో వీకెండ్ ఎంజాయ్‌మెంట్ కోసం ప్లాన్ చేస్తున్నాడు వంశీ...

మోహనవంశీ బీటెక్, ఎంబీఏ.

సెల్: 94414 20962

వంటలు

చికెన్ స్నాక్స్

ఎప్పుడూ చికెన్ కూర, చికెన్ బిర్యానీ ఇవేనా! వెరైటీగా ఏం చేసుకోలేమా? అనుకునేవాళ్ళకు ఈ స్పెషల్ చికెన్ స్నాక్స్. సాయంత్రం వేళ వేడివేడిగా కమ్మగా ఆస్వాదిస్తూ నాన్‌వెజ్ తినాలనుకునేవారికి మంచి చాయిస్.

చికెన్ మిర్చీ బజ్జీ

కావలసిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్ - 250 గ్రా, మిరపకాయలు (బజ్జీకాయలు) - 10, పసుపు - చిటికెడు, కారం - టీ స్పూన్, కొత్తిమీర తరుగు - టీ స్పూన్, కరివేపాకు - ఒక రెమ్మ, ఉప్పు - తగినంత, నూనె - వేయించడానికి తగినంత, మైదా - 2 టీ స్పూన్లు, ఉల్లిపాయ తరుగు - 2 టేబుల్ స్పూన్లు

తయారీ పద్ధతి: కుక్కర్‌లో కొద్దిగా నూనె వేసి ఉల్లిపాయలు గోధుమరంగు వచ్చే వరకు వేయించుకోవాలి. అందులో పసుపు, కారం, గరం మసాలా, చికెన్, ఉప్పు, కొత్తిమీర, కరివేపాకు వేసి వేయించాలి. తర్వాత కొద్దిగా నీరు పోసి, కుక్కర్ మూత పెట్టి ఒక విజిల్ వచ్చాక దింపేసి చల్లారనివ్వాలి. తర్వాత మైదాపిండిలో కొద్దిగా ఉప్పు, నీళ్ళు పోసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. కొద్దిగా నూనె అద్దుకొని కలిపితే పిండి మృదువుగా వస్తుంది. పిండిని చిన్న చిన్న ముద్దలుగా తీసుకొని పూరీలా వత్తాలి. తర్వాత పూరీని కత్తితో సన్నసన్నని రిబ్బన్లుగా కట్ చేయాలి. మిర్చీకి గాటు పెట్టి అందులో చికెన్ మిశ్రమాన్ని నింపాలి. ఇలా నింపిన మిర్చీని కట్ చేసిన పూరీ రిబ్బన్ల మీద ఉంచి రోల్ చేయాలి. దీనిని నూనెలో డీప్‌ఫ్రై చేయాలి.

ఓట్స్ చికెన్ టిక్కా

కావలసిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్ - 250 గ్రా, ఓట్స్ - రెండు టేబుల్ స్పూన్లు, బియ్యప్పిండి - రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు - తగినంత, కారం - రెండు టీ స్పూన్లు, పచ్చిబఠాణీలు - రెండు టేబుల్ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - స్పూన్, పెరుగు - 3 టేబుల్ స్పూన్లు, పుదీనా ఆకులు - టేబుల్ స్పూన్

తయారీ పద్ధతి: చికెన్‌ను గ్రైండ్ చేసి పేస్ట్‌లా చేయాలి. ఇందులో ఓట్స్, పెరుగు, పుదీనా పేస్ట్, పచ్చిబఠాణీల పేస్ట్, కారం, ఉప్పు కలపాలి. చిన్న చిన్న ముద్దలు తీసుకొని అరచేతిలో వత్తి బియ్యప్పిండిలో అద్ది నాన్‌స్టిక్ పాన్ మీద వేయించాలి. వీటి తయారీకి నూనె వాడాల్సిన అవసరం లేదు.

చికెన్ పొట్లీ

కావలసిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్- 250 గ్రా (ఉడికించి గ్రైండ్ చేయాలి), బీన్స్ తరుగు, క్యారెట్ తరుగు, ఉల్లికాడల తరుగు - 3 టీ స్పూన్ల చొప్పున, టొమాటో - 1(తరగాలి), సోయాసాస్ - 2 టీ స్పూన్లు, కారం - 2 టీ స్పూన్లు, ఉప్పు - తగినంత, నల్ల మిరియాలు - 5, మైదా - 3 టేబుల్ స్పూన్లు, పాలు - కప్పు, నిమ్మరసం - టీ స్పూన్

తయారీ పద్ధతి: మైదాను పాలతో చపాతీ పిండిలా కలిపి పక్కనుంచాలి. పాన్‌లో నూనె వేడయ్యాక క్యారెట్, బీన్స్, ఉల్లికాడల తరుగు వేసి వేయించాలి. తర్వాత అందులో చికెన్, టొమాటో, సోయాసాస్, ఉప్పు, మిరియాలు కలిపి కొద్దిగా వేగనివ్వాలి. మైదాపిండి చిన్న పూరీలా చేసుకుని అందులో చికెన్ మిశ్రమాన్ని కొద్దిగా పెట్టి, ఉల్లికాడలతో మూటలా కట్టి పొట్లీని తయారుచేయాలి. ఇలా తయారుచేసుకున్న పొట్లీలను ఇడ్లీ పాత్రలో పెట్టి ఉడికించాలి. వీటిని సాస్‌తో వేడివేడిగా తింటే రుచిగా ఉంటాయి.

చికెన్ స్టిక్‌బార్

కావలసిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్ - 250 గ్రా, పచ్చిబఠానీ - 50 గ్రా, బంగాళదుంపలు - 100 గ్రా, గరంమసాలా - టీ స్పూన్, అల్లంవెల్లుల్లి పేస్ట్ - టీ స్పూన్, కారం - 2 టీస్పూన్లు, ఉప్పు - తగినంత, కోడిగుడ్డు - 1

తయారీ పద్ధతి: చికెన్‌కు అల్లం వెల్లుల్లి పేస్ట్ పట్టించి పక్కన పెట్టాలి. తర్వాత స్టవ్‌పై బాణలి పెట్టి చికెన్‌ను మిగతా పదార్థాలతో (కోడిగుడ్డు మినహా) కలిపి ఉడికించి, చల్లారిన తర్వాత మరీ మెత్తగా కాకుండా గ్రైండ్ చేయాలి. ప్లేట్‌లో చాకోబార్ షేప్‌లో చికెన్ మిశ్రమాన్ని సర్ది, దానికి ఐస్‌క్రీం పుల్లను గుచ్చాలి. ఒక పాత్రలో కోడిగుడ్డును గిలక్కొట్టి పక్కన ఉంచాలి. పెనం మీద నూనె వేసి చికెన్ స్టిక్‌బార్‌ని కోడిగుడ్డు మిశ్రమంలో ముంచి రెండువైపులా డీప్‌ఫ్రై చేయాలి. టొమాటో సాస్‌తో కలిపి వేడివేడిగా తినాలి. అంతే.

కాన్‌పురా చికెన్

కావలసిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్ - 250 గ్రా, తెల్ల మిరియాలపొడి - తగినంత, ఉప్పు - రుచికి తగినంత, మైదా - రెండు టీ స్పూన్లు, గుడ్డు - ఒకటి

తయారీ పద్ధతి: చికెన్‌కు మిరియాలపొడి కలిపి అరగంట నాననివ్వాలి. దీనికి కొద్దిగా ఉప్పు కలిపి గ్రైండ్ చేసుకోవాలి. మరో పాత్రలో గుడ్డులోని తెల్లసొన, మైదా, ఉప్పు కలిపి ఉంచాలి. కడాయిలో నూనె కాగిన తరువాత గ్రైండ్ చేసుకున్న చికెన్‌ను పొడవుగా పీసులుగా చేత్తో చేసి, గుడ్డు మిశ్రమంలో ముంచి, కాగిన నూనెలో వేసి వేయించాలి. వీటిని గుండ్రంగా తరిగిన ఉల్లిపాయలు, కొత్తిమీర, నిమ్మముక్కలతో అలంకరించాలి. టొమాటో లేదా సోయాసాస్‌తో వేడివేడిగా సర్వ్ చేయాలి.

ఆరోగ్య సిరి
నల్ల వరి

బియ్యం ఎలా ఉంటాయి?

ఇదేం ప్రశ్న! వింతగా అడుగుతున్నారే! అని ఆశ్చర్యపోతున్నారా? బియ్యం ఎలా ఉంటాయి? తెల్లగా మల్లెపూవులా మెరిసిపోతూ, సన్నజాజిలా సన్నగా, పొడుగ్గా ఉంటాయి. అదే బ్రౌన్‌రైస్ అయితే గోధుమ రంగులో ఉంటాయి అని చెప్పేద్దామనుకుంటున్నారా? మీ ఊహల్ని తారుమారు చేసేలా నల్లగా పొడుగ్గా ఉండేలా బియ్యం గింజలు ఉంటే...?

అదేంటి నల్ల బియ్యమా? అని ఆశ్చర్యపోతున్నారు కదూ! నల్ల బియ్యంతో ఉడకబెట్టి చేసిన నల్లటి అన్నాన్ని మీరు ఊహించుకోగలరా?

బియ్యాలలో రకరకాలు ఉంటాయని తెలుసు.. కానీ నల్ల రకం బియ్యం సంగతి తెలుసా మీకు? అయితే నల్లబియ్యం అనగానే కృత్రిమంగా తయారు చేసింది అనుకునేరు. మన ప్రాచీనకాలం నుంచి అందుబాటులో ఉన్న బియ్యమే ఇవి! పైగా వైట్ రైస్, బ్రౌన్‌రైస్ మాత్రమే కాదు ఈ బ్లాక్‌రైస్ వల్ల కూడా అనేక ప్రయోజనాలున్నాయి. నలుపు రంగును చూసి ఏవగింపు కలగవచ్చునేమోగానీ ఈ బ్లాక్ రైస్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ఆర్థిక ప్రయోజనాలు ఏంటో తెలుసుకోండి మరి!

మనదేశంలో నిరాదరణ

బియ్యం కేవలం మనదేశానికే పరిమితం కాదు చైనా, వియత్నాం, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్, బర్మా వంటి ఎన్నో ఆసియా దేశాల్లో ఇది ప్రధాన ఆహారం. బియ్యంలో చాలా రకాలున్నాయి. కానీ మన దేశంలో మాత్రం తెల్ల బియ్యానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అయితే ఎన్నో విలువైన పోషకాలు కలిగి ఉండి ఆరోగ్యాన్ని ఇచ్చే నల్ల బియ్యం మనదేశంలో నిరాదరణకు గురైందనే చెప్పవచ్చు. పూర్వకాలంలో ఈ నల్ల బియ్యాన్ని నిషిద్ధ బియ్యం అని పిలుచుకునేవారు. ప్రాచీన మానవులు వివిధ రకాల వరి వాడి వాటిలో నల్ల బియ్యం తదితరాలను వాడడానికి అనుకూలమైనవిగా ఎంపిక చేసుకున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

గొప్పవారి ఆహారం

పురాతన చైనాలో కేవలం గొప్పవారికే ఈ నల్ల బియ్యం తినడానికి అనుమతి ఉండేది. గొప్పింటి ప్రజలు తప్ప వేరేవారు తినేవారు కాదు. దాంతో కాల క్రమేణా ఇది నిషిద్ధ బియ్యంగా మారిపోయి అందరూ దీన్ని తినకుండా ఉంటున్నారు. ఈశాన్య భారత రాష్ట్రాలలో నల్ల బియ్యం వినియోగం అధికమే. ఔషధ గుణాల వల్ల మణిపూర్ ప్రజలు నల్లబియ్యాన్ని బాగా ఇష్టపడతారు. పండుగల సందర్భంగా నల్ల బియ్యంతో చేసిన పాయసాన్ని అక్కడ ప్రత్యేకంగా తింటారు కూడా! మణిపూర్, కర్ణాటక రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలలో ఈ బియ్యాన్ని ఎక్కువ పండిస్తున్నారు. చైనాలో ఎప్పట్నుంచో వినియోగిస్తున్న ఈ నల్ల బియ్యాన్ని శాస్త్రవేత్తలు ఇప్పుడు సూపర్ ఫుడ్‌గా అభివర్ణిస్తున్నారు.

శక్తినిచ్చే పోషకాలు

ఇది పేరుకే బ్లాక్ రైస్ కానీ దీనిని ఉడకబెట్టిన తర్వాత నలుపు రంగు పోయి ఎర్ర రంగులోకి తేలుతుంది. తెల్లబియ్యంతో పోలిస్తే నల్ల బియ్యంలో బి, ఇ విటమిన్లు, నియాసిన్, కాల్షియం, మెగ్నీషియం, ఇనుము, జింకు వంటి ఖనిజ విలువలూ అధికమే. పీచు పదార్థం పుష్కలంగా ఉంటుంది. నల్ల బియ్యం ఆంకోసైనిక్స్ యాంటి ఆక్సిడెంట్లుగా పని చేయడమే కాక రోగనిరోధక ఎంజైమ్‌లను క్రియాశీలం చేస్తాయి. బ్లాక్‌రైస్‌లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొన్నిచోట్ల స్వీట్స్ తయారీలో కూడా నల్ల బియ్యం ఉపయోగిస్తున్నారట.

రోగనిరోధక శక్తి పెంపు

అమెరికాలోని లూసియానా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో గోధుమ రంగు బియ్యంతో పోలిస్తే ఈ బ్లాక్ రైస్‌లోనే విటమిన్-ఇ ఎక్కువగా ఉంటుందని తేలింది. అంతేకాదు ఈ బియ్యంలో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువ ఉంటాయని దీన్ని ప్రతి రోజు

ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ

బ్లాక్‌రైస్ గురించి బాగా తెలుసుకోవాలంటే ఎవరైనా అస్సాంలోని గోల్ పరా రాష్ట్రానికి వెళ్లాల్సిందే. ఎందుకంటే అక్కడి రైతులు ఈ నలుపు రంగు బియ్యాన్ని సాగు చేస్తున్నారు. అంతేకాదు, అధిక దిగుబడులు సాధిస్తున్నారు. అక్కడ సుమారు 200 మంది రైతులు ఈ పంట పండిస్తున్నారట. ప్రస్తుతం మార్కెట్లో ఈ నల్లబియ్యం కిలో 100 రూపాయలు పలుకుతోంది. ఎన్నో ఔషధ గుణాలు, విటమిన్లు, పోషకాలు కలిగి ఎంతో శక్తి నిచ్చే నల్లబియ్యం సాగును సమర్థవంతంగా మన దేశంలో అమలులోకి తెస్తే రైతుల ఆదాయం అన్ని రెట్లు పెరుగుతుంది. ఈ నల్ల వరి గొప్పదనం ఏంటంటే పోషకాలతో పాటు చీడ పీడా పట్టకుండా ఉండడంతో పాటు ఎలాంటి ఎరువుల సాయం లేకుండా పెరుగుతుంది. అంతేకాదు మామూలు వరి సాగుకు పట్టే సమయం 135 రోజులైతే, ఈ నల్ల వరి సాగు కేవలం వంద రోజుల్లోనే పూర్తయి దిగుబడి చేతికి వస్తుంది. దీనికి నీటి అవసరం కూడా చాలా తక్కువే.

ఎలాంటి రసాయన ఎరువుల అవసరం లేకుండానే ఈ వరి పంట పెరుగుతుంది. ఈ పంట ఎంత బలమైనదంటే ఎలాంటి దోమ పురుగు దీని జోలికి రావడం కష్టం. అంతేకాదు ఈ పంటను పొలంలో కోత కోసిన తర్వాత కూడా ఆ కోసిన మొక్కల నుంచి కొత్త ధాన్యం వస్తుండడంతో వ్యవసాయ అధికారులు సైతం ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

తింటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టం అవుతుందని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు.

గుండెకు మంచిది

నల్లబియ్యంతో వండిన అన్నం తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు వెల్లడిస్తున్నారు. దీనిలో ఉండే ఎంథోసియానిన్ సైకో కెమికల్స్ శరీరంలో కొవ్వును సక్రమంగా ఉంచేలా దోహదం చేస్తాయి. అలాగే కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. దీనివల్ల గుండెకి సంబంధించిన వ్యాధులు తగ్గే అవకాశాలున్నాయట.

జీర్ణ సంబంధ వ్యాధుల నియంత్రణ

బియ్యాలలో ఉన్న రకాలలో తెల్ల బియ్యం, గోధుమ రంగు బియ్యం మాత్రమే కాదు, బ్లాక్‌రైస్‌ని కూడా ఎక్కువ ఫైబర్ ఉన్న బియ్యంగా చెప్పుకోవచ్చు. ఒక కప్పు బ్లాక్‌రైస్‌లో రెండు నుంచి మూడు గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఈ ఫైబర్ ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, గ్యాస్ట్రిక్ సమస్యల్ని పరిష్కరించడానికి, కడుపు ఉబ్బరం తగ్గించడానికి దోహదపడుతుంది. అలాగే అందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రాపర్టీస్ కడుపులో మంటను తగ్గిస్తాయి.

డయాబెటిస్ అదుపు

కొన్ని రకాల పరిశోధనల ద్వారా తేలిందేంటంటే బ్లాక్‌రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా డయాబెటిస్‌ను తగ్గించుకోవచ్చట. కార్బోహైడ్రేట్‌లతో కూడిన ఆహారం కన్నా బ్లాక్‌రైస్ అత్యుత్తమమైనది. ఈ రైస్ తినడం వల్ల డయాబెటిస్‌కి సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయట. ఇందులో ఉండే ఫైబర్ టైప్ 2 డయాబెటిస్ వల్ల వచ్చే రిస్క్‌లను తగ్గిస్తుంది.

ఒబేసిటీని తగ్గిస్తుంది

ఒబేసిటీని తగ్గించే కొన్ని రకాల ధాన్యాలపై ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో తేలిందేంటంటే బ్లాక్‌రైస్‌ను రోజూవారి ఆహారంలో భాగం చేసుకుంటే ఒబేసిటీ నుంచి తప్పించుకోవచ్చట. అలాగే అందులో ఉండే పోషకాలు శరీరంలో ఇన్సులిన్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దానివల్ల ఒబేసిటీ వల్ల వచ్చే సమస్యలు తగ్గుతాయి.

శరీర బరువు తగ్గడానికి

బరువు తగ్గాలనుకునేవారు బ్లాక్‌రైస్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే సరి. కడుపు నిండుగా ఉందనే ఫీలింగ్ కలిగిస్తుంది బ్లాక్‌రైస్. ఇందులో ఉండే ఫైబర్ వల్లనే ఎక్కువ సమయం ఇలాంటి ఫీలింగ్‌లో ఉండగలుగుతాం. దీంతోపాటు శరీరానికి శక్తిని కూడా అందిస్తుంది. అంతేకాక బ్యాడ్ కొలెస్ట్రాల్‌ను తొలగించి బరువును అదుపులో ఉంచేలా చేస్తుంది.

కళ్లకు మంచిది

బ్లాక్‌రైస్‌లో ఆంథోసియానిన్స్ ఉంటాయి. అవి కంటి సంబంధమైన వ్యాధులను నయం చేస్తాయి. రోజూ బ్లాక్‌రైస్ తింటుంటే కాటరాక్ట్, మాక్యులర్ క్షీణత, చూపు క్రమ క్రమంగా మందగించడం లాంటి సమస్యలను తగ్గించడమే కాదు ఒకవేళ అలాంటి సమస్యలేమైనా ఉంటే వాటి ప్రభావాన్ని తగ్గిస్తుంది. అలాగే దీనిపై ఓ పరిశోధన చేసినపుడు తేలిన విషయమేంటంటే కంటిచూపును ఇది మెరుగుపరుస్తుందని.

ఆస్తమా తగ్గుతుంది

బ్లాక్ రైస్ తిన్నట్లయితే ఆస్తమా వల్ల వచ్చే ఇబ్బందులు తొలగిపోతాయి. శ్వాస సంబంధమైన వ్యాధుల వల్ల వచ్చే ఇబ్బందులను కూడా ఈ ఆహారం తొలగిస్తుంది. అయితే ఆస్తమా పూర్తిగా దీనివల్లే తగ్గుతుందని చెప్పలేం. ఆస్తమా వల్ల వచ్చే ఇబ్బందులను తొలగించుకోవడానికి ఇది ఒక ప్రత్యామ్నాయం మాత్రమే.

క్యాన్సర్ నియంత్రణ

నల్ల బియ్యం కాన్సర్ కణాలు వ్యాప్తి చెందకుండా నిరోధిస్తాయని శాస్త్రజ్ఞులు, వైద్యనిపుణులు చెబుతున్నారు. గడ్డలను, పుట్టకురుపులనూ నిరోధిస్తాయంటున్నారు. గడ్డలు, కురుపుల పెరుగుదలకు తోడ్పడే రక్తనాళాలు ఎదగకుండా నిరోధిస్తాయి. క్యాన్సర్ కారకాలు ఇతర కణజాలాన్ని వేరుచేయడంతో పాటు క్యాన్సర్ కణజాలం వ్యాప్తి చెందకుండా అరికడతాయని చైనాకు చెందిన ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు లీపింగ్‌లువో, ఆయన పరిశోధక బృందం పరిశీలనలో నిర్ధారణ అయింది. నల్ల బియ్యంలో పుష్కలంగా లభించే ఆంథోసియానిన్స్ మహిళలలో ఇటీవల కాలంలో అధికంగా వస్తున్న రొమ్ము క్యాన్సర్ నిరోధానికి తోడ్పడుతాయంటున్నారు. రొమ్ము క్యాన్సర్‌కు దారితీసే కణజాలం వ్యాప్తి చెందకుండా ఆంథోసియానిన్స్ రోగ నిరోధకాలుగా పనిచేస్తాయి.

అందాన్ని తెచ్చిపెడుతుంది

నల్లబియ్యంతో ఉడికించిన గంజిని తలకు పట్టించి స్నానం చేస్తే వెంట్రుకలు బలంగా, అందంగా నిగనిగలాడుతూ కనిపిస్తాయని ఈశాన్య రాష్ట్రాల్లో మహిళల నమ్మకం. అంతేకాదు ఈ బియ్యం గంజి ముఖానికి రాసుకుంటే ముఖం మీద మచ్చలు, మొటిమలు తగ్గుముఖం పడతాయి. ముఖ వర్చస్సు పెరుగుతుంది.

-సంతోషి దహగాం

డీఎన్ఏ దెబ్బతినకుండా

ఈ నల్లబియ్యంలో చక్కెర తక్కువగా ఉండడమే కాదు ఆరోగ్యాన్ని కాపాడే పీచు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా దండిగా ఉంటాయని లూసియానా రాష్ట్ర విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో వెల్లడైంది. బ్లాక్‌బెర్రీలో కన్నా అధికమైన ఆంథోసియానిన్స్ ఆక్సిడెంట్లు కేవలం చెంచాడు నల్లబియ్యం తవుడులో దొరుకుతాయి. చక్కెర మోతాదు తక్కువగానూ పీచు, విటమిన్-ఇ ఎక్కువగా ఉంటాయి. నిషిద్ధ బియ్యంగా పిలిచే ఈ నల్ల బియ్యం మానవ డీఎన్ఏ దెబ్బతినకుండా కాపాడుతుంది. క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుంది.

మనిషికి రెండు కళ్ళు

-పి.వి.డి.ఎస్. ప్రకాష్

"మాస్టారూ! మీరు షర్ట్ విప్పాల్సిందే" అడక్కుండానే పక్కనున్న వ్యక్తి అలా ఓ ఉచిత సలహా పడేసేసరికి ఒళ్ళు మండిపోయింది ఆనందరావుకి. 'వీడేంటి, కాస్త తేడాగా ఉన్నాడు. బొత్తిగా సభ్యతా సంస్కారం తెలీదు కాబోలు' లోలోన విసుక్కున్నాడు ఆనందరావు. అయితే ఆ విసుగుని ఏమాత్రం గమనించని ఆ వ్యక్తి తాను చెప్పదలుచుకున్నదేదో చెప్పేయాలనే తీర్మానించుకున్నాడు. అందుకే అతడు మరికాస్త ముందుకు జరిగి చనువుగా ఆనందరావు కళ్ళల్లో కళ్ళు పెట్టి సూటిగా చూస్తూ "మాస్టారూ! నేనెందుకు చెప్తున్నానో కాస్త అర్థం చేసుకోండి...ప్లీజ్! ఒకవేళ అర్థం చేసుకోలేదో ఇక్కడే ఇప్పుడే ఓ ఘోర అవమానాన్ని ఎదుర్కొంటారు" హెచ్చరించాడు నవ్వుతూనే.

"వట్టి అధిక ప్రసంగి. నిజంగా వీడు కాస్త తేడానే" నిర్ధారణకొచ్చాడు ఆనందరావు.

తర్వాత అడిగాడు - "ఏం అవమానం?"

"ఇలా మీరు చొక్కాతోనే ఉండండి. ఆ అవమానం ఏంటో ఎదురైనప్పుడు మీకే తెలుస్తుంది" అన్నాడావ్యక్తి.

వచ్చినదగ్గర నుంచీ వాడినోకంట కనిపెడుతూనే ఉన్నాడు ఆనందరావు. రాగానే నేలమీద గబుక్కున కూచుని పద్మాసనం వేశాడు. తర్వాత ఒక్కసారి గదంతా కలయచూసి ఒంటిమీద ఉన్న చొక్కా గుండీల్ని ఒక్కొక్కటిగా విప్పుతూ వచ్చాడు. ఆఖరి గుండీ విప్పిన తర్వాత చొక్కా తీసి భుజానికి తగిలించుకున్నాడు. అటుపై ఆచ్ఛాదన లేని గుండెలపై గుబురుగా పెరిగిన తెల్లటి వెంట్రుకల్ని నిస్సిగ్గుగా ప్రదర్శనకి ఉంచి చిర్నవ్వులు చిందిస్తూ ఎక్కడలేని దర్జా ఒలకబోస్తున్నాడు. "వాడి ఖర్మ. ఎలాగోలా కూచున్నాడ'ని ఆనందరావు సర్దిపుచ్చుకున్నా ఉన్నవాడున్నట్టు ఉండడే? 'తగుదునమ్మా!' అంటూ ఉచిత సలహాలిస్తున్నాడు. అసలు తనేంటో, సొసైటీలో తన స్థానమేంటో తెలీకుండా పెచ్చరిల్లిపోతున్నాడు. పేరు మోసిన జర్నలిస్ట్ తను. రాష్ట్రంలో ఏ పుణ్యక్షేత్రాని కెళ్ళినా రెడ్‌కార్పెట్ వెల్‌కమ్. 'వీఐపి' ట్రీట్‌మెంట్. ఇవాళ్టికివాళ తెల్లవారుజామునే ఈ క్షేత్రంలో కూడా శ్రీమతితో సహా 'క్యూ'లో నిలబడకుండా స్వామివారి దర్శనం క్షణాల్లో చేసుకున్నాడు. కౌంటర్లో నిలబడి అలసిపోకుండా లడ్లు, ప్రసాదాలు తనదగ్గరకే తెప్పించుకున్నాడు. అంతటి పరపతి ఉన్న తనలాంటివాడు ఏదో దయతలచి ఇక్కడికిలా వస్తే సంతోషంతో కిందపడి దొర్లకుండా పక్కనున్న వీడెవడో ఎర్రతేలులా సన్నసన్నగా కుట్టేస్తున్నాడు.

కోపం పెల్లుబుకుతోంది ఆనందరావుకి. సెకను సెకనుకీ నషాళానికంటుతున్న ఆ కోపాన్ని లోలోనే బలవంతంగా అణచుకుంటున్న ఆనందరావు-"ఎవడో...ఎక్కడివాడో...ఇక్కడ పంక్తిలో నా పక్కన మహా అయితే ఓ అరగంట కూచుంటాడు. వచ్చిన పని పూర్తయి బయటకెళ్తే, ఇక వాడెవడో, నేనెవరో? ఇతడితో నాకెందుకు?" మనసులోనే అనుకున్నాడు.

అయితే ఆ పక్కవాడు ఊరుకుంటే కదా! ఆనందరావుని మళ్ళీ గిల్లాడు. 'ఏవండీ, మిమ్మల్నే' ఈసారి కాస్త గట్టిగానే పిలిచాడు. వాడివేపు చురుగ్గా చూస్తూ-"ఇంతకీ...నీ నసేంటీ?" చికాగ్గా అడిగాడు ఆనందరావు.

"నసో...గిసో! మీరేమనుకుంటే నాకేం. ఒక్క విషయం చెప్తున్నా. ఎందుకైనా మంచిది. ఎంచక్కా ముందు ఆ షర్ట్ తీసేయండి. ఒకవేళ మీ ఒంటిమీద బనీను కూడా ఉంటే... అదీ తీసేయండి"

"తీసేసి..."

"వెంట తెచ్చుకున్న బ్యాగ్‌లో ఓ తువ్వాలేదైనా ఉంటే అది తీసుకుని..."

"తీసుకుని..."

"భుజం మీద వేసుకుని..."

"వేసుకుని"

"ఇంకా చెప్పేదేముందండీ? సుష్టుగా భోం చేసి మరీ వెళ్ళండి"

"ఒంటిమీది వలువలు తీస్తే కానీ ఇక్కడ భోంచేయడం కుదరదా?" అడిగాడు ఆనందరావు.

"కుదరదంటే కుదరదు" కుండబద్దలు కొట్టి నట్టు చెప్పాడతడు.

"ఛీ...ఛీ! పొద్దున్నే ఎవరి మొహం చూశానో ఏంటో? వీడితో బుద్ధులు చెప్పించుకోవాల్సి వస్తోంది. ఎవరితో ఎలా మాట్లాడాలో అస్సలు తెలీని అక్కుపక్షిగాడు నాకు నీతులు చెప్తాడా?" చెంపమీద అయిదువేళ్ళూ అతుక్కునేలా లాగి ఒక్కటివ్వాలన్నంత కసితో కళ్ళెర్రబడ్డాయి. కాల్చి బూడిద చేస్తానన్నంత కోపంతో ఉడికిపోతున్నాడు. అయినా, ఆ వ్యక్తినేం చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.



"అసలు నా గురించి వీడేమనుకుంటున్నాడు? తిండికి కరువై ఆకలితో అలమటిస్తూ ఇలా ఇక్కడికి వచ్చాననుకుంటున్నాడా? తలుచుకుంటే క్షణాల్లో స్టార్ హోటల్లో ఖరీదైన భోజనమే చేయగలడు తను. ఏదో శ్రీమతి కోరిక కాదనలేక ఇదిగో... ఇక్కడికి....ఈ సత్రానికి వచ్చి ఇలా బుక్కయిపోయాను" ఆవేశంగా చూశాడు ఈ పక్కనున్న శ్రీమతి అలిమేలు మంగతాయారు వేపు.

తర్వాత తాపీగా "చూశావా...ఈ నసగాడు ఏమంటున్నాడో? ఇక్కడ షర్ట్ విప్పాలట" అన్నాడు నీరసంగా.

"ఇంట్లో కూడా మీకు షర్ట్‌తోనే తినడం అలవాటు కదా. ఇక్కడా అలాగే చేయండి" నెమ్మదిగా అంది శ్రీమతి.

"ఫర్వాలేదా?"

"మరేం ఫర్వాలేదు" కళ్ళతోనే ఓదారుస్తూ అంది.

గంట క్రితం -

దైవ దర్శనం చేసుకున్న తర్వాత ఏదో హోటల్‌కి వెళ్ళి భోంచేసి తిరుగు ప్రయాణమవుదామనుకుంటుండగా...."ఏమండీ" గట్టిగా అరిచింది అలిమేలు మంగతాయారు.

"ఏమైందే...? అంత గావుకేక పెట్టావ్" ఆనందరావు.

"అదిగో...అటు చూడండి" శిఖర దర్శనం కనిపించినంత ఆనందతన్మయత్వంతో కూడిన గొంతుతో అంది. ఆమె చూపుడు వేలు సారించిన వేపు తను ఓ చూపు చూశాడు ఆనందరావు.

"అన్నపూర్ణమ్మగారి అన్నదాన సత్రం..." పెద్ద క్షరాల్లో ఓ బోర్డు కనిపించింది.

"ఆ...అయితే..."

"ఇవాళ ఆ సత్రంలో భోంచేద్దామండీ. ఇలాంటి క్షేత్రాల్లో అలాంటి సత్రాల్లో భోంచేస్తే పుణ్యం రెట్టింపవుతుంది కూడా. ఏదో హోటల్లో కూచుని ఎవరెవరో వండిన పదార్థాలు తినే బదులు ఇక్కడే భోంచేస్తే మంచిదేమో?" చెప్తోంది అలిమేలు.

నిజానికి ఇలాంటి సత్రాల్లో తినడం అంటే ఆనందరావు అవమానంగా భావిస్తాడు. 'సత్రం కూడు, మఠం నిద్ర' పనీపాటాలేని వ్యక్తులకు సంబంధించినవేనని గాఢంగా నమ్ముతాడు కూడా. ఏపూటకాపూట ఎన్నో ఇక్కట్లకు గురవుతూ కూటికి గతిలేని పేదలే ఈ సత్రాల్లో ఇంత అన్నం తిని కడుపు నింపుకుంటారనే అభిప్రాయం అతడిది. అందుకే ఎన్ని యాత్రలు చేసినా, ఒక్కసారంటే ఒక్కసారి సత్రంలో అడుగు పెట్టేందుకు, అక్కడ తినేందుకు అంగీకరించలేదు. అలాగే సహధర్మచారిణి అయినందుకు అలిమేలు మంగతాయారుకీ అలా సత్రంలో తినే అవకాశం కల్పించలేదు. అయితే ఈసారి అలిమేలు మంగతాయారు పట్టినపట్టు వీడలేదు.

"ఏమండీ....ప్లీజ్! ఈ ఒక్కసారి నా కోరిక మన్నించరూ! ఇక్కడి సత్రంలో భోజనం బాగు లేకపోతే జీవితంలో మళ్ళీ ఈ కోరిక కోరను. మీరు చెప్పినట్లే మీతో హోటల్ భోజనానికే వస్తా... ఓటు వేస్తా" అంతలా శ్రీమతి అడిగేసరికి ఆనందరావు కాదనలేకపోయాడు. ఎన్నోసార్లు మొండిగా తన పంతం నెగ్గించుకున్నాడు. ఈసారికి ఆమె మాట కాదనడం ఎందుకు? నిశ్చయానికొచ్చాడు.

ఆ తర్వాత ఆ ఇద్దరూ అన్న సత్రంలోని కౌంటర్ దగ్గరికి వెళ్ళారు.

"గోత్రం..."

"కౌండిన్యస...."

"ఎక్కడ దిగారు?"

చెప్పాడు ఆనందరావు.

ఓ కూపన్ ఇచ్చాడు కౌంటర్లోని వ్యక్తి. ఆ కూపన్ తీసుకుని లోనికి వచ్చి ఇలా బుక్కయిపోయాడు ఆనందరావు. ఇప్పటికే ఆ సత్రంలోకి బిలబిలమంటూ ప్రవేశించిన చిన్నా పెద్దా ముసలీముతకా... మగాళ్ళంతా ఒంటిపై ఉన్న చొక్కాల్ని నిస్సిగ్గుగా విప్పేసి ముందుజాగ్రత్తగా తమతో తెచ్చుకున్న ఓ తువ్వాలుని పై ఆచ్ఛా

దనగా వేసుకుంటున్నారు. తర్వాత ఒకే తరహా చీరలు ధరించిన ఆడవాళ్ళు నలుగురైదుగురు లోపలికి వచ్చారు. వాళ్ళలో ఒక్కొక్కరూ ఒక్కోపని అందిపుచ్చుకుని చకచకా చేస్తున్నారు. పంక్తిలో కూచున్న ప్రతి ఒక్కరి ముందూ ఒకరు అరిటాకులు వేస్తూంటే...ఇంకొకరు స్టీలు గ్లాసులు పెడ్తున్నారు. ఆ వెనుకే వస్తున్న మరొకరు ఆ గ్లాసులో మంచినీళ్ళు పోస్తున్నారు. ఓ ముసలావిడ కూడా తనకు తోచిన సేవ చేయాలనే సత్సంకల్పంతో కాబోలు చిటికెడు ఉప్పు తీసుకుని ప్రతి ఒక్కరి ఆకుల్లో వేస్తోంది. పప్పు, రెండు కూరలు, ఘుమఘుమలాడుతున్న ఎర్రెర్రని దోసావకాయ, పొంగలి, పాయసం ఇలా పదార్థాలన్నిటినీ శ్రద్ధగా వడ్డిస్తు న్నారు.

దోసావకాయ నోరూరిస్తుంటే ఓ ముక్క తీసుకుని నోట్లో వేసుకోబోయిన ఆనందరావు ఒక్కసారిగా ఆగిపోయాడు.

"ఒరేయ్! వడ్డన పూర్తి కాకుండా విస్తట్లో ఎవ్వరూ చేతులు పెట్టకూడదు. ఇదీ మన ఆచారం. అంతేకాదు. ఇక్కడికి వేదపండితులు వచ్చి మంత్రాలు చదివిన తర్వాతే ఎవరైనా ముద్ద ముట్టేది" ఎదురుగా ఉన్న పంక్తిలో ఓ తండ్రి ఒక్కో విషయాన్నీ విడమర్చి చెప్తుంటే పక్కనున్న ఆ కుర్రాడు ఆసక్తిగా వింటున్నాడు. ఎందుకో హఠాత్తుగా ఆనందరావుకి తండ్రి గుర్తుకువచ్చి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. సరిగ్గా తనకూ ఎదురుగా ఉన్న పిల్లవాడి వయసు ఉన్నప్పుడే తండ్రి తనకు ఉపనయనం చేసి గాయత్రి ఉపదేశించాడు. ఒక్కసారిగా షర్ట్‌లోపల తడుముకున్నాడు ఆనందరావు. పవిత్ర యజ్ఞోపవీతం ఇప్పుడక్కడ లేదు. ఆ జంధ్యం ఒంటికి వేలాడుతుంటే స్వేచ్ఛగా సమాజంలో తిరగలేననే సంకుచితత్వం తనలో కలగడంతో....ఆ బాధ భరించలేక ఓ రోజు తనే...తెంచేసి బయటపారేశాడు.

ఇంతలో అక్కడకొచ్చిన ఏడేళ్ళ వయసున్న చిన్న పిల్లలిద్దరు సుస్వరాల్తో లయబద్ధంగా వేద మంత్రాలు పఠిస్తున్నారు. ఆ వేదఘోషతో అక్కడి ప్రాంతం యజ్ఞవాటికనే తలపిస్తోంది. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఎక్కడెక్కడివాళ్ళో ఇలా ఒకచోటకు చేరి సహపంక్తిలో కూచోవడం ఎంతో హృద్యంగా ఉంది. వీళ్లల్లో చాలామంది ఇక్కడే అప్పుడప్పుడు కలుసుకుంటున్నారు కాబోలు...ఒకర్నొకరు ఆత్మీయంగా చూసుకుంటూ చిర్నవ్వుల్తో పలకరించుకుంటున్నారు. 'ఏ ప్రాంతంలో ఉన్నా మనం మనం ఒకరికొకరం' అనే ఐక్యతా మంత్రాన్ని వల్లె వేస్తోంది ఈ స్థలి.

ఇప్పుడు...ఇన్నాళ్ళకి ఇక్కడ ఈ సత్రంలో కూచున్న ఆనందరావు ఓ ఉపనయన కార్యక్రమంలోనో, ఓ పెళ్ళివేడుకలోనో దగ్గరివాళ్ళతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న అనుభూతికి లోనవుతున్నాడు. సరిగ్గా అప్పుడే ఎదురుగా గోడపై అక్షరాల్ని చదివాడు-'దయచేసి సత్రం పవిత్రత కాపాడండి. భోజనానికి ముందు మీ షర్టులు, బనియన్లు విప్పండి.'

చుట్టూ చూశాడు. ఎదురుగా ఉన్న చిన్న పిల్లవాడు సైతం షర్టు విప్పాడు. ఇక్కడికి వచ్చిన తర్వాత కచ్చితంగా ఇక్కడి నియమాలు పాటించాల్సిందే. ఆ చిన్నపిల్లవాడిని చూసైనా బుద్ధి రాకుంటే, అది తన వయసుకి గౌరవం కాదు అనుకున్నాడు ఆనందరావు. ఇంతసేపూ తన పక్కనున్న వ్యక్తి చెప్తున్న హితోక్తుల్ని పట్టించుకోకపోవడం ఎంత తప్పో అతడికి తెలిసివచ్చింది.

"వడ్డనలు పూర్తయ్యాయి. ఇక, అంతా భోంచేయవచ్చు" తెల్లపంచె, ఒంటిమీద ఉత్తరీయం, నెత్తిపై పిలక ఉన్న వేద పండితుడొకరు చెప్పారు. ఆ సూచనతో ప్రతిఒక్కరూ భోజనానికి ఉపక్రమించారు.

ఇంతలో పక్కనున్న వ్యక్తి "మాస్టారూ! ఇప్పటికైనా ఆ షర్ట్ విప్పండి" సూచిస్తున్నాడు. అప్పటికే తను చేస్తోంది పొరపాటని గుర్తించిన ఆనందరావు షర్ట్ గుండీ ఒకొక్కటిగా విప్పబోతుండగా, అప్పటివరకూ అక్కడ పెద్దగా నిలుచున్న వేదపండితుడు ఆనందరావు దగ్గరికి వచ్చి ఎదురుగా నిల్చున్నాడు.

"దయచేసి మీరు చొక్కా విప్పి భోంచేయండి. అది మన సంప్రదాయం. మన సంస్కృతి. మన ఆచారం. మడి,తడి, ఆచార వ్యవహారాలున్న ఇళ్లల్లోని మగాళ్ళు ఇలా చొక్కాల్తో కూచుని భోజనం చేయరు కదా! అపుడెపుడో చిన్ననాడు ఉపనయన సమయంలో వేదపండితుల సమక్షంలో ఎంతో

మాస్టారూ చొక్కా విప్పేయండి. లేకుంటే అవమానాల పాలవుతారు అని పక్కన కూర్చున్న పెద్ద మనిషి చెప్పాడు. ఒళ్ళు మండిపోయింది ఆనందరావుకి. వీడేంటి తేడాగా ఉన్నాడు. చొక్కా విప్పేయమంటాడేంటి! బొత్తిగా సభ్యతా సంస్కారం తెలియదని తిట్టుకున్నాడతడు. కానీ కాసేపటికి అతడికే అర్థమైంది, చొక్కా విప్పక తప్పదని. ఇంతకీ అతడెందుకు చొక్కా విప్పాల్సివచ్చింది?

నిష్ఠగా రహస్యంగా మీ తండ్రి మీ చెవిలో ఉపదేశించిన ఆ గాయత్రీ మంత్రానికి అపవిత్రత తేకండి...." చెప్తున్నాడు. అప్పటికే ఆనందరావు షర్ట్ ఆఖరి గుండీ విప్పేశాడు. అయితే, అతడలా చెప్పిందానికి కించిత్ కూడా బాధపడలేదు. తప్పు చేసినదానికి దండన తప్పదు అనుకున్నాడంతే.

ఇంతలో-

అక్కడో హఠాత్ సంఘటన జరిగింది. పంక్తి చివరన ఖాళీగా ఉన్న ఓ అరిటాకు దగ్గరకి ఎవరో ఆగంతకుడు వచ్చి కూచోవడమే కాకుండా వేడి వేడి అన్నాన్ని ఆబగా నోట్లో వేసుకుని తినేస్తున్నాడు. ఎన్నాళ్ళబట్టి ఆకలితో నకనకలాడుతున్నాడో ఏమోగానీ...అన్నాన్ని చూడగానే అతడికి ప్రాణం లేచివచ్చినట్లయింది. అరిటాకులో వడ్డించిన అన్నాన్ని గుప్పెడు గుప్పెడుగా తీసుకుని నోట్లో కుక్కేసుకుంటున్నాడు.

"ఒరేయ్...లేరా? ఇది అడుక్కు తినేవాళ్ళ సత్రం కాదు. అన్నపూర్ణమ్మగారి సత్రం. ఇక్కడ ఓ సామాజికవర్గం వాళ్ళే పవిత్రంగా భోంచేయాలి. అంతేకానీ....మీలాంటివాళ్ళకి ఇక్కడ ప్రవేశం లేదు" అంటూ ఓ నలుగురు వ్యక్తులు వాడి రెక్కలు పుచ్చుకుని లేపేందుకు ప్రయత్నించారు. అంతేకాదు... వాళ్ళలో ఒకడు అక్కడి వేదపండితుడితో - "అయ్యగారూ క్షమించాలి. మేమెంత పహారా కాసినా మా కళ్ళు గప్పి వీడు లోనికి వచ్చేశాడు స్వామీ. ఇక్కడ్నుంచి వీడిని వెంటనే తరలించేస్తాం" వేడుకుంటున్నారు.

అయితే ఆ వేదపండితుడు శాంతంగా చూసి- "తప్పు...తప్పు. అన్నం దగ్గర్నుంచి అతన్ని లేపకండి" అన్నాడు. ఆ పండితుడి దగ్గర్నుంచి ఆ మాట వచ్చేసరికి అవాక్కయిపోయిన ఆ నలుగురు వాడిని వదిలేశారు. సహపంక్తి భోజనం చేస్తున్నవాళ్ళంతా ఆ సన్నివేశానికి ఆశ్చర్యపోయారు.

జరుగుతున్న సంఘటనలేమీ పట్టించుకోకుండా వాడు ఆబగా తింటూనే ఉన్నాడు.

అరగంట తర్వాత- "అన్నదాతా సుఖీభవ" అన్న వేదపండితుని ముగింపు వాక్యంతో భోజనాలు ముగించిన అక్కడి జనాలు తమ తమ స్థానాల నుంచి లేచారు...ఆనందరావు దంపతులతో సహా.

"భోజనాలు బాగున్నాయి. వంటలు రుచిగా ఉన్నాయి. డబ్బు పెట్టి ఏ హోటల్లో భోంచేసినా



ఇంతటి సంతృప్తి రాదు మనకి. నిజంగా ఇంట్లో పండగ భోజనం చేసినంత ఆనందంగా ఉంది” అలిమేలు మంగతాయారు అంటోంది. ఆ మాట ఒప్పుకోవాల్సిందే. వంటలు భేషుగ్గా ఉన్నాయి. స్వామివారి సందర్శనం కోసం ఎక్కడెక్కడి నుంచో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఇక్కడికొచ్చే యాత్రికులకు కడుపునిండా ఇంత అన్నం పెట్టడం ఎంత పుణ్యకార్యం. అన్నపూర్ణమ్మ నిజంగా అన్నపూర్ణే...అనుకున్నాడు ఆనందరావు కూడా.

“ఇక....బయల్దేరదామా?” అలిమేలు అంది.

“ఓ చిన్న సందేహం తీర్చుకున్న తర్వాత” అన్నాడు ఆనందరావు.

“మీరే పెద్ద జర్నలిస్టు. మీకూ సందేహమేనా?” భార్య మాటలకి చిన్నగా నవ్వాడతను.

ఇంతలో ఇందాకటి వేదపండితుడు కనిపించాడతనికి. ఆయనకి ఎదురేగాడు ఆనందరావు నమస్కరిస్తూ.

“క్షమించండి. అంతమందిలో మిమ్మల్ని అవమానపరిచాను” మనస్ఫూర్తిగా అన్నాడు వేద పండితుడు ఆనందరావుతో.

“మన సంస్కృతి సంప్రదాయాల ప్రకారం ఈ సత్రాన్ని నిర్వహిస్తున్నాం. ఇక్కడికొచ్చే ప్రతి ఒక్కరూ ఈ నియమాల్ని పాటించేలా చేస్తే ఆరిపోతోందనుకున్న మన ఆచార వ్యవహారాల్ని రెండు చేతులూ అడ్డుపెట్టి కొంతలో కొంత కాపాడుకోవచ్చు కదా!” ఆ పండితుడు చెప్తున్నాడు.

“అంతా బాగానే ఉంది కానీ...ఇందాకా భోజనపంక్తిలోకి దూసుకొచ్చిన ఆ ఆగంతకుణ్ణి అలా వదిలేసారేం స్వామీ? శుచి, శుభ్రత, పవిత్రత.... అంటూ పెద్ద పెద్ద కబుర్లు చెప్తున్న పండితులే క్షణానికో పద్ధతి పాటిస్తే ఎలా? ఈ సత్రం కేవలం ఓ వర్గానికి చెందిన యాత్రికులకు భోజన సౌకర్యం కల్పించేందుకు మాత్రమే ఆవిర్భవించింది. మారుతున్న కాలమాన పరిస్థితులను కూడా పట్టించుకోకుండా షర్టు, బనీన్ విప్పి తీరాల్సిందేనంటూ పట్టుపట్టే మీలాంటి పండితులే కులగోత్రనామాలేంటో తెలీని ఓ అర్భకుడు..ఓ ఆగంతకుడు వచ్చి అక్కడ సహపంక్తిలో కూచున్నా ‘కిమ్మనకపోవడం ఏ ఆర్షధర్మం? అదేం సంప్రదాయం? అదేం సంస్కృతి?” అడుగుతున్నాడు ఆనందరావు.

“ఆదిశంకరాచార్యుల గురించి మీకు తెలుసా?” అడిగాడు వేదపండితుడు.

“తెలుసు”

“ఆయన కన్నా మనం గొప్పవాళ్ళమా? ఛండాలుడు ఎదురొస్తే నమస్కరించిన మహానుభావుడాయన” అన్నాడు పండితుడు.

“ఔను...ఆ ఛండాలుడిలోనూ పరమాత్మనే చూశాడాయన” చెప్పాడు ఆనందరావు.

“కదా.. ఆ ఆగంతకుడిలోనూ నాకు పరబ్రహ్మ స్వరూపమే కనిపించింది. ఆకలి తీర్చే అన్నం పరబ్రహ్మ స్వరూపమే కదా! ఆ అన్నానిది ఏ సామాజిక వర్గం, ఏ కులం, ఏ మతం? ఆ ఆగంతకుడివల్ల ఇప్పుడే నా కళ్ళు తెరుచుకున్నాయి. ఆకలికి కులం లేదు. మతం లేదు. అది అందర్నీ పీడిస్తుంది. అందుకే ఇకమీదట ఈ అన్నపూర్ణమ్మ సత్రం అందరి సత్రంగా మార్చాలనుకుంటున్నా. ఇవాళ నేను నేర్చుకున్న కొత్త పాఠం ఇదే” చెప్తున్నప్పుడు ఆ వేద పండితుడి కళ్ళు చెమర్చడం గమనించాడు ఆనందరావు.

“ఔను. నా కళ్ళు కూడా తెరుచుకున్నాయి. ఇంతకాలం నేనే పెద్ద జర్నలిస్టును అని విర్రవీగాను. స్వామివారి సందర్శనాన్ని పరపతితో జయించి గొప్పవాడినని పేట్రేగిపోయాను. స్టార్ హోటళ్ళలో తినగలిగే ఆర్థికస్థితి ఉందనే అహంకారంతో అన్నసత్రంలో తప్పుగా ప్రవర్తించాను. ఈ యాత్రతో నా కళ్ళు తెరుచుకున్నాయి” వెళ్ళిపోతున్న వేదపండితుడి అడుగుజాడల్ని అత్యంత శ్రద్ధాభక్తులతో గమనిస్తూ అనుకున్నాడు ఆనందరావు.

“ఇక వెళ్దామా?” దగ్గరికి వచ్చి అడిగింది అలిమేలు.

“వెళ్దాం. కానీ, ఇంటికి కాదు”

“మరి....”

“దైవ దర్శనానికి. ఈ రాత్రి ఇక్కడే ఏ మఠంలోనో ఉండి రేపు ఉదయాన్నే క్యూలో నిల్చుని ధర్మదర్శనం చేసుకున్న తర్వాతే మనింటికి వెళ్దాం. మంచితనం, మనిషితనం మనిషికి రెండు కళ్ళని ఈ క్షేత్రంలో వెలసిన స్వామి నాకు గొప్ప పాఠమే చెప్పాడు. అంతేకాదు. స్వధర్మ పరిరక్షణ కూడా అత్యవసరమని చెప్పాడు.” చెప్తున్నాడు భార్యతో ఆనందరావు. కొత్తగా కనిపిస్తున్న భర్త వంక ఆశ్చర్యానందాలతో చూస్తుండిపోయింది అలిమేలు మంగతాయారు.

సెల్ 9000544160

బాలీవుడ్‌లో బోర్లాపడ్డ సమంత

దక్షిణాది హీరోయిన్లను బాలీవుడ్ ఎప్పుడూ ఊరిస్తూనే ఉంటుంది. కొంతమంది బాలీవుడ్‌కి వెళ్ళడమే తమ అంతిమ లక్ష్యం అన్నట్టు మాట్లాడితే మరికొందరు అక్కడికి వెళ్ళాలన్న ఆశ ఉన్నా అవకాశం రాకపోయేసరికి బాలీవుడ్ పెద్ద గొప్ప కాదు అన్నట్టు మాట్లాడుతుంటారు. ఈ విషయంలో సమంతకి మినహాయింపేమీ లేదు. ఇన్నాళ్ళూ బాలీవుడ్ వెళ్ళే ఉద్దేశం లేదంటూ పైకి కబుర్లు చెప్పినా లోపల్లోపల అక్కడ పాదం మోపడానికి తన వంతు ప్రయత్నాలు చేసుకుంటూనే ఉంది! ఇటీవల బాలీవుడ్‌లో ఓ అవకాశం వచ్చింది. దాదాపు ఆ సినిమా చేయడం ఖాయం అనుకునే సమయంలో ఎదురు దెబ్బ తగిలింది. బాలీవుడ్‌లో చేయబోయే సినిమాలో బికినీ సీన్లు ఎక్కువ ఉన్నాయని ఆ సినిమా దర్శకనిర్మాతలు చల్లగా చెప్పారు. ఒకటి రెండుసీన్లంటే పర్వాలేదుకానీ, అంతకు మించి అయితే కష్టం కదా? అనుకుంటూ సమంత మీనమేషాలు లెక్కపెట్టడం మొదలెట్టింది. ఈ గ్యాప్‌లో శ్రుతి ఆ అవకాశాన్ని తన్నుకుపోయింది. ఎన్ని సీన్లయినా నో ప్రాబ్లమ్ అంటూ శ్రుతి అనేసరికి ఆ సినిమా దర్శకనిర్మాతలు శ్రుతికే ఓటు వేశారట! అలా సమంత అక్కడ బొక్కబోర్లా పడింది అంటున్నారు టాలీవుడ్ జనాలు.

హమ్మయ్య! నేను సేఫ్

'శరత్ ఈ కేసు కాస్త జటిలంగా ఉంది. అందుకే నిన్ను పిలవమన్నాను' గదిలోకి అడుగు పెట్టిన డిటెక్టివ్ శరత్‌తో అన్నాడు ఇన్‌స్పెక్టర్ విజయ్. నవ్వాడు శరత్.

'వ్యాపారి జేమ్స్ అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఆ సమయంలో ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. ఆత్మహత్యా లేక హత్యా అనేది తెలియటం లేదు. భార్య కాన్ఫరెన్స్ నిమిత్తం కలకత్తా వెళ్లింది. ఆ రోజు జేమ్స్ రాత్రి తొమ్మిదిన్నర నుంచి పది వరకూ భార్యతో ఫోనులో మాట్లాడి, ఇక నిద్రపోతానని చెప్పాడు. తెల్లారి ఫోను చేస్తే ఎంతకీ ఫోను తీయలేదు. ఆమె పక్కింటి వాళ్లకి ఫోను చేసింది. వాళ్లు తలుపులు విరగ్గొట్టి చూస్తే బెడ్‌రూమ్‌లో జేమ్స్ శవం కనిపించింది, పోస్ట్‌మార్టం రిపోర్టు ఇంకా రాలేదు' గబగబా చెప్పాడు విజయ్. సహజ మరణం అంటే అతని భార్య ఒప్పుకోవటం లేదు. అదీగాక...'

'అదీగాక?' ప్రశ్నించాడు శరత్.

'ఒకవేళ హత్య అయితే భార్య నీహారికే ప్రథమ అనుమానితురాలవుతుంది'.

శరత్ కళ్లు ఎగరవేశాడు.

'వారిది ప్రేమ వివాహం. పెళ్లై రెండేళ్ళయింది. అమ్మాయి నీహారిక హిందూ. జేమ్స్ క్రిస్టియన్. పెద్దల్ని ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. ఎవరి మతాన్ని వాళ్ళు అనుసరించాలన్నది వారి మధ్య ఒప్పందం. జేమ్స్ కుటుంబం ఈ పెళ్ళిని మొదట ఒప్పుకోలేదు. తరువాత ఆదరించారు. కానీ నీహారికని వాళ్ళింట్లో వాళ్లు పూర్తిగా వదిలేశారు. వాళ్ల నాన్న అయితే వారసుల జాబితాలోంచి అమ్మాయిని తొలగించాడు' చెప్పాడు విజయ్.

'దీన్లో అనుమానించేదేం లేదు' అన్నాడు శరత్.

'జేమ్స్ స్నేహితుల్నీ, నీహారిక స్నేహితుల్నీ పోలీసులు ప్రశ్నించినప్పుడు నీహారిక ఫ్రెండ్స్ ఓ విషయం చెప్పారు. పెళ్లయిన మొదటి ఆరు నెలలూ సవ్యంగానే ఉందట. జేమ్స్ కుటుంబ సభ్యులు వీళ్ళ పెళ్ళిని అంగీకరించినప్పటి నుంచీ గొడవలు మొదలయ్యాయట. మతం మారమని నీహారికను ఒత్తిడి చేయడం మొదలు పెట్టారట. ప్రేమకు, మతానికి సంబంధం లేదని చెప్పి ఆమె మొండికేసిందట. దాంతో గొడవలు పెరిగాయని, నీహారిక తమ వద్ద బాధపడేదని స్నేహితులు చెప్పారు. కానీ నీహారిక మాత్రం అలాంటిదేమీ లేదంటోంది'.

'భర్తను చంపటానికి అది కారణం కాక పోవచ్చు' ఆలోచిస్తూ అన్నాడు శరత్.

'ఏడాది క్రితం జేమ్స్ రెండున్నర కోట్ల పాలసీ తీసుకున్నాడు. జేమ్స్ మరణం వల్ల అదంతా ఆమెకే దక్కుతుంది' అన్నాడు విజయ్.

'నేనోసారి శవం దొరికినప్పటి ఫోటోలు చూడాలి' అన్నాడు శరత్.

అందించాడు విజయ్.

బెడ్‌రూమ్‌లో మంచంపై ఉంది శవం. మనిషి నిద్రిస్తున్నట్టు ఉన్నాడు. ఫోటోల్ని జాగ్రత్తగా పరిశీలించాడు. శవం ముఖాన్ని క్లోజప్‌లో తీసిన ఫోటో చూస్తూ ఆగిపోయాడు శరత్. దాన్ని జాగ్రత్తగా పరిశీలించి, విజయ్‌కి అందించాడు.

'ఇది చూసిన తరువాత నాకూ అనుమానం వచ్చింది. జేమ్స్‌కు గుండె సమస్యలు, బీపీ లాంటి వేవీ లేవు. ఆరోగ్యవంతుడే. మరి, అతడు హఠాత్తుగా నిద్రలో ఊపిరి అందక ఎలా మరణించి ఉంటాడు? ఎవరైనా ఊపిరి అందకుండా చేయాలి, లేక, తనంతట తాను ఊపిరి అందకుండా చేసుకోవాలి. రెండోది జేమ్స్ ఉన్న పరిస్థితులలో అసంభవం. మొదటి దానికి ఆధారాలు లేవు. అదీ సమస్య' అన్నాడు విజయ్.

'ముఖం మీద చర్మం కింద రక్తనాళాలు ఉబ్బి ఎర్రగా కనిపిస్తున్నాయి. జాగ్రత్తగా ముఖంపై దిండో, ఇతర మెత్తటి వస్తువో ఉంచి ఊపిరి అందనీయకుండా ఒత్తటం వల్ల కావాలని హత్య చేసినట్టు ఆనవాళ్లు కనిపించవు. కానీ ఈ ఒత్తిడివల్ల రక్తం అందని ముక్కు, మూతి ప్రాంతాలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే పాలిపోయి ఉంటాయి. ముఖంపై సయనాసిస్ లక్షణాలున్నాయి. అంటే, రక్తప్రసరణ ఆగటంవల్ల చర్మం కింద నీలిరంగు 'పాచెస్' ఉన్నాయి. కాబట్టి, తనంతట తాను ఊపిరి అందకుండా చేసుకుని ఉండక పోతే ఎవరో ఊపిరి అందకుండా చేసి చంపేశారు' అన్నాడు శరత్ నిశ్చయంగా.

'ఎవరు?' అడిగాడు విజయ్.

'అది కనుక్కోవటమే మన పని' అంటూ లేచాడు శరత్.

భార్య ఊళ్లో లేని సమయంలో ఇంట్లోనే అనుమానాస్పదస్థితిలో మరణించాడతడు. భార్యకు రెండున్నర కోట్లు బీమా సొమ్ము ముడుతుంది. కానీ తన భర్తను ఎవరో చంపి ఉంటారంటోంది భార్య. కేసు డిటెక్టివ్ శరత్‌కు అప్పగించారు. డిటెక్టివ్ రంగంలోకి దిగి కేసు జల్లెడ పట్టాడు. బీమా సొమ్ము కోసం భర్తను చంపేసి భార్యే నాటకం ఆడుతోందా? ఈ కేసులో శరత్ సంపాదించిన సాక్ష్యాలు ఏమిటి? అసలు జరిగిందేమిటి?

●●●

'అందరూ నన్ను అనుమానించటం బాధగా అనిపిస్తోంది. చెప్పింది నీహారిక.

'భర్త హఠాత్తుగా మరణిస్తే భార్యని, భార్య హఠాత్తుగా మరణిస్తే భర్తని అనుమానించటం సహజం' అనునయంగా అన్నాడు శరత్.

'నాకు కారణం ఏమి ఉంటుంది'

'మీకూ ఆయనకీ గొడవలవుతున్నాయి. రెండున్నర కోట్ల పాలసీ నీకు వస్తుంది'.

నీహారిక శరత్‌వైపు విచిత్రంగా చూసింది. తరువాత లేచి నిలబడింది.

'గెటౌట్. ఈసారి నా ముందుకు వారంట్‌తోటే రండి అంటూ, శరత్ ముఖం మీదే తలుపు వేసేసింది.

●●●

'బాస్.. నీహారిక, జేమ్స్‌ల ఫోను వివరాలు సేకరించాను. జేమ్స్ మంచివాడని అతడి సన్నిహితులంటున్నారు' చెప్పాడు అసిస్టెంట్ రాము.

'వాళ్ళిద్దరికీ ఇతర వ్యవహారాలేమైనా ఉన్నాయా?'

'లేదు. నీహారిక ఊళ్లో లేనప్పుడు శ్యామ్‌తో గడుపుతాడు జేమ్స్. వాళ్లిద్దరూ క్లాస్‌మేట్స్'.

'జేమ్స్ మరణించిన రోజు శ్యామ్ ఎక్కడున్నాడు?'

'భార్య, పిల్లలతో ఇంట్లోనే ఉన్నాడు'.

'శామ్‌కు నీహారికకు మధ్య...?'

'బాస్.. శ్యామ్ నీహారికకు నచ్చలేదు. శామ్ ఇంటికి రాకూడదని నియమం పెట్టింది'.

'సరే, శ్యామ్‌ని కలుద్దాం' అన్నాడు.

●●●

'షి ఈజ్ ఎ బిచ్. అప్రయత్నంగా అన్నాడు శ్యామ్.

'ఎందుకని?' అడిగాడు శరత్

'నీహారికను ప్రేమిస్తున్నానని జేమ్స్ పొరపడ్డాడు. వల వేసి అతడి వెంటపడి, వాణ్ణి అందరికీ దూరం చేయాలని చూసిందామె. కానీ కుదరలేదు. అందుకే చంపించి ఉంటుంది. ఆమె ఫ్రెండ్ రంజిత్ ఒక గూండా. ఊరు వెళ్తూ వాడికి పని అప్పజెప్పిందేమో. తాళం చెవి గురించి అడిగాడు. తాళం చెవులు ఒకటి జేమ్స్ దగ్గర, రెండోది నీహారిక దగ్గర ఉంటాయి. స్పేర్ కీ ఉంటేనే లోపలికి

వచ్చి చంపడం సాధ్యం' అన్నాడు శ్యామ్ కసిగా.

●●●

పెద్దగా నవ్వాడు రంజిత్. శ్యామ్ ఒట్టి వెధవ. వాడికి జేమ్స్ డబ్బులిచ్చి పోషించే వాడు. అది నీహారికకు నచ్చలేదు. జేమ్స్‌ని డబ్బులు ఇవ్వనివ్వలేదు. అదే వాడి కోపం. ఇక జేమ్స్‌ని చంపటం, చంపించడం అనేది మీరు నిరూపించాలి' అన్నాడు రంజిత్.

'రామూ, ఈ రంజిత్ నేపథ్యం, నీహారికతో ఉన్న సంబంధం గురించి పరిశోధించు' చెప్పాడు శరత్.

●●●

"జేమ్స్ కంటే రంజిత్‌కే నీహారిక ఎక్కువ సార్లు ఫోను చేసింది. జేమ్స్‌తో మాటలు అయిదు పది నిమిషాలే. కానీ రంజిత్‌తో గంటలుగంటలు మాటలు. నీహారిక బ్యాంకు ఎకౌంట్ వివరాలు పరిశీలించాను. అనువూనించదగిందేం లేదు. రంజిత్ బ్యాంక్ ఎకౌంట్‌లో ఎప్పుడూ డబ్బులకు కటకటే కనిపిస్తోంది. కానీ అతని ఎకౌంట్‌కి పెద్ద మొత్తాల ట్రాన్స్‌ఫర్లు లేవు. జేమ్స్ ఎకౌంట్‌లో కూడా అనుమానాస్పదమైనదేం లేదు" చెప్పాడు రాము.

పోస్ట్‌మార్టమ్ డాక్టర్‌కి ఫోను చేశాడు శరత్.

'హత్య అని అనుమానించటానికి ఆధారాలున్నాయి. ముఖ్యంగా, ఊపిరి అందనప్పుడు జేమ్స్ తనపై ఒత్తిడి పెడుతున్న వారిని తోసేయాలని ప్రయత్నించినట్టున్నాడు. అతని చేతి వేళ్లకు అంటిన సూక్ష్మ ఫైబర్లున్నాయి. ఎవరో బాగా తాగించి హత్య చేసి ఉంటారు' చెప్పాడు డాక్టర్. చాలా సేపు ఆలోచించి ఓ నిశ్చయానికి వచ్చిన వాడిలా విజయ్ దగ్గరకు బయల్దేరాడు శరత్.

'సీజ్ చేసిన జేమ్స్ ఇంటి తాళం తీశాడు విజయ్.

అతన్ని అనుసరించాడు శరత్. రెండు బెడ్ రూమ్‌లు, కిచెన్ , హాలు. కలయచూశాడు. శవం దొరికిన బెడ్‌రూమ్, తర్వాత కిచెన్ చూశాడు. సింకులో పడి ఉన్న రెండు గాజు గ్లాసులను ప్లాస్టిక్ కవర్‌లో వేసుకున్నాడు. చెత్త డబ్బాలో బాటిల్స్ కనిపించేసరికి శరత్ ముఖం నవ్వుతో వెలిగిపోయింది. రాముకి ఫోన్ చేశాడు.

●●●

'ఎంత పర్‌ఫెక్ట్‌గా నేరం చేసినా ఏదో ఓ పొరపాటు చేస్తారు. నేరస్థుడు తప్పించుకోలేడు' గంభీరంగా అన్నాడు శరత్.

ఇంతలో రాము వచ్చి ఓ కాగితం శరత్‌కిచ్చాడు. నీహారిక, శ్యామ్, రంజిత్‌లను కలియచూశాడు శరత్.

'జేమ్స్‌ని ప్రేమించకముందు నుండీ నీహారిక, రంజిత్ మధ్య స్నేహం ఉంది. జేమ్స్ అడ్డు తొలగిపోతే వాళ్ళకి ఫ్రీగా ఉంటుంది'.

'నీహారిక, నేను మంచి ఫ్రెండ్స్ అంతే. తన బాధలు చెప్పేది. ఓదార్చి, ధైర్యం చెప్పేవాణ్ణి. అంతకు మించి మా మధ్య ఏమీ లేదు' అరిచాడు రంజిత్.

'నీహారికను జేమ్స్ పెళ్లి చేసుకోవటం శ్యామ్‌కు ఇష్టం లేదు. దీనికి తోడు జేమ్స్ నుంచి శ్యామ్‌కి డబ్బు ముట్టకుండా చేసింది కాబట్టి శ్యామ్ నీహారికను చంపాలిగానీ జేమ్స్‌ను కాదు కదా' రంజిత్ అరిచినా పట్టించుకోకుండా చెప్పాల్సింది చెప్పాడు శరత్.

జేమ్స్‌ది సహజ మరణం కాదు. అతనితో కలిసి తాగినవారు అతడికి బాగా తాగించి తరువాత ముఖంపై దిండుపెట్టి ఒత్తి చంపేశారు. తరువాత అన్నీ శుభ్ర పరచి వెళ్ళిపోయారు. అలా చేసింది ఎవరు?' అందరినీ కలయచూశాడు శరత్.

'జేమ్స్ కిచెన్ రూమ్‌లోని సింకులో తాగిన గ్లాసులు కనిపించాయి. నేరస్థుడు తెలివిగా ఆ గ్లాసులపై వేలిముద్రలు తుడిచిపెట్టేసి సేఫ్ అనుకున్నాడు. బాటిల్స్ డస్ట్‌బిన్‌లో పారేసి ఇంకా సేఫ్ అనుకున్నాడు. కానీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందిందంటే, వేలిముద్రలు ఎంతగా తుడిచినా, గ్లాసుకు అంటి ఉన్న బాక్టీరియాల ఆధారంగా ఆ వ్యక్తిని గుర్తించవచ్చు. ఆ బాటిల్స్ ఏ దుకాణంలో , ఎవరు కొన్నారో తెలుసుకోవచ్చు. జేమ్స్ ఇంటికి దగ్గరలో ఉన్న వైన్ షాపులో ఈ బాటిల్స్ కొనటం వల్ల మా పని సులభం అయింది. నీహారిక ఊరెళ్ళిపోగానే శ్యామ్‌ని ఇంటికి పిలిచాడు జేమ్స్. వస్తూ బాటిల్స్ తెచ్చాడు శ్యామ్. దుకాణం వాడు శ్యామ్ ఫోటో చూసి గుర్తుపట్టాడు.

'ఇంపాజిబుల్' అరిచాడు శ్యామ్. 'నేను ఆ బాటిల్స్ మిలటరీ క్యాంటీన్ నుంచి తెచ్చాను. దుకాణంలో కొనలేదు. వాడు అబద్ధం....' అంటూ పొరపాటు గ్రహించి మాట మధ్యలోనే ఆపేసి నోరు మూసుకున్నాడు శ్యామ్. గదిలోంచి పరుగెత్తబోయాడు. అందుకోసమే ఎదురు చూస్తున్న విజయ్, రాము అతడిని బంధించారు.

'శ్యామ్‌కి జేమ్స్‌కి చాలా సన్నిహిత సంబంధం ఉంది. అది అసహజ సంబంధం. అందుకే జేమ్స్ శ్యామ్‌కి డబ్బులిచ్చే వాడు. అయితే నీహారికతో పెళ్లయిన తరువాత జేమ్స్ శ్యామ్‌ని దూరం పెట్టాడు. డబ్బులిచ్చి పొమ్మనేవాడు. అది శ్యామ్‌కి నచ్చలేదు. ఇంతకుముందులానే ఆ అసహజ సంబంధం కావాలని కోరాడు శ్యామ్. జేమ్స్ ఒప్పుకోలేదు. ఫలితంగా జేమ్స్ చేత తాగించి హత్య చేశాడు. నేరం నీహారిక పైకి వెళ్తుందనుకున్నాడు. కానీ నేరం చేసినవాడు తప్పించుకోలేడు' అన్నాడు శరత్.

-కస్తూరి మురళీకృష్ణ

సెల్: 98496 17392

నిండు నూరేళ్ళు

9

-సింహప్రసాద్ సెల్: 98490 61668

“మిణుకుమిణుకుమని వెలుగుతోన్న ఒక్క దీపమూ గుప్పుమని ఆరిపోయింది విజితా. నా కెరీర్ ఫినిష్డ్!” ఫోన్లో చెప్పాడు విహాన్.

నా గుండెల్లో పిడుగు పడింది. “ఏవిటి విహాన్? ఏవిటి నువ్వంటున్నది?”

“ఆర్జే జాబ్ పోయింది. రోడ్డున పడ్డాను..”

విహాన్ గొంతునిండా అంతులేని నిరాశ! నిస్పృహ!

కదలిపోయాను. కలవరపడ్డాను. కన్నీరు పెట్టుకున్నాను.

“డోంట్ లూజ్ హార్ట్. ఏదో ఒకటి దొరుకుతుంది..”

“అందాకా బతకాలిగా!”

“అదేం మాట?”

“నిష్ఠూర సత్యం! మళ్ళీ వెనక్కెళ్ళి బౌన్సర్ని కాలేను. నా కలల్ని మరచిపోలేను. త్రిశంకుస్వర్గంలో వేళ్ళాడాల్సిందే!”

“ఐడియా. మా డాడీ సాయం తీసుకుందాం”.

“ఏ రకంగా?”

“ఆయనకి సినిమా రంగంలో ఎందరో ఫ్రెండ్సు ఉన్నారు. వారెవరికైనా చెప్పి నీకు బ్రేక్ ఇప్పించమని అడుగుతాను”.

“హెల్ప్ చేస్తారంటావా?”

“హీ ఈజ్ మై ఫాదర్... నువ్వుకూడా వస్తావా కలిసి అడగొచ్చు..”

“నాకు మొఖం చెల్లదు”.

“సరేలే. నేను అడుగుతాన్లే. సాయంత్రానికల్లా నీకు గుడ్ న్యూస్ చెప్పకపోతే అడుగు”.

“ఏ పుట్టలో ఏముందో! వేచి చూస్తాను.”

నాన్న రూంలో కెళ్ళాను. ల్యాప్టాప్లో ఏదో చూసుకుంటున్నారు.

చప్పుడు చేయకుండా కూర్చున్నాను.

తలెత్తి నన్ను చూశారు. “రాత్రి చాలా వెయిట్ చేసినట్టున్నావ్..”

“యస్ డాడ్. మీతో కొంచెం మాట్లాడాలి..”

ల్యాప్టాప్ పక్కకి తోసి, “ఇప్పుడు చెప్పు” అన్నారు.

“విహాన్కి ఏదీ కలిసి రావట్లేదు. టాలెంట్ ఉంది. కష్టపడగల సత్తా ఉంది. అయినా అదృష్టం చిన్న చూపు చూస్తోంది. ప్రామిస్లు చేస్తున్నారు తప్ప ఎవరూ బ్రేక్ ఇవ్వడం లేదు. తానేమో డిస్కరేజ్ అవుతున్నాడు. డిస్టర్బ్ అవుతున్నాడు. మీరు మీ కనెక్షన్స్ ఉపయోగించి అతడికి లిఫ్ట్ ఇస్తారేమోనని...”

“భలేదానివే. అవసరమైతే ఎందుకివ్వను? మరీ తప్పకపోతే అతన్ని హీరోగా పెట్టి నేనే సినిమా తీసేస్తాను”.

“డాడీ!”

కనురెప్పలు మూసి తెరచి నవ్వారు. “నువ్వింకా ఈ డాడీని అర్థం చేసుకోలేదు బేబీ. అతడు టీవీలో బాగానే రాణిస్తున్నాడు కదా. సడన్గా ఏమైంది విజ్జీ..”

తడబడ్డాను. “కొందరు కావాలని ఏవో రూమర్స్ స్ప్రెడ్ చేశారు..”

“న్యూస్లో ఉండటానికి అలాంటివి కావాలనే క్రియేట్ చేస్తుంటారు. అలాంటిదేనా?”

“అహహ... మరేవిటంటే..”

“ఓకే. లీవిట్. లెట్ మీ థింక్...”

ఒక నిమిషం ఆలోచించారు. ఫోన్లో కాంటాక్ట్ నెంబర్లు వెదికారు.

ఒక నెంబరుకి ఫోన్ చేశారు.

“నాయుడూ ఎలా ఉన్నావ్... నాకో పర్సనల్ హెల్ప్ కావాలి. ఏం లేదు, నాకు బాగా కావాల్సిన కుర్రాడున్నాడు. నైస్ గై. టీవీలో నటించాడు. గుడ్ యాక్టర్. అతడికి మీ సినిమాల్లో అవకాశం ఇవ్వాలి. సపోర్టివ్ రోల్ అయినా ఫరవాలేదు. రికగ్నిషన్ వచ్చేదైతే చాలు. ఓకే పంపిస్తాను. థాంక్యూ..”

చెప్పలేనంత ఆనందం నన్ను చుట్టేసి ఉక్కిరి బిక్కిరి చేసింది.

“జెమినీ నాయుడు గురించి వినే ఉంటావు. సీనియర్ ప్రొడ్యూసర్. అతడేదో లోబడ్జెట్లో సినిమా ప్లాన్ చేస్తున్నట్టు చెప్పాడు. వచ్చి కలవమన్నాడు. నేను పంపించానని చెప్పి వెళ్ళి కలవమను..”

“థాంక్యూ డాడ్! థాంక్యూ వెరీమచ్..” నాన్న చెయ్యి పట్టుకుని ఊపేశాను.

“నువ్వు నాకు థాంక్స్ చెప్పడం ఏవిటి విజ్జీ. విహాన్ బాధ్యత నాది కాదూ? అతడు ఉన్నత స్థితికి చేరాలని నీకన్నా ఎక్కువగా కోరుకుంటున్నాను తెలుసా?”

“మీదింత గొప్ప మనసు అనుకోలేదు...”

“పిల్లలు పేరెంట్స్ అయ్యాకే తమ తల్లిదండ్రుల్ని కరెక్ట్గా అర్థం చేసుకుంటారు.”

మందహాసం చేశారు.

ఆ మర్నాడే విహాన్ని తీసుకుని జెమినీ నాయుడు ఆఫీసు కెళ్ళాను. నేను కారులో ఉండిపోయి అతన్ని లోపలికి పంపించాను.

నిమిషాలు యుగాల్లా గడుస్తున్నాయి.

లోపల్నుంచి వస్తూనే థమ్సప్ సైన్ చూపించాడు.

ఎగిరి గంతేశాను.

“కంగ్రాట్స్... రిసీవింగ్ బాగుందా?”

“రెడ్కార్పెట్ పరిచారు. సెల్లో నా ఫోటోలు, టీవీ సీరియల్లోని ఓ సీన్ చూపించాను. ఫ్లాట్ అయ్యారు. హీరో రోల్కి సూటవుతానన్నారు. ఫోటోసెషన్ ఏర్పాటు చేస్తానన్నారు..”

“ఇక నీకు తిరుగుండదు. చుక్కలు చూస్తావు. నా ప్రెడిక్షన్ తప్పదు చూడు”.

“మా వాళ్ళని ఒకస్థాయికి తీసుకు రాగలిగితే చాలు, ధన్యుణ్ణి అవుతాను” ఆలోచనగా అన్నాడు.

“ఇంతచేసిన నన్ను మర్చిపోయావేంటి. నాకేమీ చెయ్యవూ!?” నిష్టూరంగా అన్నాను.

“నేనే నీ వాణ్ణిగా!”

“నాటీ.. బుగ్గ పొడిచాను.”

“అంకుల్కి థాంక్స్ చెప్పు. వేషం కన్ఫర్మ్ అయ్యాక వచ్చి కలసి థాంక్స్ చెబుతాను”.

“నువ్వు వృద్ధిలోకొస్తే సంతోషించే వారిలో మా డాడీయే ఫస్ట్ ఉంటారు, గుర్తుంచుకో” ఫోజు కొట్టాను.

•••

అర్జంటుగా రమ్మని విహాన్ ఫోన్చేస్తే మళ్ళీ ఏమయిందో ఏమిటో అనుకుంటూ

జరిగిన కథ

ఏడు నెలల క్రితం వివాహం జరిగినా విహాన్ జ్ఞాపకాల నుంచి బైటపడలేదు. విజ్జీ. ఇంతలోనే ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు ఆమెకు మెసేజ్ ఇస్తాడు విహాన్. అతన్ని రక్షించే ప్రయత్నంలో భర్తను కూడా లక్ష్యపెట్టకుండా అర్థరాత్రి పూనే నుండి హైదరాబాద్ వెళ్ళేందుకు ఎయిర్పోర్ట్కు చేరుకుంది విజ్జీ. ఆమె ఆలోచనలు గతంలోకి జారుకున్నాయి. ఒక పబ్లో బౌన్సర్గా పరిచయమైన నటుడు విహాన్తో ప్రేమలో పడుతుంది విజ్జీ. వారి పెళ్ళికి మొదట అభ్యంతరం చెప్పినా తర్వాత ఓకే చెబుతాడు ఆమె తండ్రి. తోటి నటి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ విహాన్పై పేపర్లో వార్తలు చదివి దిగ్భ్రాంతి చెందుతుంది విజ్జీ. నిజం చెప్పమని నిలదీస్తుంది. ఆ తర్వాత...

హడావిడిగా వెళ్ళాను.

సీరియస్‌గా కూర్చున్నవాడల్లా నన్ను చూస్తూనే "విజితా! నేను విజేతని!" బిగ్గరగా అరుస్తూ వచ్చి నన్ను వాటేసుకున్నాడు. కెంపులైన నా బుగ్గల మీద ముద్దు ముద్ర వేశాడు.

"కంగ్రాట్యులేషన్స్. ఏ వేషం?"

"నీ హీరోని అని హీరో వేషమే ఇచ్చారు".

"డబుల్ కంగ్రాట్స్"

"డైరెక్టర్ కొత్తవాడు. లవ్‌స్టోరీయే. కొత్తదనం ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇంకో మూడు నెలల్లో స్క్రిప్టు పక్కాగా తయారుచేసుకుని షూటింగు కెళ్తామన్నారు. అంతా బాగానే ఉంది గాని ఒక చిన్న మెలిక పెట్టారు".

ఉలిక్కిపడ్డాను. "రెమ్యునరేషన్ ఇవ్వనన్నారా?"

"ఊహూ. అగ్రిమెంటు రాయమన్నారు. వాళ్ళ సినిమా విడుదలయ్యే వరకూ నేను ఏ సినిమాలోనూ, టీవీలోనూ నటించకూడదన్నారు. ధైర్యం చేసి దేవుడి మీద భారం వేసి సంతకం పెట్టేశాను".

"గుడ్ డెసిషన్. నువ్వు రిగ్రెట్ అవ్వాల్సిన పరిస్థితే రాదు. ఆర్నెల్లు మహాఅయితే వన్ ఇయర్లో సినిమా విడుదలై పోతుంది. అదీగాక ఆయన మా డాడీ ఫ్రెండు. నీ వెల్ విషర్".

"ఆ నమ్మకంతోనే ముందడుగు వేశాను. నెలకి పదివేలు చొప్పున జీతం ఇస్తానన్నారు. ఫస్ట్ కాపీ రాగానే రెండు లక్షలిస్తామని చెప్పారు" అగ్రిమెంటులోనూ రాశారు.

"బాగా తక్కువేమో?"

"ఇండస్ట్రీ స్టాండర్డ్స్ ప్రకారం తక్కువేగాని తప్పదు. కొందరు పని గట్టుకుని దెబ్బ తీసిన ఇమేజ్‌ని తిరిగి తెచ్చుకోవాలిగా!"

"ఆ ద్రోహులెవరో ఏమైనా ఆచూకీ తెలిసిందా విహాన్?"

"నా అనుమానం శేషగిరి మీద ఉంది.."

"శేషగిరి?"

"ప్రముఖ సినీనటుడి కొడుకు. అతన్ని హీరోగా ఇంట్రడ్యూస్ చేస్తూ భారీ ఎత్తున ఓ సినిమా తీశారు. అది అట్టర్ ఫ్లాప్ అయింది. దాంతో కొన్నాళ్ళు స్తబ్దుగా ఉండి ఈ మధ్య టీవీవైపు వచ్చాడు. మొదట 'అగ్ని పరీక్ష'లో నా రోల్ అతడికిద్దామనుకున్నారట. నా నటన నచ్చి నాకు ఆఫర్ చేశారు. నాకు బాగా పేరు వస్తుండటం చూసి అతడు తన ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. రూమర్లు లేవదీశాడు. దాంతో నన్ను తొలగించి నా ప్లేస్‌లో అతన్ని తీసుకున్నారు".

కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. ఎంతోసేపు అనునయిస్తే గాని సర్దుకోలేకపోయాడు.

"ప్రతిభతో పైకి రావాలి గాని ఈ అడ్డదార్లూ, వెన్నుపోట్లూ ఎందుకు విహాన్".

"సర్వైవల్ ఆఫ్ ది ఫిటెస్ట్.."

"ఇంక ఆ విషయాల్ని మరచి పో. గ్రహణం విడిచింది. ఇక నీదంతా హ్యాపీ జర్నీయే."

"మా అమ్మ గుర్తొస్తోంది. ఈ శుభవార్త స్వయంగా వెళ్ళి అమ్మకి చెప్పాలి. మా ఊరెళ్దామా విజితా. పన్లోపనిగా అమ్మకి నిన్ను చూపించినట్లవుతుంది".

"సినిమా మొదలయ్యాక సినిమా హీరో ట్యాగ్‌తో వెళితే మీ అమ్మగారు ఎక్కువ సంతోషిస్తారు".

"ఐడియా బావుంది. అలాగే చేద్దాం. హీరో అయ్యాకే అమ్మ ముందుకెళ్తాను. కమాన్, ఇవాళ డిన్నర్ నేనిప్పిస్తాను".

రెస్టారెంట్ వెళ్ళే దారిలో పానీపూరీ బండి దగ్గర ఆపి మరీ తినిపించాడు.

హీ ఈజ్ సో కేరింగ్! అయామ్ లక్కీ!

జెమినీ నాయుడి కొత్తసినిమా గురించి వార్తలు అన్ని పత్రికల్లో ప్రముఖంగా వచ్చాయి. కొత్తహీరోని ఇంట్రడ్యూస్ చేస్తున్నామనీ, అతడి టాలెంటు అమోఘమనీ అతడు రేపటి 'స్టార్' అనీ అభివర్ణించారు. వివిధ గెటప్పుల్లోని విహాన్ ఫోటోలు రిలీజ్ చేశారు.

మా ఆనందానికి అవధులు చెరిగిపోయాయి.

అమ్మా నాన్నా అన్నయ్యా వదినా అంతా హ్యాపీగా ఫీలయ్యారు.

"ఇక మేం ఇంటిముందు సెక్యూరిటీ పెంచాల్సిందే" అంది వదిన.

"ఏం?"

"హీరోగారు ఇక్కడికొచ్చినప్పుడల్లా చూడ

టానికి అభిమానులు పోటెత్తుతారుగా"

గబగబా నాకు రెక్కలు మొలుచుకొచ్చాయి. ఆకాశాన్ని అందుకోడానికి ఎగిరిపోయాను.

అదృష్టవశాత్తూ ఇంట్లో నా పెళ్లికెవరూ తొందర పెట్టడం లేదు!

●●●

రోజుకి రెండు మూడు సార్లు ఫోన్లు చేస్తున్నాడు విహాన్.

ఫలానా ప్రొడక్షన్ వాళ్ళు కలవమన్నారనీ, ప్రముఖ హీరో పెద్ద సినిమాలో సపోర్టింగ్ పాత్ర ఆఫర్ చేశారనీ, కొత్త డైరెక్టర్లు మంచి పాత్రలతో కలిశారనీ, ఎక్కడికెళ్ళినా బాగా రిసీవ్ చేసుకుంటున్నారనీ ఎడతెరిపి లేకుండా వార్త మీద వార్త చెబుతున్నాడు.

ఇద్దరు తమిళ ప్రొడ్యూసర్లు కొన్ని స్టిల్స్ పంపించమన్నారనీ, నెట్ ద్వారా పంపిస్తున్నాననీ చెప్పాడు.

"నాది శుక్రమహర్దశ అంది మా అమ్మ" అన్నాడు పొంగిపోతూ.

మెల్లగా అతడి కొచ్చే కాల్సూ ఎంక్వైరీలూ తగ్గిపోయాయి. అతడి ఉత్సాహమూ జావగారిపోయింది.

ఆర్నెల్లు గడిచాయి. జెమినీనాయుడి సినిమా పట్టాలెక్క లేదు.

డిస్ట్రిబ్యూటర్ సెట్ కాలేదనీ, ఫైనాన్స్ సర్దుబాటు కాలేదనీ, స్క్రిప్టు తృప్తికరంగా లేదనీ, మారిన ట్రెండ్ దృష్ట్యా ఇంకో కథ కోసం చూస్తున్నామనీ, రకరకాలుగా చెప్పుకొచ్చారు. మొదట్లో నాయుడే మాట్లాడేవాడు. తర్వాత్తర్వాత ఫోన్ లిఫ్ట్ చెయ్యకపోవడం, ఆఫీసుకెళ్తే ఎవరెవరో ఏదేదో చెప్పడం, దిగాలుపడి విహాన్ వెనుదిరిగి పోవడం జరుగుతోంది.

ఈ మధ్యలో విహాన్‌ది 'ఐరన్‌లెగ్' అన్న గుసగుసలు మొదలయ్యాయి. నాయుడి సినిమాకి అడుగడుగునా అడ్డంకులు రావడానికి విహాన్ కారణమన్న కలరింగ్ ఇస్తున్నారెవరో.

దాంతో విహాన్ బాగా డిస్టర్బ్ అయ్యాడు. కనబడని శత్రువు ఎవరో తనని దిక్కుతోచని స్థితిలోకి నెట్టేస్తున్నట్టు ఫీలవ సాగాడు.

ఒకరోజున తప్పతాగి బార్ బయట కూలిపోయాడని పత్రికల్లో వార్త వచ్చింది.

అదిచూసి నాకన్నా ఎక్కువగా నాన్న చలించిపోయారు. బాధతో కుమిలిపోయారు.

"మరీ ఇంత వీక్ మనస్తత్వం అనుకోలేదు. ఈ పతనం ఎంతదాకా వెళ్తుందో, ఎక్కడికి లాక్కుపోతుందోనని భయంగా ఉంది".

నేను మాట్లాడలేక పోయాను. భరోసా ఇవ్వలేకపోయాను.

ఇది వరకు మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. అదంతా గిట్టనివాళ్ళ కుట్ర అనుకున్నాను. ఇప్పుడేకంగా తాగి రోడ్డు మీద పడ్డాడు. ఇది కచ్చితంగా స్వయంకృతమే!

ఖర్మకాలి ఆ సినిమా మొదలుకాకపోతే అతడి పరిస్థితేమిటి? మనఃస్థితేమిటి? గమనం ఎటు? గమ్యం ఎంత దూరం?

విహాన్ మీద సానుభూతి కలగలేదు. కోపం వచ్చింది. ఆ వేడిలో ఫోన్ చేసి "దేవదాసువై రోడ్ల మీద తిరుగుతావా?" అంటూ నోటికొచ్చినట్టల్లా తిట్టేశాను.

ఇంకోసారలా జరగదంటూ ప్రాధేయపడ్డాడు. అతడి పరిస్థితిని అంచనా వేసి కొంచెంగా మెత్తబడ్డాను.

అనుకోకుండా ఒక గొప్ప అవకాశం విహాన్‌ని వెదుక్కుంటూ వచ్చింది.

సుబ్బు పది షార్టుఫిల్మ్‌లు తీశాడు. అన్నిటికీ యూట్యూబ్‌లో చాలామంచి రెస్పాన్స్ వచ్చిందిట. కొందరు స్నేహితుల్తో కలిసి సినిమా ప్రారంభిస్తూ హీరో పాత్రకి విహాన్‌ని తీసుకున్నాడు.

యాభై వేలు ఎడ్వాన్స్ ఇవ్వడమే కాదు సినిమా షూటింగ్ మొదలుపెట్టారు.

షూటింగ్‌కి నేనూ వెళ్ళాను. మంచి రోజులొచ్చాయంటూ అభినందించాను.

కెమేరా ముందు కొత్త అని ఫీలవకుండా చక్కగా నటించావంటూ మెచ్చుకున్నారు డైరెక్టరు, ఇతర టెక్నీషియన్సు.

ప్రారంభోత్సవ ఫోటోలూ, కొన్ని స్టిల్సూ పత్రికల్లో వచ్చాయి. టీవీలోనూ బాగా కవర్ చేశారు. విహాన్‌కి మళ్ళీ ఫోన్లు రాసాగాయి. క్లౌడ్ నైన్ మీదున్నాడు విహాన్. నేనూ డిటోయే.

ఉరుములేని పిడుగులా ప్లీడరు నోటీసొచ్చింది. అగ్రిమెంటుకు విరుద్ధంగా తన చిత్రం విడుదల కాకుండా బయటి చిత్రంలో నటిస్తున్నందుకు సంజాయిషీ, నష్టపరిహారం కోరారు. అంతేగాకుండా కొత్తసినిమా తాలూకు రెమ్యునరేషన్ యావత్తూ తనకి చెల్లించాలని డిమాండ్ చేస్తూ జెమినీ నాయుడు ఇప్పించిన నోటీసది.

"అన్యాయం.. తను సినిమా తీయడు. ఇంకొక సినిమాలో నటించనివ్వడు. పైగా వాళ్ళిచ్చే పదీపరకా అతగాడికి ఇచ్చేయాలిట. ఇక నీకేం మిగులుతుంది బూడిద!"

"నెల నెలా పదివేలు ముష్టి పడేస్తున్నాడుగా, దానితో సరి పెట్టుకోవాలి".

"ఇది అమానుషం. అగ్రిమెంటుని అడ్డుపెట్టుకుని నిలువుదోపిడీ చేస్తాడా? డాడీతో చెప్పిస్తాన్లే నువ్వేం భయపడకు. బెదరకు" భరోసా ఇచ్చాను.

> **ఉద్యోగాన్ని కోల్పోయిన ప్రియుడికి తండ్రి సిఫార్సుతో సినిమాలో హీరోగా చాన్స్ ఇప్పించింది విజిత. దాంతో అతడికి మళ్ళీ మహర్దశ ప్రారంభమైంది. మరిన్ని అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. దాంతో ప్రేయసీ ప్రియులిద్దరూ ఫుల్ జోష్‌లో ఉన్నారు. అలాంటి ఆనందకర పరిస్థితుల్లో ఆకస్మికంగా విహాన్ జైలుపాలయ్యాడు. ఎందుకని? ఏం జరిగింది?**

"నేను వెళ్ళి రిక్వెస్ట్ చేస్తాను. బయటి సినిమాల్లో నటించడానికి ఎలాగోలా ఒప్పిస్తాను. ఇక జీతం ఇవ్వక్కర్లేదనీ చెబుతాను".

"ఆవేశపడకు సుమా".

"దెబ్బ మీద దెబ్బ తగుల్తున్నాయి. ఇంకెక్కడి ఆవేశం. అవసరం తీరితే చాలు. బతిమాలో బామాలో ఒప్పిస్తాను. లేకపోతే నా కెరీర్ ఖతం అయిపోయినట్టే"

ఎన్నోరకాలుగా నచ్చచెప్పి పంపాను.

నాయుడు లేడని, వచ్చేవరకూ వెయిట్ చేస్తానని ఫోన్ చేశాడు. అంతా సానుకూలమవుతుందని నమ్మకంగా ఉందన్నాడు. అవతల షూటింగ్‌కి రమ్మని ఫోన్ మీద ఫోన్ చేస్తున్నారనీ, నోటీసు సంగతి ఎవరికీ తెలీనివ్వలేదనీ చెప్పాడు. నన్ను టెన్షన్ పడొద్దని కోరాడు.

తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. బహుశా బ్యాటరీ అయిపోయిందేమో.

నాయుడు అంగీకరించాడో లేదోనని ఆలోచిస్తూ పడుకున్నాను.

రాత్రి పదిగంటల వేళ వదిన నా రూము కొచ్చింది. విహాన్ గురించి టీవీలో ఏదో చూపిస్తున్నారని కళ్ళనీళ్ళతో చెప్పింది.

ఒక్కంగలో హాల్లోకి వెళ్ళాను. అప్పటికే ఇంటిల్లిపాదీ టీవీ ముందు పాతుకుపోయి ఉన్నారు.

విహాన్ జెమినీనాయుడితో గొడవపడి అతన్ని చితక బాదాట్ట! గాయపడ్డ నాయుణ్ణి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారట! విహాన్‌ని అరెస్టు చేశారట!

ఘర్షణలో ఆఫీసులో ముక్కలైన అద్దాలతో పాటు చెల్లాచెదురైన సామానునీ టీవీలో చూపిస్తోంటే నాకు స్పృహ తప్పింది!

కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రి బెడ్ మీదున్నాను.

నా పక్కనే కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అమ్మ, బాధ పడుతూ వదిన.

నాన్న కోసం కలయజూస్తుంటే లోపలికొచ్చారు.

"డాడీ! విహాన్ చెడ్డవాడుకాదు. విషమ పరిస్థితులు తట్టుకోలేక పోయాడు. అతన్ని ఎలాగైనా విడిపించు. ప్లీజ్ సేవ్ హిమ్..." ఏడుస్తూ చేతులు జోడించాను.

నా తల నిమిరి, "నువ్వు రెస్ట్ తీసుకో. నేను చూస్తానుగా" అన్నారు.

సాక్షాత్తూ ఆ దేవదేవుడే దిగి వచ్చి అభయం ఇచ్చినట్లుగా అనుభూతించాను.

మరుసటి రోజు నన్ను డిశ్చార్జి చేశారు. తిన్నగా



పోలీస్‌స్టేషన్ కెళ్ళాను. కోర్టుకు తీసుకెళ్ళారని చెప్పారు. అక్కడికి పరిగెత్తాను.

పోలీసుల మధ్య తలదించుకుని దీనాతిదీనంగా నిలబడి ఉన్న విహాన్‌ని చూసేసరికి నా దుఃఖం కట్టలు తెంచుకుంది. బావురుమన్నాను.

అన్నయ్య ఓదార్పు పట్టించుకోకుండా దూసుకెళ్ళాను.

"ఎందుకిలా చేశావు? నన్నెందుకిలా హింసిస్తున్నావు?" విహాన్ చొక్కా పట్టుకుని గుంజాను.

"బ్యాడ్ లక్. నుదుటి రాతను తప్పించుకోలేకపోయాను"

"వేదాంతమా? నిన్ను నువ్వు కంట్రోలు చేసుకోలేనంత బలహీనుడివి అనుకోలేదు".

"గదిలో బంధించి కొడితే పిల్లి కూడా తిరగబడుతుంది".

అతడి కఠినవాక్కులకు అదిరిపడ్డాను. సంశయాత్మకంగా చూశాను.

"నీకు సినిమా అవకాశం ఇచ్చిన దేవుడిలాంటి నాయుడి మీద చెయ్యెత్తడానికి నీకసలు చేతులెలా వచ్చాయి? నువ్వసలు మనిషివేనా?"

"అతడు దేవుడుకాదు దయ్యం. నా కెరీర్ ఫినిష్ చెయ్యడానికి కంకణం కట్టుకున్నాడు."

"అతడికి నీమీద కక్ష ఎందుకుంటుంది? అనవసరంగా ఇతరుల్ని నిందించకు. నీ తప్పుల్ని ఇతరుల మీదకు తోయకు".

"నీకు తెలీదు విజితా. నా బలహీనతని అగ్రిమెంటులో బంధించి నన్ను ఆడించాలనీ, సొమ్ము చేసుకోవాలనీ చూస్తున్నాడా దుర్మార్గుడు. ఆ ఒక్క సినిమాలో నటించనివ్వమని కాళ్ళు పట్టుకున్నాను. బూటు కాలితో తన్నాడు.

నిర్ఘాంతబోయాను.

"ఇంకచాలు. వెళ్ళు వెళ్ళు..." నన్ను ఎడంగా పంపేశారు పోలీసులు.

విహాన్‌ని కోర్టులో హాజరు పరచగా నాలుగు వారాల జ్యుడీషియల్ రిమాండ్‌కి ఆదేశించారు న్యాయమూర్తి.

నాన్న నియమించిన ప్లీడరు వచ్చి వకాల్తా నామా మీద, బెయిల్ పేపర్ల మీద విహాన్ సంతకం తీసుకున్నాడు. విహాన్ మిత్రులూ వచ్చారు. ఎలాగైనా బెయిలొచ్చేట్లు చూడమని అర్థించారు.

అవాళ్టికి కోర్టు టైము అయిపోవడంతో ఆ మర్నాడు బెయిల్ పేపర్లు కోర్టుకు సమర్పిస్తానని చెప్పాడు ప్లీడరు.

విహాన్‌ని పోలీస్‌వ్యాన్‌లో చంచల్‌గూడ జైలుకి తీసుకెళ్తోంటే అశక్తురాల్నై శోకమూర్తినై చేష్టలుదక్కి చూస్తుండిపోయాను!

●●●

గుండెలు చిక్కబట్టుకుని జైలుకెళ్ళి మిలాఖత్‌లో విహాన్‌ని కలిశాను.

రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాడు కాబోలు, కళ్ళు ఉబ్బి ఉన్నాయి. సర్వశక్తులూ ఉడిగినవాడిలా ఆశల ఆకులన్నీ రాలినవాడిలా ఉన్నాడు. మరమనిషిలా ఉన్నాడు.

"కష్టాలు దేవుడు పెట్టే పరీక్షలు. ఇటువంటప్పుడే ధైర్యంగా నిలబడాలి. మనమేంటో నిరూపించుకోవాలి.

"అమ్మకి ఇదంతా తెలిసే ఉంటుంది. ఎంతగా కన్నీరు మున్నీరవుతోందో పాపం! అండగా నిలబడాల్సిన పెద్దకొడుకు జైల్లో మగ్గుతున్నందుకు ఎంతగా కుళ్ళిపోతోందో!" అతడి కళ్ళవెంట కన్నీటిధార ప్రవాహంలా కారిపోతోంది. అయినా పట్టించుకోకుండా శూన్య దృక్కులు చూస్తున్నాడు.

'నేవెళ్ళి ఓదారుస్తాను. అడ్రస్ చెప్పు".

"వద్దొద్దు. ఇక నేను తుఫానులో చిక్కుకున్న చిరునావనే. ఇక దిక్కూ దిశా ఉండవు. ఎటు గాలి వీస్తే అటు కొట్టుకుపోవాల్సిందే".

"షటప్! ఇప్పుడేమంత కొంపమునిగిందనీ? రేపో ఎల్లుండో బెయిలు వస్తుంది. బయటికొస్తావు".

"అంతటితో కథ అయిపోదు. కేసు విచారిస్తారు. శిక్ష విధిస్తారు. మళ్ళీ ఇక్కడికి రావాల్సిందే. చిప్పకూడు తినాల్సిందే".

"మా డాడీని తక్కువగా అంచనావేయకు. ఏదో మార్గం చూస్తారు. శిక్ష తప్పిస్తారు. నిన్ను బయట పడేస్తారు. ప్లీడరు గట్టి వాడంట, అన్నయ్య చెప్పాడు.."

శుష్కహాసం కదిలిందతడి పెదాల మీద.

"చిన్నప్పుడు మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉందని చదివి నవ్వుకున్నాను. ఇప్పుడది కల్పనకాదు నిజమే అన్పిస్తోంది. నా ప్రాణాలిప్పుడు నాయుడి కబంధ హస్తాల్లో చిక్కుకుని ఉన్న అగ్రిమెంటు పేపర్లలో ఉన్నాయి. దాన్ని విడిపించుకోవాలంటే లక్షల్లో పరిహారం చెల్లించాలట. నన్నుఅమ్మినా అంత డబ్బు రాదు. ఇక నేను ఎక్కడో మారుమూల ప్రదేశానికి పారిపోయి కూలో నాలో చేసుకోవాల్సిందే!"

"ఎప్పటికీ అలాంటి బతుకు నీకు రాదు. రానివ్వను. నీకు అండగా నేనున్నాను".

"వద్దొద్దు. ఇంక అవన్నీ మర్చిపో. నా దురదృష్టం నిన్ను కాటేస్తే నేను భరించలేను. నువ్వు సుఖంగా సంతోషంగా ఉండాలి. అదే నాకు కొండంత మనశ్శాంతి!"

"నా పేరు విజిత. అదెందుకు పెట్టారో తెలీదు. కాని విజిత అంటే పార్టనర్. వాటాదారు. నిర్ణయించేవారనీ అర్థముందిలే. నేన్నీకు పార్టనర్‌ని. లైఫ్‌లో కష్టంలో, సుఖంలో, దుఃఖంలో, సంతోషంలో, ఆశల్లో, ఆశయాల్లో అన్నిటా నేను భాగస్థురాల్ని. అన్నట్టు స్నేహంలో కూడా సమభాగస్థురాల్నే. నా పేరున డాడీ పెట్టిన ఆస్తిపాస్తుల్లో పదో వంతు చాలు మనం హ్యాపీగా బ్రతకడానికి. బీహ్యాపీ మేన్. నేన్నీకు లక్కీ మస్కట్‌ని అంటావుగా!" నవ్వాను.

అతడు గుడ్లప్పగించి నా వంకే చూస్తూండిపోయాడు. అతడికింకా నా మాటల మీద నమ్మకం చిక్కటం లేదని ఆ చూపులు చెప్పాయి.

"ఇక మాటలొద్దు. చేతల్లో చూద్దువుగాని.. బై".

●●●

విహాన్‌కి వెంటనే బెయిల్ రాలేదు.

పీపీ అడ్డు పడ్డారనీ, కోర్టుకు సెలవులనీ, లాయర్ల ఆందోళననీ, బెయిల్ షరతులు పూర్తి చేయాలనీ - ఏదోటి చెబుతూ వచ్చారు.

ఈలోగా నాన్న జెమినీ నాయుడితో మాట్లాడి రాజీకి ఒప్పించారు.

అతడు పోలీస్ కేసు వాపస్ తీసుకోవడం, కోర్టులో కాంప్రమైజ్ పిటీషన్ దాఖలు చేయడం, కేసు కొట్టివేయడం చకచకా జరిగిపోయాయి.

నాయుడిని ఒప్పించడానికి పెద్దమొత్తం నాన్న ముట్ట చెప్పారని అన్నయ్య చెప్పాడు.

విహాన్ జైలు నుండి విడుదలవుతూనే నేరుగా మా ఇంటికొచ్చి నాన్నకి కృతజ్ఞతలు చెబుతాడనీ, ఆయన పాదాల మీద వాలిపోతాడనీ ఆశించాను. ఏం చేసినా ఆయన ఋణం తీరదు!

కాని విహాన్ రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు.

సైఫ్‌కి టాటా చెప్పేసిందా?

మొన్నటి వరకూ బాలీవుడ్‌లో బెస్ట్ పెయిర్స్‌లో కరీనా, సైఫ్‌ల పేరు కూడా వినిపించేది. ఇప్పుడు ఆ పేరు వినిపించడం లేదు. కారణం కరీనా ఓ ఇంటర్నేషనల్ డిజైనర్‌తో క్లోజ్‌గా మూవ్ కావడమే అంటున్నారు. ఈ డిజైనర్ కారణంగానే సైఫ్, కరీనాలు దూరం దూరంగా ఉంటున్నారని కూడా బాలీవుడ్‌లో పుకార్లు తెగ షికారు చేస్తున్నాయి. ఈ డిజైనర్‌తో సంబంధం పెట్టుకోవడం వల్లనే కరీనా సినిమాలేవీ పెద్దగా ఒప్పుకోవడం లేదన్నది కూడా తాజా సమాచారం. ఈ పుకార్ల విషయంలో సైఫ్ స్పందించకపోవడం, వాటిని ఖండించకపోవడం చూస్తుంటే ఈ వార్త నిజమేనేమో అన్న అనుమానం కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఆ డిజైనర్‌తో కలిసి విదేశాల్లో స్థిరపడాలన్న ఆలోచనలో కరీనా ఉందని కూడా కొందరు అంటున్నారు. మొత్తానికి దీర్ఘకాలం సహజీవనం, కొన్ని సంవత్సరాల వైవాహిక జీవితానికి కరీనా గుడ్‌బై చెప్పేసి కొత్త తోడు వెతుక్కుందన్న జోకులు బాగానే వినిపిస్తున్నాయి. గతంలో ఇలాంటి పుకార్లు వచ్చినప్పుడల్లా కరీనా, సైఫ్‌లు తీవ్రంగా ఖండించేవారు. ఇప్పుడు మాత్రం ఇద్దరిలో ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదు.

రాముకే రాలేదని అతడి మిత్రులు చెప్పారు.

పిచ్చిగా సిటీమీద పడి గాలించాను. ఒకరోజు కాదు రెండ్రోజులు కాదు. వరుసగా వారం రోజులు. అతడి స్నేహితుల్నీ, పరిచయస్తుల్నీ అందర్నీ కలిశాను. వాకబు చేశాను.

ఏ మాత్రం 'క్లూ' లభించలేదు.

ఏమయ్యాడు? అవమానభారం భరించలేక ఏ అఘాయిత్యానికో పాల్పడలేదు కదా?

భయం! దిగులు! ఆందోళన! ఆవేదన!

నిద్రపట్టని రోజులు... తలగడ తడిసిన రాత్రులు.. పీడ కలలు గంటలు..!

●●●

'అమ్మాయ్ విజితా, ఎలా ఉన్నావు? " ఎండిన గుండెల మీద తొలకరి జల్లులా అమ్మాజీ తేనె పలుకులు!

"బాగానే ఉన్నాను అమ్మాజీ. మీరెలా ఉన్నారు? అంకుల్ బావున్నారా?"

"అంతా బాగున్నాం. నీతో కొంచెం మాట్లాడాలి. ఇది సరైన సమయమేనా?"

"అదేంమాట అమ్మాజీ. మీరెప్పుడు మాట్లాడినా సరే ఆల్వేస్ వెల్కం"

"ఇందిర పెళ్ళిలో రాజేశ్వర్‌ని కలిశావుగా. మీరిద్దరూ కలిసి బీచ్‌కి, అరకు వెళ్ళారు, గుర్తుందా? అతడి గురించి నీ అభిప్రాయం ఏమిటి?"



అతడి రూపం కళ్ళ ముందు కదిలింది. ఒక లెవెల్ మెయిన్‌టెయిన్ చెయ్యాలని చూస్తాడు తప్ప పద్ధతైన మనిషి. చక్కని వాడు. సంస్కారి.

"జెంటిల్‌మేన్".

"నీక్కూడా అలాంటి అభిప్రాయం కలిగినందుకు సంతోషం. అతడికి నిన్ను పెళ్లి చేసుకోవాలనుంది. నిజం చెప్పాలంటే నిన్ను తప్ప వేరెవర్నీ చేసుకోనంటున్నాడు. నీ అభిప్రాయం తెలుసుకుందామని ఫోన్ చేశాను".

"మమ్మీ డాడీ ఏమంటారో...!"

"డాడీని అడిగాను. నీ అభిప్రాయాన్ని గౌరవిస్తామన్నారు.."

రాజేశ్వర్‌తో పెళ్లి!

అంటే విహాన్‌ని పూర్తిగా మరిచిపోవాలి. అతడితో గడిపిన క్షణాలు, చెప్పుకున్న ఊసులు, చేసుకున్న బాసలు, కలిసి కన్న కలలు, కట్టుకున్న ఇసుక గూళ్ళు... అన్నింటినీ గుండె అట్టడుగున సమాధి చెయ్యాలి!

పలకమీది రాతల్ని చెరిపినట్టు చెరిపేసి కొత్త బలపంతో కొత్త రాత ప్రారంభించాలి!

అది నా వల్ల అవుతుందా? అసలది సాధ్యమేనా?

"మాట్లాడవేం విజితా..."

"అహ అది.. నాకు ఆన్‌లైన్ బిజినెస్ చెయ్యాలనుంది అమ్మాజీ.."

"చెయ్యి. ఎవరొద్దన్నారు? రాజేశ్వర్‌తో మాట్లాడతాను. సాఫ్ట్‌వేర్‌వాడు కదా, తనూ సాయపడతాడు. మీరిద్దరూ చిలకాగోరింకల్లా ఉంటారు. చదువు, అభిరుచి, అంతస్తు అన్నిటా సమఉజ్జీగా ఉంటారు. ఈడూజోడూ చక్కగా ఉంటుంది. మీ జంట చూడ ముచ్చటగా ఉంటుంది.

"నేను ఎటూ తేల్చుకోలేక పోతున్నాను. నాక్కొంచెం టైం కావాలి అమ్మాజీ".

"నీక్కావలసినంత తీసుకో. పెళ్ళైనంత మాత్రాన ఉద్యోగం, వ్యాపారం, సంఘసేవ చెయ్యలేరు చెయ్యకూడదు అంటే నేనొప్పుకోను. స్త్రీ మల్టీటాస్కర్. ఒకే సారి అనేక పనులు చేయగల సామర్థ్యం మనకుంది. మన అస్తిత్వాన్ని, అభిరుచిని కాపాడుకుంటూనే కుటుంబానికి మూలస్తంభంగా నిలవాలి. పదిమందికి గాకపోయినా నలుగురికి చేయగలిగిన సాయం తప్పనిసరిగా చేయాలి".

"మిమ్మల్నీ మీ మాటల్నీ... మర్చిపోను అమ్మాజీ".

ఆవేళ భోంచేస్తోంటే నాన్న వచ్చి భోజనాల బల్ల దగ్గర కూర్చున్నారు. రోజూ కన్నా చాలాముందే క్లబ్బు నుంచి వచ్చేశారు. అమ్మ సైతం ఆశ్చర్యపోయింది.

"విహాన్ గురించేమైనా ఆచూకీ తెలిసిందా విజ్జీ!"

తల అడ్డంగా ఊపాను.

"పిరికి మనిషి. బొత్తిగా కలేజా లేదన్నమాట. విగ్రహమే గాని నిగ్రహం లేదన్నమాట. ఇంకతడి గురించి తెలీక పోవచ్చు. తెలిసినా అవి మనకి నచ్చేవీ, మనం మెచ్చేవీ కాకపోవచ్చు. అంచేత ఇక అతన్ని మర్చిపోదాం. ఆ అధ్యాయం ముగిసిందీ...!"

"అతడు పాపం మంచివాడే డాడీ. ఏదో ఆవేశంలో అదుపు తప్పి.." ఆపై మాటలు మింగేశాను.

"అతడిలోని లోపలి మనిషి బయటపడ్డాడు. గీటురాయిపై పెట్టి చూసినప్పుడే నికర బంగారమో కాకిబంగారమో బయట పడేది. మనం గుర్తించలేదు గాని అతడు క్రిమినల్. అందులో సందేహించాల్సిందేమీ లేదు. అతడేమవుతాడోనన్న ఆలోచనే రానివ్వొద్దు. అతడికేం హ్యాపీగా ఉంటాడు. నిన్నో నిచ్చెనలా వాడుకుని పైకెగబాకాలని చూశాడు. అది బెడిసి కొట్టింది. మరో చోట మరో పేరుతో మరొకరి కోసం కొత్త వల అల్లుతుంటాడు..."

చాలా బాధగా అన్పించింది. ముద్ద దిగలేదు.

"నువ్వతడి బొమ్మే చూశావు. గనుకే అతడి మీదింకా నమ్మకం మిగిలి ఉంది. బొరుసు కూడా చూసి ఉంటే నువ్వీపాటికి అసహ్యించుకుంటూ ద్వేషిస్తూ ఉండే దానివి. మనకి ముఖ్యంగా నీకెలాంటి హాని, అపకారం చెయ్యనందుకు నేను సంతోషిస్తున్నాను. పెళ్లికిముందే ముసుగు తొలగిపోవడం మన అదృష్టం. చదువుకున్న దానివి. ఆలోచించు..."

నాన్న లేచి వెళ్ళబోతుంటే, "అమ్మాజీ ఫోన్ చేశారు" అంది అమ్మ.

"నాతోనూ మాట్లాడారు. అన్నివిధాల తగిన సంబంధం కాకపోతే ఆవిడ చెప్పరు. కల్పించుకోరు. అమ్మాజీని నీతో మాట్లాడమన్నాను. మాట్లాడే ఉంటారు. మేం ఏం చేసినా నీ ఇష్టప్రకారమే చేస్తాం. నీకు ఎలాంటి కష్టం కలక్కుండా చూస్తాం. మేం నీ బాగుకోరే వాళ్ళం. నీ ఆనందం కోరుకునేవాళ్ళం. రాజేశ్వర్ నీకు సరిజోడు, సరితోడు అనుకుంటే చెప్పు, వెంటనే ముహూర్తం పెట్టిస్తాం.."

"మీరంతా ఆలోచించి ఎలా బావుంటుందంటే అలా చెయ్యండి. విజ్జీ అడ్డు చెప్పదు. ఏమంటావు విజ్జీ..." ఆప్యాయంగా నా తల నిమురుతూ అడిగింది అమ్మ.

కరిగిపోయాను.

మరి నెల తిరక్కుండానే మా ఇంట్లో బాజాలు మోగాయి.

అట్టహాసంగా రాజేశ్వర్‌తో నా పెళ్లి జరిగింది.

"విహాన్ కన్నా హండ్రెడ్ టైమ్స్ బెటర్" అంది ప్రాంజలి.

"నేను చేసిన పూజలే నన్ను కాపాడాయి" అంది సుధారాణి.

మెల్లమెల్లగా 'నేను అదృష్టవంతురాల్ని' అన్న భావం నాలో వేళ్ళూనసాగింది.

అయినా గుండెలోతుల్లో ఏదో చిన్న వెలితి. బాధ. అపరాధ భావన. నేను పూర్తిగా ఆనంద పరవశురాల్ని కాకుండా అడ్డుపడుతున్నాయి.

మొదటి ప్రేమ, మొదటి ముద్దు, మొదటిగా స్తన్యమిచ్చి నప్పటి అనుభూతి - కడదాకా వెంటాడుతూ ఉంటాయంటారిందుకే కాబోలు!

ఒక్కటి మాత్రం ఒప్పుకోవాలి.

నా పెళ్లి వార్త తెలిసి విహాన్ ఎక్కడున్నా ఎలా ఉన్నా పరిగెత్తు కొస్తాడనుకున్నాను. పెళ్లి పీటల మీంచి దిగేవరకూ ఎదురుచూస్తూనే ఉన్నాను.

ఒక గర్ల్‌ఫ్రెండుగానో, మాజీ ప్రేయసిగానో కాదు ఒక స్నేహితురాల్లా ఎదురు చూశాను. ఒక చిన్న గులాబీ బహూకరించి "మిత్రమా! నీ వైవాహిక జీవితం శుభప్రదంగా, సుఖప్రదంగా, జయప్రదంగా సాగాలి" అని నిండు మనసుతో ఆకాంక్షిస్తాడని ఆశించాను.

కాని అతడు రా...లే...దు!

(ఇంకా వుంది)

ఎథికల్ ఆమ్నేసియా

మోసగాళ్ళు ఎంత చెప్పినా వినకుండా మళ్ళీ మళ్ళీ మోసాలకు, తప్పులకు పాల్పడటానికి కారణం ఒక మనిషి తాను చేసిన తప్పులను జ్ఞాపకం చేసుకునేటప్పుడు మెమరీ లాస్‌కు గురవుతాడనీ, అందువల్లనే చేసిన తప్పులు మళ్ళీ మళ్ళీ చేస్తాడనీ పరిశోధకులు వెల్లడించారు. దీనినే వారు ఎథికల్ ఆమ్నేసియా *(ethical amnesia)*గా పిలుస్తున్నారు. నైతిక ప్రవర్తనకు సంబంధించి తాము చేసిన చర్యలను తిరిగి జ్ఞప్తికి తెచ్చుకోవడంలో మనిషికీ, మనిషికీ మధ్య ఉండే తేడాలెలా ఉంటాయో, వారు ఎలాంటి విషయాల్ని విస్మరిస్తారో తెలుసుకునేందుకు నార్త్ వెస్ట్రన్ యూనివర్సిటీకి చెందిన *Maryam Kouchak*, హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన *Francesca Ginoe* నాయకత్వంలో రెండు పరిశోధక బృందాలు తొమ్మిది రకాల ప్రయోగాలు చేశాయి. 2,100 మంది ఈ ప్రయోగాల్లో పాల్గొన్నారు. వీరంతా రోజువారీ నైతిక ప్రవర్తనకు

సంబంధించిన జ్ఞాపకాలను సులభంగా గుర్తుకు తెచ్చుకున్నారు. ప్రకృతి సహజ సిద్ధమైన సానుకూల ప్రతికూల చర్యలకు సంబంధించిన విషయాల్నీ బాగానే గుర్తు చేసుకున్నారు. కానీ అనైతిక ప్రవర్తనకు సంబంధించి తాను చేసిన చర్యలను, ఖచ్చితంగా ఎక్కడ తప్పు చేసిందీ ఆ వివరాలను గుర్తుతెచ్చుకోవడం మాత్రం వారికి మహాగగనం అయిపోయిందట. మనుషులు పదే పదే అనైతిక నిర్ణయాలు తీసుకోవడానికి ఇదే కారణం అయివుంటుందని పరిశోధకులు చెబుతున్నారు. తమ నైతిక, అనైతిక చర్యల్ని లిఖిత పూర్వకంగా వివరించమని 343 మందిని పరిశోధక బృందం అడిగింది. మరో 70 మందిని ఆహారం తింటూ బొమ్మా బొరుసూ ఆట ఆడమని కోరింది. వారు ఎదుటి వారిని మోసం చేసి చాలా సులభంగా ఎక్కువ డబ్బు సంపాదించారు. కానీ ఈ విషయాల్ని రెండు వారాల తర్వాత గుర్తు చేసుకుని ప్రశ్నావళిని పూర్తిచెయ్యమన్నప్పుడు తాము మోసంతో ఎంతెంత సంపాదించారో వివరాలన్నీ 43 శాతంమంది రాయలేకపోయారు. ఏం తిన్నారో మాత్రం రాయగలిగారు. మరో 230 మందిని నిజాయితీగానూ, మోసంతోనూ పాచికలాట ఆడమని ప్రోత్సహించి, రెండు వారాల తర్వాత ప్రశ్నావళి పూర్తిచెయ్యమన్నారు. కానీ చేసిన తప్పులకు పశ్చాత్తాపం వల్ల జరిగింది జరిగినట్లు వారు రాయలేకపోయారు. దీనంతటికీ ఎథికల్ ఆమ్నేసియా కారణమని పరిశోధకులు చెబుతున్నారు. కానీ ఇతరుల అనైతిక వర్తనను ఎత్తి చూపడంలో మాత్రం వారి జ్ఞాపకశక్తి అమోఘంగా పనిచేసిందట! చూశారా!!





కవిసేన మేనిఫెస్టో
ఆధునిక కావ్య శాస్త్రమ్
గుంటూరు శేషేంద్ర శర్మ
ధర: 300 రూపాయలు
పేజీలు: 250
ప్రచురణ: గుంటూరు శేషేంద్ర శర్మ మెమోరియల్ ట్రస్ట్
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

కవిత్వాన్ని కవిత్వంగా బతికించాలని తపన పడిన గొప్ప సాహితీమూర్తి, ఆధునిక కవికుల గురువు గుంటూరు శేషేంద్రశర్మ. కవిత్వం అంటే ఏమిటి? అనే మీమాంసకు పునాదివేసి అనేక కోణాల్లో ఆ అంశాన్ని ఆయన శాస్త్రీయంగా చర్చించారు ఈ పుస్తకంలో. కవిత్వం ఎలా ఉండాలో, కవిత్వానికి అవసరమైన సామగ్రి ఏమిటో కూలంకషంగా చెప్పారు. నిజమైన కవితకు అనుభూతే గీటురాయి అనీ, అనుభూతిని ఒక కళగా అభ్యసించాలనీ చాటిన రచనిది.

శారద రచనలు
నవలలు
మొదటి సంపుటం
ధర: 325 రూపాయలు
పేజీలు: 498
ప్రతులకు: నవచేతన, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు

పదమూడేళ్ళ వయసులో తమిళనాడు పుదుక్కోటై నుండి తెనాలి తరలివచ్చి హోటల్ కార్మికుడిగా నడుంవంచి బతికాడు నటరాజన్. తెలుగు నేర్చి అభ్యుదయ రచయితల సంఘం సాహిత్య పాఠశాలలో జేరి కలం సేద్యంతో శారదగా మారాడు. దారిద్ర్యాన్నీ, చీకటి బతుకులనూ, కన్నీళ్ళనూ రచనలుగా మలిచి కథా-నవలా సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. శారద రాసిన ఏది సత్యం, అపస్వరాలు, మంచీ-చెడూ అనే నవలలతో వెలువడిన తొలి సంపుటమిది.



సూక్తి సుధా కలశం
అనుసృజన: యల్లా ప్రగడ ప్రభాకర రావు, పంగులూరి హనుమంతరావు
ధర: 200 రూపాయలు, **పేజీలు:** 200
ప్రతులకు: హనుమంతరావు హైదరాబాద్-36.
సెల్: 99086 48474

మన ప్రాచీన సాహిత్యంలోని సుభాషితాలు, సూక్తులతో కూడిన సంస్కృత అనువాద పద్యాల నీతి శ్లోకాల సముచ్చయమిది. నీతిసార సుభాషితాలలోని 380 శ్లోకాలను పాఠకుల హృదయాలకు హత్తుకునేలా కడురమణీయంగా అనువదించారు రచయిత.

జయహో భారత్
రైతుకవి వట్టికూటి సాంబశివరావు ,
ధర: 100 రూపాయలు
పేజీలు: 78
ప్రతులకు: రీతిక పబ్లికేషన్స్, యల్లారెడ్డి గూడ, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్-73
సెల్: 94911 27804

క్రికెట్‌ను శ్వాసించే మన దేశంలో ఈ ఆటపై ఉన్న మక్కువను అందమైన అచ్చ తెలుగు పద్యాలలో చాటి చెప్పారీ రైతు కవి. క్రికెట్‌కు ఈ విధంగా పద్య గౌరవం, కావ్య గౌరవం కల్పించారు.

స్వీకారాలు

చిగురించే పాదం కవిత్వం
మేడక యుగంధరరావు
ధర: 40 రూపాయలు, **పేజీలు:** 70
ప్రతులకు: రచయిత, రామకృష్ణ రెసిడెన్సీ, 100 ఫీట్ రోడ్, తాడిగడప సెంటర్, విజయవాడ-37
సెల్: 9032056738 మరియు ప్రముఖ పుస్తక దుకాణాలు.

గీతా ప్రసాదం గేయరూప అనువాదం
డా.అనిల్ సూర్యగుంట ప్రసాద్
ధర: 200 రూపాయలు, **పేజీలు:** 318
ప్రతులకు: పాలపిట్ట బుక్స్, విజయసాయి రెసిడెన్సీ, సలీం నగర్, మలక్‌పేట, హైదరాబాద్-36
ఫోన్: 040-27678430

చిరుదీపాలు రెక్కలు
డా.పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి
ధర: 100 రూపాయలు, **పేజీలు:** 144
ప్రతులకు: వంశీ పబ్లికేషన్స్, ఇంద్ర భవన్‌రోడ్, నెల్లూరు -01
సెల్: 9440279594., విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు

చెరుగ్గడ రెక్కలు - 4
యం.కె.సుగమ్‌బాబు ,
ధర: 100 రూపాయలు
పేజీలు: 120
ప్రతులకు: న్యూ లైఫ్ ప్రెజెంటేషన్స్, సాయితేజ ఎన్‌క్లేవ్, సూరారం క్రాస్‌రోడ్స్, హైదరాబాద్-055

-లలితాత్రిపురసుందరి

బానిస

-పివిబి శ్రీరామమూర్తి

"హలో! ఎవరూ?" - ఫోన్‌లో.

"నేను సార్! తిరుమలరావుని" అతని గొంతులో వణుకు..

"ఏంట్సార్? ఒంట్లో బాగులేదా?"

"ఏం చెప్పమంటారు, చచ్చిపోయినా బాగుణ్ను."

"ఏమయింది?"

అతని రోగం చెప్పాడు! అర్జంటుగా ఆపరేషన్ చెయ్యాలంట. నలభై వేలవుతుంది. నా సహాయం కావాలంటున్నాడు. "ఏం చేయాలి?" ఇస్తానన్నాను. అకౌంటు నెంబరు పంపాడు. నాకు కష్టంగాఉన్నా పదివేలు అకౌంటులో ఆన్‌లైన్ ద్వారా పంపాను.

తిరుమలరావు నాకేమీ కాదు కొద్దిపాటి స్నేహం... ఎలా కుదిరిందంటే...

నేనుండేది విజయనగరం. తిరుమలరావుది కాకినాడ. మా అత్తగారిది కాకినాడ. నా పెళ్ళి నాటికే మా అత్తమామలు లేరు. బావమరిది ఉన్నాలేనట్టే. అతను తాగుడికి బానిస. కొద్ది కాలానికే కాలం చేశాడు. మా బావమరిది కొడుకు పెద్దాడు ప్రయోజకుడయ్యాడు. కేటరింగ్ పెట్టి బాగా సంపాయించాడు. ఎప్పుడూ రమ్మంటాడు. తీరావెళ్తే వాళ్ళ పనుల్లో బిజీ. అప్పుడు తారసపడ్డాడు తిరుమలరావు. అతను మా మేనల్లునికి వరసకు బావ అవుతాడు.

కాకినాడలో గోకులం దాటాక మధురానగర్ కొత్తగా ఏర్పడింది. అక్కడున్న కుటుంబాలన్నీ వంటల మీద ఆధార పడ్డవే! అక్కడే మా మేనల్లుడి ఇల్లు.

అందులో రెండు కేటరింగ్ కుటుంబాలతో కలిసి, విడివిడిగా కూడా మేనల్లుడు కేటరింగ్ చేస్తాడు. మావాడికి పెద్ద బ్యాచ్ ఉంది. ఒకేరోజు అయిదారు పెళ్ళిళ్ళు ఉన్నా సునాయాసంగా కేటరింగ్ చెయ్యగలడు. అందునుంచి ఇంటినిండా బియ్యపు బస్తాలు, పప్పు మూటలు, నూనె డబ్బాలు, కూరగాయలు, పాల ప్యాకెట్లు, డిస్పోజబుల్ గ్లాసుల కట్టలూ - ఓ కిరాణా దుకాణంలా ఉంటుంది. ఇక ఇంటి నిండా కుర్రాళ్లు... అందరూ పని కుర్రాళ్ళే. ఎక్కువమంది ఖైనీలు వేస్తారు. చాలామంది పనులైపోగానే మందుకొడతారు. మధ్యాహ్నం పూట ఆడాళ్ళు, మగాళ్ళు అన్న తేడా లేకుండా ఖాళీగా ఉంటే పేకాట లేదా హౌసీ ఆటలతో కాలక్షేపం చేస్తారు. వాళ్ళలో వాళ్ళు కేకలేసుకుంటారు. ఏ పెళ్ళి వంట లెలా చేశారు, ఎక్కడ వంట తగలడిందీ, ఎవరు డబ్బులు ఎక్కువ ఇచ్చిందీ, ఎవరు ఎగ్గొట్టేసిందీ చెప్పుకుంటారు. మధ్యమధ్య టి.వి. టీవీలో క్రికెట్.. క్రికెట్ మీద బెట్టింగులూ జరుగుతుంటాయి. మా మేనల్లుడు ఎప్పుడో వచ్చి పలకరించి వెళ్ళిపోయేవాడు. మేనల్లుడి భార్య దూరపు చుట్టం అయినా ప్రాణంలా చూసుకునేది. ఏ సమయానికి కాఫీ కావాలో, ఏ సమయానికి టీ కావాలో, టిఫిన్ కావాలో అన్నీ సమకూర్చిపెట్టేది. మధ్యలో 'బాబాయిగారూ! బోరు కొడుతుందా? ఈయనకి ఖాళీ అయితే అలా దాక్షారామం, శాంతేశ్వరం, పెద్దాపురం మరిడమ్మ కోవెలకూ వెళ్దాం" అనేది.

అనేది కాని, పాపం! వాళ్ళకి తీరికెక్కడిది? ఈలోగా నా సెలవయి నేను వచ్చేసేవాణ్ణి.

ఓ సారి..

వాళ్ళ గృహ ప్రవేశాని కెళ్ళాల్సి వచ్చింది. ఇంటి నిండా జనం. అయినా మా మేనల్లుడి భార్య దుర్గ నన్ను ప్రత్యేకంగా పిల్చి "ఏమండోయ్! మీక్కాలక్షేపానికి లోటు లేకుండా మా అన్నయ్యని అప్పచెబుతున్నా! ఒరే బుల్లిబాబూ! ఇట్రా అని తిరుమలరావు అలియాస్ బుల్లిబాబుని పరిచయం చేసింది. బుల్లీ! ఈయనెవరో తెలుసా? మా బాబాయిగారు. పేరు విజయభాస్కర్. మంచి రచయిత. బోలెడన్ని కథలూ, నవలలూ రాశారు. వీడి పేరు తిరుమలరావు. చిట్‌ఫండ్ కంపెనీలో ఫీల్డ్ ఆఫీసరు. వీడికి తెలీని విషయం లేదు. రచయితలంటే పిచ్చి అభిమానం. మరి నేనొస్తా జాగ్రత్తారే. బాబాయిని జాగ్రత్తగా చూసుకో" అంది వెళ్తూ.

అతను "గ్లాడ్ టు మీట్యూ! మీకు శ్రీకంఠస్ఫూర్తి తెలుసా? ఈ ఊరే! అద్దేపల్లి రామమోహనరావు మంచి

పోయెట్ ఇక్కడ. కె.బి.కృష్ణ, ప్రఫుల్లచంద్ర, యండమూరి బ్రదరూ! చాలామంది రైటర్లు కాకినాడలో ఉన్నారు. మీకు వీలయితే కలుద్దాం అని కాకినాడ ప్లాన్ టౌను. మీరిక్కడ వారం రోజులుంటే సరౌండింగ్స్ తిరుగుదాం. రాజమండ్రి వెళదాం. నాకు రచయితలంటే చాలా అభిమానం. మీ పేరు నేను విన్నాను. మీరు 'సంకెళ్ళు' నవల రాశారుకదా, ఎ.ఎన్.ఎమ్‌ల మీద. చాలా నచ్చింది నాకు. నాకింత వరకు మీరు మా చుట్టం అని తెలీదు" అని ఏకధాటిగా మాట్లాడాడు. అతను మాట్లాడుతుంటే వచ్చే మందు వాసన నాకు ఇబ్బందిగా అనిపించింది. అది అతను గమనించాడు.

"సారీ! నాక్కొంచెం మందలవాటుంది. మీకు పడదేమో" అన్నాడు.

"ఫరవాలేదు, డోంట్‌వర్రీ" కడుపులో తిప్పేస్తున్నా మొహమాటానికన్నాను.

ఆ రాత్రల్లా అతను మాట్లాడుతూనే ఉన్నాడు. అతనికి జ్ఞాపకశక్తి ఎక్కువ. నా కథలు చాలా చెప్పాడు. నవలల్లో రెండు మూడు దొర్లిన తప్పులు సున్నితంగా చెప్పాడు. వాటితోపాటు సమకాలీన రచయితలు, ప్రతిభావంతులు, ప్రస్తుత కథారీతులు, మోడ్రన్ పొయిట్రీ, పోస్టు మోడరనిజం గురించి మాట్లాడుతూనే గడిపాడు. ఆషామాషీ వాడు కాడనిపించింది.

నాలుగు రోజులున్నాను.

నాలుగు రోజులూ నన్నొదల్లేదు. ఆ నాలుగు రోజుల్లో మరి చుట్టపు రచయితననో, పెద్దవాణ్ణనో తెలీదు కానీ నాకు అడుగులకు మడుగులొత్తాడు. ఉదయాన్నే కాఫీ, టీలు, టిఫిన్లు తెచ్చేవాడు. నా కుర్చీకి దగ్గర్లో కూర్చునేవాడు.

అతనిలో నేనో విషయం గమనించాను. రాత్రే ఎక్కువగా తాగుతాడు. తాగినప్పుడే ఎక్కువ మాట్లాడతాడు. అదీ పనికిరాని సొల్లుకాదు సాహిత్య విషయాలు, క్రీడా విషయాలు, రాజకీయాలూ...

ఆ తరువాత చాలాసార్లు కాకినాడ వెళ్ళాను ముఖ్యంగా తిరుమలరావును కలుసుకోటానికి. ఓసారి మాటల్లో శ్రీనాథుని శృంగారనైషధం గురించి మాట్లాడుతూ వ్యాఖ్యానం దొరకలేదన్నాను. మర్నాడుదయం భానుగుడి సెంటర్‌కెళ్ళి వ్యాఖ్యానంతో పుస్తకం తెచ్చేశాడు. డబ్బులిచ్చినా పుచ్చుకోలేదు. ఇంకోసారి రవీంద్రుని గీతాంజలి స్వదస్తూరితో ఉన్న బెంగాలీ, ఆంగ్లరచన తీసుకున్నాడు నాకోసం ఏదైనా అంటే చాలు అవి కొనేసి తీసుకొచ్చేసేవాడు. ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం ఉంది.

షేక్స్‌పియర్ నాటకాలంటే ఇష్టం. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారంటే చాలాఇష్టం. కరుణశ్రీ అంటే ఇష్టం. క్రికెట్లో ద్రావిడ్ అంటే ఇష్టం అంటూ టెండూల్కర్ షాట్ల వైవిధ్యం చెప్పేవాడు. రామాయణ, భారతాలు బాగా చదువుకున్నాడు. ఓసారి లక్ష్మణుని క్యారెక్టరు గురించి చెప్తూ సీతాదేవి నగలను రాముడు పరిశీలించమని లక్ష్మణునితో చెప్పినప్పుడు వాల్మీకి రాసిన శ్లోకం "నాహం జానామి కేయూరః! నాహం జానామి కుండలః, నూపురేత్వభి జానామి నిత్యం పాదాభివందనాత్" అని పాదాలను పూజించటం వల్ల మాత్రం నూపురాలు తెలుసు అంటాడు. ఎంత రమ్యం? వాల్మీకి క్యారెక్టరైజేషన్ ఎంత అద్భుతం? అలాగే భరతుడు! నిజంగా రాముని కంటే భరతుని త్యాగనిరతి గొప్పది. ఎవరండీ రాజ్యాన్ని వదులుకుంటారు? అని వాల్మీకి శ్లోకాలు ఉటంకించాడు. విశ్వనాథ కల్పవృక్షంలో రాముని బాల్యాన్ని వర్ణిస్తూ రాసిన ఆ పద్యాలు ఏం మధురం? రాముడు నీ పేరేంటంటే చెప్పాడు? నాన్న పేరేంటంటే 'దశరదుడు' అంటే - నా పేరు చెప్పమని కౌసల్య అంటే నోరుతిరక్క ఏడిస్తే - కౌసల్య కొడుకుని గుండెలకు హత్తుకుంటుంది. ఎంత అద్భుతమండీ" అని రామాయణం గురించి రంగనాయకమ్మ రాసిన విషవృక్షం గురించీ ఆమెలో మార్క్సిజం భావాల గురించి గంటసేపు చెప్పాడు. స్త్రీలలో అంత గొప్ప రచయిత్రి తెలుగులో లేదని చెప్పాడు. యండమూరి రచనా వైశిష్ట్యం గురించి చెప్పాడు.

మొదట్లో నేను రచయితగా అతని దగ్గర గొప్పగా ఫీలయ్యేవాణ్ణి. కానీ తరువాత నేనే అతని దగ్గరెన్నో నేర్చుకున్నాను. ఓసారి మాటల్లో అడిగా 'మీరే రచన ఎందుకు చెయ్యరాదూ' అని. ఆ మర్నాడతను తన గేయ సంపుటి తెచ్చి, తన కవితలు చదివి వినిపించాడు. నాకాశ్చర్యం వేసింది. అతనిలో అద్భుతమైన కవి ఉన్నాడు!

"మరి దేనికీ పంపలేదేం?"

"ఇవి నా ప్రేయసికోసం రాసినవి. లోకానిక్కాదు."

ఆ తరువాత తెల్సింది అతని విషాదగాథ. అతనో అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి ప్రేమించింది కానీ తన విషయం ఆమెకు తెలిసేసరికి ఆమెకు సంబంధం కుదిరి వేరొకరితో పెళ్ళయింది. ఆ తరువాత ఆమె చనిపోయింది. కారణాలు తెలీవట. అప్పుడతను కంటతడి పెట్టాడు. బ్రహ్మచారిగా ఉండిపోయాడు!

ఎంత గొప్ప మేధావి అయినా, వారికీ ఏదో ఒక లోటు ఉంటుంది. అది లోటో, మానవ బలహీనతో గానీ అదే వాళ్ళకి స్వయంకృతాపరాధంగా మారుతుంది. ఉన్నత శిఖరాలకు చేరుకోలేకపోతారు. ఈ కథలో కాకినాడ తిరుమలరావు కూడా అంతే. నిజానికి అతడో సమాచార నిధి. సకల విషయాలు నాలుకమీదే ఉంటాయి. కానీ అతణ్ణి ఆ ఒక్క బలహీనతే చావు దెబ్బతీసింది!

ఆ తరువాత అతను రెండు నవలలకు, సుమారు డజను కథలకూ ప్లాట్లిచ్చాడు రాయమని. రెండు నవలలు రాశాను. మంచి హిట్టయ్యాయి. సుమారుగా అతను చెప్పిన కథల్లో మూడింటికి బహుమతులొచ్చాయి. సాధారణంగా రచయితలకు చాలామంది చెప్తారు మీకు మంచి ప్లాటిస్తా, కథ రాయండి అని. కానీ వాళ్ళు చెప్పినవేవీ రాయటానికి కష్టపడక్కరలేదు. అతనే ప్రారంభం. ముగింపు అన్నీ చెప్పి, మీ ఇష్టం మీరెలా మల్చుకుంటారో? అంటాడు.

ఒకప్పుడు నన్నతను 'గురువుగారూ' అనేవాడు కానీ ఇప్పుడు నేనే అతన్ని 'గురువుగారూ' అనాల్సిన పరిస్థితి. కానీ గమ్మత్తేమిటంటే అతను ఏ మంచి విషయం చెప్పినా ఏ కథకో, నవలకో ఇతివృత్తం చెప్పినా, మంచి మందుపట్టు మీదున్నప్పుడే! మందులేనప్పుడు మితభాషి. నోరు మెదిపేవాడు కాదు.

తిరుమలరావు చేత ఎలాగైనా తాగుడు మాన్పించాలనీ, ఓ వేసవిలో వెళ్ళి నెల రోజులుండి పట్టుబట్టి మాన్పించాను. ఇప్పుడతనికీ వింతరోగం ఏమిటో? వెంటనే కాకినాడ వెళ్ళాలనిపించి బయలుదేరాను.

నేనెళ్ళేసరికి మా మేనల్లుడింట్లోనే ఉన్నాడు. నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. చెప్పాపెట్టకుండా వెళ్ళినందుకు విషయం చెప్పాను.

"అంతా అబద్ధం! ఉద్యోగానికెళ్లటం లేదు. మూణ్ణెల్లయింది. మళ్ళీ తాగుడెక్కువయింది. ఎక్కడ పడితే అక్కడ అప్పులు చేసేస్తున్నాడు. రోడ్డుమీద పడి అడుక్కుంటున్నాట్ట కూడా! అనేసరికి నేను చాలా బాధపడ్డాను. ఎలాగైనా తిరుమలరావుని కలవాలనుకున్నాను. ఎక్కడుంటాడో తెలీదన్నాడు మా మేనల్లుడు.

ఆ సాయంకాలం భానుగుడి సెంటర్‌కి బయలుదేరాను. తోవలో మాసిన బట్టలతో ఇంగ్లీషులో అడుక్కుంటున్న పిచ్చివాడు! తీరా దగ్గరకెళ్తే తిరుమలరావే!

"ప్లీజ్! టెన్ రుపీస్ దానం చెయ్యండి. కడుపునొప్పి విపరీతం. ఆపరేషన్ పడుతుందట" అంటున్నాడు.

నాకు లాగిలెంపకాయ కొట్టాలన్నంత కోపం వచ్చింది. వెంటనే గతం కళ్ళముందు తిరిగింది. మనసు తోడుకు పోయింది. ఎంత తెలివైన వాడు! ప్రేమోన్మాదానికి లోనై వ్యసన పరుడయ్యాడు. వ్యసనానికి బానిసయ్యాడు. మనసంతా బాధ. పర్సు తీశాను. విలువ కోల్పోయిన జీవితానికి విలువివ్వలేని ఐదు వందల నోటు చేతికందింది. తీసి అతనికిచ్చాను. అతన్ని మరి చూళ్ళేకపోయాను. ముందుకు కదిలాను, గుండె బరువుతో చీకటి లోకంలో మగ్గుతున్న వెలుగుసూర్యుణ్ణి వదిలేస్తూ!

సెల్: 94400 59067



నిత్య సంతోషానికి నిఖార్సయిన మార్గం

ఎప్పుడూ ఆనందంగా సంతోషంగా జీవించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ జీవితాల్లో వచ్చే కొన్ని రకాల ఒడిదుడుకుల కారణంగా ఆ సంతోషాన్ని సంపూర్ణంగా పొంద లేకపోతున్నారన్నది అక్షర సత్యం. అయితే కొంతమంది మాత్రం ఎన్ని రకాల కష్టాలు వచ్చినా సరే నిత్యం హుషారుగా కనిపిస్తూ బాధలనేవే లేనట్టు ప్రవర్తిస్తారు. అలాంటి వారిని చూసి నప్పుడు, బాధల్లో కూడా ఎలా ఆనందంగా ఉండగలుగుతున్నారబ్బా! అని సందేహం వస్తుంది.

సమాజంలో మనచుట్టూ రకరకాల మనుషు లుంటారు. ప్రతి చిన్న విషయాన్ని పెద్ద సమస్యగా ఊహించుకుని బాధపడుతూ కాలంగడిపేవారు కొందరైతే, పెద్ద సమస్యని కూడా చిన్నగా తీసు కుని చిరునవ్వులతో జీవితాన్ని సాగించేవారు మరికొందరు. అయితే మనం కూడా అలాంటి సంతోషాన్ని హుషారునూ సొంతం చేసుకోవా లంటే మనలో దాక్కున్న కొన్ని లక్షణాలను వది లించుకుని, కొత్త లక్షణాల్ని పుణికిపుచ్చుకోవాలి. ఆ లక్షణాలేంటో చదివేసేయండి!!

సానుకూల ధోరణి..

కొందరుంటారు చిన్న అపజయం కలిగినా లేక చిన్న అవరోధం కలిగినా ఇక నావల్ల ఏమీ కాదు, నాకు ఏమీరాదు అనే ఒక భావనతో ఉంటారు. నిరాశా నిస్పృహలతో కాలం గడిపేస్తారు. కానీ మీరు గనుక ఎల్లప్పుడూ ఆనందంగా ఉండా లని ఆశిస్తే మాత్రం, సానుకూల ధోరణితో ఆలోచిం చడం తప్పని సరి. ఉదయం లేవగానే మీలో ఏర కమైన ఆలోచనలు ఉంటాయో, ఆ రోజంతా అలాంటి ఆలోచనలతోనే గడిచే అవకాశాలు ఎక్కు వగా ఉంటాయి. అందుకని ఉదయం నిద్రలేచిన దగ్గర్నుంచి పాజి టివ్ ఆలో చనలతో రోజు ప్రారంభించాలి. ఎల్లప్పుడూ ఆనందంగా ఉండేవారు ఎప్పుడూ పాజిటివ్‌గానే ఆలోచిస్తుంటారు. ఇలాంటి వారు ఎదుటివారి పట్ల ద్వేషభావాన్ని, ఈర్ష్య అసూయ లను పెంచుకోరు. దీంతో అందరితో అన్ని పరిస్థితు ల్లోనూ పాజిటివ్‌గానే మాట్లాడుతూ ముందుకు సాగిపోతుంటారు. దానివల్ల సమాజం కూడా ఇలాంటి వారిని ప్రత్యేకంగా చూస్తుంది.

వాస్తవానికి దగ్గరగా

కొందరు భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలో చిస్తూ ఉంటారు. భవిష్యత్తు గురించి కలలు కనడం మంచిదే కానీ వాటి మీదనే ఆధారపడి ఎక్కువగా ఊహించుకుంటూ కాలం గడపడం వ్యర్థం. ఒక రకంగా చెప్పాలంటే కలల్లోనే ఎక్కు వగా బతకడానికి చాలా మంది ఇష్టపడుతుంటారు. దీనివల్ల వాస్తవ పరిస్థితులను గుర్తించలేరు. దాంతో వారు ఊహించినట్లు ఏదీ జరగకపోతే వెంటనే డీ లా పడిపోతారు. బాధపడుతుంటారు. అందుకే ఊహాలోకంలో విహరించడం మానేసి నిజాలు జీర్ణించుకోవాలి. వాస్తవ పరిస్థితులను అర్థం చేసు కుని వాటికి తగినట్లుగా మన లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి. వాటిని సాకారం చేసుకోవ డానికి ప్రయ త్నించాలి.

ఎందుకంటే ఈరోజు మనం చేసే పని మీదే రేపటి మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయం గుర్తుంచు కోవాలి. ఎప్పుడూ ఆనందంగా ఉండేవారు కలల్ని కంటూ వాటిని నిజం చేసుకోవడానికి తమవంతు ప్రయత్నం చేస్తారు. వారి జీవితంలో ఓ లక్ష్యం అనేది తప్పకుండా ఉంటుంది. అంతేకాదు వాటికి తగినట్టు వారు ఓ ప్రణాళిక నిర్దేశించుకుని, సిద్ధం చేసి పెట్టుకుంటారు. సరైన ప్రణాళిక, లక్ష్యం రెండూ ఉంటే తప్పక విజయం సాధిస్తాం. కాబట్టి కలలు సాకారం చేసుకోవాలంటే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తూ ఈ క్రమంలో చిన్న చిన్న లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని చేరుకున్నప్పుడు మనల్ని మనమే అభినందించుకుంటూ ముందుకు సాగిపోవాలి.

అందరినీ నవ్విస్తూ..

ఆనందంగా ఉండడం అంటే మీరొక్కరే నవ్వుతూ బతకడం ఎంతమాత్రమూ కాదు. మీతో పాటు నలుగురినీ నవ్వించగలిగితేనే మీరూ ఆనందంగా ఉన్నట్లు లెక్క. పూర్వకాలంలో నవ్వు నాలుగు విధాల చేటు అనేవారు కానీ అదంతా పాత నానుడి. ఇప్పుడు నవ్వితేనే అన్ని విధాలా మంచిది అని చెబుతున్నారు. నవ్వడం వల్ల ఆరోగ్య పరంగానే కాదు మానసికంగానూ ఎంతో మేలు జరుగుతుంది. అందుకే వీలైనంత వరకు నవ్వుతూ నవ్విస్తూ ఉండడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వండి. ఇంట్లో కుటుంబ సభ్యులతో, సహోద్యోగులతో, స్నేహితులు, ఇరుగు పొరుగు వారితో సరదాగా ఉండడానికి ప్రయత్నించండి. నవ్వు మనసులోని ఒత్తిడిని తగ్గిస్తుందని ఎన్నో రకాల పరిశోధనలు వెల్లడించాయి. నవ్వు రాలేదనుకోండి కొన్ని హాస్య సన్నివేశాలు వీక్షించడమో లేక జోకులు చదువుతుండడమో చేయాలి. దీనివల్ల మీకు నవ్వు రావడమే కాదు వేరేవారితో పంచుకోవడానికి తోడ్పడతాయి. ఇది మనకు తెలియకుండానే మనసులో ఓ పాజిటివ్ ఎనర్జీని పెంచుతుంది. అయితే ఈ హాస్యం శ్రుతిమించకుండా జాగ్రత్త పడాలి. లేదంటే నవ్వు సంగతేమో కానీ లేనిపోని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

గతాన్ని మరిస్తేనే ఆనందం

గతం తాలూకు అనుభవాలను మరిచిపోవడం కష్టమైన పనే. కానీ కొందరు దాని గురించే బాధ పడుతూ అప్పుడు అలా జరిగింది కదా అని జరిగి పోయిన సంఘటన గురించి పదే పదే ఆలోచిస్తారు. ఆ తలపుల్లో ఉంటూ ఎప్పుడు చూసినా దిగాలుగా ఏదో పోగొట్టుకున్నట్లుగా ఉంటారు. ఆ సంఘటన వల్ల వారి జీవితంలో ఏదైనా పెద్ద మార్పే జరిగి ఉండవచ్చు. లేకుంటే దానివల్ల తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొని ఉండవచ్చు కానీ దాన్ని మనం ఇప్పుడు మార్చలేం కదా! జరిగిపోయిన దాన్నే తల్చుకుంటూ ఉండడం వల్ల ప్రస్తుతం కొనసాగుతోన్న వర్తమాన జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించలేం. అందుకే గతంలో ఏవైనా బాధాకర సంఘటనలు జరిగితే వాటినే తలుచుకొని బాధ పడకూడదు. ఎందుకంటే ఆ సంఘటనలు వ్యక్తిలో ప్రతికూలంగా ఆలోచించే మనస్తత్వాన్ని పెంచుతాయి. ఫలితంగా ఇప్పటి జీవన ప్రయాణంలో మరెన్నో అవాంతరాలు వచ్చే అవకాశాలున్నాయి. దానివల్ల రేపటి భవిష్యత్తు సైతం దెబ్బతినే అవకాశాలున్నాయి. అందుకే గతంలో జరిగిన మంచిని గుర్తుచేసుకుంటూ, చెడును వీలైనంతగా మరిచిపోతూ దానినుంచి పాఠాలు నేర్చుకుని, అవి పునరావృతం కాకుండా జాగ్రత్త పడినప్పుడే వర్తమానాన్ని సంతోషంగా గడపగలుగుతాం.

చేస్తున్న పనిని ప్రేమించాలి

రోజూ చేసే పని ఒకేరకంగా ఉంటే చాలా మందికి బోర్ కొడుతుంది. కొందరికి ఉద్యోగం కూడా బోర్ కొడుతుంది. ఆ ఉద్యోగాన్ని చేస్తూ వారు ఆనందంగా ఉండలేరు. దీనికి ఇష్టంలేని పనిచేయాల్సి రావడం, ఏదో అనుకుంటే మరేదో చేయడం, ఆఫీసు వాతావరణం నచ్చకపోవడం, పనితీరు బాగున్నా ప్రోత్సాహం ఉండకపోవడం ఇలా రకరకాల కారణాల వల్ల అసంతృప్తికి గురై ఆనందంగా ఉండలేకపోతుంటారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు పనిని నెమ్మదిగా ప్రేమించడం అలవాటు చేసుకోవాలి. అయినప్పటికీ వీలుకాకుంటే కంపెనీ మారడమో లేకుంటే ఇష్టమైన రంగం ఏంటన్నది నిర్ణయించుకోవచ్చు.

అయితే ఆనందంగా ఉండడానికి కేవలం ఇవి మాత్రమే కాదు ఆరోగ్యం సహకరించడం కూడా అతిముఖ్యమే. ఆనందంగా ఉండాలంటే ఆహార అలవాట్లను కూడా మార్చుకోవాలి. అనారోగ్యాల బారిన పడకుండా మంచి ఆహారాన్ని వేళకు మితంగా తినడం అలవాటు చేసుకుంటూ, ప్రతిరోజూ ఉదయంపూట వ్యాయామం చేస్తే అన్ని రోజులూ హ్యాపీడేసే!!

- నివేదిత

మంచిని చూడటం ముఖ్యం

కొన్ని విషయాల్లో ఇతరుల్ని చూసి మనకూ అలా ఉంటే బాగుంటుంది కదా అనిపిస్తుంది. అది ఆర్థికపరమైన విషయాల్లోనే కావచ్చు, కుటుంబ పరమైన విషయాల్లోనే కావచ్చు, లేదా అందం ఇతరత్రా విషయాల్లోనైనా కావచ్చు. అలా అనుకోవడం వల్ల పెద్ద నష్టమేమీ లేదు. కానీ ఇలాంటి భావన శ్రుతిమించితేనే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వారికి ఉంది మనకు లేదు అనే అంశం మనలో అసూయగా పరిణమిస్తుంది. ఇదే కనుక జరిగితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. దీనివల్ల ఎంతలా దిగజారుతారంటే ఎదుటివారికి చెడు జరగాలని కోరుకునే స్థాయికి దిగజారిపోతారు. అయితే ఇలా ఆలోచించడం వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదు, పైగా ఇతరుల దృష్టిలో మనం చెడ్డవాళ్ళుగా ముద్రపడిపోతాం. జీవితంలో ప్రశాంతత కోల్పోతాం. అందుకే మనలో ఈర్ష్య, ద్వేషం, అసూయ లాంటివి పెరగకుండా చూసుకోవాలి. ఇది జీవితాన్ని ప్రశాంతంగా సంతోషంగా గడిపేలా చేస్తుంది. ఇతరులలో చెడుకంటే మంచిని చూడాలి. సంతోషంగా ఉండేవారు ఈ పద్ధతినే పాటిస్తారు. ఒకవేళ వారిలో చెడు ఉన్నా పట్టించుకోకుండా వదిలేస్తారు వారి పట్ల ఎప్పుడూ మంచిగానే ప్రవర్తిస్తారు. ఈ గుణం వల్ల వారు శత్రువులను కూడా మిత్రులుగా చేసుకోగలరు.

ఓటమిని ఒప్పుకోవాలి

సాధారణ వ్యక్తులకైతే ఓటమి కేవలం బాధ మాత్రమే కలిగిస్తుంది. అయితే సంతోషంగా ఉండాలంటే మాత్రం ఓటమిని అంగీకరించండి. ఓటమి అనేది ఓ మంచి గుణపాఠంతో పాటు తర్వాత ఏం చేయాలో నేర్పిస్తుంది. అందుకే ఓటమిని ఒప్పుకోవడానికి ఎలాంటి పరిస్థితుల్లోనూ సిగ్గుపడకూడదు. ఓటమిని అంగీకరించి వాటికి కారణాలు అన్వేషించాలి. భవిష్యత్తులో అలాంటి తప్పు తిరిగి జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఓ వ్యూహం తయారుచేసుకోవాలి. దీనివల్ల మన ఓటమి బాధను మిగల్చడం కంటే భవిష్యత్తుపై ఆశను పెంచుతుంది. అందుకే ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం, తప్పు ఒప్పుకోవడం నేర్చుకోవాలి.



"ఇండియన్ డాటర్‌ని బ్యాన్ చేశారటగా?" తన కుర్చీని నా టేబుల్ దగ్గరగా లాక్కొని కూర్చుంటూ అన్నాడు శివకుమార్.

ఆఫీసులో లంచ్‌టైం. ఎవరి సీటులో వాళ్ళు తమ తమ క్యారియర్లు ఓపెన్ చేసి భోజనాలు ముగించిన తరువాత నా టేబుల్ దగ్గర నలుగురూ చేరి ఓ పావుగంట 'పిచ్చాపాటి' నిర్వహించడం కద్దు. త్వరలో రిటైర్ కాబోతున్న నాతో, ఇంకో రెండేళ్ళలో రిటైర్ కావల్సిన విశ్వనాథం, మాకు జూనియర్లయిన శివకుమార్, ఆనంద్ ఈ పిచ్చాపాటీలో పాల్గొంటూంటారు. అప్పుడప్పుడు మా అందరికీ జూనియర్, ఇంకా పెళ్ళి కాని ప్రసాద్ కూడా కలుస్తుంటాడు. ఆరోజు మా బాస్ క్యాంప్‌కి వెళ్ళటం ఐచ్ఛిక సెలవుదినం కావటం వల్ల చాలా మంది సెలవు పెట్టడం వల్ల ఆఫీసు ప్రశాంతంగా ఉంది.

"కానీ...నెట్‌లో దొరుకుతోందటగా" అన్నాను.

"ఆ రేపిస్ట్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. ఉరిశిక్ష పడిన వాడికి భయమేమిటి? ఎవర్నీ లెక్క చేయనవసరం లేదు. ఇటువంటి డాక్యుమెంటరీలు అందరి దృష్టినీ ఆకర్షిస్తాయి. అటువంటప్పుడు రేపిస్ట్ వ్యాఖ్యలు సమంజసమా కాదా అన్నది ప్రశ్న కాదు. వాడు ఏం మాట్లాడినా వాటి ప్రభావం ఉంటుంది. అప్పుడప్పుడు కనీసం ఎడిటింగ్ ఉండాలి" అన్నాడు విశ్వనాథం.

"ఇంచుమించు అటువంటి వ్యాఖ్యలు న్యాయవాదులు, కొందరు రాజకీయ నాయకులు కూడా చేశారు. 'ఫ్రీ సెక్స్' ఉన్న పాశ్చాత్య దేశాలలోనే ఎన్నో రేప్‌లు జరుగుతున్నాయి. దీనికే ఎందుకింత ప్రాధాన్యం?" ఆనంద్ సందేహించాడు.

"బ్యాన్ అమలులోకి వచ్చిందా? ఈ రోజు నెట్‌లో చూడాలి" శివకుమార్ అన్నాడు.

"నేను నిన్నటి నుంచి చూడడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. కనెక్ట్ అవటం లేదు" చర్చలో పాల్గొంటూ అన్నాడు అప్పుడే వచ్చిన పెళ్ళికాని ప్రసాద్.

"ఏం చూపిస్తాడో?" అన్న ఉద్వేగం ప్రసాద్ మాటల్లో. జరిగిన ఘోరం, ఈ ప్రసారం మంచి చెడుల మీద కాకుండా, ప్రసారం 'చూడాలన్న' ఉత్కంఠే ఎక్కువగా ఉంది.

ఏం చూపిస్తాడు? ఏం చూడాలి? ఆ 'ఘోరం' కన్నా ఈ 'దృష్టి' చెడ్డది. అందుకే మగవాళ్ళ ఆలోచనాధోరణి చెప్పటమే మా లక్ష్యం అంటున్నారు డాక్యుమెంటరీ తీసినవారు.

ఇంతలో నా టేబుల్ మీద ఫోన్ మోగింది. భోజన విరామ సమయం ముగియడంతో చర్చకు ముగింపు పలికి ఎవరి సీట్లకు వారు వెళ్ళిపోయారు.

•••

సాయంత్రం ఏడు కావస్తోంది.

ఆఫీసు నుంచి ఇంటి దారి పట్టాను. స్కూటర్ సర్వీసింగ్‌కి ఇవ్వడం వలన నడవడం మొదలు బెట్టాను. బస్సు మీద వెళ్ళొచ్చుకానీ 'అవకాశం ఉన్నప్పుడల్లా నడుస్తూనే ఉండండి' అన్న వైద్యుల సలహాను పాటించదలిచాను. కొంచెం బజారు పని కూడా ఉండడంతో మెయిన్ రోడ్డులో నడుస్తున్నాను. రెడ్ సిగ్నల్ పడడంతో ట్రాఫిక్ ఆగింది. ఇంతలో రయ్ మంటూ వచ్చి ఆగింది ఓ బైక్. ఓ జంట. పెద్దవాళ్ళు కాదు. చిన్నవాళ్ళూ కాదు. వేగంగా రావడం వల్లా, గాలి బాగా వీస్తుండడం వల్లా ఆ బైక్ మీద వెనుక కూర్చున్న ఆమె పైట స్థానభ్రంశం చెందింది. పైట దాదాపుగా ఎగురుతోంది. మొత్తం వీపు, నడుం కనబడేలా నిండు వయసులో ఉంది. పచ్చటి, పుష్టైన ఒళ్ళు. ఒక్కక్షణం దృష్టి అటువైపు పోయింది. 'స్తన భరిత నాభీ ప్రదేశాన్ని చూస్తే మోహం కలగకుండా ఉంటుందా' అంటోంది భజగోవిందం. వారి వెనుక ఆగి ఉన్న బైక్‌ల మీద కుర్రకారున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తున్న వాళ్ళ మొహాలలో అనేక కదలికలు, సన్నగా ఈలు, గ్రీన్ సిగ్నల్ పడడంతో ఆ బైక్ బయలుదేరింది. ఆమె పైటను పట్టించుకోవటం లేదు. వెనక బైక్ వాళ్ళు బాగా పట్టించుకుంటూ ఆ బైక్ వెనకాలె వెడుతున్నారు. వాళ్ళేంటి? చూడాలని కాకపోయినా చూసిన వాళ్ళు ఎందరో. అమ్మాయిల మీద అఘాయిత్యాలకు కారణం 'వాళ్ళు నిండుగా కప్పుకునేలా దుస్తులు ధరించకపోవడమే' అనే ఓ వ్యాఖ్య బుర్రలో దొర్లుతోంది. మధ్యాహ్నం ఆఫీసులో జరిగిన చర్చ గుర్తుకు వచ్చింది. ఆఫీసులో అప్పడాలు తినుబండారాలు, చీరలు ఇంకా రకరకాల వస్తువులు అమ్మకానికొస్తూ ఉంటాయి. అలాగే ఒకావిడ అప్పడాలు, జంతికలు వగైరాలతో వచ్చింది. తీసుకున్న వాళ్ళు తీసుకున్నారు.

లేని వాళ్ళు లేదు. ఇంకో ఆవిడ వచ్చింది. ఏదో రోల్డ్‌గోల్డ్ వస్తువులు అమ్మడానికి. నలభై ఏళ్ళుం టాయి. ఆధునికంగా ఉంది. మా దగ్గరకు వచ్చి లిప్‌స్టిక్ పెదాలతో వస్తువులు అమ్మటానికి ప్రయ త్నించింది. మేము ఎవరమూ తీసుకోకపోవడంతో వెళ్ళిపోయింది. "లిప్‌స్టిక్ వేసుకుంటే లిప్‌స్టిక్ వేసు కుందనే విషయం తెలియ జెప్పడానికి తప్ప కొత్త అందం తీసుకువస్తుందని నేను అనుకోను" అన్నాడు శివ కుమార్. సహజమైన అందానికి అలంకరణ అవ సరం లేదు. కొద్దిపాటి అలంకరణ అందాన్ని ఇనుమ డింపచేస్తుంది. అంత అందంగా లేనప్పుడు అన వ సరమైన అధికమైన అలంకరణ ఎబ్బెట్టుగానే తోస్తుంది. వ్యాఖ్యలకు తావిస్తుంది. ఈవిడకు ముందే ఒకావిడ వచ్చింది. ఎవరూ ఎటువంటి వ్యాఖ్యలూ చెయ్యలేదు. ఈవిడని చూడగానే వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. శివకుమార్ వ్యాఖ్య సమంజ సంగానే ఉంది. అయినా అది మా పిచ్చాపాటికే పరి మితం. ప్రజలకు చేరదు. పబ్లిక్‌లో మాట్లాడవలసి వస్తే చాలా నియంత్రణ ఉండాలి. ఇలా ఆలో చిస్తూ బజారు పని పూర్తి చేసి ఇంటి దారి పట్టాను. నా పక్క నుండి ఓ యాక్టివా వెళ్ళింది. ఇద్దరు యువ తులు ఆధునిక దుస్తులు. నేను చూస్తుండగానే కొంత దూరం వెళ్ళి ఆగిపోయారక్కడ. స్కూటర్ ఆగిపోయిందెందుకో! వాళ్ళు దిగి పరిశీలిస్తున్నారు. ఇంతలో అటుగా బైక్ మీద వస్తున్న యువకులు వాళ్ళ దగ్గరగా వచ్చి స్లో చేసి ఏవో వ్యాఖ్యలు చేసి

స్త్రీకి మరణించే వరకు కష్టాలు తప్పవేమో! వయసులో ఉన్నప్పుడు భద్రత ఉండదు. పెళ్ళయ్యాక స్వేచ్ఛను కోల్పోతుంది. భర్త ఎన్ని తప్పులు చేసినా భార్య భరించాల్సిందే. అతడితో చెంప దెబ్బలు తినాలి. అతడికి సేవలు చేయాలి, సంపా దించాలి. కానీ ఈ కథలో సావిత్రి చేసిన తప్పేంటి? ఇండియన్ వైఫ్‌లో మార్పు రావాలా? వద్దా?

వెళ్ళిపోవటం, ఆ యువతులు తిట్టడం గమనిం చాను. రోడ్డు కాబట్టి వాళ్ళు వ్యాఖ్యలతో సరిపె ట్టారు. నిర్భయం!!! ఎవరికి నిర్భయం? జులాయి లకే నిర్భయం. వాళ్ళని దాటుతూ గమనించాను. టైట్ జీన్స్‌లలో ఉన్నారు. బాడీ అవుట్‌లైన్‌ని సుల భంగా గీసేటట్లు. వారికి అధునాతన దుస్తులు ధరించే స్వేచ్ఛ ఉంది. రాత్రి ఎనిమిది గంటలు దాటాక ఎక్కడికో వెడుతున్నారు. పది గంటలకు కూడా వెళ్ళవలసి వస్తే వెళ్ళాలి. 'ఆడది ఇంట్లోనే ఉండాలి. రాత్రి పదింటికి బయటకు వస్తే మంచిది కాదు. అప్పుడు మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం' అన్న నిర్భయ రేపిస్ట్ ఇంటర్వ్యూ గుర్తుకు వస్తోంది. అలా మాట్లాడాడంటే అది వాడి పొగరు కాదు. సమాజం అసమర్థతే అలా మాట్లా డిస్తోంది. ఆడది ఒక భోగ వస్తువుగానే చూడబ డటం యుగయుగాల నుంచి జరుగుతూ వస్తు న్నదే! "నేనూ అత్యాచారానికి గురైన మహిళనే. నాకు అదెంత బాధాకరమో తెలుసు. అఘాయి త్యాలకు మూలకోణం తెలుసుకోవడం కోసమే ఇండియాస్ డాటర్ తీశాను. ఎవరినీ కించపరచ డానికి కాదు. నేరాలకు మూల కారణం తెలుసు కుంటేనే కదా నేరాల్ని నిర్మూలించగలం" అన్న 'ఇండియాస్ డాటర్'ను నిర్మించిన లెస్లీఉడ్విన్స్ మాటలు గుర్తుకు వస్తున్నాయి.

మా వీధిలోకి మళ్ళాను. మధ్యాహ్నం నుంచి వివిధ ఆలోచనలతో బుర్ర వేడెక్కి ఉంది. ఇంటికెళ్ళ గానే కాఫీ తాగాలనుకున్నాను. భోజనానికి టైం అవుతున్నా సరే. ఇంటికెళ్ళేసరికి ఇంటికి తాళం. అప్పుడు గుర్తుకొచ్చింది. ఇంటి దగ్గర గుడిలో 'లలితా పారాయణం' జరుగుతోంది. అక్కడికి వెడతా నని చెప్పింది. నేను తాళం తీసుకు వెళ్ళడం మరి చాను. గుడి దగ్గరే. పోయి తెచ్చుకుంటే సరి అని బయలుదేరబోతుంటే హడావిడిగా వస్తోంది భార్య సావిత్రి "వచ్చేశారా?" అంటూ. ఇంట్లోకి వచ్చాం. కాఫీ పెట్టమన్నాను.

"ఏం తలనొప్పిగా ఉందా?" అని నుదురు మీద చేయి పెట్టి చూసి లోనికి వెళ్ళింది. అయిదు నిమిషాల్లో కాఫీతో వచ్చింది. కాఫీ తాగుతు న్నాను. మనసు గతాన్ని తవ్వుతోంది. గతంలో అయితే ఇంటికొచ్చేసరికి తను లేకపోతే చీకా



కొచ్చేసి, “ఎక్కడ చచ్చావే ము...” అనేసే వాడిని. అటువంటి సందర్భాలలో “అలా తిట్టకండి... వేరేలా తిట్టుకోండి” అనేసేది. ఇంకేమనేదికాదు. ఏం అనగలదు? పురుషాధిక్య సమాజం మరి. గత మూడేళ్ళ నించీ నాలో చాలా పరివర్తన కలిగింది. గతంలో నేనూ ఓ ‘మృగాడినే’.

అవి నేను కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులు. ఇంట్లో పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. సావిత్రి సంబంధం కుదిరింది. తను డిగ్రీ వరకూ చదువు కుంది. టీచర్‌గా చేస్తోంది. తనకి అత్తామామ, ఇద్దరు ఆడపడుచులు. వాళ్ళిద్దరికీ పెళ్ళి చేయాలి. కోడలు కూడా ఉద్యోగి అయితేగాని కుటుంబం నడవదని అమ్మకు తెలుసు. సావిత్రికి ఉద్యోగం ఉంది. మనిషి బాగానే ఉంటుంది. చేసుకున్నాం. ఆఫీసుల నుంచి ఇద్దరం దాదాపుగా ఒకే సమయానికి ఇంటికి చేరు కుంటాం. “వచ్చావా తల్లీ! కాస్త కాఫీ పెట్టే యమ్మా.. తలనొప్పిగా ఉంది” అనేది మా అమ్మ.

కాఫీలు పెట్టాలి. వంట వండాలి. ఇల్లు సర్దు కోవాలి.... ఇవన్నీ సరే. ఆఫీసు నుంచి వచ్చేసరికి అమ్మ కోడలికి కాఫీ కలిపి ఇవ్వటం నేనెప్పుడూ చూడలేదు. పెళ్ళైన కొత్తలో పాపం ఆమెకి సాయం చేద్దామని వంటింట్లోకి వెడితే అమ్మ పిలిచేసేది.



“చెల్లెళ్ళకి ఏవో డౌట్లున్నాయట్రా, అవి చెప్పు” అనేది. ఏ వంకా లేకపోతే “నువ్వు ఆడంగిలా వంటింట్లోకెడతావేంట్రా...ఉద్యోగాలు చేసినంత మాత్రాన ఇల్లు చూసుకోరా?” అనేది. నేను మౌనంగా ఉండిపోయే వాడిని. సావిత్రి ఎంతో ఓపికగా శక్తి మేర ఎంత చేసినా ఏదో ఒకటి అనేది. సావిత్రి నాతో చెప్పబోతే “చదువుకున్నావుగా...డీల్ చెయ్య లేవా?” అని తప్పించుకునేవాడిని. సాయంత్రం ఇంటికెడితే ఈ గొడవుంటుందని ఆఫీసు అయ్యాక స్నేహితులతో తిరగటం మొదలుపెట్టాను. ఎప్పుడో కాల్చే ఒకటి రెండు సిగరెట్లు రోజుకి రెండు పెట్టెల స్థాయికి చేరుకున్నాయి నెమ్మది నెమ్మదిగా. ఒకటి రెండు సిగరెట్లు ఒకటి రెండు పెగ్గులుగా మారాయి. గంట కాలక్షేపానికి మొద లైన పేకాట తెల్లవారే వరకు సాగేది. సావిత్రి ఏమన్నా చెప్పబోతే “వాడు మగాడు. మగాడన్నాక సవాలక్ష పనులుంటాయి” అనేది అమ్మ. సంసారం పెరగసాగింది. ఇద్దరాడపిల్లలు. ఇద్దరు చెల్లెళ్ళకి

పెళ్ళిళ్ళు చేశాడు, సావిత్రి చేత కూడా అప్పులు చేయించి. సావిత్రి సహకారం లేకుంటే కుటుం బమే గడిచేది కాదు. పరిస్థితి అర్థం చేసుకుని మగపిల్లాడి కోసం చూద్దామనే అత్తగారితో బాటు తాను అనుకున్నా గానీ, తనే కుటుంబ నియం త్రణ ఆపరేషన్ చేయించుకుంది. పిల్లల పెంపకం, చదువులు అంతా తనే చూసుకునేది. భక్తి చాలా ఎక్కువ. నోములు, వ్రతాలు సరేసరి. నేనైతే వ్యస నాలతో ప్రమోషన్ తీసుకొని అప్పుడప్పుడు రాత్రిళ్ళు పూర్తిగా బయటే గడిపేవాడిని. కాలం గడిచి పిల్లలు పెళ్ళీడుకు రాసాగారు. బాధ్యతలు గుర్తు చేసేది సావిత్రి. “ఇప్పుడు పిల్లలు పెద్దయ్యా రండి. మీ ప్రవర్తన మార్చుకోండి” అనేది. ఒక సారి నాకు అనారోగ్యం చేసింది. డాక్టర్లు పరీక్షలు చేసి ముందుగా అలవాట్లు మార్చుకోవాలన్నారు. అన్ని వ్యసనాలూ ఉన్న నాలో ఉన్న సుగుణం ఏమి టంటే కావాలనుకుంటే మానెయ్యగలననే నమ్మకం ఉండేది. అదో ధీమా. పెద్దమ్మాయికి ఇంజ నీరింగ్‌లో కేంపస్‌లోనే సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ జాబ్ వచ్చింది. చిన్నమ్మాయి ఇంజనీరింగ్‌లో ప్రవే శించింది. నేను చేసింది ఏమీ లేదు. వాళ్ళ ఆలనా పాలనా, చదువు సంధ్యా అన్నీ సావిత్రే చూసు

కునేది. నా జీతంలో ఎక్కువ భాగం నా ఖర్చులకే ఉంచేసుకునేవాడిని. ఉన్నదాంతోనే తను గడుపు కునేది. నేను మారాలని పూజలు చేసేది. నేను మారే ప్రయత్నానికి అమ్మ పోతేగాని బలం చేకూర లేదు. అలవాట్లు తగ్గించాను. పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టాను. సావిత్రి ఎంతో సంతోషించేది. కాని ‘వ్యసనం’ బలీయం. ఓ సాయంత్రం ఓ స్నేహితుని బలవంతంతో మళ్ళీ మందు పుచ్చుకో వలసి వచ్చింది. ఇంటికి రాగానే గొడవయింది. “ఏమిటండీ! మళ్ళీ మొదలు పెట్టారు. మీకోసం నా కోసం కాకపోయినా పిల్లలు, పెళ్ళీడుకొచ్చిన పిల్లల కోసమైనా మారాలి” ఎప్పుడూ లేనంతగా ఆవేశంగా చాలా మాటలు అంది. నాకూ అర్థమ వుతోంది. కానీ ఆవేశం వస్తోంది. అణచుకోలేక ఓ చెంప దెబ్బ వేసి గది బయటకు వచ్చేశాను. ఎదు రుగుండా పెద్ద కూతురు. మా మాటలు అన్నీ విని ఉంటుంది. “ఏమండీ మొన్న గుళ్ళో ఒకళ్ళు పరిచయమయ్యారు. అబ్బాయి ఉన్నాడని తెలిసి

అడగబోతే మీ ఆయనకి అన్ని వ్యసనాలు ఉన్నా యట కదా. మీ అమ్మాయి కూడా హాస్టల్‌లోనే ఉంటోంది కదా అని ఏవేవో మాట్లాడిందండీ. సిగ్గే స్తోందండీ” అన్న భార్యని కొట్టి బయటకు వచ్చాడు తను. కూతురు తన వేపు చూసిన చూపు...తనని కాల్చేసింది. తనా చిన్నపిల్ల కాదు. “ఛీ...ఛీ...ఏం బ్రతుకు?” అనుకొని తలవంచుకొని ఇంట్లోంచి బయటకు వచ్చేశాను. మత్తు పూర్తిగా దిగిపోయింది. తను ఎంత తొందర పడ్డాడో... కూ తురు తనని ఎలా చూస్తుందో తల్చుకుంటే ...శరీరం చచ్చిపోతోంది. తిరిగినంత కాలం తిరి గాను. పిల్లల ముందు కూడా తేలిపోతే ఎలా? ఆ సంఘటన జరిగిన రోజు కూతురు తనతో మాట్లా డలేదు. అమ్మతోనే ఉంది. మర్నాడు రాత్రి ఆమెను హైదరాబాద్ బస్సు ఎక్కించడానికి బస్టాండ్‌కి వెళ్ళాను. బస్సెక్కించాక టా..టా...చెబుతూ వచ్చే వారం నువ్వొచ్చేసరికి ‘కొత్త నాన్నను చూస్తావమ్మా’ అన్నాను. మర్నాటి నుంచి నన్ను నేను స్వాధీనం లోకి తెచ్చుకున్నాను. పెళ్ళి ప్రయత్నాలు ముమ్మరం చేశాను. మరుసటి వారం సెలవులకు వచ్చిన కూతురు మెచ్చుకునేలా మారిపోయాను. ఎన్నో సంవత్సరాల తరువాత అందరం కలిసి సినిమాకి వెళ్ళాం. ఆరు నెలల్లో కూతురికి వివాహం చేసేశాను. కానీ ఆరోజు “గురూ కూతు రికి పెళ్ళి చేశావు బ్రహ్మాండంగా...ఓ మంచి పార్టీ ఎరేంజ్ చెయ్యాలి” అని పట్టుబట్టారు మందు మిత్రులు. ఆలోచించి, “ఇదే లాస్ట్. ఇక మీదట నన్ను మర్చిపోండి” అని పార్టీ ఇచ్చాను. నేను మందు పుచ్చుకోలేదు. దమ్ము కొట్టలేదు. ఇంటి కొస్తే తనకెందుకో అనుమానమొచ్చి, “మళ్ళీ మొదలెట్టారా” అంది సావిత్రి. జరిగింది చెప్పాను. ఇంక అదే లాస్ట్ అని చెప్పాను. “నమ్మమంటారా” అంది మెల్లగా శూన్యంలోకి చూస్తూ, సూదితో కంట్లో పొడిచినట్టు. సమాధానం చేతలే చెప్పాలి, చెప్తాయి అనుకున్నాను. ఇది ఈ మధ్యనే జరి గింది. కాని అప్పటి నుంచి సావిత్రి యాంత్రికంగా ‘వీడింతే మారడు’ అని నిశ్చయించుకున్నట్లుగా చాలా ముభావంగా ఉంటోంది. నాకు కావలసి నవి అందించడం తప్ప మరే మాట లేదు. తట్టు కోలేకపోతున్నాను. ఈ రోజు ఎలాగైనా సరే కాళ్ళు పట్టుకునైనా సరే తన ముభావాన్ని పోగొట్టాలి అనుకున్నాను.

అలా ఆలోచిస్తూనే కాఫీ, స్నానాలు, భోజనం ముగించి పక్క మీదకు చేరాను. కొంచెం సేపటికి పను లన్నీ ముగించుకొని సావిత్రి గదిలోకి వచ్చింది. మంచం మీదే పడుకుంది దూరంగా. జరిగి చేయి వేశాను. “చెప్పానుగా సావిత్రీ! మిత్రులకి పార్టీ ఇచ్చాను. కానీ నేను పుచ్చుకోలేదు. ఇంక ఆ ఛాయలకు కూడా వెళ్ళను. మాట్లాడు. తిట్టు. నువ్వు తిట్టక పోతే నాకు అదోలా ఉంటుంది” అన్నాను.

నవ్వింది నిర్లిప్తంగా. ఆ నవ్వులో ఎన్నో భావాలు.

లేచి కూర్చొని ఆమె కాళ్ళు పట్టుకున్నాను. చటుక్కున లేచి “ఛీ...ఏమిటండీ ఇది!” అంది కాళ్ళ మీద నుంచి నా చేతులను తొలగిస్తూ.

"ఎలా చెప్పమంటావు మరి?" అని "పిల్లల మీద ఒట్టు పెట్టి చెబుతున్నాను. నేను పూర్తిగా మారాను."

"అయ్యో! అంత మాటెందుకండి?" అని దగ్గ రకు తీసుకుంది.

"లేదు సావిత్రి! ఇంత కాలం నేను నిన్ను ఎంతో ఇబ్బంది పెట్టాను. నేనూ తప్పు తెలుసుకు న్నాను" అని ఇంకా చెప్పబోయేంతలో...

"లేదండీ. నాదే తప్పు. మీలో మార్పు గమనిం చాను. ఇంక ఊరుకోండి" అనేసింది.

"లేదు...రేపటి నుంచి నువ్వు ఉద్యోగానికి వెళ్ళొద్దు. రిజైన్ చేసెయ్. రెస్ట్ తీసుకో.." అన్నాను.

"అమ్మాయి పెళ్ళి అప్పు తీర్చాలి. ఇంకో అమ్మాయి పెళ్ళికి రెడీ కావాలి. ఉద్యోగం మానేస్తే ఎలా? మీరు ఇంటి పట్టునే ఉంటే చాలు నన్ను సుఖ పెట్టినట్లే" అనేసి ఇంకేమీ మాట్లాడనివ్వలేదు. కాసే పటికి నిద్రలోకి జారుకుంది. నాకు తొందరగా నిద్ర పట్టలేదు. మరునాటి నుంచి సరికొత్త మగా డిగా సరైన మగాడుగా ఆమెను, పిల్లలను సుఖ పెట్టాలి. ఇప్పటికే అన్ని అలవాట్లు మానేశాను. రేపు తన జీవితంలో ఓ శుభోదయం రాబోతోంది అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

•••

తెల్లవారింది. టీవీలో వార్తలు వస్తున్నాయి. ఏడయిందా? బాగా నిద్రపట్టేసింది. తొందరగా లేచి స్నానం చేసి గుడికెళ్ళి రావాలి అన్నింటికన్నా ముందుగా. అయినా భార్య నిద్ర లేస్తూనే తన అర చేతులు చూసుకుంటుంది. తనూ అలా చూసు కొని నూతన జీవితం మొదలు పెట్టాలనుకు న్నాడు. అరచేతులు తీసుకోబోయాడు. ఎడమ చేయి లేచింది కానీ కుడి చేయి లేవలేదు. ఎంత ప్రయత్నించినా చేయి కదలలేదు. లేవబోయాడు. కుడి కాలు కదలలేదు. అతి కష్టం మీద 'సావిత్రి' అని పిలవగలిగాడు. నిజానికి అరిచాడు.

•••

"పక్షవాతం" అన్నారు డాక్టర్ అన్ని పరీక్షలూ చేసి.

"ఈ మధ్య షుగర్ చెక్ చేయించుకోలేదా? సిగరెట్లు, మందు మానెయ్యమన్నాను కదా...ఇలా నిర్లక్ష్యం చేస్తే ఎలా?" అన్నారు.

"లేదు డాక్టర్ నేను అన్నీ వదిలేశాను" అన్నాను.

"అవునండీ" అంది సావిత్రి.

"అవ్వొచ్చు! ఒంట్లో సత్తువ ఉన్నప్పుడు దురల వాట్ల ప్రభావాన్ని శరీరం అడ్డుకోగలుగుతుంది. కానీ వయసుతో వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లుతుంటే... ఇదిగో...ఇలా దెబ్బతీస్తాయి దురలవాట్లు" అన్నాడు డాక్టర్.

"డాక్టర్ నేను నిజంగా మానేశాను. మారాను. నిజంగా ఈ రోజు నుంచి కొత్త జీవితం మొదలు పెడదామనుకున్నాను. నాకు త్వరగా నయం చెయ్యండి...డాక్టర్"

కన్నీళ్ళతో వేడుకుంటున్న భర్తకేసి జాలిగా చూడసాగింది సావిత్రి.

•••

వేళ పట్టున భర్తకు సపర్యలు చేస్తోంది సావిత్రి. కూతురు అల్లుడు నాలుగు రోజులుండి వెళ్ళి పోయారు. మందులు సరిగ్గా వాడి, ఫిజియో థెరపీ చేయించు కుంటే మూడు నెలల్లో తేరుకోవచ్చన్నారు డాక్టర్ గారు.

ఆలోచిస్తున్నాను. భార్యనేనాడు సుఖ పెట్టలేదు. గట్టి నిర్ణయం తీసుకునేసరికి భగవంతుడు ఇలా చేశాడు. తను ఆమెకి సేవ చేద్దామనుకునేంతలో తనకే ఆమె ఇంకా ఎక్కువ సేవ చేసేలా చేస్తున్నాడు.

'ఇండియాన్ వైఫ్'కి సుఖపడే రాత లేదా? పెళ్ళయినప్పటి నుంచి తను బాధ్యతారహితం గానే ప్రవర్తించాడు. పగలంతా ఆఫీసులో పని చేసి వచ్చి, ఇంటి పనంతా చేయాలి. ఇంటిల్ల పాదికి సేవ చెయ్యాలి. తను సాయం చెయ్యబోతే అడ్డుకునేది అమ్మ. మగాడు మగాడిలాగే ఉండా లట. ఎలా ఉంటే మగాడు? భార్య దార్లోకి తెచ్చుకో బోతే అడ్డుపడింది. కొడుకెలా పోయినా సరే కోడ లిని సుఖపెట్టకూడదు...అదీ అమ్మ అంతరంగం. 'ఇండియాన్ ఆంటీ'లు అలాగే ఉండాలా? ఉంటారా? ఏమోగానీ తను మాత్రం ఓ సగటు భారతీయ మగాడులాగే మసిలాడు.

'ఇండియాన్ హజ్బెండ్' పురుషాధిక్య సమా జానికి ప్రతీకవలె ఉండాలా? ఉండకూడదు. కల కంఠి కంట కన్నీరు రాకూడదంటారు. కానీ ఓ యావరేజ్ 'ఇండియాన్ ఆంటీ'లు 'ఇండియాన్ హజ్బెండ్'లు తమలాగే ఉంటే 'ఇండియాన్ వైఫ్'లు సావిత్రిలాగే ఉంటారు.

సావిత్రి, తను చదువుకుంది. ఉద్యోగం ఉంది. కాని తమని ఎదిరించలేదు. ఎందుకని? సమాన హక్కులంటూ భర్తతో విభేదించి వేరు పడి ఒంట రిగా బ్రతకలేక పిల్ల పెళ్ళి చెయ్యడానికి మరల భర్త దగ్గరకే చేరిన కొలీగ్ సుజాత గుర్తుకు వచ్చింది. ఒంటరిగా పోరాడలేక పోయింది. పోరాడి విజయం సాధించిన వాళ్ళున్నారు. కానీ తక్కువ.

"ఆడది వీధిలో పెట్టిన మిఠాయి వంటిది. కుక్కలు ముట్టుకుంటాయి" నిర్భయ కేసులో ఒకరి వ్యాఖ్యలు. మృగాళ్ని కుక్కల కింద జమకట్టారు. కాని ఆడదాన్ని ఓ ప్రాణం లేని వస్తువుగా చేసే, చూసే హక్కు ఎవరిచ్చారు?

నా జబ్బు సంగతి తెలిసి చూడడానికి వచ్చారు సావిత్రి పిన్నీ, బాబాయిలు. క్షేమ సమా చారాలు కనుక్కొని వెళ్ళారు. రూం బయట ఎవరి తోనో మాట్లాడుతున్నారు. "సావిత్రి బ్రతుకంతా కష్టాలే. ఎప్పుడూ సుఖం లేదు. అలవాట్లు మానేశా నన్నాడట. మానతారా ఏమిటి? ఏమిటో ఈ కష్టాలు" సావిత్రి పిన్ని ఎవరితోనో అంటోంది.

"తను కాబట్టి భరిస్తోంది. నేనయితేనా?" ఎవరిదో చిన్నపిల్ల గొంతులా ఉంది. ఆ మాటలు విని నేను తల దించుకున్నాను. సావిత్రి బయటకి నడిచింది. వారించ డానికి. ఆ మాటలు అన్నది దూరపు చుట్టాలమ్మాయి.

ఓ ఇండియాన్ డాటర్...డాటర్‌గా ఉన్నప్పుడు భద్రత లేదు. పెళ్ళయ్యాక "ఇండియాన్ వైఫ్" అయ్యాక ఎలా ఉంటుందో తెలియదు.

సావిత్రిలాగా, నా వైఫ్‌లా ఉండకూడదని ఆశీర్వ దించాను.

సెల్: 9494649967

నిత్యామీనన్ మారిపోతోంది

కాలం ఎలాంటివారిలోనైనా మార్పు తెస్తుం దేమో కానీ నిత్యామీనన్‌లో మాత్రం మార్పు తేక పోవచ్చు అని చాలా మంది ఫీలింగ్. ఆ ఫీలింగ్ బీటలు వారేట్టు ఉంది. ఇప్పటి దాకా గ్లామర్‌కి 'నో' అని పట్టుదలగా ఉన్న నిత్యా ఈ మధ్య కాస్త పట్టు సడలించిందట! సినిమాల్లో గ్లామర్‌గా కనిపించా లని నిర్ణయించుకుంది. ఆమె అలా నిర్ణయించుకో గానే దర్శకనిర్మాతలు ఆమె ఇంటి ముందు వాలిపో యారు. చాలా మంది గ్లామర్ కథలు వినిపించేశా రట కూడా! అయితే గ్లామర్ గేట్లను పూర్తిగా తెర వాలా? సగం మాత్రమే తెరవాలా? అన్న విష యాన్ని నిత్యా డిసైడ్ చేసుకోలేకపోతోందట! గ్లామర్‌గా కనిపిస్తే తన మీద అలాంటి ముద్ర పడితే, ఇక తన ప్రత్యేకత ఏముం టుంది? అన్నది ఆమె సెకండ్ థాట్ అంటున్నారు ఆమె అభిమానులు. ఇంత గందరగోళం మధ్య ఓ సిని మాలో గ్లామర్‌గా కనిపించడా నికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు.

రామాయణం

90

యుద్ధాన్ని తప్పించుకోవాలనుకున్నాడు రావణుడు. అలాగే సీతను లోబరుచుకోవాలనుకున్నాడు. అందుకు ఓ తంత్రాన్ని ఆశ్రయించాడతను. దాని ఫలితమే విద్యుజ్జిహ్వుడు అందజేసిన మాయాశిరస్సూ, ధనుస్సూ.

రాత్రికి రాత్రే రాముణ్ణి ప్రహస్తుడు కడతేర్చాడంటూ, రాముని మాయాశిరస్సునూ, అతని ధనుస్సునూ సీత ముందు ఉంచాడు రావణుడు. పోయిన రాముడు తిరిగిరాడన్నాడు. వాడి కోసం ఏడవడం అవివేకం అన్నాడు. సీతను బాగా యోచించమన్నాడు. యోచించి రాముణ్ణి మరచిపొమ్మన్నాడు. తన పట్టపురాణిగా కొలువుదీరమన్నాడు.

సరమ ఓదార్పు:రావణ సభావిశేషాలు

రావణుని ఏ మాటనూ పట్టించుకోలేదు సీత. తన ముందు ఉన్న రాముని శిరస్సునే పరిశీలనగా చూడసాగింది. ఆ ముఖంలో అదే కాంతి. అవే కళ్ళు. జడలు కట్టిన అదే జుత్తు. చిత్రంగా జుత్తులో హనుమంతునికి తానిచ్చి పంపిన శిరోరత్నం...అనుమానం లేదు. ఇది రాముని శిరస్సే అనుకుంది సీత. గొల్లుమంది.

"కైకా! నీ కోరిక నెరవేరిందమ్మా! నా రాముడు కడతేరిపోయాడు. రాజ్యం నీదే" అంది. నిలువునా వణికిపోయింది. మొదలు నరికిన చెట్టులా నేల కూలిపోయింది. స్పృహ కోల్పోయింది సీత.

నవ్వుతూ ఆమెను చూడసాగాడు రావణుడు. మాయాశిరస్సును సీత నమ్మింది. సగం విజయం సాధించినట్టే అనుకున్నాడు. అంతలో తేరుకున్నది సీత. కళ్ళిప్పి రాముని శిరస్సును చూస్తూ అన్నదిలా.

"మహాబాహూ! భార్య చేసిన పాపానికే భర్త ముందుగా మరణిస్తాడంటారు. నేనేం పాపం చేశానో! నిన్ను కోల్పోయాను. ఇక నాకు దిక్కెవరు స్వామీ?"

"నేనున్నానుగా" మనసులోని మాట నోట రాబోయి ఆగిపోయింది. అందుకు ఆశ్చర్యపోయాడు రావణుడు. ఆందోళనగా గొంతు నిమురుకున్నాడతను. 'రావణా' అని తనని తాను పిలుచుకున్నాడు. గొంతు పలికింది. పర్వాలేదనుకున్నాడు.

"నాకోసం యుద్ధానికి వచ్చావు. నా దౌర్భాగ్యం వల్లనే ప్రహస్తుని చేతిలో మరణించావు. ఈ వార్త తెలిస్తే కౌసల్యాదేవి ఎంతగా శోకిస్తుందో కదా! జ్యోతిష్కులు నిన్ను దీర్ఘాయుష్షుమంతుడన్నారు. వారి మాటలు అబద్ధాలా? యుద్ధం చేయబోతూ నువ్వు గాఢనిద్ర పోయావంటే నమ్మశక్యంగా లేదు రామా! కాకపోతే విధి దుష్టసంకల్పాన్ని ఎవరు అడ్డుకోగలరు? నిన్ను కలుసుకునేందుకు నేను ఇక్కడ తపస్సు చేస్తోంటే... నువ్వు అక్కడ ఒంటరిగా మరణించడం న్యాయమా?" రోదించింది సీత. మళ్ళీ స్పృహ కోల్పోయింది. కొద్దిసేపటికి తేరుకుంది. దీర్ఘంగా ఆలోచించింది. రామునితో సహగమనం చేసేందుకు సిద్ధమయిందామె. రావణుని చూసిందప్పుడు. అన్నదిలా.

"రాక్షసరాజా! కరుణించి నా భర్త మిగతా కాయాన్ని కూడా తెప్పించు. నేను ఆయనతో సహగమనం చేస్తాను. చేతులెత్తి మొక్కుతున్నాను, దయ చేసి ఆ ఏర్పాట్లు చూడు."

అసహనంగా చూశాడు రావణుడు. అనుకున్నట్టుగా సీత లోబడడం లేదు సరికదా, రాముడి సహా చస్తానంటోంది. తట్టుకోలేకపోయాడతను. అంతలో అక్కడికి ద్వారపాలకుడు ప్రవేశించాడు. నమస్కరించి నిలుచున్నాడు.

"చెప్పు"

"మంత్రిమండలితో ప్రహస్తుడు మీకోసం ద్వారం దగ్గర వేచి ఉన్నాడు ప్రభూ! ఏదో అత్యయిక విషయం మీతో మాట్లాడాలట! అన్యథా భావించక రమ్మంటున్నాడు." చెప్పాడు ద్వారపాలకుడు.

"పద" అని రావణుడు అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. రావణుడు నిష్క్రమించిన మరుక్షణం సీత ముందున్న మాయాశిరస్సు, ధనుస్సు రెండూ మాయమయ్యాయి.

వస్తున్న రావణునికి ఎదురేగాడు ప్రహస్తుడు.

"మహారాజా! ఇప్పుడే అందిన వార్త, రాముడు దండయాత్రకు సిద్ధమయ్యాట్ట." చెప్పాడు.

సమాధానంగా రాజ్యసభ వైపు నడిచాడు రావణుడు. అంతా అతన్ని అనుసరించారు. రామదండయాత్ర గురించి చర్చించారక్కడ. సేనానాయకులతో అన్నాడిలా రావణుడు.

"వీరులారా! ఇక ఆలస్యం అనవసరం. యుద్ధభేరులు మ్రోగించండి! యుద్ధానికి సైన్యాలను సిద్ధం చేయండి."

అలాగేనన్నట్టుగా తలలూపారు సేనానాయకులు.

"సైన్యం యుద్ధకారణం అడిగితే..." ఎవరో అడిగారు.

"చెప్పాల్సిన అవసరం లేదు." అన్నాడు రావణుడు. విసురుగా మందిరం కేసి నడిచాడు.

కళ్ళారా చూసుకునేందుకు రాముని శిరస్సు లేదు, అతని ధనుస్సు లేదు. ఆ అదృష్టాన్ని కూడా తనకు దక్కనివ్వక వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ రావణుడు తీసుకుని పోయాడనుకున్నది సీత. విలవిల్లాడిపోయింది. నేల మీద బోర్లాపడి తల కొట్టుకుంటూ దుఃఖించసాగింది.

"సీతా"

అనునయంగా ఎవరో పిలిచినట్టయి తలెత్తి చూసింది సీత.

ఎదురుగా విభీషణుని భార్య సరమ.

సీత యోగక్షేమాలు తెలుసుకునేందుకు రాజకుటుంబం తరఫున సరమను నియమించాడు రావణుడు. ఆమె అప్పుడప్పుడూ వచ్చి సీతను కలుస్తూ ఉంటుంది. సీతను ఓదారుస్తూ ఉంటుంది. రాక్షసుల్లో దేవత ఆమె.

"లే తల్లీ లే! ఏడవకు." అంది సరమ. సీతను లేపి కూర్చోబెట్టింది. కాపలా స్త్రీలు కొంచెం దూరంగా ఉండడాన్ని గమనించింది. చెప్పిందిలా.

"తల్లీ! యోగవిద్యతో నేను అదృశ్యంగా ఉండి, నీకు రావణుడు చెప్పిందీ, నీ ఆవేదనా అంతా గమనించాను. రాముడు శిరస్సూ, ధనుస్సూ చూశాను. కుతంత్రాలు పన్నడంలో రావణుడు దిట్టమ్మా! అతని చేష్టలన్నీ కుతంత్రాలే! నిజం చెప్పనా? ఆ శిరస్సూ, ధనుస్సూ రాముడివి కావమ్మా! అంతా మాయ." అన్నది సరమ.

"నిజమా" అంది సీత. కన్నీరు తుడుచుకుంది.

"నిజం తల్లీ! ఆ శిరస్సూ, ధనుస్సూ రెండూ మాయే." గట్టిగా చెప్పింది సరమ.

"మెల్లిగా మాట్లాడమ్మా! లేకపోతే నా వల్ల నీకు లేనిపోని ప్రమాదం." అన్నది సీత. అటూ ఇటూ భయంగా చూసింది.

"తల్లీ! నీ సేవలో నా ప్రాణాలు పోయినా పర్వాలేదు. నాకేం కాదు గాని, నీకు ఓ నిజం తెలుసా తల్లీ! ద్వారపాలకుడు రాగానే రావణుడు ఎందుకంత ఆందోళనగా ఇక్కణ్ణించి వెళ్ళిపోయాడో తెలుసా?" అడిగింది సరమ. తెలియదన్నట్టుగా తలూపింది సీత.

"నీ భర్త రాముడు లంకపై దండెత్తి వస్తున్నాడు. ఆ మాట చారులు చెబితే మంత్రులతో మంతనాలు సాగించి, యుద్ధానికి సిద్ధమవుతున్నాడు రావణుడు."

అందుకు ఆనందించాలో, దుఃఖించాలో తెలియని

లంకను ముట్టడిస్తున్నట్టుగా వానరుల గర్జనలూ, సింహనాదాలూ, శంఖ, భేరీధ్వనులూ వినవచ్చాయి. ఆ ధ్వనులకు భూమి కంపించింది. సీత ఆనందించింది. లంకారాజ్యం రామునిపై యుద్ధానికి సిద్ధమైందని తెలుసుకున్న రావణమాత కైకసి, అతడి పెదతాత మాల్యవంతుడూ రాజ్యసభకు చేరుకున్నారు. రావణుడితో వారేమన్నారు? అందుకు అతడేం సమాధానమిచ్చాడు?

స్థితిలో ఉంది సీత. అయోమయంగా చూసింది.

"నీతిశాస్త్రం, ధర్మపరత, ప్రతాపాల్లో సాటిలేని నీ రాముడికి ఎలాంటి ఆపదా రాదు తల్లీ. నీకు తెలుసా? నీ భర్తను పెద్దపెద్ద వృక్షాలూ, కొండలూ పట్టుకుని వానరులు కాపలా కాస్తున్నారు." అన్నది సరమ.

అవునా? అని ఆశ్చర్యంగా చూసింది సీత.

"ఓ శుభవార్త చెబుతాను, వినమ్మా! నేను కళ్ళతో చూసింది చెబుతున్నాను. రాముడు సముద్ర మధ్యంలో సేతువు నిర్మించాడు. దానిపై నడచి వచ్చి అపార సేనావాహినితో లంకలో విడిది చేశాడు." అంది సరమ. ఆనందంగా చూసింది సీత. అంతలో యుద్ధ సన్నాహాన్ని తెలియజేస్తూ భేరీ, శంఖధ్వనులూ వినవచ్చాయి. కవచాలు ధరిస్తున్న సైనికులు అటూ ఇటూ తిరగడం కనిపించింది. గుర్రాల సకిలింపులూ, ఏనుగుల ఘీంకారాలు కూడా వినవచ్చాయి.

"విన్నావా? అవన్నీ మనకు మంగళవాద్యాలే.' అన్నది సరమ. సీతకు ధైర్యాన్ని కలిగించింది. ఆమెకు మరింత ఆనందాన్ని కలిగించేందుకు అన్నదిలా సరమ.

"తల్లీ! నువ్వు కావాలనుకుంటే నేను అదృశ్యంగా పోయి నీ రాముణ్ణి కలుసుకుంటాను, నీ క్షేమాన్ని తెలియజేసి వస్తాను."

"ఆ సంగతి తర్వాత. ముందు నాకు ఓ చిన్న సాయం చేయమ్మా." అడిగింది సీత.

"చెప్పమ్మా"

"రావణుడు ఈ సమయంలో ఏం చేస్తున్నాడో, నన్ను ఏం చేయాలనుకుంటున్నాడో తెలుసుకుని రా."

"తప్పకుండా" అన్నది సరమ. అక్కణ్ణుంచి అదృశ్యమైంది. రెండు గడియల్లో తిరిగి వచ్చింది. వచ్చిన సరమను గట్టిగా కౌగలించుకుంది సీత.

"రావణుడిప్పుడేం చేస్తున్నాడు? నన్నేం చేయాలనుకుంటున్నాడు?" అడిగింది మళ్ళీ.

"రావణుడు ఇప్పుడు యుద్ధానికి సిద్ధమవుతున్నాడమ్మా! ఆ విషయమై మంత్రులతో మంతనాలు చేస్తున్నాడు. రాముడు దండెత్తి వస్తున్నాడన్న వార్త తెలుసుకున్నదేమో! రావణుని తల్లి కైకసి వచ్చిందక్కడికి. ఆమెసహా వృద్ధమంత్రి అవిర్ధుడూ వచ్చాడు. ఇద్దరూ రాముని పరాక్రమాన్ని రావణునికి వివరించారు. ఒంటి చేత్తో ఖరదూషణాదులను రాముడు హతమార్చిన సంగతి గుర్తు చేశారు.

రాక్షసజాతీ, లంకా క్షేమంగా ఉండాలంటే రాముడితో యుద్ధం వద్దన్నారు. తప్పు ఒప్పుకుని, నిన్ను నీ భర్తకు అప్పగించమన్నారు. రాముణ్ణి శరణు వేడుకోమన్నారు."

"రావణుడు అందుకు ఒప్పుకున్నాడా?" అడిగింది సీత.

"లేదమ్మా! ఆ మూర్ఖుడు తల్లి కోరినా కాదన్నాడు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ నిన్ను వదలనన్నాడు." అన్నది సరమ. ఆ మాటకు ఏడవసాగింది సీత.

"అనుభవిస్తాడమ్మా! ఇంతకింతా ఆ మూర్ఖుడు అనుభవిస్తాడు. యుద్ధం ఖాయం. రాముడు గెలుపు ఖాయం. సైన్యంసహా రావణుణ్ణి మట్టుబెట్టి, రాముడు నిన్ను అందుకుంటాడు. నాకు ఆ దృశ్యం కనిపిస్తున్నది." అంది సరమ.

అంతలో లంకను ముట్టడిస్తున్నట్టుగా వానరుల గర్జనలూ, సింహనాదాలూ, శంఖ, భేరీధ్వనులూ వినవచ్చాయి. ఆ ధ్వనులకి భూమి కంపించింది. కంపిస్తున్న భూమిని చూసి, ఆనందించింది సీత. రాక్షసులు ప్రాణభయంతో దిక్కులు చూశారు. మంత్రులతో మంతనాలాడుతున్న రావణుడు కూడా ఆ ధ్వనులకి భయపడ్డాడు. తనుసహా మంత్రులు భయపడడాన్ని గమనించాడు. తట్టుకోలేకపోయాడు. కళ్ళు మూసుకున్నాడు. ఓ పన్నెండు క్షణాలకాలం ఆలోచించాడు. అప్పుడు కళ్ళు తెరిచాడు. అరిచాడిలా.

"వినవచ్చిన ధ్వనులకి భయపడుతూ మీరంతా ఒకరిని ఒకరు చూసుకోవడం వల్ల లాభం లేదు. పిరికితనం నూరిపోసుకోవద్దు. మీ శౌర్యప్రతాపాలు నాకు తెలియనివి కావు. నా విజయాల వెనుక మీరున్న సంగతి నేను మరచిపోలేను. ధైర్యం కూడ గట్టుకుని యుద్ధానికి సిద్ధం కండి."

రాజాజ్ఞను శిరసావహిస్తున్నట్టుగా తలలు వంచుకున్నా, సేనానాయకులెవరూ యుద్ధానికి సిద్ధంగా లేరన్నది గ్రహించాడు రావణుని పెదతాత మాల్యవంతుడు. చెప్పాడిలా.

"రావణా! నువ్వు చేసిన నీచకృత్యాల కారణంగా నీ తపశ్శక్తి క్షీణించింది. ధర్మరక్షకుడైన రామునితో నువ్వు యుద్ధం చేసి గెలుపొందలేవు. నా మాట విను. సీతను రామునికి అప్పగించి, తప్పుని ఒప్పుకుని అతనితో స్నేహం చేసుకో! మనందరికీ మంచిదది."

"పెద్దలంతా పదేపదే అదే మాట! ఛీ" అసహ్యించుకున్నాడు రావణుడు.

"పెదతాతవి కాబట్టి బతికిపోయావు. లేదంటే ఈపాటికి నీ శిరస్సు గాలిలో గింగిరాలు తిరిగేది. రాముడంటే అంత భయం ఎందుకయ్యా మీకు?" అన్నాడు రావణుడు.

"సరే! నువ్వు చెప్పినట్టుగా ఆ రాముడు అజేయుడే అయితే అతనితో ఒక వీరుడిగా పోరాడి నేను మరణిస్తాను. అంతేగాని నన్ను నిలువునా చీరినా నేను అతనికి సీతను అప్పగించను. నేను అతని సంధి కోరను. శరణు వేడను. నా వ్యక్తిత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు మీరు. నన్ను అసమర్థుణ్ణి చేస్తున్నారు." అన్నాడు రావణుడు.

"నిన్ను అసమర్థుణ్ణి చెయ్యడం కాదు, లంకలోని రాక్షసుల క్షేమం కోరి మాట్లాడుతున్నాను." అన్నాడు మాల్యవంతుడు.

"వద్దు! నువ్విక మాట్లాడవద్దు! నువ్వు మాట్లాడితే నేనేం చేస్తానో నాకే తెలియదు." హెచ్చరించాడు రావణుడు. దురుసుగా తాతను చేరుకున్నాడు. అతని దండను అందుకున్నాడు.

"వెళ్ళిక్కణ్ణుంచి" అని ముందుకు తోశాడు.

రావణుడు తోసిన తోపునకు కింద పడాల్సినవాడే మాల్యవంతుడు. అయితే బలాన్నంతా కూడదీసుకుని నిలదొక్కుకున్నాడు. రావణుణ్ణీ, సభామందిరాన్నీ కన్నీళ్ళతో చూశాడు. తల వంచుకుని అక్కణ్ణుంచి నిష్క్రమించాడు. అడుగులో అడుగు వేసుకుని సభామందిరాన్ని వదలి వెళ్తున్న మాల్యవంతుణ్ణి చూసి మంత్రులంతా ఆ క్షణం మూగబోయారు. అచేతనులయ్యారు.

-అరణి

సౌభాగ్య చక్రం

జూన్ 8 నుంచి
జూన్ 14 వరకు

శ్రీ బిజుమళ్ళ బిందుమాధవశర్మ

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 20 మధ్య పుట్టినవారు)

వృత్తిపరమైన సమావేశాలు, కుటుంబ వ్యవహారాలు, బదిలీలు, వేడుకలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం సన్నిహితుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. మార్పులు. చేర్పుల వల్ల విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుంది. 9,10 తేదీల్లో విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ఒక శుభవార్త అందుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. 11,12 తేదీల్లో వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. చర్చలు, సమావేశాల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. 13,14 తేదీల్లో శుభవార్త అందుకుంటారు. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చర్చలు, సమావేశాలు ఫలిస్తాయి.

వృషభం (ఏప్రిల్ 21 - మే 21 మధ్య పుట్టినవారు)

ఇంక్రిమెంట్లు, పెట్టుబడులు, విద్యా విషయాలు, ప్రేమానుబంధాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం విద్యకు అవసరమైన నిధులు సర్దు బాటు కావడంలో ఆటంకాలు ఎదురవుతాయి. 9,10 తేదీల్లో ఇంటి అవసరాల కోసం నిధులు సర్దుబాటవుతాయి. ఫర్నీచర్, గృహాలంకరణ వస్తువుల కొనుగోలుకు అనుకూలం. రుణాలు మంజూరవుతాయి. 11,12 తేదీల్లో పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రియతముల కోసం ఖర్చులు అధికం. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. 13,14 తేదీల్లో వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి శుభప్రదం. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం సమకూరుతుంది.

మిథునం (మే 22 - జూన్ 21 మధ్య పుట్టినవారు)

బదిలీలు, మార్పులు, వృత్తి, వ్యాపారాలు, పెట్టుబడులకు ఈ వారం ప్రాధాన్యం ఇస్తారు. బుధవారం ఆర్థిక విషయాల్లో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలి. అదనపు ఆదాయం కోసం ప్రయత్నిస్తారు. 9,10 తేదీల్లో విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ఒక సమాచారం ఉల్లాసం కలిగిస్తుంది. 11,12 తేదీల్లో బదిలీలు, మార్పులు చేర్పులు అసౌకర్యం కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, రిటైల్ రంగాల వారికి నిరుత్సాహకరం. 13,14 తేదీల్లో ప్రేమానుబంధాలు బలపడతాయి. పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. చిన్నారులు, ప్రియతముల విషయంలో శుభపరిణామాలు సంభవం.

కర్కాటకం (జూన్ 22 - జులై 22 మధ్య పుట్టినవారు)

విద్య, ప్రయాణాలు, గృహారంభ ప్రవేశాలు, ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం సినీ, రాజకీయ రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది. 9,10 తేదీల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అవసరమైన నిధులు సమ కూరతాయి. 11,12 తేదీల్లో కాంట్రాక్టులు, అగ్రిమెంట్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యార్థులు పట్టుదలతో కృషి చేసి సత్ఫలితాలు సాధిస్తారు. 13,14 తేదీల్లో కుటుంబ సభ్యుల వ్యవహారాలపై దృష్టి సారిస్తారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి శుభప్రదం. దూరప్రయాణాలకు అనుకూలం.

సింహం (జులై 23 - ఆగస్టు 23 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, వేడుకలు, విద్యా విషయాలు, బదిలీలు, సమావేశాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం సమావేశాలు, బృంద కార్యక్రమాల్లో నిరుత్సాహకరమైన పరిణామాలు చోటుచేసుకుంటాయి. 9,10 తేదీల్లో సమావేశాలు, పెట్టుబడులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వేడుకల్లో ఉల్లాసంగా పాల్గొంటారు. 11,12 తేదీల్లో ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోతారు. విలువైన వస్తువులు సమ కూర్చుకుంటారు. 13,14 తేదీల్లో ఆర్థిక వ్యవహారాలకు ప్రోత్సాహకరం. విద్యార్థులకు శుభప్రదం. సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. వేడుకల్లో పాల్గొంటారు.

కన్య (ఆగస్టు 24 - సెప్టెంబర్ 22 మధ్య పుట్టినవారు)

కీలక నిర్ణయాలు, ఇంక్రిమెంట్లు, వృత్తిపరమైన సమావేశాలు, వేడుక లకు ఈ వారం అనుకూలం. బుధవారం వృత్తిపరమైన సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది. పెద్దల ప్రోత్సాహం కొరవడుతుంది. 9,10 తేదీల్లో రాజకీయ, సినీరంగాల వారు ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. 11,12 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. కొత్త ప్రాజెక్టుల గురించి ఆలోచిస్తారు. 13,14 తేదీల్లో ఇంక్రిమెంట్ల విషయంలో సానుకూల సంకేతాలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

తుల (సెప్టెంబర్ 23 - అక్టోబర్ 23 మధ్య పుట్టినవారు)

ఉన్నత విద్య, దూరప్రయాణాలు, వృత్తి, వ్యాపారాలు, బృందకార్యక్రమాలకు ఈ వారం ప్రోత్సాహకరం. బుధవారం ప్రణాళికా లోపం కారణంగా వృత్తి వ్యాపారాల్లో సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. 9,10 తేదీల్లో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలు ఫలిస్తాయి. 11,12 తేదీల్లో సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది. రాజకీయ సినీరంగాల వారు పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తారు. 13,14 తేదీల్లో ప్రయాణాలు, చర్చలకు ప్రోత్సాహకరం. సమావేశాలు, వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

వృశ్చికం (అక్టోబర్ 24 - నవంబర్ 22 మధ్య పుట్టినవారు)

ఆర్థిక సంస్థలతో పనులు, ఆర్థిక వ్యూహాలు, బృందకార్యక్రమాలకు ఈ వారం ప్రాధాన్యం ఇస్తారు. బుధవారం ప్రయాణాల్లో అసౌకర్యం కలుగుతుంది. విద్యకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. 9,10 తేదీల్లో పెద్దల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ఆరోగ్యం మెరుగవుతుంది. 11,12 తేదీల్లో పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. 13,14 తేదీల్లో ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆత్మావలోకనం చేసుకుంటారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం.

ధనుస్సు (నవంబర్ 23 - డిసెంబర్ 21 మధ్య పుట్టినవారు)

వేడుకలు, శుభకార్యాలు, సినీ, రాజకీయ విషయాలు, ఆరోగ్య అంశాలకు ఈ వారం అనుకూలం. బుధవారం స్పెక్యులేషన్లలో జాగ్రత్త అవసరం. భాగస్వామి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. 9,10 తేదీల్లో బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ప్రదర్శనల్లో పాల్గొంటారు. సమావేశాలు లాభిస్తాయి. 11,12 తేదీల్లో వేడుకల్లో పెద్దల నుంచి మాటపడాల్సి వస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో సన్నిహితుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. 13,14 తేదీల్లో ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. వివాహాది శుభకార్యాల్లో పాల్గొంటారు. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు.

మకరం (డిసెంబర్ 22 - జనవరి 20 మధ్య పుట్టినవారు)

వృత్తి, వ్యాపారాలు, ఆరోగ్యం, స్పెక్యులేషన్లు, వేడుకలు, ప్రేమాను బంధాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం భాగస్వామి ఆరోగ్యం కలవరపెడుతుంది. విందులు, వేడుకల్లో పాల్గొంటారు. 9,10 తేదీల్లో ఆరోగ్యం మెరుగవుతుంది. బీమా, పెన్షన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. 11,12 తేదీల్లో వృత్తిపరమైన సమావేశాల్లో పాల్గొంటారు. లక్ష్య సాధనకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. చర్చలు ఫలిస్తాయి. 13,14 తేదీల్లో వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ప్రోత్సాహకరం. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

కుంభం (జనవరి 21 - ఫిబ్రవరి 18 మధ్య పుట్టినవారు)

వృత్తిపరమైన నిర్ణయాలు, ఆర్థిక విషయాలు, విద్య, ఆరోగ్య అంశాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. 9,10 తేదీల్లో ప్రేమానుబంధాలు బలపడతాయి. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. 11,12 తేదీల్లో పొదుపు పథకాల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ప్రియతముల ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు. 13,14 తేదీల్లో ప్రియతములకు సంబంధించిన ఒక సమాచారం ఉల్లాసం కలిగిస్తుంది. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ప్రయాణాలకు అనుకూలం.

మీనం (ఫిబ్రవరి 19 - మార్చి 20 మధ్య పుట్టినవారు)

వేడుకలు, గృహోపకరణాల సేకరణ, ఉన్నత విద్య, ప్రేమానుబంధాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం విద్యార్థులకు సీట్లు లభించడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. 9,10 తేదీల్లో బదిలీలు, మార్పులు చేర్పులకు అనుకూలం. కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. 11,12 తేదీల్లో వివాహాది శుభకార్యాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. వాగ్వాదాలకు దూరంగా ఉండాలి. 13,14 తేదీల్లో కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. రుణాలు మంజూరవుతాయి.

నవ్య

నవ్య సినిమా

అత్తమ్మకు బాలీవుడ్ బాగుందట!

'అత్తారింటికి దారేది'లో నదియా నటనకు అందరూ ఫిదా అయిపోయిన సంగతి తెలిసిందే! హీరోయిన్‌గా కెరీర్ ముగిసి, క్యారెక్టర్ ఆర్టిస్టుగా సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టిన నదియా అత్తగా, అమ్మగా వెండితెర మీద దూసుకుపోతోంది. దక్షిణాదిన ఆమెకు అవకాశాలు బాగానే వస్తున్నా, బాలీవుడ్ మీద మనసు పారేసుకుంది నదియా. బాలీవుడ్‌లో తన వయస్సు వారికోసం ప్రత్యేకమైన పాత్రలు సృష్టిస్తున్నారట! అదే దక్షిణాదిన అలాంటి పోకడలు కనిపించడం లేదని తెగ బాధపడుతోంది. ఇక్కడి వారు నలభై సంవత్సరాల వయస్సులో ఉన్న మహిళా క్యారెక్టర్లను సృష్టించడంపై శ్రద్ధ పెట్టరు అంటూ విమర్శలు కూడా ప్రారంభించింది. చేసేది దక్షిణాది సినిమాలు, పాడేది ఉత్తరాది పాటా? అంటూ కొందరు ఆమె మీద ఎదురు దాడికి సిద్ధమవుతున్నారట కూడా!

టాలీవుడ్‌కి మరో దర్శకురాలు

టాలీవుడ్‌లో మహిళా దర్శకులు చాలాచాలా తక్కువ మందే ఉన్నారు. వీరి సంఖ్య వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. ఇలాంటి తరుణంలో సూపర్ స్టార్ కుటుంబం నుంచి మరో మహిళా దర్శకురాలు రాబోతోంది. ఆ మహిళ మరెవరో కాదు కృష్ణగారి కూతురు మంజుల. నటిగా, నిర్మాతగా పలుచిత్రాలు నిర్మించిన మంజుల 'కావ్యడైరీ' తరువాత మరో సినిమా తీయలేదు. ఆఖరిసారిగా 'ఆరెంజ్' సినిమాలో ఓ చిన్న సీనులో తళుక్కుమంది అంతే! ఇంత కాలానికి దర్శకత్వం ద్వారా మరోసారి తెలుగు ప్రేక్షకులను పలకరించాలనుకుంటోంది మంజుల. నేచురల్ స్టార్ నానీని డైరెక్ట్ చేయబోతోందట!

ఆయన్ని వదలబుద్ధికాదు



ఓ సినిమా అయిపోగానే చేయబోయే సినిమా గురించి ఆలోచిస్తాం... కానీ... త్రివిక్రమ్‌గారితో చేస్తే మాత్రం ఆయన్ని వదలబుద్ధి కాదు అంటున్నాడు రావు రమేష్. సినిమా షూటింగ్ మొత్తం అయిపోయినా, ఆయనతో ఇంకా కాసేపు గడిపితే బాగుండు అన్న ఫీలింగ్ కలుగుతుందట! దానికి కారణం ఆయన చెప్పే మాటలే అని రావు రమేష్ చెబుతున్నాడు. ఇప్పటి వరకూ చాలా మంది దర్శకులతో పనిచేశాను కానీ, ఎవరితోనూ ఇలాంటి ఫీలింగ్ కలగలేదు అంటున్నాడు. ఆయన నటులకు మంచి ఫ్రీడమ్ ఇవ్వడమే కాకుండా చాలా విషయాలు చెబుతుంటారు. నన్ను ఎప్పుడూ "మీరు బాగా చేస్తే రావుగోపాలరావుగారి అబ్బాయి, చేయక ఏం చేస్తాడు? అంటారు. అదే బాగా చేయకపోతే వాళ్ళ నాన్న పరువు తీశాడురా అంటారు" ఈ విషయాల్ని బాగా గుర్తు పెట్టుకోండి అంటూ చెప్పేవారు. అందుకే 'అ..ఆ' సినిమా షూటింగ్ అయిపోయిందంటే కొద్దిగా దిగులేసింది అంటూ చెప్పుకొచ్చాడు రావు రమేష్.

సారీకి అడ్డాల రెడీ

బ్లాక్ బస్టర్ అవుతుందనుకున్న 'బ్రహ్మోత్సవం' రిజల్టు గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు. ఈ సినిమా పరాజయం బాధ్యతను మహేష్ తన భుజాన వేసుకుంటే, హీరోకి సారీ చెప్పడానికి దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల రెడీ అయిపోయాడు. ఈ సినిమా ఎక్కడ పరాజయం పాలయిందో, ఎక్కడ తప్పులు దొర్లాయో మహేష్‌బాబుకి వివరించి సారీ చెప్పాలని డిసైడ్ అయ్యాడు. ఓ సినిమా పరాజయానికి తామంటే తామంటూ హీరో, దర్శకుడు పోటీపడడం సూపర్ అంటున్నారు సినీ జనాలు.

కొరటాల రీమేక్ చేయబోతున్నాడా?

ఇది విన్న వాళ్ళందరూ 'జోక్ ఆఫ్ ది ఇయర్' అంటున్నారు. ఈ మాట ఎప్పుడు ఎలా పుట్టిందో తెలియదు కానీ, వైరస్‌లా వ్యాపించి చాలా మంది దీని గురించే మాట్లాడుకునేలా చేసింది. కొరటాల శివ ఇప్పటి వరకూ రెండు సినిమాలు చేశాడు. రెండూ బ్లాక్ బస్టర్లే. మూడవ సినిమా ఎన్టీఆర్‌తో 'జనతా గ్యారేజ్' చేస్తున్నాడు. అది కూడా పూర్తి కావస్తోంది. ఇప్పుడు తన నాల్గవ సినిమాగా ఓ మాలీవుడ్ సినిమా రీమేక్ చేయబోతున్నాడనే వార్త బాగా హల్‌చల్ చేస్తోంది. అదీ అఖిల్ హీరోగా! ఇన్ని ప్రత్యేకతలున్న ఈ వార్తను చాలా మంది కామెడీగా తీసుకుని తెగ ఎంజాయ్ చేస్తున్నారట!

ఆ రెండూ నాకు సరిపడవు

-శ్రీదివ్య

శ్రీదివ్య.... పేరుకు తగినట్టే దివ్యమైన రూపం....మనసు దోచుకునే నటన... ఇవేవీ టాలీవుడ్‌ను ఆకర్షించలేక పోయాయి. తమిళ తంబీలు మాత్రం ఆమెకు బ్రహ్మరథం పట్టి స్టార్ హీరోయిన్ స్థాయి కల్పించారు. అవడానికి తెలుగమ్మాయే అయినా కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ల గుండెల్లో గుబులు పుట్టించే విధంగా జెట్ స్పీడులో దూసుకుపోతోంది శ్రీదివ్య. దాదాపు స్టార్ హీరోలందరితో జత కట్టేస్తూ ఫుల్‌జోష్‌లో ఉన్న శ్రీదివ్యకు ఒకే ఒక్క లోటు. అదే తెలుగులో గుర్తింపు రావడం లేదనే బాధ. ఆ బాధను అధిగమించి ఎప్పటికైనా ఓ మంచి సినిమాతో ఇంట గెలవాలని తహతహలాడుతున్న శ్రీదివ్యతో...

'రాయుడు' సక్సెస్‌తో తెలుగులో అవకాశాలు వస్తున్నాయా?

తెలుగులో అవకాశాలు రావడం లేదని ఎవరన్నారు? నాకు తగ్గవి, నేను చేయగలిగినవి రావడం లేదు. అదే నా బాధ. ఇప్పటికీ చాలా మంది కథలు చెబుతున్నారు. త్వరలోనే తెలుగులో ఓ సినిమా తప్పకుండా చేస్తాను. ఎలాగైనా తెలుగులో సినిమాలు చేయాలన్న కోరిక నాకూ ఉంది. గతంలో డేట్లు అడ్జస్ట్ కాక కొన్ని సినిమాలు వదులుకోవలసి వచ్చింది. వాటిని ఎలా అడ్జస్ట్ చేయాలో అప్పుడు అంత బాగా తెలియలేదు. ఇప్పుడు వాటి మీద బాగా అవగాహన వచ్చింది. ఈసారి అవకాశాలను వదులుకోను.

మీకు తగినవి అంటే....

హీరోయిన్ అనగానే గ్లామర్, స్కిన్‌షో చేయాలి అనుకునే వారి సంఖ్య ఎక్కువ! కానీ ఆ రెండూ నాకు సరిపడవు. నా శరీరాకృతి అందుకు సహకరించదు. అంతే కాదు ఆ రెండిటికీ నేను చాలా దూరం. హోమ్లీ క్యారెక్టర్లంటే నాకు ఇష్టం. వాటిల్లో చాలా బాగా ఒదిగిపోగలను. కానీ చాలా మంది దర్శక నిర్మాతలు నన్ను గ్లామర్‌గా చూపించడానికే ముందుకు వస్తున్నారు. అలాంటి వారికి నో చెప్పడం వలనే తెలుగులో సినిమాలు చేయలేకపోతున్నాను. గ్లామర్‌గా కనిపించడానికీ, స్కిన్‌షో చేయడానికీ చాలామంది హీరోయిన్లు రెడీగా ఉన్నారు. నా అవసరం లేదు. జయప్రద, శ్రీదేవి లాంటి వాళ్ళు ఈ రెండూ లేకుండానే స్టార్ హీరోయిన్లు అయ్యారు. ఈ విషయంలో వారే నాకు ఆదర్శం. తెలుగు సినీ పరిశ్రమలో మార్పు వస్తోంది. నాలాంటి వారికి సరిపడా పాత్రలను సృష్టిస్తున్నారు. త్వరలోనే తెలుగులో మరిన్ని సినిమాలు చేస్తాను అన్న నమ్మకం నాకు కలుగుతోంది. మోడ్రన్‌గా చూపిస్తానంటే నాకెప్పుడూ అభ్యంతరం లేదు. మోడ్రన్ పేరుతో అసభ్యంగా డ్రస్ చేసుకోమంటే మాత్రం చేసుకోను.

అంత కచ్చితంగా ఉంటే అవకాశాలు రావేమో?

తప్పకుండా వస్తాయి. నాకు తగిన పాత్రలను దర్శకులు రూపొందిస్తారన్న నమ్మకం నాకుంది.

ఓ సినిమా అంగీకరించేటప్పుడు ఏఏ అంశాలు చూస్తారు?

ముందు కథ. ఆ తరువాత నా పాత్ర. నా పాత్రకు ఎంత వరకూ ఇంపార్టెన్స్ ఉందీ చూస్తాను. కొన్నిసార్లు కొద్దిసేపు కనిపించే పాత్రే అయినా కథను మలుపు తిప్పేదిగా ఉంటుందంటే అలాంటి పాత్రలు చేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. సినిమా మొత్తం నేనే కనిపించాలన్న నిబంధనలేవీ నేను పెట్టుకోలేదు.

శ్రీదివ్య కోలీవుడ్ మీద పెట్టిన దృష్టి టాలీవుడ్ మీద పెట్టడం లేదు అంటున్నారు ఎంత వరకు నిజం?

కోలీవుడ్‌లో డిఫరెంట్ క్యారెక్టర్లు చేయడానికి అవకాశం ఉంది. హీరోయిన్ పాత్రను సహజంగా చూపించడానికి ప్రయత్నిస్తారు. టాలీవుడ్‌లో ఆ పరిస్థితి లేదు. హీరోయిన్ అంటే ఎంతసేపూ గ్లామర్, స్కిన్‌షోకే పరిమితం అన్నట్టు ప్రవర్తిస్తారు. ఈ కారణంగానే టాలీవుడ్ కన్నా కోలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేస్తున్నాను. 'కేరింత' తరువాత చాలా రోజులకి 'రాయుడు' ద్వారా

తెలుగువారికి కనిపించాను. ఈ సినిమాని ఆదరిస్తున్న తెలుగువారికి ధన్యవాదాలు అన్నది చాలా చిన్న మాట. అంతకు మించి పెద్ద పదం నాకు తెలియదు.

కోలీవుడ్‌లో భాష ఇబ్బంది అనిపించలేదా?

లేదు. నేను పుట్టింది తమిళనాడులో. అయితే పెరిగిందంతా ఆంధ్రాలో. తెలుగు బాగా వచ్చు. తమిళంతో కొద్దిగా పరిచయం వుంది. కోలీవుడ్‌లో వరుస పెట్టి సినిమాలు చేయడం ప్రారంభించాక భాష నేర్చుకున్నాను. నా డబ్బింగ్ నేనే చెప్పుకుంటాను.

'రాయుడు' సినిమాలో నల్లగా కనిపించడానికి ప్రత్యేకించి మేకప్ వేసుకున్నారా?

లైట్‌గా బ్లాక్ కలర్ మేకప్ వేసుకున్నాను.

రీమేక్ సినిమాలు అంగీకరించరట ఎంత వరకూ నిజం?

అలాంటిదేమీ లేదు. 'బెంగుళూరు డేస్' తమిళంలో తీస్తున్న సమయంలో నజ్రియా చేసిన క్యారెక్టర్ నన్ను చేయమన్నారు. ఆ సినిమా సూపర్ డూపర్ హిట్. దాన్ని నేను చేస్తే ఆ పాత్రకు న్యాయం చేయగలనా? అన్న అనుమానం వచ్చింది. దర్శకుడు భాస్కర్ సార్ నన్ను ఒప్పించి ఆ పాత్ర చేయించారు. ఒప్పించడం కన్నా ఆయన కథ చెప్పిన తీరు నచ్చింది. చేశాను. రీమేక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. నా పద్ధతిలో చేసుకుంటూ పోవడం కుదరదు. ఆ సినిమా మీదా, ఆ పాత్ర మీదా ప్రేక్షకులకు ఓ అభిప్రాయం ఉంటుంది. దాన్ని పాడు చేయకుండా, డిఫరెంట్‌గా చేస్తూ వారిని మెప్పించాలి. ఇది కత్తిమీద సాము లాంటిది. ఓ విధంగా ప్రయోగం చేయడమే! ఇప్పుడే అలాంటి ప్రయోగాల జోలికి పోదలుచుకోలేదు.

విశాల్‌తో రెండుసార్లు చేసినట్టున్నారు?

అవును. ఆయనతో రెండు సినిమాల్లో చేశాను. కోలీవుడ్‌లో తెలుగు బాగా మాట్లాడ గలిగిన హీరోలలో ఆయన ఒకరు. మొదటిసారి ఆయనతో చేయడం అంటే కొద్దిగా భయపడ్డాను. కానీ సెట్‌లో ఆయన ప్రవర్తన చూసిన తరువాత ఆ భయం పోయింది. చాలా క్లోజ్‌గా మూవ్ అవుతారు.

బాల నటిగా చేశారు. ఇప్పుడు హీరోయిన్‌గా చేస్తున్నారు. అప్పటికీ ఇప్పటికీ తేడా?

ఎప్పుడూ నటించడమే! చిన్నతనంలో దర్శకుడు ఏం చెబితే అది చేసేదాన్ని. ఇప్పుడూ అంతే కానీ, దానికి నా ఆలోచనలు, అభిప్రాయాలు కూడా అప్పుడప్పుడూ జోడిస్తూ ఉంటాను. చిన్నతనం నుంచి నటించడం వల్లనేమో షూటింగ్ అంటే ఇంట్లో ఉన్న ఫీలింగే కలుగుతుంది.

కోలీవుడ్‌లో చేస్తున్న సినిమాల గురించి....

కార్తీ, నయనతార నటిస్తున్న 'కాష్మోరా' సినిమా చేస్తున్నాను. ఇందులో డిఫరెంట్ క్యారెక్టర్ చేస్తున్నాను. నయనతారతో సమానంగా ఉంటుంది నా క్యారెక్టర్. ఈ సినిమా గురించి ఇంతకన్నా ఎక్కువ చెబితే బాగుండదు. జీవాతో మరో సినిమా చేస్తున్నాను. మరో రెండు సినిమాలు ఒప్పుకున్నాను. వాటి షూటింగ్‌లు ఇంకా మొదలు కాలేదు.

చివరగా ప్రేమా, పెళ్ళి గురించి....

ఇప్పటి వరకూ ఎవరిని చూసినా ప్రేమించాలి అన్న ఫీలింగ్ కలగలేదు. ఎవరో ఒకరు నాకు నచ్చిన వ్యక్తి తప్పకుండా తారసపడతాడని నా నమ్మకం. ఆ వ్యక్తిని పెళ్ళి చేసుకోవాలి అనిపించగానే ఆ విషయం మా ఇంట్లో చెప్పేస్తాను. మా పేరెంట్స్ నా అభిప్రాయానికి విలువ ఇస్తారన్న నమ్మకం నాకుంది. వారి అనుమతితోనే ప్రేమించిన వ్యక్తిని పెళ్ళి చేసుకుంటాను.

-చిన్ని

ఇలియానాకు ఏడుపొచ్చింది

ఈ ఏడుపు సినిమాల్లేక కాదట! షూటింగ్ అయిపోయిందంటే బాధగా అనిపించి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి అంటోంది ఇల్లీబేబీ. టాలీవుడ్‌లో చక్రం తిప్పిన చందంగానే బాలీవుడ్‌లో కూడా టాప్ హీరోయిన్ రేంజ్‌కి దూసుకెళ్ళాలని ఎన్నో కలలు కంది ఇలియానా! ఆమె అక్కడికి వెళ్ళే సరికే విపరీతమైన పోటీ ఉండడంతో ఆ పోటీలో నెగ్గలేక వెనక్కి తగ్గింది. ఏడాదికో, రెండేళ్ళకో తప్ప ఇలియానాకి అవకాశాలు రావడం లేదు. తాజాగా అక్షయ్‌కుమార్‌తో చేసిన సినిమా షూటింగ్ కూడా ఇటీవలే పూర్తయింది. అంటే అమ్మడికి మళ్ళీ ఖాళీ దొరికినట్లే! ఈ సినిమాలో అక్షయ్‌తో చేయడం మరిచిపోలేని అనుభూతి అనీ, సినిమా షూటింగ్ పూర్తయిందంటే ఏడుపు వచ్చేసిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. పనిలో పనిగా హీరోగారిని తెగ పొగిడేసింది.

ఇంటర్వ్యూ

సినిమా రంగంలో ఇంకా విలువలున్నాయి

-తులసి

శంకరాభరణం చిత్రంతో బాలనటిగా జాతీయస్థాయి గుర్తింపు సంపాదించింది తులసి. ఆ చిత్ర విజయంలో కీలకపాత్రధారి. అయిదు దశాబ్దాలుగా 300 పైచిలుకు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషా చిత్రాల్లో నటించారు. రెండు సార్లు నంది అవార్డు, రాష్ట్రపతి స్వర్ణ పతకం సహా పలు భాషల్లో ఎన్నో అవార్డులు అందుకుని తానేమిటో నిరూపించుకున్నారు. సినిమా రంగంలో ఇంకా మానవతా విలువలు బతికే ఉన్నా యంటున్న తులసి ఇంటర్వ్యూ.....

చెన్నైలో జన్మించాను. మా నాన్నగారు వెంకట రాఘవన్. అమ్మ విజయ. మా అన్నయ్య భాస్కర్. ప్రస్తుతం ఆయనే మా నాన్నస్థానంలో అందరి బాధ్య తలూ చూసుకుంటున్నాడు.

మూడు నెలల పసికందుగా ఉన్నప్పుడే నేను సినిమా జీవితం ప్రారంభించాను. అందువల్ల నేను ఎక్కువగా చదువుకోలేకపోయాను. కానీ ప్రైవేటుగా అన్ని వాడుక భాషలూ నేర్చుకున్నాను. ముఖ్యంగా ఇంగ్లీషుపై పట్టు సంపాదించాను.

సావిత్రి, మా అమ్మ ఫ్రెండ్స్

